ఓషో
జీవిత సత్యాలు

సౌభాగ్య

కిరణ్మయి ప్రచురణలు

కేవలమైనది

అతీతమైనది, కేవలమయినది, అది మాత్రమే అయినది అంటే దానికి వేరయినది, అతీతమైనది లేదని అర్థం. దాన్ని ఇంగ్లీషులో 'Absolute' అంటారు. దయచేసి అట్లాంటి పదాన్ని వాడకండి. వీలయినంత వరకు దాన్ని వదిలిపెట్టండి. ఎందుకంటే ఆ 'కేవలమైనది' అన్న పదం మూఢభక్తికి, తీవ్ర మతావేశానికి కారణమవుతుంది. ఎవరి దగ్గరా కేవల సత్యమంటూ ఏదీలేదు. సత్యం విశాలమైంది. అన్ని సత్యాలూ సాపేక్షాలే. ఈ 'కేవల'మన్న పదం మానవజాతిని నరక కూపంలోకి లాగింది.

మహమ్మదీయులు కేవల సత్యం ఖురాన్‌లోనే వుందంటారు. క్రిస్టియన్లు బైబిల్‌లో, హిందువులు గీతలో వుందంటారు. అంధులవుతారు. యిట్లా ఎన్నో 'కేవలం సత్యాలు' వుండడమంటూ ఎట్లా వీలవుతుంది? ఫలితంగా సంఘర్షణ, సంక్షోభం, యుద్ధం, మత యుద్ధాలు, జిహాద్‌లు. "వాళ్ళ సత్యమే కేవలం సత్యమనే వాళ్ళని చంపండి. ఎందుకంటే మన సత్యమే కేవలం సత్యం."

గడచిన కాలాల్లో లెక్కలేనన్ని హత్యలు, రేపులు, దోపిడీలు అన్నీ మతం పేరుమీద మారణకాండలా జరిగాయి. కారణం? కేవలం వాళ్ళనుకునే 'కేవల సత్యమే!'

మనకు తెలిసింది, తెలుసుకోవాలనుకున్నది సాపేక్షికంగా వుంటుంది. అది మీకు అనురాగాన్ని అందిస్తుంది. అది మీకు స్వేచ్ఛను ప్రసాదిస్తుందన్న విషయం మరచిపోకండి! అది మిమ్మల్ని మానవత్వంతో నింపుతుంది. అది మీకు యితరుల దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి సాయపడుతుంది.

సత్యం విశాలమైంది. సరళమైంది కానీ, ఆకాశమంత విశాలమైంది. అనంత విశ్వం దానిలో వుంది. అనంత విశ్వం హద్దులు లేనిది. అనంతమైనది. ఆది మధ్యాంతర హితమైనది. సమస్త సత్యాన్ని మనమెలా భావనలోకి తెచ్చుకుంటాం? కేవల సత్యాన్ని ఎట్లా మన దోసిట్లో బంధిస్తాం? 'అహం' ఆ ప్రయత్నం చేస్తుంది.

అహం మోసకారి. జిత్తులమారి. మనం నిజమైన సత్యాన్ని అనుభూతి చెందిన క్షణం వెంటనే అహం ప్రత్యక్షమై, అవును యిదే కేవల సత్యం, అంటుంది. అది మీ మనసుని బంధించివేస్తుంది. దాన్ని దాటిన సత్యం అక్కడ అడుగుపెట్టే అవకాశముండదు. ఎప్పుడయితే మీరు ఇదే కేవలం సత్యం అన్న అభిప్రాయానికి వచ్చారో దారి తప్పారన్న మాట. మనిషికి సంబంధించిన సత్యం సాపేక్షికం!

నైరూప్యతలు

నైరూప్య భావనలు నైరూప్య విషయాల్ని ప్రేమించడానికే యిష్టపడతాయి. మానవత్వాన్ని ప్రేమించడమన్నది మనుషుల్ని ప్రేమించడం కన్నా తేలిక. ఎందుకంటే నువ్వు మానవత్వాన్ని ప్రేమించడంలో ఎట్లాంటి 'ఇబ్బందీ' లేదు. ఎట్లాంటి 'సమస్యా' లేదు. సవాలూ లేదు. ఎందుకంటే ఒక్క మనిషి అన్నవాడు మానవజాతికన్నా ప్రమాద కరమైనవాడు. మానవజాతి అన్నది ఒక పదం. అక్కడ ఎట్లాంటి వినిమయ వాస్తవం వునికిలో లేదు. మానవ ప్రాణి అన్నది వాస్తవం. అందుకనే నువ్వు వాస్తవాన్ని సమీపించి నప్పుడు మంచి వుంటుంది, చెడు వుంటుంది, బాధ, ఆనందం, ఎగుడు దిగుళ్ళు, శిఖరాలు, లోయలు, విషాదాలు, పరవశాలు అన్నీ వుంటాయి.

అదే 'మానవజాతి'ని ప్రేమించడంలో పరవశమూ లేదు, పరివేదనా లేదు. నిజానికి మనుషుల్ని తప్పించుకోడానికి మానవజాతి పట్ల ప్రేమ ప్రకటించటం ఒక మార్గం. ఎందుకంటే నువ్వు మనిషిని ప్రేమించలేనప్పుడు నిన్ను నువ్వు మోసం చేసుకోడానికి మానవ జాతిని మానవత్వాన్ని ప్రేమిస్తావు!

అసంగతం

'అసంగతం' అన్నది దేవుడికున్న మరో పేరు తప్ప మరేమీ కాదు. నిజానికి అది 'దేవుడు' అన్న పేరుకన్నా అద్భుతమైంది. ఎందుకంటే గడచిన శతాబ్దాలలో మత సిద్ధాంత వేత్తలు, తాత్వికులు 'దేవుడు' అన్న పదంలోని అందాన్ని నాశనం చేశారు. ధ్వంసం చేశారు. దానిపై రంగులుపూసి, పాలిష్‌చేసి హేతుబద్ధమైన చెత్తా చెదారంతో నింపి ప్రాణం లేకుండా చేశారు. ఫిలాసఫర్ల దేవుడు దేవుడు కాదు. ఎందుకంటే వాళ్ళది కేవలం హేతుబద్ధమయిన దృక్పథం.

ప్రేమికు దేవుడన్న మాట పూర్తిగా వేరు విషయం. దానికి హేతువుతో, మేధస్సుతో సంబంధం లేదు. అది సమస్త విశ్వంతో సమశృతిలో సాగే హృదయ స్పందన! అది గానం, సమశృతి, నాట్యం, ఉత్సవం! అది వచనం కాదు కవిత్వం! అది మేధస్సు కాదు సహజాతం! అది అనుభూతి చెందదగింది. ఆలోచించదగింది కాదు. అందుకనే 'అసంగత' మన్నది దేవుడికన్నా మంచి పదం అన్నాను నేను.

టెర్టూలియన్ ఎప్పుడూ గుర్తుతెచ్చుకోదగిన వ్యక్తి. అతను గొప్ప క్రిస్టియన్ మార్మికుడు అతను. 'నేను దేవుణ్ణి నమ్ముతాను. ఎందుకంటే దేవుడు అసంగతం!' అన్నాడు. అతని నమ్మకానికి అతనిచ్చిన హేతువు ఏమిటంటే నమ్మకానికి కారణం లేదనే!

మీ జీవితంలో హేతువుకు అందనిది ఏదైనా వుండని పక్షంలో మీ జీవితం అర్థ వంతం కానిదవుతుంది. విలువలేనిదవుతుంది! మీ జీవితంలో హేతురహితమయిన పునాదుల్తో జీవించడం, మరణించడం అన్నవి లేని పక్షంలో మీ జీవితానికి, మీ అస్తిత్వానికి అర్థం వుండదు. కేవలం మీ జీవితాల్లో ఉపరితలం వుంటుంది. లోతులుండవు, గాఢత వుండదు.

అందుకనే మీ జీవితాల్లో అసంగతమన్నది అద్భుతమయిన దాన్ని ఆవిష్కరించి నప్పుడు అది విస్ఫోటనాత్మకంగా వుంటుంది. అది మీరు ప్రపంచాన్ని కొత్తకోణంలో చూడ్డానికి ఆస్కారమిస్తుంది. పునర్జన్మనిస్తుంది. 'మనసు' నించి మిమ్మల్ని వేరు చేస్తుంది. మనసు ధూళినించీ మిమ్మల్ని బయటికి లాగుతుంది. ప్రతిదీ నవ్యంగా తాజాగా వుంటుంది.

మీరు ఉనికికి సంబంధించిన హేతురహిత స్థితిలో, అసంగతంతో సంబంధం కలిగి వుంటే అప్పుడు పూర్తిగా వేరయిన దారిలో వుంటారు. మనసు నించి మనసులేని స్థితిలోకి, మనసునించి ధ్యానంలోకి మళ్ళుతారు. ధ్యానమంటే అదే. మనసు చెరసాల

నించి మీకు విముక్తి కలిగించేది అదే. గతమనే చెరసాల నించీ బయటపడేసేది. ఎందుకంటే యింకో జైలంటూ లేదు, గతమే జైలు.

హేతువునించి బయటపడడం కష్టం. ఎందుకంటే వ్యక్తి భయం గుప్పిట్లో వుంటాడు. హేతువు ఒక క్రమపద్ధతికి సంబంధించిన స్పృహ కలిగిస్తుంది. హేతువు వెళ్ళిపోతుంది. అక్కడ గందరగోళమే మిగుల్తుంది. అయోమయమే మిగుల్తుంది. కానీ ఒకటి గుర్తుంచు కోండి! హేతువు ముళ్ళకంచె, అయోమయమన్నది గర్భంలాంటిది. ఆ అసంగతం నించి అతి ముఖ్యమైంది ఆకారాన్ని సంతరించుకుంటుంది. అక్కడ వ్యక్తి పునర్జన్మనిస్తాడు.

అసంగతం నిన్ను పరవశానికి లోనుచేస్తే ప్రతి దాని లోలోతుల్లోకి వెళ్ళగలిగిన అంతర్దృష్టి వస్తుంది. అది యింకొకరితో పంచుకోలేనిది. అది అవ్యక్తం!

ఇప్పుడు కాలం పరిపక్వానికొచ్చింది. పాశ్చాత్య ప్రపంచం కొత్త ద్వారాలు తెరిచే అవకాశం వచ్చింది. అదే అసంగతం! ఆ ద్వారం గుండా అడుగుపెట్టాలి. కేవలం అదొక్కటి మాత్రమే! దైవనిలయానికి, ఆలయానికి అదొక్కటే మార్గం!

ఆమోదం

గౌతమ బుద్ధునికి ఏర్పరచిని పేర్లలో ముఖ్యమైన వాటిలో 'తథాగతుడు' అన్నది ఒకటి. జీవితం ఎట్లావుంటే అట్లా జీవించేవాడు. ఎట్లాంటి పరిస్థితిలోనైనా ప్రతిదాన్నీ సంపూర్ణంగా జీవించేవాడని అర్థం. అతను మరణాన్ని కూడా సంపూర్ణంగా ఆమోదిస్తాడు. ఎందుకంటే ఉనికి అన్నది అనంతమని అతను నమ్ముతాడు. దానికి సరిహద్దులు లేవు. అది నియమరహితం. అన్నిట్నీ ఆమోదించడమన్నది ధ్యానంలో శిఖరాయమానమయిన స్థితి. జీవితంలోని మాధుర్యం, జీవితంలోని బాధలు అన్నిట్నీ సమానంగా, ఎంపిక లేకుండా యిష్టాయిష్టాల కతీతంగా ఆమోదించడం.

ఒకసారి యిది జరగడం మొదలయ్యాక నువ్వు ఆనందించడం ఆరంభిస్తావు. నువ్వు నిర్మలత్వంగా, సమగ్ర నిశ్శబ్దంగా మారుతావు. కానీ ఆ నిశ్శబ్దం ప్రాణంలేని నిశ్శబ్దం కాదు, సంకేతాలున్న నిశ్శబ్దం, నాట్యంచేసే నిశ్శబ్దం. అది శూన్యం నిండిన నిశ్శబ్దం కాదు. నిండుతనం తొణికే నిశ్శబ్దం.

అది నీ పద్ధతిగా మారుతుంది. జీవితం ఏమిచ్చినా దాన్ని స్వీకరించడం నేర్చు కుంటావు. ఏదయినా సంభవిస్తే దాన్ని ఆమోదించు, అది అదృశ్యమయితే దాన్ని ఆమోదించు. సుఖం నీ ముందు నిలిస్తే దాన్ని అంగీకరించు, అది ఆవిరైతే దాన్ని ఆమోదించు, బాధను కూడా అట్లాగే.

నిర్ణయాలు చెయ్యకపోవడం, తీర్మానాలు చెయ్యకపోవడమనే స్థితిలో వుండు. అన్నిటిపట్ల నిశ్శబ్ద సాక్షిగా నిలబడు. మేలుకున్న చైతన్యవంతులయిన అందరి బుద్ధుల అద్భుత రహస్యమిదే!

యాదృచ్ఛికం

నేను ఒక ఆత్మకథ చదువుతున్నా అతను ఎక్కడికో ప్రయాణమవుతూ వుంటే ట్రెయిన్ చాల ఆలస్యమయిందట! బహుశా అక్కడ ఒక టాక్సీ కూడా లేదు. అది అర్ధరాత్రి. చలి విపరీతంగా వుంది. టాక్సీలు కనిపించకపోవడంతో అతను రెస్టారెంట్‌కు వెళ్ళాడు. అది అప్పుడే మూస్తున్నారు. కౌంటర్‌లో వున్న స్త్రీ యింటికి వెళుతోంది. ఇతన్ని చూసి ఆగి యితనికి కాఫీచేసి యిచ్చింది. కాఫీ తాగాడు. అక్కడ వీళ్ళు తప్ప ఎవరూలేరు. కబుర్లలోకి దిగారు. ఆమె 'ఈ సమయంలో నీకు టాక్సీ దొరకడం కష్టం. నాతోబాటు కార్లో రా. దార్లో నిన్ను వదిలిపెడతాను' అంది.

అతను కారు ఎక్కాడు. వాళ్ళ అభిప్రాయాలు కలిసి ఒకర్ని ఒకరు యిష్టపడ్డారు. ప్రేమించుకున్నారు. ఎవరయితే ఈ ఆత్మకథ రాశాడో అతని తల్లి ఆమె! అంటే వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకున్నారన్న మాట! ఆ సంగతి చెబుతూ 'ట్రెయిన్ సమయానికి వచ్చివుంటే నేను ఈ ప్రపంచంలో అడుగుపెట్టేవాణ్ణి కాను. అట్లాగే సమయానికి టాక్సీ దొరికినా అదే పరిస్థితి. లేదూ ఆ స్త్రీ అతన్ని కార్లోకి ఆహ్వానించకున్నా ఈ ప్రపంచంలోకి వచ్చేవాణ్ణి కాను అన్నాడు.

అన్నీ యాదృచ్ఛికాలే! జనం మత్తులో బతుకుతారు. అచేతన స్థితిలో జీవిస్తారు. నీ ప్రేమ యాదృచ్ఛికం, నీ ద్వేషం యాదృచ్ఛికం! నీ స్నేహం, నీ శతృత్వం అన్నీ యాదృచ్ఛికాలే!

యాదృచ్ఛికంగా వుండడం మానెయ్యి! నీతో నువ్వు స్పృహలో వుండు. కొంత చైతన్యంతో వుండు. ఏం జరుగుతుందో చూడు. మెల్లమెల్లగా నీ చైతన్యంతో నువ్వు పని చెయ్యడం మొదలుపెడితే నీలోంచీ నీ చైతన్యంనించి అద్భుతశక్తి ఆవిర్భవించిడం చూస్తావు. అప్పుడు నీ సమస్త జీవితం సంపూర్ణంగా విభిన్న పరిమళంతో విభ్రమం కలిగిస్తుంది!

ప్రమాదాలు

ఒకసారి నేను ఒక మిత్రుడితోబాటు కార్లో వెళుతున్నా. కారు ప్రమాదానికి లోనయింది. మా కారు బ్రిడ్జి మీది నించి యిరవై అడుగులు లోతుకి తల కిందులుగా పడిపోయింది.

నేను అతన్తో ధ్యానం గురించి చెప్పేవాణ్ణి. అతను బాగా చదువుకున్న మేధావి. కానీ అతను ప్రతిసారీ 'నువ్వు ఎన్నయినా చెప్పు. ఆలోచనలేని మనసంటూ వుండదు. ఆలోచనలేని మనసన్నది ఎట్లా వీలవుతుంది? అట్లా వాదించేవాడు. బహుశా అతను చెప్పిన దాంట్లో పాయింట్ వుంది. ఆలోచనలేని మనసెట్లా వీలవుతుంది? దానికి విషయం కావాలి. మనసెప్పుడూ దేన్ని గురించో ఆలోచించాలి. అప్పుడే అది వుంటుంది. అతను చెప్పిందాట్లో హేతువు వుంది.

చైతన్యమన్నది ఏదో ఒకటి వున్నప్పుడే వునికిలో వుంటుంది. ఏదీ లేకపోతే చైతన్యంగా వుండడంమెలా? దేని గురించి? చైతన్యంమంటేనే దేన్నో ఒకదాని పట్ల స్పృహతో వుండడం. కాబట్టి నువ్వు చైతన్యంలో వుండడానికి విషయం అవసరం. వాటి రెంటి వునికి అప్పుడే వుంటుంది. అది నిజంగా సైకలాజికల్గా, హేతుబద్ధంగా వాస్తవమే... అదే నేను అతనికి వివరించాను కానీ అతను పూర్తిగా 'మనసు'తో నిండి వున్నాడు. ఆ రోజు ఆ ప్రమాదం జరిగింది.

కొన్ని క్షణాలలో ఆ ప్రమాదం జరగబోతోందని మేము స్పృహలో వున్నాం. బ్రేకు ఫెయిలయింది. మేము కొండమీదనించీ జారాము. డ్రైవర్ కంట్రోల్ తప్పాడు. కారు అదుపు తప్పింది. ప్రమాదం జరగబోతోందని మాకు తెలిసింది. కారు దానంతట అదే పోతోంది. అక్కడ చెయ్యడానికి ఏమీలేదు. అక్కడ కొన్ని క్షణాలపాటు అతని ఆలోచనలు ఆగిపోయాయి. అట్లాంటి విచిత్ర స్థితిలో ఎవడూ ఆలోచించలేడు. అక్కడ ఆలోచించడానికి ఏముంది! అది అసాధారణ సందర్భం! కొండ కింద మృత్యువు ఎదురుచూస్తోంది! క్షణాలలో నువ్వు నిష్క్రమించబోతున్నావు. ఆ షాక్ చాలు నీ ఆలోచనల ప్రవాహాన్ని ఆపడానికీ. అతను కిందపడగానే నేను అతన్ని పైకిలాగాను. అతను నవ్వడం ప్రారంభించాడు. అతను "అది నిరూపించడానికి మార్గం యిదా? యింకో మంచి మార్గం నీకు దొరకలేదా? యిది మరీ ప్రమాదకరమైన పద్ధతి" అన్నాడు. ఎవరమూ గాయపడలేదు. నిజంగా యిది ప్రమాదకరమైంది. కారు పచ్చడైంది. కానీ అతన్లో మెరుపు మెరిసింది. అప్పటినించీ

అతను నాతో వాదించడం ఆపేశాడు. కారణం తెలుసు. ఆ ప్రమాదం అతని జీవితంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకొచ్చింది!

కానీ అతను కేంద్రాన్ని దర్శించాడు. ఆ చైతన్యం 'విషయం'తో నిమిత్తం లేని చైతన్యం! ఆ ప్రమాదం దీవెనలాంటిది! నేను డ్రైవర్‌కు కృతజ్ఞతలు చెప్పాను. సంవత్సరాలుగా నేను సాధించలేనిది నువ్వు క్షణంలో చేశావన్నాను!

ఆ క్షణంలో అతను మరణించి వుంటే మరింత ఉన్నత స్థాయిలో అతని జననం జరిగేది. అందులో తప్పులేదు. మరణం కూడా మంచిదే! ఆ ఆలోచనలేని స్థితిలో అతని మరణం కూడా ఒకరకమయిన జ్ఞానోదయం లాంటిదే. అతను బయటపడ్డాడు. అప్పటి నుంచి అతను నాతో వాదించడం మానుకున్నాడు. కొత్త మానవుడయ్యాడు!

చర్య

నీ విషాన్ని తేనెగా పరివర్తింపజెయ్యడం నేర్చుకో. అదెట్లా వీలవుతుంది? అది చాలా సరళమయిన మార్గం. నిజానికి పరివర్తింపజెయ్యడమన్నది సరికాదు. ఎందుకంటే నువ్వు ఏమీ చెయ్యడం లేదు కదా! నీకు కావలసిందల్లా సహనం, ఓర్పు. నీకు ఒక గొప్ప రహస్యం చెబుతాను విను. నీకు కోపం వచ్చినప్పుడు ఏమీ చెయ్యకు. నిశ్శబ్దంగా కూచుని ఆ కోపాన్ని పరిశీలించు. దానికి వ్యతిరేకంగా మారకు, అనుకూలంగా మారకు. దానితో ఏవిధంగానూ సహకరించకు. దాన్ని అణగదొక్కాలని ప్రయత్నించకు. సహనంతో వుండు. అప్పుడు ఏం జరుగుతుందో చూడు!... అది రానీ!

ఒక విషయం మరచిపోవద్దు! విషం నిన్ను బంధించినప్పుడు ఆ స్థితిలో ఎట్లాంటి చర్యకూ ఉపక్రమించకు. కేవలం ఎదురుచూడు. విషం దాని రూపాన్ని మార్చుకోడం ఆరంభిస్తుంది. ఇది జీవితానికి సంబంధించిన మౌలిక సూత్రాల్లో ఒకటి! ప్రతిదీ యింకొకటిగా పరివర్తిస్తుంది! నేను చెప్పినట్లు పురుషుడు స్త్రీగా పరివర్తిస్తాడు. స్త్రీ పురుషుడుగా పరివర్తిస్తుంది. మంచివాడు చెడ్డవాడుగా మారతాడు. చెడ్డవాడు మంచి వాడవుతాడు. ఒక్కో సందర్భాన్నిబట్టి నీలో మార్పులొస్తాయి. సన్యాసికి పాపపు చింతన కలుగుతుంది. పాపికి సన్యాసి ఆలోచనలు వస్తాయి. వ్యక్తి మార్పు కోసం ఎదురు చూడాలి!

నీలో సన్యాసి ఉన్నత స్థాయిలో వున్నప్పుడు చర్యకు పూనుకో! అదే నీలో పాపి ఉన్నత స్థాయిలో వున్నప్పుడు ఏమీ చెయ్యకు! అట్లా చేస్తే నువ్వు పశ్చాత్తాపపడతావు. చర్యా ప్రతిచర్యల పరంపరలో పడి కర్మకు తగులుకుంటావు. వ్యతిరేకపు ఆలోచనలో వున్నప్పుడు నువ్వు ఏ పనిచేసినా గొలుసుల్లో చిక్కుకుపోతావు. దానికి అంతముండదు. వ్యతిరేకపు అంటే నెగిటివ్ ఆలోచనల్లో వున్నప్పుడు ఏ పనిచేసినా యితర్లు కూడా నెగెటివ్‌గా మారుతారు. వ్యతిరేకత వ్యతిరేకతకే కారణమవుతుంది. వ్యతిరేకత వ్యతిరేకతని రెచ్చగొడు తుంది. కోపం కోపానికి కారణమవుతుంది. ద్వేషం ద్వేషాన్ని సృష్టిస్తుంది. విషయాలు ఒకదాని వెంట ఒకటి అలా సాగుతాయి. జనాలు వాటిని తగులుకుని జీవిస్తారు!

కోపాన్ని అణచకు, కోపాన్ని అనుసరించి ఏమీ చెయ్యకు. తరువాత చూడు, నీ ముఖంలో నెమ్మదితనమొస్తుంది. కళ్ళలో చల్లదనం కదుల్తుంది. శక్తిలో మార్పుచోటు చేసుకుంటుంది. స్త్రీ పురుషుడుగా, పురుషుడు స్త్రీగా మారుతాడు. అప్పుడు నీలో కాంతి

ధగదగలాడుతుంది. ఎర్రగా వున్న కోపం స్థానంలో చల్లని వెన్నెల వస్తుంది. నీ ముఖంలో సౌందర్యం కదులుతుంది. అప్పుడు నువ్వు చర్యకు పూనుకో!

నువ్వు పాజిటివ్‌గా వున్నప్పుడు ఏదయినా పనికి పూనుకో! ఆశావహ దృష్టి దానంతట అది వచ్చేదాకా ఎదురుచూడు! రహస్యమక్కడే వుంది. నేను విషం తేనెగా పరివర్తన చెందడం' అన్నది యిదే!

నటన

నటన అన్నది గొప్ప ఆధ్యాత్మిక వ్యాపారం. ఎందుకంటే నటుడు గొప్ప విరోధాభాసంలో వుంటాడు. వైరుధ్యంలో వుంటాడు. అతను నటించే పాత్ర ద్వారానే గుర్తింపు పొందుతాడు. అంటే అతను నటుడిగా వుంటాడు. అదే సమయంలో పరిశీలకుడుగా వుంటాడు.

అతను హామ్లెట్‌గా నటిస్తూ వుంటే పరిపూర్ణంగా హామ్లెట్‌గా లీనం కావాలి. నటనలో తనని తాను మరచిపోవాలి. కానీ అంతరాంతరాలలోని కేంద్రంలో పరిశీలకుడుగా, సాక్షిగా వుండాలి.

నిజమైన నటుడు విరోధాభాస స్థితిలో వుండాలి. నటుడిగా పాత్రను నటిస్తూనే లోలోపల నేను యిది కాదు అన్న స్పృహలో వుండాలి. అందుకనే నేను నటన అన్నది గొప్ప ఆధ్యాత్మిక వ్యాపారమన్నాను.

నిజమైన ఆధ్యాతికతవేత్త తన సమస్త జీవితాన్ని నటనలోకి పరివర్తింపజేసుకోవాలి. అప్పుడు ఈ ప్రపంచం కేవలం రంగస్థలమవుతుంది. అందరూ నటులు అవుతారు. అందరూ నటిస్తాం.

అప్పుడు నువ్వు బిచ్చగాడయితే నీ పాత్రని అద్భుతంగా నిర్వహించు, రాజయితే ఆ పాత్రనీ అద్భుతంగా నటించు. కానీ అంతరాంతరాల లోపల బిచ్చగాడు కూడా 'నేనదికాదు, రాజు కూడా' నేనది కాదు' అని అనుకుంటాడు.

బిచ్చగాడు, రాజు యిద్దరూ 'యిది నటన, మా యదార్థస్థితి యిది కాదు' అని గుర్తిస్తారు. యిద్దరూ ఒకే కేంద్రానికి చేరుతారు. దానినే నేను 'సాక్షీభూతంగా వుండడం' అంటాను. అప్పుడు వ్యక్తి నటిస్తాడు, సాక్షీభూతంగా కూడా వుంటాడు.

అందుకనే నటన గొప్ప ఆధ్యాత్మిక వృత్తి. ఆధ్యాత్మిక వ్యక్తి నటుడు మినహా మరేమీ కాదు. ఈ సమస్త ప్రపంచం నాటకరంగం. సమస్త జీవితం నటన!

చలనం

మనసు నిర్జీవంగా మారిన మరుక్షణం మనసు అదృశ్యమవుతుంది. అప్పుడు మొట్టమొదటిసారి చలనమన్నది, చర్య అన్నది అద్భుత సౌందర్యభరితంగా మారుతుంది. అక్కడ 'ఉపయోగం, ప్రయోజనమన్నది లేదు. గులాబీ పువ్వుకు ఎట్లాంటి ప్రయోజముంది? అయినా అది వికసిస్తుంది. పరిమళాన్ని వెదజల్లుతుంది. దానికి ప్రయోజనమేముంది? రోజూ సూర్యుడు ఉదయించడంలో ఉపయోగమేముంది? అసలు సూర్యుడయినా దానివల్ల ఏమైనా ప్రయోజనముందా? నక్షత్రాలు రాత్రి రావడం వెనక ప్రయోజనమేమిటి? 'ఉపయోగ'మన్న పదం మనసుకున్న అలంకారాల్లో, ఆడంబరాల్లో ఒకటి. మనసెప్పుడూ 'ఉపయోగం' అన్ని దానిగుండా సాగుతుంది. మనసు మాయమయితే చైతన్యం అదృశ్యం కాదు, ఉపయోగం అదృశ్యమవుతుంది.

చైతన్యానికి ఉపయోగముంది. చైతన్యం స్వచ్ఛమయిన ఉల్లాసం, స్వచ్ఛమైన సౌందర్యం. ఏదో సాధించాలని నువ్వు చర్యకు పూనుకోవాల్సిన పనిలేదు. నువ్వు చర్యకు పూనుకోవాలి ఎందుకంటే చైతన్యమన్నది నాట్యం, చైతన్యమన్నది గానం! చైతన్యమన్నది శక్తి!

సముద్రతీరంలో పరిగెడుతున్న పసివాణ్ణి చూశావా? నువ్వు ఆ కుర్రవాడి దగ్గరకు వెళ్ళి 'ఎందుకు పరిగెడుతున్నావు? దానివల్ల ఏం లాభం? అని గవ్వల్ని సేకరించే పసివాణ్ణి. అడుగు. ఎందుకని? వాటివల్ల ఏం లాభం? టైమెందుకు వృథా చేస్తావు?' అని అడుగు.

కానీ పసివాడికి ప్రయోజనంతో పనిలేదు. అతను తన 'శక్తి'ని ఆనందిస్తున్నాడు. అంతులేని పొంగిపొర్లే శక్తితో పరవశంలో వున్నాడు. దాంతో సమస్త ప్రకృతి అతని విహార స్థలం. రాళ్ళు, ఇసుకగూళ్ళు, గవ్వలు నిమిత్తమాత్రాలు. అక్కడ ప్రయోజన ప్రసక్తి లేదు.

'శక్తే సంతోషం! అన్నాడు విలియం బ్లేక్. చైతన్యమే ఆనందం! విలియం బ్లేక్ పాశ్చాత్య ప్రపంచంలో అరుదయిన మార్మిక కవి. గొప్ప శక్తి వుంటే ఏం చెయ్యాలి? అది విస్ఫోటించక తప్పదు! చైతన్యానికి లక్ష్యముండదు. చైతన్యమే ఆదీ, అంతం.

ప్రశంస

తనపట్ల తనకు గౌరవంలేని వ్యక్తి ప్రశంసను కోరుకుంటాడు. మనల్ని ఆత్మన్యూనత లోలోతుల్లో పాతుకుపోయినట్లు పెంచారు. మొదటినించి మన తల్లిదండ్రులు మనల్ని తప్పుపడుతూ పెంచారు. ఉపాధ్యాయులు, మతపెద్దలు రాజకీయవాదులు మన సాంఘిక నిర్మాణమే దాని పునాదులపై వుంది.

చిన్నప్పటి నుంచి పసివాళ్ళకు ఒకేమాట పదే పదే చెప్పారు. నువ్వు చేసే పని మంచిది కాదు, నువ్వు ఏది చెయ్యాలో అది చేయడం లేదు, ఏది చెయ్యకూడదో అది చేస్తున్నావు!" ప్రతి పసివాడికీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తను చేస్తున్న పని సరైంది కాదేమో! పనికిమాలిన పనిచేస్తున్నామేమో! అన్న భావన కలిగించారు.

ఇట్లాంటి చర్య ప్రతి మనిషిలో లోలోతుల్లో బలమైన గాయం చేసింది. తనపట్ల తనకు న్యూనత కలగజేసింది. ఆ గాయాన్ని కప్పిపెట్టడానికి మనం ప్రశంసను, అభినందనను ఆశిస్తాం! అభినందన ఓదార్పునిస్తుంది. నిన్ను నువ్వు గౌరవించుకుంటే అది చాలు. నిన్ను నువ్వు ప్రేమిస్తే ఎట్లాంటి ప్రశంసను కోరుకోవు! ఎట్లాంటి కోరికా కలగదు! ఎందుకంటే ఒకసారి నువ్వు యితరుల నించి అభినందనను ఆశించడం మొదలు పెడితే నువ్వు వాళ్ళతో రాజీపడడం ఆరంభిస్తావు. వాళ్ళ అంచనాలను, ఆశల్ని నువ్వు పూరించాలి, పూర్తిచేయాలి. అప్పుడే వాళ్ళు నిన్ను ప్రశంసిస్తారు. అప్పుడు నువ్వు వాళ్ళు చెప్పినట్లు నడుచుకోవాలి. స్వేచ్ఛగా నువ్వు జీవించలేవు! నువ్వు నలిగి పోతావు, నీ లోలోతుల్లో అంగవైకల్యానికి గురవుతావు. నువ్వే ప్రతిబంధకంగా మారుతావు. నీలో ఎదుగుదల వుండదు. నీపట్ల నీకే అపనమ్మకమేర్పడి నీ ఎదుగుదలను జాగ్రత్తగా గమనిస్తావు. ఎందుకంటే నిన్ను నువ్వు అనుమతిస్తే నువ్వు తప్పుచేస్తావని, పొరపాటు చేస్తావని నీకు తెలుసు. కారణం నువ్వు నియంత్రణకి లోనయ్యావు. నీకు అడ్డంగా కంచె వుంది. అందువల్ల నీపైన నువ్వు ఆధారపడలేవు, యితరుల మీద ఆధారపడి వున్నావు!

ప్రచారం

సమస్త ప్రచార కళ అన్నది ఒకే మార్గంలో సాగుతుంది. వునికిలో వుంటుంది. మా మార్గమే పునరుక్తి. పునరుక్తి ద్వారానే అది వునిలో వుంటుంది. నియోన్ లైట్లు కనిపెట్టబడినప్పుడు వాటిని ప్రచారంలో వుపయోగించారు. 'లక్స్ టాయిలెట్‌సోప్ లేదా 'హమామ్' లేదా మరొకటి. వాటి ప్రచారంలో కాంతి'ని ప్రధానం చేశారు. మొదట ఆ వెలుగులో వాటిని చదువుతాం. అయితే సైకాలజిస్టులు సలహా యిచ్చారు. ఆ కాంతిని మినుకు మినుకు మనేలా చెయ్యండి. దాన్ని వెలుగుతూ ఆరుతూ వుండేలా చేయండి. వ్యక్తి దాన్ని చదవాలంటే కనీసం యిరవైసార్లు దాన్ని చూడాల్సి వుంటుంది. ఆరుతూ వెలుగుతూ వుంటుంది కాబట్టి మళ్ళీ మళ్ళీ చదవాలి. అట్లా వ్యక్తి మళ్ళీ మళ్ళీ దాన్ని చూస్తే దాని ప్రభావం అతని మీద పడుతుంది. దాన్ని టీవీలో, రేడియోలో, మాగజైన్లలో మళ్ళీ మళ్ళీ ప్రదర్శించండి. మనుషులు తిరిగే ప్రదేశాల్లో మళ్ళీ మళ్ళీ ప్రదర్శించండి.

'లక్స్ టాయిలెట్ సోప్' అన్నది కనిపించేదారంటే వ్యక్తి వెళితే అతను హిప్నటైజ్ అవుతాడు. అతను షాపువకు వెళితే సోపు గుర్తుకొస్తే లక్స్ టాయిలెట్' సోపునే అడుగుతాడు. 'అబద్ధం' అతను ఆ సోపునే కొంటాడని నమ్ముతుంది. దాంతో యితరులు కూడా అతని కోసం అదే కొంటారు.

సలహా

సలహా ఎవరైనా చెబితే విను. కానీ అనుసరించకు. శ్రద్ధగా విను. కానీ నీ అంతర్దృష్టి చెప్పినట్లు విను. యితరుల సలహాని అనుసరించకు. అయితే తప్పకుండా యితరులు చెప్పింది విను. వాళ్ళు నీకు ఏంచెప్పదలచుకున్నారో అర్థం చేసుకోడానికి ప్రయత్నించు. వాళ్ళు నీ యోగక్షేమాలు కోరుకునే వాళ్ళే కావచ్చు. కానీ గుడ్డిగా వాళ్ళు చెప్పింది అనుసరించావంటే నువ్వు దారితప్పుతావు. జనం ఎప్పుడూ తాము ఏం చెయ్యాలో యితరులు చెబితే బాగుండునని చూస్తారు. జనం నాయకుల కోసం ఎదురుచూస్తారు. నాయకుల్ని కోరుకోవడం అనారోగ్య లక్షణం.

విను. ఎందుకంటే జనాలకి గొప్పగొప్ప అనుభవాలుంటాయి. వాటిని వాళ్ళు పంచుకోవా లనుకుంటారు. అట్లాంటప్పుడు వినకపోవడం తెలివితక్కువ. వాళ్ళ అనుభవాల్ని తెలుసు కోవడంవల్ల నీలో గొప్ప అంతర్దృష్టి కలుగుతుంది. నువ్వు మరింత చైతన్యవంతంగా మారడానికి అవి సహకరిస్తాయి. కానీ అనుసరించకు.

జనం మాటల్ని అనుసరిస్తారు. గుడ్డివాళ్ళవుతారు. నీకు అవసరమయింది యితరులు యిస్తే యిక నీకు కళ్ళెందుకు? యితరులు నీ కోసం నమిలి యిస్తే నువ్వు నమలడమెందుకు? క్రమక్రమంగా నువ్వు బలహీనపడతావు. శక్తిహీనుడవుతావు. ఆకలితో అల్లాడతావు.

నిజమైన స్నేహితుడెవరంటే ఎవరయితే నీకు సలహా యివ్వడో అతనే! అయితే నిజమైన స్నేహితుడు నువ్వు మరింత స్పృహతో, మరింత చైతన్యంగా, జీవితంపట్ల శ్రద్ధగా వుండేందుకు సహకరిస్తాడు. నీ సొంత సాహస యాత్రకు సహకరిస్తాడు. నీ ప్రయోగశీలతకు ధైర్యాన్నిస్తాడు. నీ అన్వేషణకు ధైర్యాన్నిస్తాడు. నువ్వు చాలా పొరపాట్లు చెయ్యడానికి శక్తి నిస్తాడు. ఎందుకంటే తప్పులు చెయ్యనివాడు ఏమీ నేర్చుకోలేడు.

వీలయినన్ని తప్పులు చేయి, కానీ చేసినవే మళ్ళీ చేయకు. అట్లాచేస్తే నువ్వు బుద్ధి హీనుడవుతావు. కొత్త తప్పులు చేయి, కొత్త తప్పులు కనిపెట్టు. వాటిగుండా నేర్చుకుంటావు. నీ చురుకుతనం మరింత పదునవుతుంది.

నిజమైన స్నేహితులు ఖచ్చితమయిన సలహాలివ్వరు. ఎందుకంటే ఈ రోజు సరయింది రేపు కాకపోవచ్చు. సందర్భాలు మారుతూ వుంటాయి. కాబట్టి సందర్భాన్ని అనుసరించి సహజ స్పందనని అనుసరించి సాగిపో. నీ అస్తిత్వం మీద ఆధారపడు.

కళా సౌందర్యం

కళా సౌందర్యం పేర కావలసినంత చెత్త పోగేశారు. నేను 'కళా సౌందర్యం' అంటున్నానంటే నేను మ్యూజియంలో, ఆర్ట్ గ్యాలరీలో పోగేసిన చెత్త గురించి కాదు. నేను కళా సౌందర్యం అంటున్నానంటే మీలో వున్న నాణ్యత గురించి, అది చిత్రకళ, సంగీతం, కవిత్వం వీటి గురించి కాదు. మీ అస్తిత్వంలోని గొప్ప నాణ్యత గురించి, సౌకుమార్యం గురించి, సౌందర్యం గురించి, మీ అస్తిత్వ చలనం గురించి, కేంద్రంలోని అపూర్వ నాట్యం గురించి, విషయాలపట్ల అభిరుచి గురించి, చైతన్యం గురించి, సముద్ర తీరం నించి వినిపిస్తున్న కోకిల గానాన్ని వినే నిశ్శబ్దం గురించి చెబుతున్నానన్నమాట.

కళా సౌందర్యమన్నది జీవితాన్ని కళాత్మకంగా సమీపించడం. ఒక కవితా దృష్టి వర్ణాల్ని సంపూర్ణంగా సందర్శించడమంటే ప్రతి చెట్టూ ఒక పెయింటింగ్, ప్రతి మేఘం దైవసాన్నిధ్యాన్ని మనముందుకు తెస్తుంది. వర్ణాలు మరింత గాఢమవుతాయి. అప్పుడు మీరు వస్తువుల కాంతి చలనాన్ని విస్మరిస్తారు. మీరు మరింత చలనంతో, చైతన్యంతో, ప్రేమతో స్వీకరించే గుణంతో, ఆహ్వానించే తత్వంతో మనసువిప్పి వుంటారు. నేను సౌందర్య దృష్టి అంటే, కళాత్మకంగా సమీపించడమంటే దాన్ని వుద్దేశించాను.

నేను బుద్ధుడు కవి అంటాను. ఆయన ఒక కవిత రాయకపోయినా ఆయన కవే. ఈ భూమిపైన అడుగుమోపిన అందరిలోకెల్లా ఆయన గొప్పకవి. అతను షేక్స్పియర్, మిల్టన్, కాళిదాసు, రవీంద్రుడు కాదు – అస్సలు కాదు అయినా నేను వాళ్ళని ఆయన్తో పోల్చలేను. ఆయన జీవితమే ఆయన కవిత్వం, ఆయన నడిచిన తీరు, ఆయన విషయాల్ని చూసిన విధానం...

వస్తు సౌందర్యం కాదు, అంతర్దృష్టితో ఎలా సమీపిస్తున్నది, వాటిని ఎంత సౌందర్య వంతంగా చూశామన్నది!

అంతస్సౌందర్యం లేకుంటే నువ్వు ఆనందించలేవు, అన్ని నిస్సారంగా నీ ముందు నించి కదలిపోతాయి. నీ జ్ఞానం అసంపూర్ణమవుతుంది.

వయసు

మొదట్లో జీసెస్‌ను అనుసరించి వాళ్ళు. దాదాపు అందరూ ఆయన సమవయస్కులయిన యువకులు. బుద్ధుని అనుసరించిన వాళ్ళు అందరు ఆయనకు దాదాపు సమానమైన వయస్సున్న వాళ్ళే. మహావీరునికి కూడా ఆ విషయం వర్తిస్తుంది. వయసు పైబడేకొద్దీ వ్యక్తి జాగ్రత్తగా వుంటాడు. ఎందుకనే విషయం గ్రహించాలి. కారణం అతను ఈ ప్రపంచంలో ఎందరో మోసగాళ్ళ మధ్య జీవించాడు. మళ్ళీ మళ్ళీ మోసపోయాడు. వంచించబడ్డాడు. అందువల్ల అతన్లో జాగ్రత్త ఏర్పడింది. చిరాకు ఏర్పడింది. అయిష్టం ఏర్పడింది. దాంతో తనకు తెలిసిన దానితో అతను అనుబంధం పెంచుకుని తెలియని దానిపట్ల భయాన్ని పెంచుకున్నాడు.

కానీ కొన్నిసార్లు మరీ జాగ్రత్తగా వుంటే, ఆ అతి జాగ్రత్త వినాశ హేతువవుతుంది. మరీ జాగ్రత్తగా వుండడమంటే మరణం రాకముందే మరణించడం. ముప్పయ్యేళ్ళకే మనుషులు 'చని'పోతారన్నది మానసిక శాస్త్రరీత్యా వాస్తవం. వాళ్ళు తరువాత కూడా బతికే వుంటారు. డెబ్బయి, ఎనభై ఏళ్ళు బతుకుతారు. మరయితే తక్కిన నలభై యాభయి ఏళ్ళు వాళ్ళు ఏంచేసినట్లు? ఒకరకమయిన శవపరీక్ష జరుపుతూ బతుకుతారు.

మరణానికి ముందే 'సన్యాసం' స్వీకరించాలి. సన్యాసంలో రెండు విషయాలు జరుగుతాయి. ఒకటి జీవించేకళ. రెండోది మరణించే కళ. మొదటిది చేజారినా రెండోది సంభవమయ్యే వీలుంది. దైవానికి ఆత్మ సమర్పణతో ప్రశాంతంగా, నిశ్శబ్దంగా, ఆనందంగా నిష్క్రమించడం. మొదటిదానికన్నా రెండోది చాలా ముఖ్యమైంది. నిజానికి మొదటిది రెండో దానికి దారితీయాలి.

జీవించే కళ అన్నది మరణించే కళకు సిద్ధం కావడం. వ్యక్తి వాస్తవానికి మరణాన్ని నాట్యంతో, గానంతో ఉత్సవంలా జరుపుకోవాలి. వ్యక్తి గాఢమైన చైతన్యంతో, ఎట్లాంటి ఆరోపణలూ చెయ్యకుండా, ఎట్లాంటి కసి, కార్పణ్యాలు లేకుండా దైవంపట్ల అపూర్వమైన కృతజ్ఞతతో మరణిస్తే అతని జీవయాత్ర అర్థవంతమైనట్లే. సంపూర్ణమైనట్లే!

★ ★ ★ ★

రుతువులు అద్భుతమైనవి. రుతువుల గుండా వ్యక్తి ప్రతిక్షణం నవ్యంగా పరివర్తన చెందవచ్చు. ప్రతిక్షణం ఒక కొత్త అనుభూతి, ప్రతిక్షణం అస్తిత్వంతో సూక్ష్మమైన కొత్త మార్పు, కొత్త ముఖం, కొత్త కళ్ళు రూపొందుతాయి.

ముసలిదయిన స్త్రీ అసహ్యంగా వుంటుందని ఎవరన్నారు? ఆమె యవ్వనవతిగా కనిపించాలని ప్రయత్నిస్తే అసహ్యంగా వుంటుంది. ముఖానికి క్రీములు వగైరాలు పూసి, పెదాలకు లిప్‌స్టిక్ వంటివి పూసి మరింత వికారంగా తయారవుతుంది. ఆమె తన వృద్ధాప్యాన్ని ఆమోదిస్తే, సహజంగా భావిస్తే తప్పనిసరి అని ఆమోదిస్తే అప్పుడు అంత అందమైన ముఖాన్ని, ముడుతలు పడిన అందమైన ముఖాన్ని మనం ఎక్కడా చూడలేం. ఆ ముడుతలు ఎన్నో రుతువుల గుండా రూపొందినవి. ఎన్నో అనుభవాల్ని, పరిణితిని సంతరించుకున్నది.

వృద్ధుడయిన వ్యక్తి జీవితాన్ని జీవించి వుంటే అతను అందంగా వుంటాడు. జీవితాన్ని జీవించకుంటే ఏదో గతంలోని ఒక సందర్భానికి, అదీ లేనిదానికి అంటుకుని వుంటే అతను అసహ్యంగా వుంటాడు.

యవ్వనం వెళ్ళిపోయి వుంటుంది. వ్యక్తి దాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నిస్తూ వుంటాడు. లైంగికశక్తి నశించి వుంటుంది. దానికోసం తాపత్రయపడుతూ వుంటాడు. అవి రుతువుల్లో అద్భుతంగా వున్నాయి. అట్లాంటప్పుడు వృద్ధుడు ప్రేమలో పడడం ఎంత హాస్యాస్పదం. యువకుడుగా వున్నప్పుడు ప్రేమలో పడకపోవడం హాస్యాస్పదం! అది రుతుధర్మ వ్యతిరేకం. యిదీ అంతే!

ప్రతిదీ దాని సందర్భంలో అద్భుతంగా వుంటుంది! దానికి వ్యతిరేకంగా అడుగు వెయ్యడం హాస్యాస్పదం! వయసులో వున్నప్పుడు యువకుడుగా వుండు, వయసుపైబడి నప్పుడు వృద్ధుడుగా వుండు! రెండిట్నీ కలగా పులగం చెయ్యకు! కలగా పులగం చేస్తే అసహ్యంగా వుంటుంది.

ఒక విషయం బాగా గ్రహించు, మార్పన్నది ఒకటే దైవం! మార్పన్నది ఒకటే ఈ ప్రపంచంలో శాశ్వతమైనది. ప్రతి ఒక్కటీ మారుతుంది, మార్పు తప్ప. మార్పు అన్నది ఒకటే మార్పుకు మినహాయింపు.

ఆగ్నోసియా Agnosia

ఆగ్నోసియా 'అంటే ఏమీ తెలియని స్థితి. సమాధి' అంటారే ఆ స్థితి. ఆ తెలియని స్థితినే ధ్యానమంటారు.

ధ్యానం సృష్టించే స్థితి 'ఆగ్నోసియా'. ఎప్పుడయితే ధ్యానం నీ జ్ఞానాన్ని కాల్చి బూడిదచేసి నిన్ను భారరహితం చేస్తుందో, తేలికపరుస్తుందో, పర్వతాల్ని తలమీది నించి దించి హాయినిస్తుందో నిన్ను గొప్ప నిశ్శబ్దంలో నిలుపుతుందో నిన్ను పసివాడిలాగా గొప్ప ఆశ్చర్యంలో నింపుతుందో దాన్ని భారతదేశంలో 'సమాధి' అంటారు. 'సమాధి' అంటే అన్నీ పరిష్కరించబడ్డాయని అర్థం. అక్కడ ఎలాంటి ప్రశ్న లేదు, ఎలాంటి సమాధానమూ లేదు. కేవల సంపూర్ణ నిశ్శబ్దం. ఎట్లాంటి విశ్వాసమూ, సందేహమూ వుండదు. దయోయని సియస్ దాన్ని 'ఆగ్నోసియా' అన్నాడు. ఆగ్నోసియా ద్వారానే వ్యక్తి తెలుసుకుంటాడు.

అది మార్మికవాదంలోని అంతిమ విరోధాభాసం. వ్యక్తి తెలియనితనం నించి తెలుసుకోవడం, తెలుసుకోవడం ద్వారా దాన్ని వదులుకోవడం. అన్ని జ్ఞానాలకన్నా తెలుసుకోకపోవడం గొప్ప జ్ఞానం. యూనివర్సిటీలు నీకు జ్ఞానాన్ని యిస్తాయి. అయితే వ్యక్తి గురువు సంబంధించిన బుద్ధని భూమిలోకి అడుగుపెట్టడం విద్యాలయాల వ్యతిరేకత దిశలో మొదలవుతుంది. యూనివర్సిటీల్లో వ్యక్తి మరింత మరింత జ్ఞానాన్ని, సమాచారాన్ని సేకరిస్తాడు. పోగు చేస్తాడు. విద్యాలయ వ్యతిరేక కేంద్రంలో గురువు ఏర్పరచిన బుద్ధ భూమిలో తెలుసుకోకపోవడమన్నది మరింత మరింతగా వుంటుంది. ఒక దశకు చేరేసరికి వ్యక్తికి తెలిసింది ఏమీ వుండదు.

ఐకిడో Aikido

జపాన్‌లో ఒక అద్భుతమయిన శాస్త్రముంది. దాన్ని 'ఐకిడో' అంటారు. 'ఐకిడో' అన్న పదం 'కి' నించి వచ్చింది. 'కి' అంటే అధికారం. చైనాలో అదే పదాన్ని 'ఛి' అంటారు. 'ఛి' అన్నది టాయ్‌ఛి నించి వచ్చింది. దానికి కూడా అధికారమనే అర్థం. ఛి కి సమానం అన్నది ఇండియా పదం 'ప్రాణ', అది అధికారానికి సంబంధించి భిన్నమయిన దృష్టి.

'ఐకిడో'లో ఎవరయినా నీపై దాడిచేసినప్పుడు వాళ్ళతో సంఘర్షించవద్దంటారు. వాళ్ళకి సహకరించమంటారు. అది అసాధ్యంగా అనిపిస్తుంది. కానీ వ్యక్తి కళను అభ్యసించాలి. ఆ కళని అభ్యసిస్తే ఏమవుతుందో వ్యక్తి గ్రహిస్తే ఆశ్చర్యపోతాడు. నీపై దాడిచేసిన శత్రువుకు నువ్వు సహకరిస్తే ఎలా వుంటుందో చూడు.

సాధారణంగా ఎవరయినా దాడిచేసే వ్యక్తి బిర్రబిగుసుకుంటాడు. గట్టిపడతాడు. ఆ దాడిని ప్రేమపూరితంగా ఆహ్వానం పలకమంటుంది. 'ఐకిడో' అది శత్రువు యిచ్చే బహుమతిగా స్వీకరించమంటుంది. శత్రువు అనంతశక్తిని తీసుకొచ్చాడు. స్వీకరించ మంటుంది.

మొదట్లో యిది అసాధ్యమనిపిస్తుంది. ఎట్లా? తరతరాలుగా అధికారమన్న విషయాన్ని, ఘర్షణని బోధించారు. ఎదుర్కోడాన్ని, పోరాటాన్ని బోధించారు. కాదనడాన్ని, వ్యతిరేకించడాన్ని బోధించారు.

'ఐకిడో' ఆమోదించడాన్ని బోధిస్తుంది. అవునన్న దాన్ని చెబుతుంది. శత్రువు దాడి చేస్తే దాన్ని 'బహుమతి'గా స్వీకరించమంటుంది. నువ్వు సాత్వికమయితే శత్రువు శక్తి నీలోకి ప్రవహిస్తుంది.

ఐకిడో కళలో నిష్ణాతుడు యుద్ధం చెయ్యకుండానే విజయం సాధిస్తాడు. వినయంగా సున్నితంగా వుంటాడు. శత్రువు తన దృక్పథం వల్లనే నాశనం తెచ్చుకుంటాడు... అతనికి సాయపడాల్సిన పన్లేదు. అతను తనలోని విషానికి తనే బలవుతాడు.

కొన్నిసార్లు ప్రయత్నించండి. పరిశీలించండి. ఫలితాన్ని పరిశోధించండి. ఒక తాగుబోతు రోడ్డుమీద తూలుతూపోతూ వుంటాడు. పక్కనున్న మురిక్కాలువలో పడతాడు. గాయపడడు. పొద్దున్నే నిద్రలేచి మళ్ళీ యధావిధిగా ఆఫీసుకు వెళుతున్న అతన్ని చూడండి. ఎక్కడా గాయాలు, ఎముకలు విరగడాలు కనిపించవు. మనం పడితే వెంటనే కాలో,

చెయ్యో విరుగుతుంది. మరి తాగుబోతు వ్యక్తికి ఏం జరిగింది? అతను పడడం అయితే సరిగ్గా పడ్డాడు. అతను ఆ ప్రమాదాన్ని ఎదుర్కొనే ప్రయత్నం చెయ్యలేదు. సంపూర్ణంగా దానికి లొంగిపోయాడు.

అట్లాంటి స్థితిని మనం చాలాసార్లు చూడవచ్చు. వర్షం పడుతూ వుంది. యింటికి వెళుతూ వుంటావు. నువ్వు 'ఐకిడో' మార్గంలో వెళుతూ వుంటావు. లేదా సాధారణ మార్గంలో సాగుతూ వుంటావు. సాధారణ మార్గమేమిటంటే నీ బట్టలు తడిసిపోయి వుంటాయి. చలికి వణికిపోతావు. యిది జరగవచ్చు, జరగకపోవచ్చు నువ్వు వర్షానికి వ్యతిరేకంగా వుంటావు. యింటివైపు విసుగ్గా పరిగెడతావు. చిరాకుగా వుంటావు.

ఐకిడో మార్గంలో ప్రయత్నించు...రిలాక్స్‌గా వుండు. చినుకులు మీద పడితే ఆనందిస్తావు, తలమీది నించి కళ్ళ మీదికి జారే వర్షపు ధారతో తడిసి ఆనందిస్తావు. అది అద్భుతమైన అనుభవం! అది నిన్ను పరిశుభ్రంచేసి పరవశింపజేస్తుంది. బట్టలు తడిచిపోతాయి. కొంపలంటుకుపోతాయా? వాటి గురించి ఆందోళన ఎందుకు? యింటికి వెళ్ళి వాటిని ఆరబెట్టుకోవచ్చు. స్వర్గం భూమిని తాకుతున్న అద్భుత సన్నివేశమది. ఎందుకట్లాంటి అవకాశాన్ని కోల్పోతావు? ఎందుకు ఆ వర్షంలో నాట్యం చెయ్యవు?

ఆందోళన వద్దు, పరుగులు తీయవద్దు. మెల్లగా వెళ్ళు, ఆనందించి, నిన్ను తడుపుతున్న చినుకుల్ని పరవశించి, ఆకాశమిచ్చిన ఆశీర్వాదంగా భావించి దాని స్పర్శని అనుభవించు, ఆమోదించు.

సాధారణ జీవనానుభవాల్ని ప్రయత్నించు, వాటిల్లో సంఘర్షణ వుంటుంది. 'ఐకిడో' మార్గంలో వాటిని సమీపించు. అర్థాలు అపూర్వంగా మారుతాయి. అప్పుడు నువ్వు ప్రకృతికి వ్యతిరేక దిశలో వుండవు. హఠాత్తుగా సూర్యుడు వస్తాడు, మేఘాలు అదృశ్యమవుతాయి. నీ ముఖంపై గొప్ప కాంతి వాలుతుంది. అది సూర్యుడిచ్చిన బహుమతిగా స్వీకరించు. కళ్ళు మూసుకుని కాంతిని అనుభవించు. సంతోషంగా ఉల్లాసంగా ఉండు. అప్పుడు నీలో గొప్ప శక్తి వికసించడం చూస్తావు.

అప్రమత్తంగా

జనం అప్రమత్తంగా వుండరు. చురుగ్గా వుండరు. నిద్రలో వుంటారు. ఒకరకమైన నీరసంలో వుంటారు. తమ అస్తిత్వం చుట్టూ ఒకరకమైన మంచుపొగని పేర్చుకుని వుంటారు. అది అయోమయానికి గురిచేసే మంచుపొగ. వ్యక్తి అరుదుగా మాత్రమే చురుగ్గా వుంటాడు. చాలా అరుదుగా మాత్రమే. మనిషి తన జీవిత కాలంలో కనీసం ఏడుసార్లు అప్రమత్తంగా వుంటే అదే మహాగొప్ప విషయం అన్నారు.

వ్యక్తి గొప్ప ప్రమాదం ఎదురయినప్పుడు అప్రమత్తంగా వుంటాడు. ఎవరైనా వచ్చి గుండెకు పిస్టల్ ఆనించి చంపడానికి పూనుకున్నప్పుడు మనిషిలోని అప్రమత్తత మేల్కొంటుంది. ఆ క్షణకాలం అల్లుకున్న మంచుపొగ అదృశ్యమవుతుంది. ఎందుకంటే మరణం అక్కడ కాచుకుని వుంది. తొంబయి మైళ్ళ వేగంతో, వందమైళ్ళ వేగంతో బండి నడుపుతూ వున్నప్పుడు హఠాత్తుగా రోడ్డు మలుపులో ప్రమాదం పొంచి వున్నప్పుడు మనిషిలో చురుకుదనం వస్తుంది. మంచు పొగ మాయమవుతుంది. ఎందుకంటే అక్కడ ప్రమాదం ఎదురైంది. ప్రమాదం కొన్నిసార్లు అప్రమత్తతని రంగంలోకి తెస్తుంది. అట్లాగే యుద్ధం కూడా. జనం యుద్ధరంగంలో అడుగుపెట్టినప్పుడు మరణం ఎదురైనప్పుడు అరుదయిన సందర్భాల్లో చురుకుదనం మేల్కొంటుంది. లేని పక్షంలో సాధారణమైన, సానుకూలమైన, సుఖవంతమయిన జీవితంలో జనం గురకపెడుతూ వుంటారు.

పరాధీనం

మనం దైవానికి ప్రియమైన వాళ్ళం. యిష్టమయినవాళ్ళం. ఈ విషయాన్ని నిరంతరం స్మృహలో వుంచుకోవాలి. గుర్తుంచుకోవాలి. మనిషి ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించాడు. అందువల్ల తను వేరయినట్లు, పరాధీనుడయినట్లు భావిస్తున్నాడు. మనం ఉనికికి సంబంధించిన వాళ్ళం కానట్లు, ఉనికి మనల్ని లెక్కపెట్టనట్లు, అనంత అస్తిత్వం మనకు వేరయినట్లు, మనం యాదృచ్ఛికమయిన వాళ్ళయినట్లు, మన అవసరమేమీ లేనట్లు వ్యక్తి భావిస్తున్నాడు.

ఈ సమస్త ప్రపంచం పరాధీనమనే చీకటి మేఘంలో కప్పబడివుంది. కారణం మనం సాధారణమైన సత్యాన్ని విస్మరించాం. దేవుడు మనల్ని ప్రేమిస్తున్నాడు, అందువల్లే మనం మనిషిలో వున్నాం. మనం ఆయన ప్రేమవల్లే జన్మించాం. ఆయన ప్రేమ ఒకటే జీవితానికి మూలం. అతని ప్రేమ లేకుంటే మనం శ్వాసించలేం. అతని ప్రేమ మన ఉనికి. అది మనకు ఎంతో సన్నిహిత విషయం కాబట్టి దాన్ని సులభంగా విస్మరించాం. ఆ ప్రేమకు మనకు మధ్య అంతరం లేదు. దాన్ని మనం చూడలేం. మనం చూడని వాటిని సులభంగా మరచిపోతాం.

ఈ విషయాన్ని స్మృహలో వుంచుకోవాలి. గుర్తుంచుకోవాలి. అట్లా గుర్తుంచుకోవడం గాఢమయితే మన పరాధీన భావం అదృశ్యమవుతుంది. ప్రపంచం కాంతివంతమయి చీకటి మాయమవుతుంది. మనమున్న ఈ ప్రపంచం మన యిల్లు. మనం యాదృచ్ఛికంగా యిక్కడికి రాలేదు. మన అవసరం ఈ ప్రపంచానికుంది. మనమొక గొప్ప ప్రయోజనాన్ని నిర్వహించడానికి వచ్చాం. మనకన్నా గొప్పదయిన ప్రయోజనాన్ని నిర్వహించడానికి యిక్కడికి వచ్చాం.

ఏకాంతం

ఏకాంతంగా వుండడమన్నది అద్భుతమయిన విషయం. అట్లాగే ప్రేమలో వుండడ మన్నది కూడా అద్భుతమయిన సంగతే. అవి రెండూ పరస్పరాశ్రితాలు, వైరుధ్యాలు కావు. నువ్వు ఇతరుల సమక్షాన్ని ఆనందించగలిగితే ఆనందించు. సంపూర్ణంగా ఆనందించు. అప్పుడు ఏకాంతం గురించి బాధపడే పనివుండదు. నువ్వు ఎప్పుడయితే యితరుల్తో విసిగిపోయావో అప్పుడు ఏకాంతం వేపుకు మళ్ళి సంపూర్ణంగా సంతోషించు.

అయితే ఏది ఎంచుకోవాలి? అన్న ప్రయత్నం చేయకు. నువ్వు ప్రయత్నిస్తే యిబ్బందుల్లో పడతావు. ఆ ఎంపిక అన్న భావనే నిన్ను రెండుగా విడదీస్తుంది. అది ఒక రకమయిన చీలికలాంటిది. అసలు ఎంపిక అన్నదెందుకు? నీకు రెండూ సిద్ధంగా వున్నప్పుడు ఒకటి ఎంచుకోవడమెందుకు? అది చాలా సహజమైన విధానం. అది ఎట్లాంటిదంటే నీకు ఆకలిగా వున్నప్పుడు తిను. నీకు కడుపు నిండితే తినకు!

ప్రేమకు, ఏకాంతానికి సంబంధించి యిదే వర్తిస్తుంది. జనాల్ని చూసి ఆనందించు. ఎందుకంటే వాళ్ళు దైవ సృష్టిలో భాగం. అదే సమయంలో యింకో కోణాన్ని దృష్టిలో వుంచుకో. నీకు విసుగు ప్రారంభమయితే అక్కడ మొహమాటంతో పనిలేదు. దాన్నించి బయటపడు. లేని మర్యాదను బ్రిటిష్‌వాళ్ళలా నటించకు. సాధికారంగా వుండు. మనకు మన పెద్దవాళ్ళు మర్యాదగా వుండమని బోధించారు. విసుగువున్నా నవ్వుతూ వుండాలి. యిష్టంలేకున్నా మిమ్మల్ని కలవడం చాలా సంతోషం అంటావు.

అట్లాంటి సంఘర్షణకి, మనసులో నలిగిపోవడానికి ఎందుకు అవకాశమిస్తావు? ఇది సరైన సమయం. మనిషి విలువైన ఒక యుగంలో వున్నాడు. సాధికారంగా వుండాల్సిన సమయమిది. నువ్వు ఒక వ్యక్తితో హాయిగా గడిపితే ఆ పనిని సంపూర్ణంగా అనుభవానికి తెచ్చుకో. నీకు అతనితో గడపడం నచ్చనప్పుడు అతన్తో "మన్నించండి" అను. కఠినంగా చెప్పాల్సిన పనిలేదు. యితర్ల సమక్షంలో బాధపడాల్సిన పన్లేదు. "నేను ఏకాంతంగా వుండడానికి యిష్టపడుతున్నాను. నాకంటూ ఒక వాతావరణం అవసరం అనిపిస్తోంది" అను.

యిప్పటిదాకా అట్లాంటి స్థితికి అవకాశం రాలేదు. నువ్వు ఎవర్నయినా ప్రేమిస్తే "నాకంటూ నాదయిన ఒక వాతావరణం అవసరం" అనలేవు! అక్కడ అట్లాంటి మాటలు పనికిమాలినవి. అంతేకాదు, మానవత్వం లేనివి. నువ్వు ఒక వ్యక్తికి ప్రేమిస్తే నిజాయితీగా

వుండు. అది ప్రేమకు సంకేతం. అప్పుడు నీకు యిష్టమయిన అనుకూలమయిన వాతావరణాన్ని కోరుకుంటే అదే సమయంలో ఎదుటి వ్యక్తికి కూడా ఆ స్వేచ్ఛ వుండాలి. ఆ వ్యక్తి నీలో వున్నా లేకున్నా అందుకు నువ్వు అనుమతించాలి.

యిద్దరు వ్యక్తులు కొంత సమయం కలిసి వుండడానికి అంగీకరిస్తే అది మంచిదే! ఏకాంతంగా వున్నా అదీ మంచిదే! ఏకాంతం వ్యక్తికి శాంతిని, నిశ్శబ్దాన్ని, సమభావాన్ని, ధ్యానగుణాన్ని చైతన్యాన్ని, సాన్నిహిత్యాన్ని, కేంద్రభావాన్ని, పునాది స్థితిని నిలకడను యిస్తుంది. యివన్నీ గొప్ప విలువలు.

ప్రేమ వ్యక్తి అనురాగాన్ని, ప్రార్థనని, సహకారాన్ని నేర్చుకోవడాన్ని నేర్పుతుంది. అవన్నీ గొప్ప విలువలు. అవి ఒకదాన్ని యింకొకటి ఎదిగేలా చేస్తాయి.

★ ★ ★ ★

ఏకాంతమన్నది ఒక పువ్వు. నీ హృదయంలో విచ్చుకునే పద్మం. ఏకాంతం ఆశావహం. ఏకాంతం ఆరోగ్యం. నువ్వు నువ్వుగా వుండడంలోని ఆనందం! నీ సొంత స్థలాన్ని కలిగివుండడంలోని ఆనందం!

అవును, వ్యక్తి ప్రేమలో వున్నప్పుడు ఏకాంతాన్ని అనుభూతి చెందుతాడు. ఏకాంతం అద్భుతమైనది. ఏకాంతం గొప్ప దీవెన అయితే దాన్ని ప్రేమికులు మాత్రమే అనుభూతి చెందగలరు. ఎందుకంటే ప్రేమ ఒకటే ఏకాంతంగా వుండగలిగే ధైర్యాన్నిస్తుంది. ప్రేమ ఒకటే ఏకాంత సందర్భాన్ని సృష్టిస్తుంది. ప్రేమ వ్యక్తిని ఏకాంతంలో, పరవశంలో లీనమయ్యేట్లు చెయ్యగలదు. ప్రేమతో నువ్వు ఎంతగా నిండివుండావంటే లోలోతుల్లో ఎంత సంపూర్ణంగా వుంటావంటే యింకొకరి అవసరమే నీకు రాదు. నువ్వు ఏకాంతంలో వుండగలవు. ప్రేమ, ఏకాంతం భిన్న ధృవాలు. ఒకే శక్తికి భిన్న ధృవాలు.

కాబట్టి నువ్వు ప్రేమలో వున్నప్పుడు ఏకాంతంగా వుండాలన్న కోరిక నీలో పుడుతుంది. నిజమైన ప్రేమికులు తను ప్రేమించేవాళ్ళకు ఏకాంతంగా వుండే స్వేచ్ఛను ఇస్తారు. వాళ్ళు సంపూర్ణశక్తితో నిండివున్నప్పుడు పరస్పరం కలుసుకుని వాళ్ళ శక్తిని ఒకరిపై ఒకరు వర్షిస్తారు. ఏకాంతంగా వున్నప్పుడు పంచుకోవాలన్న గొప్ప కాంక్ష వుంటుంది. అక్కడ వున్న లయాత్మకతను చూడండి. ప్రేమలో వున్నప్పుడు నీకు ఏకాంతంగా వుండాలనిపిస్తుంది. ఎట్లాగూ ప్రేమికులు, దగ్గరవుతారు కానీ వేరవుతారు. వేరుకావడమంటే వ్యతిరేకార్థంలో కాదు. మళ్ళీ తమ ఏకాంతాన్ని అందుకోవడానికి విడి పోతారు. అందులోని అందమదే. ఆనందమదే. వ్యక్తి ఆనందంతో నిండినప్పుడు పంచుకో డానికి

తహతహలాడుతాడు. పట్టరాని పరవశం ప్రవాహంగా చుట్టుముట్టినప్పుడు అది వరద రూపం దాలుస్తుంది. దాన్ని పట్టిపెట్టడం అసాధ్యం. దాన్ని పంచుకునే వ్యక్తుల కోసం మీరు అన్వేషిస్తారు.

ప్రేమ పొంగిపొర్లినప్పుడు బుద్ధుల పరిస్థితి ఏమిటి? జ్ఞానుల పరిస్థితి ఏమిటి? బుద్ధుడు జ్ఞానోదయం పొందినప్పుడు ఆయన సంపూర్ణ శక్తితో నిండివున్నాడు. సంపూర్ణ ఆనందంతో పొంగిపొర్లుతున్నాడు. పంచుకోవాలనుకున్నాడు. నలభయేళ్ళపాటు ఒక గ్రామంనించీ యింకో గ్రామం తిరుగుతూ తన శక్తిని, ఆనందాన్ని అందరికీ పంచాడు.

నేను మీతో చేస్తున్నది ఆ పనే!

పంచుకోవాలన్న కాంక్ష మొదలయితే పట్టుకోవడం కష్టం. జ్ఞానోదయం, బుద్ధుని తత్వం, క్రీస్తు చైతన్యం, యివన్నీ దేవుని అందుకోవడానికి వంతెన వేస్తాయి. అనంతశక్తి నీ ముందు విస్తరించి వుంటుంది. పట్టలేని అవకాశాలు పరచుకుని వుంటాయి. అప్పుడు నువ్వు పంచుకోవడానికి ప్రపంచంలోకి అడుగుపెడతావు. నువ్వు ఎంతగా నీ శక్తిని పంచుకుంటే అంతగా అది నీలో పెరుగుతూ వుంటుంది.

ఏకాంతమన్నది శిఖరాయమాన స్థితికి చెందింది. గురువు ఈ ప్రపంచంలో గొప్ప ఏకాంతజీవి. అందువల్ల గురువన్నవాడు ఈ ప్రపంచంలో గొప్ప ప్రేమికుడు. బుద్ధుడికన్నా, క్రీస్తుకన్నా గొప్ప ప్రేమికులు ఈ ప్రపంచంలో లేరు. ఇప్పుడు ప్రేమ ఎంతో నాణ్యతని సంతరించుకుంటుంది. అందులో స్నేహం, అనురాగం, సానుభూతి అంతర్లీనమతాయి. వ్యామోహం అదృశ్యమవుతుంది.

★ ★ ★ ★

నీ లోతుల్లో ఏకాంతంగా వుండలేక పోవడమన్నది అసాధ్యం! అందుకనే కోట్ల మంది అంతర్లోకాల అన్వేషణ చెయ్యరు. వాళ్ళ అచేతన స్థితి హెచ్చరిక చేస్తుంది. అక్కడికి వెళ్ళకు. అది చాలా ప్రమాదకరం. అక్కడ నువ్వు ఏకాంతంగా మారిపోతావు. అక్కడ నువ్వు బిగ్గరగా అరిచినా వినే నాధుడుండడు."

నువ్వు ఎంత లోతుల్లోకి వెళితే అంత ఏకాంతముంటుంది. అక్కడ కేవలం ఏకాంతం, శాశ్వత నిశ్శబ్దం వుంటాయి. అందుకనే జనాలు భయపడి ఎప్పుడూ ఆ పనీ యీ పనీ చేస్తూవుంటాడు. ఏదో ఒక పనిలో తమని తాము మరిచిపోయి లీనమవుతారు.

ఒంటరిగా వుండడానికి అంటే ఏకాంతంగా వుండడానికి సామర్థ్యం వున్న వ్యక్తి 'అస్తిత్వం' కలిగి వుండడానికి సమర్థుడు కాదు. నిజానికి అతనికి నిజమైన అస్తిత్వ

ముండదు. అతను 'అస్తిత్వం' వున్నవాడు అనడం పైపైన చూసి చెప్పేమాట. తను ఎట్లాంటి కేంద్రం లేని పరిధి, ఆత్మలేని నీడ!

★ ★ ★ ★

వ్యక్తి ఏకాంతంగా వుండడం అభ్యసించినప్పుడే అత్యున్నతస్థాయి ఆనందాన్ని అందుకోగలడు. అది వ్యక్తి అస్తిత్వం నుండి ఆరంభమవుతుంది. వ్యక్తి లోలోతుల్ని ప్రదర్శిస్తుంది. అది ఎవరిమీదా ఆధారపడదు. అది ఒక నిరంతర ప్రక్రియ. వ్యక్తి ఆ ఆనందంలో నిరంతరం కొనసాగవచ్చు. ఆ అన్వేషణ ఆనందమే. ధ్యానమంటే ఏకాంతంగా వుండడంలోని ఆనందమే! అట్లా వుండడానికి శక్తి సామర్థ్యాలు వుంటే అతను సజీవంగా వున్నట్లు. ఎట్లాంటి పరిస్థితిపైనా, ఎవరిపైనా ఆధారపడడమంటూ అక్కడ వుండదు. ఎందుకంటే అది వ్యక్తి స్వీయతత్వానికి సంబంధించింది. ఉదయం సాయంత్రం రాత్రిం బగళ్ళు యవ్వనంలో, వృద్ధాప్యంలో వుండేది. ఆరోగ్యంలో, అనారోగ్యంలోనూ వుండేది. జీవన్మరణాలలో వెంటవుండేది. అది ఎందుకు వ్యక్తితో వుంటుందంటే అది బయటినించి వచ్చింది కాదు. అది వ్యక్తి లోలోతుల్లో వున్నది. అది వ్యక్తి తత్వం, వ్యక్తి సహజాతం.

★ ★ ★ ★

వ్యక్తి లోపలి ప్రయాణం కేవల కేవల ఏకాంతంపట్ల సాగే ప్రయాణం. అక్కడికి నీతోబాటు ఎవ్వర్నీ తీసుకెళ్ళలేవు. అక్కడి నీ కేంద్రాన్ని ఎవరితోనూ పంచుకోలేవు నీ ప్రియమైన వ్యక్తితో సహా! దాని లక్షణమది కాదు. దాన్ని గురించి ఏమీ చెయ్యడానికి కుదరదు. ఏ క్షణం నువ్వు దానిలోపల అడుగుపెడతావో అన్ని రకాలయిన బాహ్య సంబంధాలు తెగిపోతాయి. అన్ని వంతెనలు కూలిపోతాయి, వాస్తవానికి సమస్త ప్రపంచం అదృశ్యమయిపోతుంది.

అందుకనే మార్మికులు ప్రపంచాన్ని 'భ్రాంతి' అన్నారు. 'మాయ' అన్నారు. అంటే అది వునికిలో లేదనికాదు కాని ధ్యానంలో వున్న వ్యక్తికి అది దాదాపు లోపలికి వెళ్ళేకొద్దీ వునికిలో లేనట్లే వుంటుంది. అనంత నిశ్శబ్దం నిండి వుంటుంది. ఏ శబ్దమూ దానిలోకి అడుగుపెట్టలేదు. అక్కడ ఏకాంతం ఎంత గాఢంగా వుంటుందంటే వ్యక్తికి దాన్ని సమీపించ డానికి ధైర్యం కావాలి. ఆ ఏకాంతం నించి ఆనందం ఆవిర్భవిస్తుంది. అది దైవానుభవం! అక్కడ యింకో మార్గం వుండదు. ప్రత్యామ్నాయం ప్రసక్తే లేదు.

ఏకాంతాన్ని ఉత్సవంగా జరుపుకోండి. మీ స్వచ్ఛమయిన స్థలాన్ని సంబరంగా జరుపుకోండి. మీ హృదయంలోంచీ గొప్ప గానం ఆరంభమవుతుంది. అది చైతన్యం

గానం! అది ఎవరినో పిలిచే గానం కాదు, కారణం హృదయం ఆహ్వానం పలుకుంతుంది. అది ఆహ్వానగానం! మేఘాలు నీటితో నిండి వుంటాయి, వర్షిస్తాయి. ఎవరికోసమో వర్షించవు కదా! పరిమళంతో నిండిన పుష్పం రెక్కలు విచ్చుకుంటుంది. పరిమళం ఎవర్నీ వుద్దేశించి ప్రవహించదు కదా! నీ ఏకాంతం ఒక నాట్యంగా పరివర్తించనీ.

★ ★ ★ ★

ఏకాంతం, నిశ్శబ్దం అన్నది ఒకే అనుభవానికి సంబంధించిన రెండు కోణాలు ఒకే నాణేనికి రెండువైపులు. వ్యక్తి నిశ్శబ్దాన్ని అందుకోవాలంటే అతను సంపూర్తిగా ఏకాంతంలో అడుగుపెట్టాలి.

మనం ఒంటరిగా పుట్టాం. ఒంటరిగా పోతాం. ఈ రెండు యధార్థాల నడుమ వెయ్యిన్నొక్క భ్రమలు సృష్టించుకుని వాటితో వుంటాం. అన్ని రకాలయిన అనుబంధాలు, స్నేహాలు, శతృత్వాలు, ప్రేమలు, ద్వేషాలు, దేశాలు, జాతులు తెగలు, మతాలు సృష్టించుకుంటాం. ఒక యధార్థాన్ని మరచిపోవడానికి మనం అన్నిరకాలయిన భ్రమల్ని అల్లుకుంటాం. ఆ యధార్థమేదంటే 'ఏకాంతం!' మనం ఒంటరివాళ్ళమన్న నిజాన్ని మరచిపోడానికి ఆ పనులు చేస్తాం! దాన్నించి తప్పించుకోడానికి ఆ పనిచేస్తాం! కానీ నిజమైన మార్గం ఆ ఏకాంతాన్ని ఆనందించడమే!

మీ ఏకాంతాన్ని ఆనందించడమే ధ్యానమంటే. మనం ఎన్ని ఆటలాడినా సత్యాన్ని మార్చలేం. అందువల్ల తప్పించుకునే బదులు దాన్ని ఆనందించండి!

మనం ఒంటరిగా పుట్టాం, ఒంటరిగా చనిపోతాం. లోలోతుల్లో మనం ఏకాంతంగా జీవిస్తాం. అట్లాంటప్పుడు మనం ఏకాంతాన్ని ఎందుకు అనుభవానికి తెచ్చుకోకూడదు? అది మన తత్వం, మన అస్తిత్వం!

అత్యాశ

అత్యాశ వినయం కోసం, నిరాడంబరత్వం కోసం, నిశ్శబ్దం కోసం, రాజకీయ రాహిత్యం కోసం అన్వేషిస్తుంది. నిరహంకారం కోసం వెతుకుతుంది. దాన్నించి మనం ఎంతో గ్రహించవచ్చు. అత్యాశ అన్నది అమాయకత్వ సాహచర్యంతో ఎంతో నేర్చు కుంటుంది.

మనం పసిపిల్లలనించి, ఆడుకుంటున్న పసివాళ్ళనించి ఎంతో నేర్చుకోవచ్చు. రాజకీయవాది సాహచర్యంలోకన్నా పసివాళ్ళ సాహచర్యంలో ఎంతో నేర్చుకోవచ్చు. దాన్ని మించి జంతువులతో, వృక్షాలతో వుంటే ఎంతో నేర్చుకోవచ్చు. మనం గొప్పవాళ్ళుగా చెప్పుకునే ఐశ్వర్యవంతులతోబాటు వుండడంకన్నా ప్రకృతితో వుండడం ద్వారా ఎంతో గ్రహించవచ్చు.

కానీ పసివాళ్ళతో, పశువుల్తో, వృక్షాలతో వుండడంవల్ల నువ్వు వ్యాకులతకు లోనవు తావు. అత్యాశలు అంటురోగాలు. అత్యాశవున్న జనాల్ని దూరంగా వుంచండి. లేకుంటే వాళ్ళ అనారోగ్య లక్షణాలు మిమ్మల్ని అంటుకుంటాయి. మిమ్మల్ని ప్రభావానికి లోనుచేస్తాయి. అప్పుడు వ్యక్తి తనకు సంబంధించని దారిలో వెళతాడు. నువ్వు చెయ్యని పనులు చేస్తావు. నువ్వు కాని ఒక వ్యక్తి సాహచర్యంలో నలుగుతావు.

నీ జీవితంవైపు చూడు. అది దాదాపు యాధృచ్ఛికమయింది. అది తప్పనిసరికాదు. అది యాధృచ్ఛికం. మీ నాన్న నువ్వు డాక్టర్ కావాలనుకున్నాడు. నువ్వు డాక్టరయ్యావు. మీ నాన్న నువ్వు డాక్టర్ కావాలని గొప్పకాంక్షతో అల్లాడాడు. ఆయన కాంక్షను నువ్వు నెరవేర్చావు! అతని అత్యాశకు నువ్వు ఉపకరణంగా ఉపయోగపడ్డావు. అది ప్రేమ కాదు. స్వలాభాపేక్షను నెరవేర్చుకోవడం!

★ ★ ★ ★

అత్యాశ అన్నది ఉన్మత్త దశకు కారణం. మీ అత్యాశల్ని అర్థంచేసుకోవడానికి ప్రయత్నించండి. మీ ప్రయత్నాన్ని ఎవరో వెనక వుండి నడిపిస్తే నువ్వు పిచ్చివాడనవుతావు. నువ్వు నువ్వుగా కాకుంటే నీకు మతిభ్రమిస్తుంది. నువ్వు ఎవరూ కాకుండా వుండు. అప్పుడు సమస్యే వుండదు. అత్యాశల్ని వదిలి జీవించడం ప్రారంభించు. అత్యాశలున్న వ్యక్తి జీవించలేడు. అతను జీవితాన్ని ఎప్పటికప్పుడు వాయిదావేస్తూ వుంటాడు. అతని

నిజమైన జీవితం ఎప్పుడూ 'రేపు'లో వుంటుంది. ఆ రేపు ఎప్పటికీ రాదు. అత్యాశాపరుడు దుర్మార్గుడుగా, నియంతగా వుంటాడు. పర్యవసానంగా అతను పిచ్చివాడవుతాడు.

అత్యాశలేని మనిషి ప్రశాంతంగా వుంటాడు. ప్రేమపూరితుడుగా, అనురాగ పూరితుడుగా వుంటాడు. అత్యాశపరుడు పరుగులుపెడుతూ, ఆరాటంగా వుంటాడు. అసహ్యతను ఆహ్వానిస్తాడు. ఒక దిగంతంకేసి అడుగు వేస్తాడు. అదక్కడ వుండదు. కనిపిస్తుందంతే. అత్యాశలేని వ్యక్తి యిక్కడ యిప్పుడు వుంటాడు. నిర్మలంగా వుంటాడు. ఆనందంగా ప్రశాంతంగా వుంటాడు.

★ ★ ★ ★

సమాజం నిన్ను 'అహంకారి'గా వుండాలని కోరుతుంది. అట్లా లేకుంటే నీకు అత్యాశ వుండదు. అట్లా లేకుంటే సమస్త సమాజ ఆర్థికస్థితి, రాజకీయ నిర్మాణం అన్నీ కూలిపోతాయి. అవన్నీ అత్యాశమీద ఆధారపడినవే. అందువల్ల ప్రతి పసివాడి మనసునీ అత్యాశతో నింపుతారు. అత్యాశ అంటే అహం. అందరికన్నా నువ్వే ముందుండాలి!' నువ్వు దేశానికి ప్రెసిడెంట్ కావాలి. ప్రై మినిస్టర్ కావాలి. ప్రపంచంలో మొదటి ఐశ్వర్య వంతుడివి కావాలి. నోబుల్ ప్రైజ్ పొందాలి. మిస్టర్ యూనివర్స్, బ్యూటీక్వీన్ యిట్లా అన్ని రకాలయిన చెత్తా చెదారం కావాలి. అంతేకానీ ఒక విషయానికి మాత్రం అనుమ తించరు. నువ్వు నువ్వులాగా వుండు. కేవలం నీలాగా వుండు. అది తప్ప యింకేమయినా చెయ్యి. నిరాడంబరంగా, సాధారణంగా వుండకు!

★ ★ ★ ★

నాకు యూనివర్సిటీలో చదువుచెప్పిన ఒక ఉపాధ్యాయుడు నన్ను చూడడానికి వచ్చాడు అతను. 'నన్ను గుర్తుపట్టవనుకుంటాను' అన్నాడు. నేను 'అవును. గుర్తుపట్టాను. ఎట్లా మరచిపోతాను! మీ కారణంగానే యిట్లా వున్నాను. నన్ను దారిలో పెట్టడానికి మీరు ప్రయత్నించారు, విఫలమయ్యారు. మీరు వైఫల్యం చెందినందుకు మీ పట్ల నాకు కృతజ్ఞత వుంది' అన్నాను.

అతను నన్ను చాలా ప్రేమించేవాడు. అతను నన్ను అడకమిక్ ప్రపంచంలో తొయ్య డానికి అన్ని రకాలుగా ప్రయత్నించాడు. నాపట్ల ఎంతో జాగ్రత్త తీసుకునేవాడు. పరీక్ష రోజు నా గదికి వచ్చి నన్ను కార్లో పరీక్ష హాల్ దాకా తీసుకుపోయేవాడు. నేను పరీక్ష రాయనేమో, ధ్యానంలో మునిగిపోతానేమో అని భయపడేవాడు. పరీక్ష ముందుగా నా దగ్గరికివచ్చి 'యిది చదువు, అది చదువు, ఫలానాది వస్తుంది. ఎందుకంటే ఆ ప్రశ్నపత్రాన్ని సెట్ చేసింది నేనే అనేవాడు. ఎప్పుడూ నాకొకటి గుర్తుచేసేవాడు. నేను చెప్పింది చదివావా

లేదా? ఎందుకంటే నేనే ఆ పేపర్ తయారుచేశాను. అది తప్పకుండా వస్తుంది అనేవాడు. తను చెప్పింది నేను విననని ఎప్పుడూ భయపడేవాడు.

అతనికి నేనంటే ప్రేమ. మీ తల్లిదండ్రులు మిమ్మల్ని ప్రేమించవచ్చు. మీ ఉపాధ్యాయులు మిమ్మల్ని ప్రేమించవచ్చు. వాళ్ళు అచేతన స్థితిలో వుంటారు. వాళ్ళు చేసే పని వాళ్ళు గుర్తించరు. నువ్వు తప్పుచేసినా వాళ్ళు ప్రేమిస్తారు. వాళ్ళు వాళ్ళ తత్వాన్ని బట్టి నిన్ను ప్రేమిస్తారు.

ఆ ఉపాధ్యాయుడు నేను గొప్ప యూనివర్సిటీ ప్రొఫెసర్ కావాలనుకున్నాడు. హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ కావాలని ఆశించాడు. డీన్, లేదా వైస్‌ఛాన్సలర్ కావాలని కోరుకున్నాడు. అతని ఆలోచనలకి నేను, నవ్వి "వీటి ద్వారా నేను ఏం సాధిస్తాను? వీటి వల్ల నీకేమిటి లాభం? నువ్వు హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, ఎన్నో డిగ్రీలున్న డీన్‌వి. డాక్టరాఫ్ లిటరేచర్‌వి. యింకా చాలా వున్నాయి. వీటి ద్వారా ఏం సాధించావు? అతను నవ్వి 'నేను చెప్పినపని చేసి నువ్వు ఎదురుచూడు' అనేవాడు. కానీ నువ్వు ఏం సాధించావు? అన్న మాటకు మాత్రం కొంత గందరగోళానికి లోనయ్యేవాడు.

అతనేం చెప్పగలడు? అతను ఏమీ సాధించలేదు. ఇప్పుడు మరణానికి దగ్గరగా వున్నాడు. అతని అత్యాశని నా ద్వారా చూడాలని అనుకున్నాడు. అతని అత్యాశని నేను కొనసాగించాలని ఆదేశించాడు!

దేవదూతలు

వాస్తవంగా దేవదూతలు వునికిలో వుండరు. కానీ పౌరాణికంగా వారు చాలా ప్రాముఖ్యం వున్నవాళ్ళు.

మానవజాతి చరిత్రలో దేవకన్యలు అన్న భావనలేని పురాణం వుండదు. మతాలు దాదాపు ప్రతిదాన్నీ వ్యతిరేకిస్తాయి. కానీ వాటిలో దేవకన్యలకు చోటుంటుంది. అందువల్ల పౌరాణికాంశాలన్నిటితో దేవకన్యలకు సంబంధం వుంటుంది. మొదట ఆ విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి.

దేవకన్యను దేవదూతగా భావిస్తారు. మనిషి శూన్యంలో వుండడు. ఏకాంత ద్వీపంలో వుండలేడు. మనిషి ఆ కారణంగా దైవంతో నిరంతర సంబంధం కలిగివుంటాడు. లేదా అనంతంతోనో, తావో తోనో సంబంధం కలిగి వుంటాడు. అతను ఆ సంగతి గురించి స్పృహతోవున్నా లేకున్నా సంబంధం కలిగివుంటాడు. ఆ విషయం గురించి అతను అంగీక రించకపోవచ్చు. కానీ అస్తిత్వంతో అతని అనుబంధం కొనసాగుతుంది. దేవదూతలు ఆ విషయానికి ప్రాతినిధ్యం వహిస్తారు. దేవదూతలు మనుషులనించి సందేశాన్ని భగవంతునికి అందించేవారుగా భావించబడ్డారు. భూమ్యాకాశాలకు సంధానకర్తలు.

మీరు దేవదూతల్ని పక్కనపెట్టి మీ చుట్టూ చూసుకుంటే భూమ్యాకాశాల నడుమ వేల విషయాలు నిరంతరం ప్రయాణిస్తున్నట్లు తెలుసుకుంటారు. వేల సంబంధాలు సాగు తున్నట్లు గ్రహిస్తారు. విశ్వం సాలెగూడులా విస్తరించి వుంది. మనం దాంట్లో భాగం.

ప్రాచ్యంలో విశ్వాన్ని సాలెగూడుగా భావించారు. ఒక్క సాలెగూడులోని తీగను తాకినా సాలెగూడంతా కంపిస్తుంది. ఒక్క గడ్డిపరకను తాకి చూడండి. మీరు గొప్ప నక్షత్రాన్ని తాకిన అనుభూతిని పొందుతారు. సుదూర తారని స్పర్శించినట్లు ఫీలవుతారు. ఎందుకంటే సమస్తమూ సేంద్రియ సంబంధమైంది. అన్ని అనంతంలో భాగాలే. సంబంధం లేనిదేదీ లేదు. మనిషి అజ్ఞానమే అహాన్ని సృష్టించింది.

అనంతం నించీ వ్యక్తిని వేరు చేసేదే అహం. వ్యక్తి అనంతలో ఒక భాగం. వేరు కాదు. కానీ దాన్నించీ వేరయ్యానని విశ్వసిస్తాడు. వ్యక్తి విశ్వాసమే వ్యక్తి నరకానికి కారణం. అహంపట్ల వ్యక్తి విశ్వాసాన్ని వదులుకుంటే అనంతం నించీ నిరంతరం అతనికి సందేశాలు అందడం గ్రహిస్తాడు. ప్రతిక్షణం, ప్రతిరోజూ, నిరంతరం అనంతం నించీ అందే సందేశాల్ని చూసి వ్యక్తి నివ్వెరపోతాడు. అప్పుడు పక్షుల గానం సందేశాల్నిస్తుంది. పూల వికాసం

సందేశాల్నిస్తుంది. రాత్రి మెరిసే నక్షత్రాలు సందేశాల్నిస్తాయి. అప్పుడు సమస్త అస్తిత్వం తెరిచిన పుస్తకమవుతుంది. నిజమైన 'బైబిల్' అవుతుంది. అప్పుడు వ్యక్తి మసిబారిన, మొరటు ప్రాచీన గ్రంథాల దగ్గరకు వెళ్ళాల్సిన పనిలేదు. అప్పుడు వ్యక్తి నక్షత్రాల్ని దర్శించి అస్తిత్వాన్ని అధ్యయనం చెయ్యడం ఆరభించవచ్చు. అప్పుడు ప్రతిచోటా ప్రార్థనలే, ప్రతి చోటా పవిత్ర గ్రంథాలే, ప్రతిచోటా పాటలే!

అద్భుత పౌరాణిక కల్పనలయిన దేవదూతలు వాటికి ప్రతినిధులు. దేవదూతల బొమ్మలు చూడండి. వాళ్ళు చిన్న పిల్లలుగా వుంటారు. కనీసం యవ్వనంలో వుండరు. వాళ్ళ పసిముఖాల్లో పసిపిల్లల స్వచ్ఛత, అమాయకత్వం, కలుషితం కాని స్థితి కనిపిస్తుంది. వాళ్ళ పళ్ళు, బుగ్గలు వాళ్ళ సమస్త ఆకారం పసిపాపలా వుంటుంది. పసివాళ్ళని పదింతలు చేసి చూసినట్లు, పసితనాన్ని కాంతివంతంగా ఆవిష్కరించినట్లు వుంటుంది.

అందరు బుద్ధులూ వీరు మళ్ళీ పసితనాన్ని అందుకుంటే తప్ప మీకు సత్యమంటే ఏమో తెలీదు. కానీ వాళ్ళలో పసితనం లేదు. ఈ విషయం గ్రహించండి. పసివాళ్ళలాగా అంటున్నారు. అంతే కానీ పసివాళ్ళయిపోయి అనడం లేదు. పసితనంగా వుండడమంటే అది ఆటంకమవుతుంది. పసితనంగా మారడం అనారోగ్యం.

దేవదూతలు పసితనంలాంటి అమాయకత్వానికి ప్రతినిధులు, అంతే కానీ కేవల పసితనానికి కాదు. ఆ అమాయకత్వ మొక్కటే దైవత్వానికి సంబంధం కలిగించేది. అందువల్లే దేవదూతలు దేవుని సందేశాన్ని అందించేవాళ్ళు. దేవునితో సంబంధమున్న వాళ్ళు. వాళ్ళ బొమ్మల్ని చూడండి, వాళ్ళ గురించి చదవండి. వాళ్ళెప్పుడూ పాడుతూ, నాట్యంచేస్తూ, భగవంతుణ్ని కీర్తిస్తూ, 'హల్లెలూయా' అంటూ వుంటారు. వాళ్ళ సంగీత వాద్యంపై హల్లెలూయ అంటూ గానం చేస్తూ వుంటారు.

దేవదూతలు సంపూర్ణ అమాయకత్వానికి ప్రతినిధులు. జీవనోత్సాహానికి ఉత్సవానికి ప్రతినిధులు. అందువల్లే వ్యక్తి ధ్యానం ద్వారా దైవంతో సంబంధం ఏర్పరచుకోవచ్చు. అప్పుడు నువ్వు దేవుడికి వేరుగా వుండవు. దేవుడి లోపల వుంటావు. అస్తిత్వం నీకు సంబంధించినదిగా, నవ్వు అస్తిత్వానికి సంబంధించిన వ్యక్తిగా వుంటావు.

కోపం

కోపమన్నది బాధని రక్షించడానికి ముందుకు వచ్చేది. ఎవరయినా నిన్ను గాయపరిస్తే నీకు బాధ కలుగుతుంది. అప్పుడు నీ అస్తిత్వాన్ని రక్షించడానికి కోపం రంగంలోకి వస్తుంది. అట్లా ప్రతి బాధనీ నీ కోపం అణచివేస్తుంది. బాధ మీద పొరలు పొరలుగా కోపం కమ్ముకుంటుంది.

అది ఎట్లాంటిదంటే బావి కోసం భూమిలో రంధ్రం చెయ్యడం లాంటిది. మొదట మనం భూమిని తవ్వుతూ పొరలు పొరలుగా రాళ్ళూ రప్పల్ని తియ్యడం లాంటిది. అప్పుడు నీళ్ళు వస్తాయి. మొదట నీళ్ళు శుభ్రంగా వుండవు. బురదగా వుంటాయి. క్రమక్రమంగా స్వచ్ఛమయిన నీరు వస్తుంది. మొదట కోపం వస్తుంది. దానికి భూమికిలాగే ఎన్నో పొరలుంటాయి. మొదట విషాదం మొదలవుతుంది. అది బురదలాంటిది. తరువాత బాధ, స్వచ్ఛమయిన, శుభ్రమయిన బాధ వస్తుంది. స్వచ్ఛమయిన బాధ అద్భుతమయింది. ఎందుకంటే అది నీకు పునర్జన్మ నిస్తుంది.

★ ★ ★ ★

వాస్తవానికి కోపమన్నది బంధనం. ఆటంకం. నేను నీతో కోపంగా లేను. ఎందుకంటే నేను ఆ బంధనలో లేను. నేను చాలా ఏళ్ళుగా ఎవరితోనూ కోపంగా లేను. ఎందుకంటే ఎవర్నీ నేను దానికి కారణభూతులుగా భావించడం లేదు. నేను స్వేచ్ఛగా వున్నాను. అందువల్ల నేను కోపంగా ఉండడంలో అర్థంలేదు. నేను దిగులుగా వుండాలనుకుంటే అది నా స్వేచ్ఛకు సంబంధించిందే. నేను ఆనందంగా వుండాలన్నా అది నా స్వేచ్ఛకు సంబంధించిన విషయమే! స్వేచ్ఛ దేనికీ భయపడదు. స్వేచ్ఛ కోపం కాదు. ఒకసారి నువ్వు నీ ప్రపంచం అని తెలుసుకున్నాక నువ్వు భిన్నమయిన అవగాహనలో అడుగుపెడతావు. అప్పుడు యింకొకదానికి అవకాశముండదు. అన్నీ ఆటలు, క్షమాపణలు అవుతాయి.

★ ★ ★ ★

సాధారణంగా కోపమన్నది అంత చెడ్డది కాదు. కోపమన్నది సహజమైన జీవితంలో భాగం. అది వస్తుంది, పోతుంది. దాన్ని నువ్వు అణగదొక్కాలని ప్రయత్నిస్తే అది సమస్యగా మారుతుంది. నువ్వు దాన్ని సొంతం చేసుకుంటావు. పట్టుకుంటావు. అక్కడ యిక రావడం,

పోవడం అంటూ వుండదు. అది నీ అస్తిత్వంగా మారుతుంది. అప్పుడు నువ్వు ఎప్పుడో ఒకసారి కోపంగా వుండడమంటూ వుండదు. నువ్వు కేవలం కోపంగా వుంటావు. కోపమై వుంటావు. ఆగ్రహమై వుంటావు. ఎవరో నిన్ను రెచ్చగొట్టడానికి ఎదురుచూస్తూ వుంటావు. మొదట నువ్వు కోపంగా ఏమైనా చేసేసి తరువాత 'నాకు తెలీకుండానే ఆ పని చేశాను' అంటావు. ఆ మాటల్ని విశ్లేషించు. నీ నిమిత్తం లేకుండా నువ్వు ఏ పనయినా ఎట్లా చేస్తావు? కానీ ఆ మాటమాత్రం అక్షర సత్యం.

అణగదొక్కబడిన కోపం తాత్కాలికమయిన పిచ్చిగా మారుతుంది. నీ అదుపు దాటి ఏదో జరుగుతుంది. దాన్ని అదుపు చెయ్యడానికి ప్రయత్నిస్తావు. కానీ హఠాత్తుగా అది నీ చేతినించి జారిపోతుంది. నిన్ను దాటిపోతుంది. నువ్వేమీ చెయ్యలేవు. నిస్సహాయంగా నిలబడిపోతావు. అది బహిర్గతమవుతుంది. వ్యక్తి ఎంతోసేపు కోపంగా వుండలేడు. కానీ కోపంగుండా సాగుతాడు.

జనాల్ని చూడు. రోడ్డు దగ్గర నిలబడి జనాల్ని పరిశీలించు. రెండు రకాల మనుషులు కనిపిస్తారు. వాళ్ళ ముఖాల్ని పరిశీలించు. సమస్త మానవజాతి రెండు రకాలుగా విభజించినట్లు గ్రహిస్తావు. మొదటి రకం దిగులుగా వుంటారు. దిగాలుగా వుంటారు. యింకో రకం కోపానికి సంబంధించిన వర్గం పిచ్చెక్కినట్లుంటారు. బద్దలు కావడానికి సిద్ధంగా వున్నట్లుంటారు.

కోపం చైతన్యంతో వున్న విషాదం. విషాదం చలనం లేని ఆగ్రహం. నిజానికి అవి రెండు విషయాలు కాదు.

నీ సొంత ప్రవర్తనని పరిశీలించు. ఎప్పుడు ఏ సందర్భంలో దిగులుగా వుంటావు? నువ్వు కోపంగా వుండలేని సందర్భంలో మాత్రమే దిగులుగా వుంటావు. అది లాభదాయకం కాదు. నువ్వు కోపంగా వుండకూడదు. నవ్వుతూ ఉండాలి. అట్లాంటప్పుడు దిగులుగా వుంటావు. శక్తి అన్నది చలనంలేని స్థితిలో వుంటుంది. నువ్వు యింటికి వస్తావు. ఏదో చిన్న విషయంలో నీ భార్యతో పేచీ వస్తుంది. అది అసందర్భమనిపిస్తుంది. అంతే! నీకు వెంటనే ఆగ్రహం వస్తుంది.

జనం కోపాన్ని ఆనందిస్తారు. ఆస్వాదిస్తారు. కనీసం ఏదో చేస్తున్నామని అనుకుంటారు. అదే విషాదంలో వాళ్ళు ఏమీ చెయ్యరు. విషాదమే వాళ్ళని ఏదోచేస్తున్నట్లు భావిస్తారు. నిశ్చేష్టితం అంచులో వున్నట్లు, స్తబ్ధత ఆహ్వానిస్తున్నట్లు భావిస్తారు. ఏదో నీపై పడినట్లు నువ్వు నిస్సహాయంగా నిలబడిపోయినట్లు, నువ్వు ఎట్లాంటి ప్రతిచర్యని ప్రతీకారాన్ని చెయ్యలేని పరిస్థితిలో పడినట్లు భావిస్తావు.

కోపంలో వ్యక్తి ఆనందిస్తాడు. ఎవరినయినా ఎదుర్కొంటున్న సమయంలో రిలాక్స్‌గా ఫీలవుతాడు. ఎందుకంటే చలనంలో వున్నాడు, చైతన్యంలో వున్నాడు. ఎందుకంటే ఏదో పనిచేస్తున్నాడు.

దిగులుగా వున్నవాళ్ళు అట్లుండరు. వాళ్ళ ఎవరయినా తమపట్ల కోపంగా వుండడాన్ని అనుమతించరు. వాళ్ళు క్రిందిస్థాయిలో వుంటారు. పైస్థాయిలో వాళ్ళ కోపంగా వుంటారు. పైస్థాయిలో వాళ్ళు పెరుగుతారు. కిందికి దిగివచ్చే కొద్దీ విషాదం నిండివాళ్ళు ఎక్కువగా వుంటారు.

ఇండియాలో అస్పృశ్యుల్ని చూడు. తక్కువ కులం వాళ్ళని చూడు. వాళ్ళు విషాదంగా వుంటారు. బ్రాహ్మల దగ్గరికి వెళ్ళు. వాళ్ళు కోపంగా వుంటారు. బ్రాహ్మణుడు ఎప్పుడూ ఆగ్రహంతో వుంటారు. చిన్న విషయానికీ పిచ్చెక్కినట్లు ప్రవర్తిస్తాడు. అస్పృశ్యుడు దిగులుగా వుంటాడు. ఎందుకంటే అతను తన కోపాన్ని వ్యక్తపరచడానికి ఎవరూ వుండరు. కోపం, విషాదం ఒకే శక్తికి రెండు రూపాలు.

సహనమన్నది కోపం, విషాదం ఈ రెండూ లేనప్పుడు వస్తుంది. సహన మన్నది ఉన్నతమయిన సంగతి. నువ్వు ఎవరి పట్లా కోపంగా లేనప్పుడు, ఎవరిపట్లా విషాదంగా లేనప్పుడు వుండేది. ఆస్థితిలో ఆ రెండు అదృశ్యమవు తాయి. నీ శక్తులు కేంద్రీకృతమయి వుంటాయి. నిలకడపొంది వుంటాయి. నువ్వు నీ సొంత యింటిలో వుంటావు. సహనమంటే నువ్వు నీ యింటికి తిరిగిరావడం! యిప్పుడు ఏదీ నిన్ను ఆందోళనకు గురిచెయ్యదు, నిన్ను గాయపరచదు. నువ్వు చాలా సంతోషంగా వుంటావు ఆంతర్యంలో పరవశంగా వుంటావు. దేనిపట్లా వ్యామోహముండదు.

★ ★ ★ ★

వ్యక్తి ఆ సంగతి గుర్తించడు. అతని దగ్గర ఒక యంత్రముంటుంది. ఎన్నో పొరల్ని కలిపికుట్టే యంత్రముంటుంది. వ్యక్తి పరిగెడితే శ్వాస మారుతుంది. కారణం మరింత ఆక్సిజన్ కావాలి. దానికి అనుగుణంగానే వ్యక్తి ఆలోచనల్లోనూ మార్పు వస్తుంది.

నువ్వు కోపంగా వుంటే పరిగెట్టు, యింటి చుట్టూ రెండు మూడు సార్లు తిరుగు. అప్పుడు వచ్చి నిన్ను నువ్వు పరిశీలించు. నీ కోపం మాయమవడం చూస్తావు. నీ ఆలోచనా విధానం వెనకట్లా వుండదు. అది మారిపోయి వుంటుంది.

నిజానికి పరిగెత్తాల్సిన పన్లేదు. ఐదార్లు సార్లు గాఢంగా శ్వాసిస్తే చాలు. ఐదారు ఉచ్ఛ్వాశ, నిశ్వాసాలు చాలు. ఎందుకంటే సూటిగా సరాసరిగా కోపాన్ని ఎదుర్కొలేం.

శరీర స్థితిని మార్చుకోవచ్చు. మొదట శ్వాసని దాన్నిబట్టి కోపాన్ని మార్చవచ్చు. ఇది శాస్త్రీయమయిన మార్గం.

★ ★ ★ ★

కోపమన్నది మానసికమయిన పయనం! పొరపాటయిన దేన్నో, పడని దేన్నో తీసుకున్నామనుకోండి. మన శరీరమంతా దాన్ని విసరికొట్టాలని ప్రయత్నిస్తుంది. బయటకు కక్కేయాలనుకుంటుంది. దాన్ని యితరుల మీద విసరికొట్టాల్సిన పనిలేదు. కానీ జనం యితర్లమీద వేస్తారు. సమాజం అదుపులో పెట్టుకోమంటుంది.

కోపాన్ని యితరుల మీద తోయాల్సిన పనిలేదు. బాత్‌రూంకు వెళ్ళవచ్చు. సుదీర్ఘ మయిన వాకింగ్ చేయవచ్చు. అంటే లోపలవున్నదేదో చలనాన్ని, చర్యను కోరుకుంటోంది. బయటపడాలనుకుంటోంది. కాసేపు జాగింగ్ చేయి. విశ్రాంతి పొందుతావు. దిండు తీసుకుని యింకో దిండుకేసి బాదు. దిండును కొరుకు. కాసేపటికి విశ్రాంతి పొందుతావు. ఆ సంగతి తెలిస్తే యితరులపట్ల ఆగ్రహాన్ని వ్యక్తపరచవు. ఎందుకంటే అది తెలివితక్కువ పని.

కోపాన్ని వ్యక్తపరచే ముందు దాన్ని రూపాంతరం చెందించాలి. నువ్వు ఎవర్నయినా చంపాలనుకుంటావు. అది సాధ్యం కాదు, కొరకాలనుకుంటావు, వీలుపడదు. ఆ పని 'దిండు' పట్ల చేయవచ్చు. దిండు అంటే 'అప్పటికే అయిన జ్ఞానోదయం' అది జ్ఞాని, బుద్ధుడు. అది ఎదురుతిరగదు, కోర్టుకు వెళ్ళదు. నీకు వ్యతిరేకంగా ఏ శత్రువునీ నిలపదు. ఏం చెయ్యదు. దిండు సంతోషంగా వుంటుంది. దిండు నిన్ను చూసి నవ్వుతుంది!

మనో వేదన

ప్రతి హృదయంలో గొప్ప ఆవేదన వుంటుంది. తన గురించి తెలియని అనంత వేదన వుంటుంది. అదెట్లాంటిదంటే మనమెక్కడి నించి వచ్చాం? మనమెక్కడికి వెళుతున్నాం? మనమెవరం? అసలు జీవితమంటే ఏమిటి? వీటన్నిటికి సంబంధించిన వేదన. అసలు జీవితానికి అర్థముందా? ఇది మన వేదన, ఇది మన ఆరాటం.

జీవితం నిష్ఫలంగా, అర్థరహితంగా, యాంత్రికమయిన పునరుత్పత్తిగా అనిపిస్తుంది. వ్యక్తి ప్రతిరోజూ చేసిన పనిచేస్తూ పోతూ వుంటాడు, ఎందుకని? ఆరాటమెందుకంటే వ్యక్తి యాదృచ్ఛికంగా వునికిలోకి వచ్చాడు. మనిషి పుట్టుకకు విలువ ఏమీ వున్నట్లు కనిపించదు. అతను ప్రపంచానికి తనవంతు ఏదో యిస్తున్న అనుభవమేదీ కలగదు. అతని వునికికి అర్థంలేదు. తన వునికికి ఒక అర్థాన్ని, ప్రయోజనాన్ని మనిషి ఆశిస్తున్నాడు. అట్లా కాని పక్షంలో మనిషి ఆరాటంతో, ఆవేదనతో వుంటాడు.

అస్తిత్వవాదులు, పరిచయమయిన పదాల్ని సృష్టించారు. మనోవేదన వాటిల్లో ఒకటి. అది ఆధ్యాత్మిక ఆవేదన. అందరూ ఆ ఆవేదన పొందుతారని కాదు. జనం నీరసంగా, తెలివితక్కువగా వుంటారు, అనుకరిస్తారు. వాళ్ళ ఆవేదనని అనుభూతి చెందరు. బతుకంతా పనిచేస్తూ జీవితం ముగిస్తారు. జీవితమంటే ఏమిటో తెలీకుండా పుట్టి చనిపోతారు. అయితే చరమాంకంలో హఠాత్తుగా స్పృహలోకి వస్తారు. 'నేను అవకాశాన్ని కోల్పోయాను' అంటారు. అది మరణానికి సంబంధించిన బాధ. నిజానికి అది పరోక్షంగా మరణ ప్రభావాన్ని కలిసి వుంటుంది. తను అదృశ్యమయిపోతున్నానని తెలిసినప్పుడు 'నేను అర్థ వంతమయిన పని ఏదీ చెయ్యలేదు. సృజనాత్మకమయిందేదీ చెయ్యలేదు. చైతన్యంతో లేను, యాంత్రికంగా బతికాను, నిద్రలో నడిచాను' అంటారు.

జంతువు

మొదటిసారి డార్విన్ 'మనిషి జంతువు నుండి పరి ణామం పొందాడు' అన్నాడు. మనిషిని సూటిగా దైవం సృష్టించాడని భక్తులు అనుకుంటారు. డార్విన్ దాన్ని ఖండించాడు. మనిషి తాను దేవుడికి సన్నిహితుడని భావిస్తాడు. తాను కోతి నుండి పరిమాణం చెందానని అనుకోడానికి అతనికి మనసొప్పదు. కానీ డార్విన్ అదంతా తల కిందులు చేశాడు. డార్విన్ మత దృష్టి వున్నవాడయినా అలా చెప్పాడు. ఆ విషయంలో అతనూ యిబ్బంది పడ్డాడు. మనిషి పరిణామక్రమంలో రూపొందాడు. అతను జంతు ప్రపంచంలో భాగం అన్న విషయం చెప్పాడు. మనిషి జంతువుకన్నా వేరుకాదని చెప్పాడు.

ఆడమ్ సిగ్గుపడ్డాడు. యిప్పుడు అతను జంతువుతో తనని పోల్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మనిషి బట్టలు వేసుకుని తనను తాను జంతువు నించి వేరుపరుచుకున్నాడు. మనం జంతువుతో పోల్చుకోడానికి సిగ్గుపడతాం. ఎవరయినా ఏదైనా పొరపాటు చేస్తే 'ఏంచేస్తున్నావు? నువ్వు మనిషిలా లేవు, జంతువులా వున్నావు, అంటాం. జంతువుగా వుండడాన్ని మనం వ్యతిరేకిస్తాం. మనం 'సెక్సు'ను వ్యతిరేకిస్తాం. కారణం అది జంతు లక్షణం కలిగింది. జంతు సంబంధమయినదేన్నయినా మనం వ్యతిరేకిస్తాం.

చైతన్యం గుండా ఖండన వస్తుంది. జంతు లక్షణాన్ని వ్యతిరేకించడం వస్తుంది. ఈ ఖండించడం సంపూర్ణమయిన శారీరక అణచివేతగా రూపొందుతుంది. శరీరం తీవ్ర నిర్బంధానికి లోనవుతుంది. మనిషి జంతువు కావడమే దానికి కారణం. మనిషి ఆ స్థితిని దాటి వెళ్ళవచ్చు. అది వేరే విషయం. కానీ అతను జంతు ప్రపంచానికి సంబం ధించినవాడే. ఒకరోజు ఆ స్థితిని దాటవచ్చు. అది అతని వారసత్వం. ఒకసారి ఆ ఆలోచన అతని మనసులోకి వస్తే అప్పుడు అతను జంతువు నుండి వేరవుతాడు. ఈ అణచివేత చీలిక తెస్తుంది. ప్రతి మనిషి యితరుడుగా మారుతాడు. ఒకటి ప్రాథమికమైంది జంతు లక్షణం. రెండోది మేధో సంబంధమయింది. నైరూప్యం, దైవసంబంధం. ప్రేమ దైవికం కాంక్ష జంతు సంబంధం. మనిషి ఈ రెంటి మధ్యా వేలాడుతూ వుంటాడు. అతను ప్రేమ అని దేన్ని అనుకుంటాడో అది కామం, ప్రేమ ఈ రెంటి సమ్మేళనం. అందులో కొంత జంతు సంబంధమైంది, కొంత దైవికమైంది వుంటుంది. అందువల్లే మనిషి ప్రేమ విషయంలో గందరగోళానికి గురవుతుంటాడు. ఏది నిజమో చెప్పలేని సందిగ్ధంలో వుంటాడు.

ప్రేమని రెండు విధాలుగా చెప్పవచ్చు. జంతు సంబంధమయిన కాంక్ష కామం. దాంట్లో సొంతం చేసుకోవడం, ఈర్ష్య, యితర్లపై అధికారం చెలాయించడం, మోసగించడం వుంటాయి.

రెండోది స్వచ్ఛమయిన పరిమళం లాంటిది. దైవికమైంది. ప్రార్థనలాంటిది. వ్యక్తి స్పృహతో వుండాలి. ఈ రెంటినీ కలపకూడదు. క్రమంగా సాగిపోతూ వుంటే జంతు లక్షణం వెనకపడుతుంది. సమాధి, జ్ఞానోదయం, సటోరి ఈ స్థితికి చేరుకున్నప్పటికి జంతు లక్షణం అదృశ్యమవుతుంది. దీనికి దారి ప్రేమ. శక్తి ప్రేమగా పరిణామం చెందితే అదే దైవత్వానికి మార్గం.

ఆరాటం

కోరిక ఆరాటాన్ని సృష్టించదని సాధారణంగా నమ్ముతారు. ఆరాటం కోరికను సృష్టిస్తుంది. మనిషి అంటే ఆరాటం.

నిన్న మీతో ఒక విషయం చెప్పాను. జంతువులకు ఆరాటం వుండదు. ఎందుకంటే అవి ఏమో కావాలనుకోవు. అవి ఎట్లా వున్నాయో అట్లానే వుంటాయి. కుక్క కుక్కలా, పులి పులిలా వుంటాయి. అక్కడ సమస్యలేదు. పులి పులిలా వుండడానికి ప్రయత్నించదు. అప్పటికే అది దానిలా వుంది. అక్కడ అది కావాలనుకున్నదేదీ లేదు.

జంతు ప్రపంచంలో ఆరాటంలేదు. బుద్ధుల ప్రపంచంలో ఆరాటం లేదు. వాళ్ళు ఏది కావాలో అక్కడ వున్నారు. వాళ్ళు సిద్ధులు, వాళ్ళు సజీవంగా వున్నారు. అక్కడ ఎట్లాంటి లక్ష్యాలూ లేవు. కదలిక లేదు. ప్రయాణం పూర్తయింది. వాళ్ళు తమ యింటికి చేరుకున్నారు.

ఈ రెండు స్థితులకు నడుమ మనిషి వున్నాడు. సగం జంతువు, సగం బుద్ధుడు. అక్కడే ఆరాటం వునికిలో వుంటుంది. ఆరాటమే ఉద్రేకం. నీలో ఒక భాగం జంతువు దగ్గరికి వెళ్ళాలని కోరుకుంటుంది. అది నిన్ను వెనక్కిలాగి 'రా! వెనక్కిరా! ఈ స్థితి అద్భుతంగా వుంటుంది. ఎక్కడికెళుతున్నావ్' అంటుంది.

యింకో భాగం భవిష్యత్తు గురించి ఆశావహంగా వుంటుంది. యింకో పరోక్షమయిన మార్గంలో బుద్ధుడు కావడమే విధి నిర్ణయమని ఖచ్చితమయిన నిర్ణయం. బీజం అక్కడే వుంది. ఆ బీజం మొదట, సరయిన నేలని చూడు. అప్పుడు నువ్వు బుద్ధ డవుతావు, అంటూ వుంటుంది. వెనక్కు వెళ్ళకు, ముందుకే వెళ్ళు' అంటూ వుంటుంది.

ఆరాటం ఎప్పుడూ పోటాపోటీగా వుంటుంది. ఆరాటమన్నది అర్థంచేసుకోవాల్సిన ముఖ్యమయిన పదం. కారణం అది కేవలం పదం మాత్రమే కాదు. మనిషి తనని తాను దానిలో చూసుకుంటాడు. మనిషి ఏదీ తేల్చుకోలేని స్థితిలో అక్కడుంటాడు. అది ప్రాథమిక మయిన తడబాటు స్థితి. ఈ స్థితిలో వుండడమా? బయటపడడమా? అన్న స్థితి. మనిషి అడ్డరోడ్‌లో నిల్చున్న స్థితి. ఒకటి ఎంపిక చేసుకుంటే యింకొకటి సిద్ధంగా వుంటుంది. ఫలితంగా భయం రంగంలోకి వస్తుంది.

క్షమాపణ

క్షమాపణ తప్పనిసరి. లేకుంటే సంబంధం వుండదు. ఎదుటి మనిషి అపరిచితు డవుతాడు. అక్కడ వివరణ, విశ్లేషణ అవసరం లేకుంటే అక్కడ ప్రేమ వుండదు. అక్కడ ప్రేమ వుంటే సంజాయిషీకి అవకాశముండదు. ఎదుటి వ్యక్తి అర్థం చేసుకుంటాడు. ప్రేమ ఎప్పుడూ అర్థం చేసుకుంటుంది.

కాబట్టి ప్రేమను మించిన నైతిక విలువ వుండదు, వుండే వీలులేదు. ప్రేమ ఉన్నతోన్నత చట్టం. అది లేనప్పుడు దానికి ప్రత్యామ్నాయాలు అవసరం. అపరిచితుని కాలు తొక్కితే అందరి మధ్యా క్షమాపణలు చెప్పడమన్నది తప్పనిసరి. అక్కడ సంజాయిషీ కూడా అవసరం. 'యిక్కడ బాగా రద్దీగా వుంది' అనాలి.

ఈ వివరణ ద్వారా ఒక విషయం అర్థంచేసుకోవచ్చు. పాశ్చాత్య ప్రపంచంలో భర్త క్షమాపణ అడుగుతాడు, భార్య సంజాయిషీ యిస్తుంది. ఫలితంగా అక్కడ ప్రేమ అదృశ్య మవుతుంది. అంటే ప్రతి ఒక్కరూ అపరిచితులే. అక్కడ యిల్లంటూ వుండదు. అంతా సంతే! ప్రాచ్యంలో అట్లా అనుకోవడానికే వీలుపడదు. కానీ పాశ్చాత్యులు ప్రాచ్య దేశస్తుల్ని మొరటువాళ్ళనుకుంటారు. భర్త ఎట్లాంటి సంజాయిషీ యిచ్చుకోడు, అవసరంలేదు. ఎందు కంటే యిక్కడ భార్యాభర్తలు అపరిచితులు కారు, కొత్తవాళ్ళు కారు. యిక్కడ వింటున్న వాళ్ళు అర్థం చేసుకుంటారు. ఎదుటి వ్యక్తి అర్థం చేసుకోలేనప్పుడు క్షమాపణ అవసరం ఏర్పడుతుంది. ప్రేమను అర్థం చేసుకోలేకుంటే క్షమాపణ ఎట్లాంటి మేలుచేస్తుంది?

ప్రపంచమే ఒక యిల్లుగా మారితే క్షమాపణలన్నీ అదృశ్యమయిపోతాయి. యితరుల పట్ల స్పష్టత లేనప్పుడు క్షమాపణ అవసరం. సంజాయిషీ అన్నది సంఘర్షణని తప్పించుకునే ఎత్తుగడ. క్షమాపణ ఘర్షణ నించి తప్పుకునే ఉపకరణం. ఘర్షణ వుంటే భయపడతాం.

ఘర్షణ నించీ తప్పుకునే నాగరిక మార్గమిది. నువ్వు ఒక అపరిచితుడి కాలు తొక్కావు. అతని కళ్ళలో కోపం చూశావు. కొట్టడానికి సిద్ధపడ్డాడు. అక్కడ క్షమాపణ అవసరం. క్షమాపణ అతని కోపాన్ని శాంతపరుస్తుంది. అది ఒక సామాజిక ఉపకరణ. అది అడ్డుకట్టవేస్తుంది. నేను బాధ్యుణ్ణికాను. అక్కడ జనం గుంపుగా వున్నారు రద్దీగా వుంది. ఏం చెయ్యలేని స్థితి. అందువల్ల అది జరిగింది' అంటూ సంజాయిషీ యిచ్చుకోవాలి.

సారాంశం 'నేను బాధ్యుణ్ణి కాను.'

ప్రేమ ఎప్పుడూ బాధ్యతే. అక్కడ జనమున్నా, రద్దీ వున్నా ప్రేమ స్పృహతో, చైతన్యంలో చురుకుదనంతో వుంటుంది. ఎందుకంటే నీ బాధ్యతని పరిస్థితిని అంటగట్టవు. ఎందుకంటే దానికి నువ్వే బాధ్యుడుగా వుంటావు.

"సార్" అని చెప్పడం ద్వారా నువ్వేం చేస్తున్నావు? నీ నిద్ర ఎగిరిపోయింది. నువ్వు నిద్రలో నడుస్తున్నావు. నిద్రిస్తూ, కలగంటూ, వూహిస్తూ నీ మనసు పరిపరి గతుల్లో సాగుతోంది. అప్పుడు యింకొకరి కాలు తొక్కావు. అక్కడ జనం గుంపుగా వున్నారని కాదు. వున్నా నువ్వు అడుగుపెట్టవు. కానీ పెట్టావు.

ఆ పనిచేసింది నువ్వు. నీ అచేతన స్థితి, నీ అచేతన ప్రవర్తన ఆ పనిచేసింది. సంతలో ఐనా, రద్దీలో అయినా బుద్ధుడు ఆ పనిచేయడు. సంపూర్ణ చైతన్యంతో ప్రవర్తిస్తాడు. ఏంచేసినా స్పృహతో చేస్తాడు. నీ పాదం తొక్కినా ఆ పని స్పృహలోనే చేస్తాడు. దానికి కారణముంటుంది.

విలువిద్య

విలువిద్యను మీరు మరింత ధ్యానంతో నిర్వహించాలి. సాధారణ విలుకాడు లక్ష్యం గురించి ఆలోచిస్తాడు. లక్ష్యాన్ని ఎట్లా అందుకోవాలి? అన్న దానిమీద దృష్టి నిలుపుతాడు. లక్ష్యాన్ని అందుకుంటే ఆనందిస్తాడు. ధ్యాన దృష్టివున్న వ్యక్తి దాన్ని గురించి ఆలోచించడు. అతనికి లక్ష్యమన్నది ముఖ్యం కాదు, అది మొదటి స్థానంలో వుండదు. అతనికి విలుకాడు ముఖ్యం. అంటే అతను ప్రథమ స్థానంలో వుంటాడు. ఎట్లాంటి మనస్థితి విల్లు వదులుతోంది అన్నది అతనికి ముఖ్యం. అది లక్ష్యంకేసి సాగుతుంది. లక్ష్యం రెండోస్థానంలోది.

వ్యక్తి ఆందోళన పడకూడదు. ప్రశాంతంగా, విశ్రాంతి స్థితిలో వుండాలి. ఆ స్థితిలో మనసులో ఏ ఆలోచనలూ వుండకూడదు. ఖాళీగా వుండాలి. బాణం వ్యక్తిని శూన్యస్థితిలో వదలాలి. అప్పుడది గొప్ప ధ్యానమవుతుంది. శతాబ్దాలుగా జెన్‌వాదులు విలువిద్యను అలా నిర్వహిస్తున్నారు.

మీరు హెర్రిగల్ పుస్తకం చదివారా?

★ ★ ★ ★

హెర్రిగల్ మూడేళ్ళు గురువు దగ్గర విద్యను అభ్యసించాడు. ఆ మూడేళ్ళు వ్యర్థమయ్యాయని భావించాడు. ఎందుకంటే గురువు ఎంతసేపూ నువ్వు బాణం వదలకూడదని అంటున్నాడు. బాణం దానంతట అదే వెళ్ళాలి' అంటున్నాడు.

గురువు 'లక్ష్యమన్నది అసలు లక్ష్యం కాదు. నువ్వే లక్ష్యం. నువ్వు లక్ష్యంపై గురి పెట్టావా? లేదా? అన్నది నేను పట్టించుకోవడంలేదు. అది యాంత్రికమైన నైపుణ్యం. నేను నిన్ను చూస్తున్నాను. అక్కడ నువ్వు వున్నావా? లేదా? అని చూస్తున్నాను. బాణం వెయ్యడమన్నది ఒక ఆట. దాన్ని ఆనందించు. నువ్వు లక్ష్యాన్ని గురి తప్పలేదు అని నిరూపించుకోవడానికి ప్రయత్నించకు. నీ అహాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నించకు. అది అప్పటికే అక్కడవుంది. నువ్వు అక్కడున్నావు. దాన్ని నిరూపించడానికి ప్రయత్నించకు. వెసులుబాటుతో వుండు. బాణం దానంతట అదే సాగనీ.

పాశ్చాత్యుల మనసు ఎప్పుడూ అంతిమం మీదనే దృష్టి నిలుపుతుంది. ప్రాచ్యం ఎప్పుడూ ప్రారంభంమీద శ్రద్ధ చూపుతుంది. ప్రాచ్యదృష్టికి అంతిమం నిరుపయోగం. ఆరంభంమే ముఖ్యం. విలుకాడిమీదే, లక్ష్యంపై కాదు. అందువల్ల గురువు "వద్దు" అంటాడు. అప్పుడు పూర్తి నిరాశ కమ్ముకుంటుంది. హెర్రిగల్ యిక వెళ్ళిపోతాను. అనుమతి యివ్వండి'

అని అడిగాడు. యింకా 'నేను వెళతాను. మూడేళ్ళు గడిచాయి. నేను ఎట్లాంటి ప్రయోజనాన్ని పొందలేదు, ఏమీ సాధించలేదు. మీరేమో ఎంతసేపూ 'వద్దు, వద్దు' అంటూ పోయారు. నేను ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లున్నాను' అన్నాడు.

అతను వెళ్ళిపోయే సమయం వచ్చింది. గురువుగారి దగ్గర వీడ్కోలు తీసుకుందామని వెళ్ళాడు. అప్పుడు గురువు యితర శిష్యులకు బోధిస్తున్నాడు. బోధన పూర్తి అయ్యేదాకా వుండి సెలవు తీసుకుందామనుకున్నాడు.

ఒక బెంచీ మీద కూచుని మొదటిసారి గురువుగారిని ఆపాదమస్తకం పరిశీలనగా చూశాడు. నిజంగానే ఆయన ఏమీ చెయ్యడం లేదు. బాణం తనంతట తాను దూసుకెళ్ళి నట్లున్నాడు. ఆయన తేలికగా విశ్రాంతిగా వున్నాడు. ఏదో ఆహ్లాదకరమయిన క్రీడలో వున్నట్లున్నాడు. లక్ష్యం మీద ఎవరికీ దృష్టిలేదు. అహమన్నది లక్ష్యాన్ని కేంద్రంగా కలిగింది.

మొదటిసారి హెర్రిగల్ చూశాడు. కారణం అతని అనాసక్తి. కారణం అది అతని పనికాదు. సమస్తాన్ని అతను సంబంధంలేనట్లు వదిలాడు. కాబట్టి అక్కడ గంభీరానికి ఆస్కారమే లేదు. మొదటిసారి అతను వైఫల్యాన్ని అంగీకరించాడు. అక్కడ నిరూపణకు అవకాశమే లేదు. మొదటిసారి అతని కళ్ళకు కమ్మిన లక్ష్యం పొరలు తొలిగాయి. మొదటి సారి వింటి నుండి వదిలిన బాణంలా అతను గురువును చూశావు. గురువు శక్తినిస్తున్నాడు. బాణం వెయ్యడంలేదు. అక్కడ సమస్తం అప్రయత్నంగా వుంది. మొదటిసారి హెర్రిగల్‌కు అవగాహన కలిగింది.

ఆనంద పరవశంతో అతను గురువును సమీపించి విల్లు తీసుకుని వెనక్కి జార విడిచాడు. గురువతన్ని చూసి నువ్వు ఎక్కడికి చేరాలో అక్కడికి చేరావు. నేను మూడేళ్ళుగా చెబుతున్నది యిదే. యిప్పుడు నువ్వు లక్ష్యాన్ని అందుకున్నావు, అన్నాడు.

వాదన

నూటికి తొంభయి తొమ్మిది సమస్యలకు వాదించడమే కారణం. అట్లాంటి వాదనల్ని, ఘర్షణల్ని వదలిపెట్టాలి.

పసివాడు నాన్నా! నేను ఆడుకోడానికి వెళ్ళనా? అంటాడు. ఏ తండ్రి అయినా మొట్టమొదట చెప్పే సమాధానం 'వద్దు!' అక్కడినించీ ఘర్షణ మొదలు. పిల్లలకు తల్లిదండ్రుల బలహీనత తెలుసు. ఏడుస్తారు. బొమ్మలు విసిరేస్తారు. పుస్తకాలు చింపేస్తారు. చివరికి 'వెళ్ళు, వెళ్ళి ఆడుకో' అంటాడు తండ్రి. ఆ విషయం మొదట చెప్పి వుంటే ఎంత బావుండేది. కానీ మన పెంపకం వాదాలతో వాగ్యుద్ధాలతో ముడిపడి వుంటుంది.

అన్వేషకుడికి మొదట అవసరమయినదేది? అక్కరలేనిదేది అన్న విషయం గ్రహించడం ప్రాథమికంగా వుండాల్సిన లక్షణమన్నాడు మహావీరుడు. దాన్ని ఆయన వివేక మన్నాడు. విచక్షణ అన్నాడు. ఏది తప్పనిసరి అవసరమో తెలుసుకోలేకపోతే అవసరం లేనిదానిలో చిక్కుకుంటాం. అనవసరమయింది అరణ్యమంత విస్తారం. అక్కడ అడుగు పెడితే అవసరమయిందేదో తెలుసుకోవడం అసంభవం. జనం అవసరంలేని దానికి అతుక్కుని వుంటారు.

రాజీపడకుండ ఎన్నిట్ని వదుకోగలమో పరిశీలించండి. అప్పుడు వాటిని వదులు కోండి. యిబ్బంది కలిగే సందర్భంలో ఎన్ని పదాల్ని వదులుకోగలమో ఆలోచించండి. వాటిని వదులుకోండి. ఎందుకంటే ప్రతి చిన్న పదమూ సమస్యల్ని కొని తెస్తుంది. మాటల్ని మినహాయించి మనకు యింకేమీ సమస్యల్ని తీసుకురావు.

'ఏదో ఒకమాట అంటావు. భార్య రెచ్చిపోతుంది. 'మీరు ఎందుకలా అన్నారు?' అంటుంది. నువ్వు సంజాయిషీ ఆరంభిస్తావు. 'నా వుద్దేశమిది కాదు' అంటావు. అక్కడ అంగీకారానికి వచ్చే సమస్యే వుండదు. తలుపులు పగలగొట్టడం, పాత్రలు విసిరేయడం దాకా వ్యవహారం కొనసాగుతుంది. లోపల దాచుకోవాల్సిన మాట బయటికివచ్చి సమస్య తెచ్చిపెట్టింది. నిజానికి అది తప్పనిసరిగా చెప్పాల్సిన మాట కాదు, అవసరం లేనిది సమస్యకు కారణమైంది, అట్లాంటి మాటల్ని వదిలిపెట్టాలి.

'అర్హత'

గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన వాళ్ళను రెండు రకాలుగా విభజించాడు. మొదటి రకం వాళ్ళని 'అర్హతులు' అన్నాడు. రెండో రకం వాళ్ళని బోధిసత్వులు' అన్నాడు. యిద్దరూ జ్ఞానోదయం పొందిన వాళ్ళే. వాళ్ళ అనుభవాల్లో తేడా లేదు. కాని 'అర్హత' కేటగిరీకి చెందిన వ్యక్తి గురువు కాడు. బోధిసత్వ కేటగిరీకి చెందిన వ్యక్తి గురువవుతాడు. అర్హతుడు జ్ఞానోదయం పొందినా బోధన సామర్థ్యం వున్నవాడు కాడు. ఎందుకంటే బోధన అన్నది పూర్తిగా ప్రత్యేక విషయం.

ఉదాహరణకి మనం సూర్యాస్తమయాన్ని చూసి. ఆ సౌందర్యాన్ని సంపూర్ణంగా అనుభవానికి తెచ్చుకుంటాం. చిత్రకారుడయిన విన్సెంట్ వాంగో స్థాయిలో అనుభవానికి తెచ్చుకుంటాం. అంతమాత్రాన మనం చిత్రకారులలాగా దాన్ని చిత్రించగలమని కాదు. చిత్రకళ అన్నది పూర్తిగా వేరయిన కళ. అనుభవం అన్నది ఒక విషయమయితే యితరులు అనుభవానికి తెచ్చుకునేలా చేయడమన్నది వేరు విషయం.

చాలామంది 'అర్హతులు' వుంటారు. కొంతమందే 'బోధిసత్వులుంటారు. బోధిసత్వులు జ్ఞానోదయం పొందినవాళ్ళు. అదే సమయంలో తమ అనుభవాన్ని యితరులకు చెప్పగలిగిన ప్రతిభావంతులు. అది ప్రపంచంలో గొప్ప కళ. దాంతో పోల్చదగిన కళ మరొకటి లేదు. కారణం దేనిని చెప్పలేమో దాన్ని అది చెప్పగలిగింది. అవ్యక్తాన్ని వ్యక్తం చెయ్యగలిగింది. జనాల్ని నిద్రనించి మేల్కొలిపేది. దాహంతో తపించేవాళ్ళకు దారి చూపేది. అది అరుదైన వరం.

ఒకసారి ఎవరో బుద్ధుణ్ణి 'మీ శిష్యుల్లో ఎంతమంది జ్ఞానోదయం పొందారు?' అని అడిగారు.

బుద్ధుడు 'చాలామంది. చూడండి, యిక్కడ కూచున్న మంజుశ్రీ, సారిపుత్ర ముగ్గలా యనుడు, మహాకాశ్యపుడు ఈ నలుగురూ జ్ఞానోదయం పొందినవాళ్ళు' అన్నాడు. ఆ వ్యక్తి మరివాళ్ళు జ్ఞానోదయం పొందిన వాళ్ళయితే వాళ్ళు మీలాగా ఎందుకు సుప్రసిద్ధులు కారు? అన్నాడు. యింకా వాళ్ళ గురించి యితరులకు ఏమీ తెలీదు. వాళ్ళకు మీలాగా వేలమంది అనుయాయుల్లేరు' అన్నాడు బుద్ధుడు. 'జ్ఞానోదయం పొందిన వాళ్ళు అర్హతులు, బోధిసత్వులు కారు" అన్నాడు.

★ ★ ★ ★

బౌద్ధంలో రెండు రకాలున్నాయి. హీనయానం, మహాయానం. హీనయానంకు సంబంధించింది 'అర్హతులు' అన్న పదం. హీనయానం అంటే చిన్న పడవ. చిన్ని పడవ గుండానే యింకో తీరాన్ని చేరగలవు. దాంట్లో ఒకరే ప్రయాణించగలరు. యితర్లని అనుమతించరు. కాదంటే అతన్తోబాటు నువ్వూ మునిగిపోతావు. పడవ అంత చిన్నది.

మహాయాన అంటే పెద్ద పడవ. అది బోధిసత్వుల మార్గం. అతను యితర్లని ఆహ్వానిస్తూ పోతాడు. అతను 'నోవా ఆర్క్'లాగా అన్ని రకాల జనాలకు అందులో అవకాశం కల్పిస్తాడు. అతని సంఘంలో అందరికీ అవకాశం వుంది. అతను వేలమందిని తనతో బాటు ఆవలితీరం తరలిస్తాడు. అతను గొప్ప గురువు.

కళ

కళలోని వైరుధ్యమేమిటంటే మొదట అందులోని క్రమశిక్షణను అభ్యసించి వ్యక్తి ఆ తరువాత దాన్ని పూర్తిగా మరచిపోవాలి. దాన్లోని ప్రాథమిక విషయాల్ని మొదట గ్రహించకుంటే దాని లోలోతుల్లోకి ప్రవేశించడం అసాధ్యం. అయితే యిక్కడ మరో విషయముంది. మొదట దాని సాంకేతికతను, అంటే టెక్నిక్‌ని తెలుసుకుని కేవలం ఆ టెక్నిక్‌నే జీవితమంతా ప్రాక్టీసుచేస్తూ పోతే వ్యక్తి గొప్ప సాంకేతిక నిపుణుడవుతాడు. కానీ గొప్ప టెక్నీషియన్‌గానే మిగుల్తాడు. ఎప్పటికీ కళాకారుడు కాలేడు.

జెన్ తత్వంలో ఒక విషయం చెబుతారు. వ్యక్తి గొప్ప చిత్రకారుడు కావాలనుకుంటే పన్నెండేళ్ళపాటు ఎట్లా చిత్రించాలో అభ్యసించమంటారు. తరువాత పన్నెండేళ్ళ పాటు చిత్రకళ గురించి పూర్తిగా మరచిపొమ్మంటారు. అంటే చివరి పన్నెండేళ్ళ కట్టెలు కొట్టడం, నీళ్ళు మోయడంలాంటి వాటిమీద ధ్యానం నిలపమంటారు, ఏపనయినా చెయ్యమంటారు, చిత్రించడం తప్ప.

అప్పుడు వ్యక్తి ఒకరోజు చిత్రించడానికి అర్హత సంపాదిస్తాడు. ఇరవయి నాలుగేళ్ళ శిక్షణ, పన్నెండేళ్ళు టెక్నిక్‌ని అభ్యసించడం, పన్నెండేళ్ళు టెక్నిక్‌ని మరచిపోవడం. తరువాత చిత్రించడం. అప్పుడు టెక్నిక్ అన్నది వ్యక్తిలో ఒక భాగమవుతుంది. అప్పుడు కేవలం సాంకేతిక జ్ఞానంగా మాత్రమే వుండదు. అది వ్యక్తి రక్తమాంసాల్లో భాగమవుతుంది. అప్పుడు వ్యక్తి తక్షణ స్పందనతో వుంటాడు. అప్పుడది వ్యక్తిని దాచిపెట్టదు. వ్యక్తిని బంధించదు.

★ ★ ★ ★

కళ అన్నది ధ్యానం. మనల్ని మనం మరచిపోగలిగితే ఏపని అయినా ధ్యానమే. మనం చేసే పనిలో మనం లీనమయితే అదే ధ్యానం. కాబట్టి కేవలం టెక్నీషియన్‌గా వుండకు. వ్యక్తి టెక్నీషియన్‌గా మాత్రమే వుంటే చిత్రించడమన్నది ధ్యానం కాదు. వ్యక్తి పనిలోకి పిచ్చెక్కినట్లు ప్రవేశించాలి. ఉన్మత్తంగా అడుగుపెట్టాలి. వ్యామోహంతో దిగాలి. తనని తాను మరచిపోవాలి. ఎక్కడికి వెళుతున్నాం అన్న సంగతి మరచిపోవాలి. ఏం చేస్తున్నాం అన్న సంగతి మరచిపోవాలి. అసలు మనమెవ్వరం అన్న సంగతే మరచిపోవాలి. తెలియని తనమన్న స్థితి ధ్యానాన్ని తీసుకొస్తుంది. దానంతట అదే సంభవించనీ, చిత్రాన్ని చిత్రించడం కాదు. దాని ఆవిష్కారం దానంతట అదే జరగనీ! అట్లా అంటే మనం సోమరితనంతో వుండాలని కాదు. అట్లా వుంటే ఆ పని జరగనే జరగదు. ఆ పని వ్యక్తి

మీద సవారీ చెయ్యాలి. వ్యక్తి విపరీతమైన తీవ్రమైన చైతన్యంతో వుండాలి. కాని నిర్నిమిత్తంగా వుండాలి. అది వ్యక్తిని తాకి లేపుతుంది. లొంగదీసుకుంటుంది. పట్టు కుంటుంది. వ్యక్తి చలనంలో వుంటాడు కానీ చర్యకు కారణం కాడు. వ్యక్తిని దాటినదేదో వ్యక్తి చర్యను సొంతం చేసుకుంటుంది.

వ్యక్తి సూర్యాస్తమయాన్ని చూస్తాడు. అది వ్యక్తిలో వుంది. అది వ్యక్తంకావాలను కుంటుంది. గొప్ప అనుభవం జరిగితే అది సౌందర్యం, సత్యం లేదా ప్రేమకు సంబంధించిన గాఢానుభవం కావచ్చు. అది జరిగితే దాన్ని వ్యక్తీకరించాలన్న గొప్ప కోరిక అనుసరించి వుంటుంది. వ్యక్తీకరించాలన్న కోరిక దానిలో భాగం, అది సహజాతం. వ్యక్తి సూర్యాస్తమయాన్ని చూస్తే దాంతో నిండిపోతాడు. దానికి సంబంధించిన స్వప్నం వ్యక్తిని చుట్టుముట్టి వుంటుంది. అది వ్యక్తి లోపల వుంటుంది. ఆ రంగులు, శబ్దాలు, మేఘాలు, గాలి, పక్షులు, ఇసుక వుంటాయి. అవన్నీ అక్కడుంటాయి. బయటకు ఆవిష్కరింపబడటానికి తహతహలాడు తుంటాయి. కాబట్టి అందుకోసం నువ్వు అందుబాటులో వుంటావు.

కేన్వాస్ దగ్గరికి వెళ్ళు. కొన్ని నిముషాలపాటు ధ్యానంలో వుండు. కేన్వాస్ ముందు నిశ్శబ్దంగా కూచో. అది దానంతట అదే సాగే రచనలాంటిది. నువ్వా కలం తీసుకుంటావు. నిశ్శబ్దంగా కూచుంటావు. హఠాత్తుగా నీచేయి కదలడం చూస్తావు. ఆ పని నువ్వు చేశావని కాదు. ఆ పని చెయ్యలేదని నీకు తెలుసు. నువ్వు కేవలం దానికోసం ఎదురుచూశావు. కదలిక ఆరంభమయింది, చెయ్యి ముందుకు కదిలింది. ఏదో జరిగింది. అనూహ్యమైంది ఆరంభమైంది.

యాదృచ్ఛికమయిన చేతివ్రాత సాగడం చూసి వ్యక్తి ఆశ్చర్యపడతాడు. అది తన చేతివ్రాత అని అది తనకు తెలియకుండా జరిగిందని వ్యక్తి ఆశ్చర్యపోతాడు. అది దానంతట అదే జరిగింది. ఆ శక్తి అవ్యక్తం. వ్యక్తిని అనంతం సొంతం చేసుకుంది. లేదా వ్యక్తిని అచేతన స్థితి పిలిచింది. లేదా యింకేమైనా అనుకోవచ్చు. అవి కేవలం పేర్లు పెట్టడాలే. వ్యక్తి అల్పమయిన మనసు అప్పుడు ఒంటరికాదు. అనంతం దాన్ని సొంతం చేసుకున్నాక అది విశాలమైంది. శక్తివంతమయింది. చైతన్యవంతమయిన మనసు అనంతం చేతిలో ఒక ఉపకరణం మాత్రమే. ఆ అనంతం దేవుడు అనండి, ప్రకృతి అనండి. మనస్తత్వవేత్తలు దాన్ని అచేతన స్థితి అంటారు. అక్కడ పేరులేనిది వ్యక్తిని ఆక్రమించింది!

అట్లాగే వ్యక్తి చిత్రించడాన్ని మొదలుపెట్టాలి. కొన్ని నిముషాలు ధ్యానం. నువ్వు అందుబాటులో వుండడం, ఏది జరిగినా ఆ జరగడాన్ని నువ్వు ఆహ్వానించాలి. నీ సాధనలన్నీ

దాన్ని అనుమతించడానికే. బ్రష్ తీసుకుని ఆరంభించు. మొదట మెల్లగా ఆరంభించు. దానివల్ల నిన్ను నువ్వు ముందుకు తీసుకురావు. మెల్లమెల్లగా సాగు. సూర్యాస్తమయం నీ గుండా ప్రవహించడం ఆరంభించి దానంతట అది దానిలో మాయమవనీ! అంతకుమించి ఏమీ ఆలోచించకు. అక్కడ కళ కళకోసమే అన్నట్లుంటుంది. తరువాత అది ధ్యానమవుతుంది. దాంట్లో ఎట్లాంటి లక్ష్యమూ అడుగుపెట్టకూడదు. అట్లా లక్ష్యానికి అనుమతి యివ్వ కూడదు. నువ్వు అక్కడ దాన్ని ప్రదర్శించవు అని నేను చెప్పడం లేదు. బహిర్గతపరచడం లేదు. అది సహజంగా జరిగేది. సృజనని అనుసరించి వచ్చేది. కానీ అది లక్ష్యం కాదు. వ్యక్తికి తిండి కావాలి. అందువల్ల పెయింటింగ్ అమ్మాలి. కానీ అమ్మకమన్న విషయం వ్యక్తి మనసుని గాయపరుస్తుంది. అది దాదాపు సొంత బిడ్డను అమ్ముకోవడం లాంటిది. అది వేరే విషయం. కానీ అక్కడ లక్ష్యంలేదు. అక్కడ లక్ష్యం వుంటే వ్యక్తి టెక్నీషియన్‌గా మిగుల్తాడు.

టెక్నీషియన్‌కి కళాకారుడికి మధ్య వున్న తేడా అది. కళాకారుడు ధ్యాని, టెక్నీషియన్ కాదు. టెక్నీషియన్ తను చేస్తున్న పనిమీద ఏకాగ్రత నిలుపుతాడు. కానీ ధ్యాని, కళాకారుడు అక్కడ తనని తాను పనిలో కోల్పోతాడు. అక్కడ ఎట్లాంటి ఏకాగ్రత లేదు. అక్కడ ఏకాగ్రత నిలపడానికి ఎవరూ లేరు. అక్కడ గొప్ప ఆనందముంది. వ్యక్తి తనని తాను కోల్పోవడంలో పరవశముంది.

వ్యక్తి పూర్తిగా చిత్రకళలో అదృశ్యం కావాలి. నాట్యంలో, శ్వాసలో, గానంలో లీనం కావాలి. వ్యక్తి ఏ పనిచేసినా దాంట్లో సంపూర్ణంగా లీనంకావాలి. అదుపుతప్పి లొంగిపోవాలి.

వ్యక్తి ఎంత వీలయితే అంత దూరం వెళ్ళాలి. ఎంత దూరం వెళ్ళాలంటే తిరిగి వెనక్కి తిరిగిరాలేనంత దూరం వెళ్ళాలి. అప్పుడు మనల్ని మనం అదుపు చేయలేకపోవడమన్నది కూడా మన అదుపులో వుండదు. మనం అదుపులో వుంటాం.

ఈ అదుపు అన్నది వ్యక్తిని గొప్ప కళాకారుడు కావటానికి అనుమతించదు. కళాకారుడు పిచ్చివాడయి దాంట్లోకి వెళ్ళాలి. అతను హృదయపూర్వకంగా ఆ అజ్ఞాతమైన దానిలోకి అడుగుపెట్టాలి. అది ఎక్కడికి తీసుకెళితే అక్కడికి వెళ్ళాలి. అన్ని ప్రమాదాల్ని ఆహ్వానిస్తూ సాగాలి.

★ ★ ★ ★

నా సమస్త దృష్టి సైన్సు సేవకుడుగా వుండాలి. మతం అధికారికంగా వుండాలి. మతం చివరి, అంతిమ సత్యంగా వుండాలి. అది సైన్సుకు వ్యతిరేకం కాదు, సైన్సు

దానికి సమాంతరంగా సాగాలి. కళ అన్నది సైన్సుకు మతానికి సంధానకర్తగా సాగాలి. కళ మేనేజర్ లాంటిది.

కళ అన్నది వంతెన. వ్యక్తి అన్ని అనుకూలాలతో వున్నప్పుడు, ప్రాథమిక అవసరాలన్నీ తీరినప్పుడు అప్పుడు కళ అవసరం. యిప్పుడు అంతట్నీ గమనించండి. సైన్సు శరీరం లాంటిది, కళ మనసు లాంటిది, మతం ఆత్మలాంటిది. శరీరం తన కోరికలు తీరినప్పుడు మనసు యింకేమో అడుగుతుంది. మంచి సంగీతం, చిత్రం, శిల్పం, నవల, కవిత్వం వగైరా. శరీరం కోరికలు తీరినప్పుడు మనసు కొత్త కొత్త విషయాల్ని కోరుతుంది. శరీర కాంక్షలు తీరితే మనసు ముందుకొస్తుంది. మనసు కాంక్షలు ముందుకొస్తాయి. అంతకు ముందురావు. అది అత్యున్నతమైన కాంక్ష. మనసు కాంక్ష బలమైంది.

బిథోవిన్‌ని, వాగ్నర్‌ని, మొజార్ట్‌ని కోరినా, షేక్‌స్పియర్‌ని లేదా మిల్టన్‌ని కోరడమంటే అది అత్యున్నతమైన అవసరం. బ్రెడ్డు అడగడమన్నది అల్పమయిన అవసరం. జీసెస్ మనిషి కేవలం బ్రెడ్డుతో మాత్రమే సంతృప్తిపడడు' అనడం వెనక అర్థమదే. నిజమే. బ్రెడ్డు అవసరమే. జీసెస్ మనిషి బ్రెడ్డు లేకుండా సంతృప్తిపడతాడు' అనలేదు. ఎవరూ వుండలేరు, జీసెస్‌కు కూడా బ్రెడ్ అవసరం కానీ అదొక్కటే చాలదు.

★ ★ ★ ★

అయితే ప్రాథమికమయిన విషయం కళకాదు. ప్రాథమికమైన విషయం సమాధి. మొదట అక్కడ సమాధి వుండాలి. తరువాత వ్యక్తి తన తన అర్హతనుబట్టి ప్రపంచానికి ఏమి యివ్వాలో ఇవ్వవచ్చు. తన దగ్గరున్నది ఏది పంచుకోవాలన్నా పంచుకోవచ్చు. అక్కడ అహానికి అవకాశమే వుండదు. ఎందుకంటే అక్కడ సమాధి స్థితిలో నువ్వు చిత్రించావు. సమాధి స్థితిలో గానం చేశావు, నాట్యం చేశావు. కాబట్టి అక్కడ అహానికి ఆస్కారమే వుండదు. అక్కడ ఎట్లాంటి లక్ష్యమూ లేదు. దాని వెనక ఎట్లాంటి ఆందోళనా లేదు. ఒకవేళ నువ్వు చెప్పేది గ్రహించడానికి ఎవ్వరూరాకున్నా నువ్వు ఏమీ కోల్పోవు. నువ్వు ఒక తాజా పుష్పంలా వుంటావు. గాఢమైన చీకటి నిండిన, దట్టమైన అరణ్యంలో పువ్వులు వికసిస్తావు. అక్కడ ఎవరూ సంచరించకపోవచ్చు. కానీ ఆ పుష్పం పరిమళ ప్రవాహాన్ని గాలికి అందిస్తుంది. దాని గురించి పట్టింపే వుండదు.

కళాకారుడు అభివ్యక్తి కోసం తపిస్తాడు. జ్ఞానోదయం పొందిన వ్యక్తికి అభివ్యక్తి అన్నది సహజమైంది. శ్వాసలాగా అది అతన్లో భాగం. అక్కడ అభివ్యక్తి కోసం ఆరాటం వుండదు. కానీ కళాకారుడు తన మార్గం కోసం తపిస్తాడు. అతనికి లక్ష్యముంటుంది.

అందువల్ల అతను గొప్ప ఆందోళనలో వుంటాడు. కళాకారుడొక్కడే అంతులేని ఆందోళనకు లోనవుతాడని కాదు. మానసిక రుగ్మత వున్న ప్రతి మనిషీ అంతులేని ఆందోళన బారిన పడతాడు. వాళ్ళు సృష్టించాలి, వాళ్ళు పూర్తిచేయాలి, వాళ్ళు నిరూపించుకోవాలి. ప్రపంచంలో తమ ముద్రను ప్రదర్శించాలి. యివన్నీ అహం ఆడే ఆటలు.

జ్ఞానోదయం పొందిన వ్యక్తి ఎట్లాంటి లక్ష్యం లేకుండా జీవిస్తాడు. ఏది ఎట్లా వుంటే అట్లా స్వీకరించి ఆనందిస్తాడు. ఏది జరిగినా మంచికే అని భావిస్తాడు. అతను ఆనందిస్తాడు. యితరుల్ని ఆనందపెడతాడు. యితరులు స్వీకరిస్తే మంచిదే. స్వీకరించ డానికి ఎవరూ రాకుంటే అదీ మంచిదే!

మోడ్రన్ ఆర్ట్

మొదటిసారి కళ కానిది కళ పేరుతో ఉనికిలోకి వచ్చింది. దాన్ని కళ అనడం కన్నా 'చికిత్స' అనడం మేలు. మోడ్రన్ పెయింటింగ్స్‌ను చూడండి. నేను చెప్పిన మాటల్తో మీరు ఏకీభవిస్తారు. ఆ చిత్రకారులు పిచ్చివాళ్ళయి వుంటారు. వాళ్ళ పిచ్చిని కాన్వాస్ మీద కుమ్మరిస్తారు. వాళ్ళ అస్తిత్వం లోపల వున్న ఆందోళనని ఆ రకంగా వాళ్ళు వదిలించు కుంటారు. అది దిక్కుతోచనితనం. కళ కాదు. కళ ద్వారా జరిగే చికిత్స అది. కానీ కళ కాదు.

★ ★ ★ ★

జాక్‌నుజల్టోవ్ ఫిఫ్త్ అవెన్యూ గుండా వెళుతూ యిరవైయేళ్ళ క్రితం కలిసిన మిత్రుణ్ణి చూశాడు. జో పాస్టర్ నాక్! నువ్వు అస్సలు మారలేదు. యిరవై ఏళ్ళక్రితం ఎలా వున్నావో అలానే వున్నావు. నిన్ను కలిసినందుకు చాలా సంతోషంగా వుంది. అది సరే! ఏం చేస్తున్నావు?" అన్నాడు.

జో 'నేను కళాకారుణ్ణి! నా కళావిష్కరణలో నేను అద్భుతాలు చేశాను. నేను చిత్రించినవి మోడ్రన్ ఆర్ట్ మ్యూజియంలో ప్రదర్శిస్తున్నారు. యిక్కడే ఈ అంతస్తులోనే అది వుంది' అన్నాడు.

జాక్ అరే! ఈ సంగతెప్పుడూ చెప్పలేదే! అది నిజంగా గొప్ప విజయం. మరి నువ్వు వేసిన చిత్రాల్ని నాకు చూపించవా?' అన్నాడు.

జో 'అంతకంటేనా? తప్పకుండా!' అని మిత్రుణ్ణి మ్యూజియంకేసి తీసుకెళ్ళాడు.

అప్పుడు గోడమీద జో వేసిన చిత్రం వేలాడుతోంది. ఆ చిత్రమంతా బ్రౌన్ కలర్ వ్యాపించివుంది. కింది భాగంలో మటుకు మరింత దట్టంగా ఒకచోట బ్రౌన్ కలర్ వుంది.

జాన్ చిత్రంగా ఐదు నిముషాలపాటు ఆ చిత్రాన్ని పరికించి చూశాడు. అతనికి ఏమీ అంతుపట్టలేదు. మిత్రునివేపు తిరిగి ఈ చిత్రం దానికి ప్రాతినిధ్యం వహిస్తోంది?' అని అడిగాడు.

జో "దీన్ని మోడ్రన్ ఆర్ట్ అంటారు. ఈ చిత్రం పేరు 'పొలంలో ఆవు' " అన్నాడు.

జాక్ ఆశ్చర్యంగా పొలంలో ఆవా? అంటే పొలంలో ఆవువుందన్నమాట. పొలమంటే పచ్చగా వుండాలి కదా! పచ్చదనమేది? అన్నాడు. జో ఓపిగ్గా వివరించడం మొదలుపెట్టాడు.

"మోడ్రన్ ఆర్ట్‌లో ఏదీ సూటిగా వుండదు. ఆవు పొలంలోకి వెళ్ళి గడ్డినంతా మేసేసింది. అంటే గడ్డి మాయమయింది. కాబట్టి యిక పచ్చదనానికి ఆస్కారమేదీ? కేవలం బ్రౌన్ రంగే మిగుల్తుంది" అన్నాడు.

జాక్ 'సరే! మంచిది. మరి ఆవు ఏది?' అన్నాడు. జో అప్పటికే గడ్డిమేసిన ఆవు అక్కడెందుకుంటుంది? వెళ్ళిపోయింది. అందువల్ల ఆవు అక్కడ లేదు' అన్నాడు.

జాక్ యిప్పుడు నాకు అర్థమయింది. అక్కడ పచ్చదనం లేదు, ఎందుకంటే ఆవు తినేసింది. ఆవులేదు ఎందుకంటే గడ్డిమేశాక వెళ్ళిపోయింది. యింతవరకూ బాగానే అర్థమయింది. మరి అర్థంకానిదేమంటే చిత్రంకింద దట్టంగా ఒక దగ్గర బ్రౌన్‌కలర్ వేశావు. ఎందుకు? అన్నాడు.

జో 'యిప్పుడు మోడ్రన్ ఆర్ట్ నీకు అర్థమవుతోంది. అక్కడ మూల దట్టంగా వున్న బ్రౌన్ కలర్ గురించి అడుగుతున్నావు. ఆవు పొలంలో వున్న పచ్చగడ్డిని తిన్నాక ఏం చేస్తుంది?' అన్నాడు. అదీ మోడ్రన్ ఆర్ట్!

వస్త్వాశ్రయ కళ

బుద్ధుని శిల్పాన్ని చూడండి. బుద్ధుని శిల్పం ముందు నిశ్శబ్దంగా కూచుని పరిశీలించండి మీరు ఆశ్చర్యానికి లోనవుతారు. మీలో ఏదో నిలకడ చోటుచేసుకుంటుంది. మీలో ఏదో నిశ్చలంగా, నిర్మలంగా ప్రశాంత స్థితిని అందుకుంటుంది.

గూర్జయేఫ్ దాన్ని 'ఆబ్జక్టివ్ ఆర్ట్' అన్నాడు. ఎందుకంటే ఆ శిల్పాన్ని సృష్టించిన వ్యక్తి తన ధ్యానం గుండా దాన్ని శిల్పీకరించాడు. అది ధ్యానానికి సంబంధించి, ధ్యానం గుండా జరిగిన పని. అది గౌతమబుద్ధుని ఆకార ప్రదర్శనకాదు. అది బుద్ధుని ధ్యానాన్ని ప్రదర్శిస్తుంది. బుద్ధుని ధ్యానానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అతని శరీరానికి కాదు. అతని మనసుకి కాదు, అతని అస్తిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అతని నిశ్చలస్థితికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

★ ★ ★ ★

గూర్జయేఫ్ కళని రెండు రకాలుగా విభజించాడు. ఆధునిక కళని ఆయన సబ్జెక్టివ్ ఆర్ట్ అంటే ఆత్మాశ్రయ కళగా పేర్కొన్నాడు. ప్రాచీన కళ నిజమైన కళ. అది జనాలు పిరమిడ్లు నిర్మించేలా చేసింది. తాజ్‌మహల్ కట్టేలా చేసింది. అజంతా ఎల్లోరా గుహల్ని నిర్మించింది. అవన్నీ పూర్తిగా భిన్నమైనవి. ఆ కళని ఆయన 'ఆబ్జెక్టివ్ ఆర్ట్' అన్నాడు. వస్త్రాశ్రయకళ' అన్నాడు. ఆత్మాశ్రయ కళ అన్నది 'వమనం' చేసుకోవడం లాంటిది.

వస్త్వాశ్రయ కళ అంటే వ్యక్తి కేంద్రానికి చేరడానికి సహకరించేది. వ్యక్తి ఆరోగ్యంగా, సంపూర్ణంగా మారడానికి సహకరించేది. తాజ్‌మహల్‌ని పండు వెన్నెల్లో దర్శించండి. మీరు ఒక ధ్యాన వాతావరణంలో మునిగిపోతారు. బుద్ధుని శిల్పం ముందు నిశ్శబ్దంగా కూచుని పరిశీలించండి. మీరు నిశ్చలంగా కొన్నిసార్లు బుద్ధునిగా మారిపోతారు. అది వస్త్వాశ్రయ కళ. అది ఎంతో సాటిలేని విలువైంది.

కానీ వస్త్వాశ్రయ కళ ప్రపంచం నించీ మాయమైపోయింది. కారణం ప్రపంచం నించీ 'మార్మికులు' మాయమైపోయారు. ఒక అత్యున్నత స్థాయిని ఎవరో అందుకున్నప్పుడు మాత్రమే వస్త్వాశ్రయ కళకు అవకాశముంటుంది. శిఖరస్థాయిని అందుకున్నవాళ్ళే దాన్ని సృష్టించగలరు. వాళ్ళు శిఖరాన్నీ చూడగలరు, లోయనీ దర్శించగలరు. వాళ్ళు మానవత్వపు అత్యున్నతస్థాయిని, మానవ నూతనత్వపు సౌందర్యాన్ని అట్లాగే మానవత్వపు అనారోగ్యాన్ని అసహ్యాన్ని కూడా చూడగలరు. వాళ్ళు అంధకారపు లోయల్లో ఆక్రందించే జనాల్ని

చూడగలరు. వాళ్ళు అంధకారంలో అలమటించే వాళ్ళకి శిఖరంపై వెలిగే సూర్యకాంతిని అందుకో గలిగే చేయూతనివ్వగలరు. వాళ్ళ కళ వ్యక్తి మనసు వికసించడానికి, వ్యక్తి ఎదగడానికి దోహదపడుతుంది.

ఆధునిక కళ పిల్లచేష్టలాంటిది. గుర్తుంచుకోండి. పసితనం లాంటిది కాదు, పసి చేష్టలాంటిది. అమాయకమైంది కాదు, తెలివి తక్కువది, మూర్ఖంది, దయనీయమైంది. మనం ఆ మార్గంనించి బయటపడాలి. మనం కొత్తరకమైన కళని, కొత్తరకమైన సృజనని ఆవిష్కరించాలి. మనం గూర్జియేఫ్ చెప్పిన వస్త్వాశ్రయ కళని సృజించాలి.

సన్యాసి

హిందూయిజం జీవితాన్ని వ్యతిరేకించేది. జీవితాన్ని నెగిటివ్ దృష్టితో చూసేది. అందుకే అది సన్యాసుల్ని గౌరవిస్తుంది. సన్యాసులు స్వీయ హింసలో మునిగిన వాళ్ళు. మసోచిస్టులు (Masochits). మానసిక రుగ్మతకు లోనయిన వాళ్ళు తనని తాను హింసించుకోవడలో ఆనందించేవాడు సన్యాసిగా మారాడు. హిందువులు అట్లాంటి సన్యాసుల్ని గౌరవిస్తారు. సన్యాసి తనను తాను ఎంతగా హింసించుకుంటే అంత గొప్ప సన్యాసి అవుతాడు. ముళ్ళ పడకమీద వ్యక్తి పడుకుంటే జనం గుంపులు గుంపులుగా వచ్చి అతన్ని పూజిస్తారు. వ్యక్తి నెలలకొద్దీ నిరాహారంగా వుంటే అతని కీర్తి దేశంలోని మారుమూల ప్రాంతాల్లో మారుమోగిపోతుంది.

అంతేగానీ, ఈ వ్యక్తి జీవితానికి, ప్రపంచానికి తనవంతుగా ఏ పని చేశాడు?' అని ఎవరూ అడగరు. ముళ్ళపడకమీద పడుకోవడమన్నది ప్రపంచానికి ఉపయోగపడే పనికాదు. ఆ పని జీవితాన్ని సౌందర్యవంతం చేయదు. అది అస్తిత్వాన్ని సంపన్నవంతం చేయదు. నెలల తరబడి నిరాహారదీక్షలో వుండడం కళ కాదు. అది వినాశకరం, ఆత్మ హత్యా సదృశ్యం!

★ ★ ★ ★

సన్యాసిగా వుండడమన్నది నువ్వు స్వీయహింసలో వున్నావని తెలుపుతుంది. నిన్ను నువ్వు హింసించుకోవడంలో ఆనందిస్తున్నావని తెలుపుతుంది. ఆత్మహత్యని యిష్టపడే మనుషులు ప్రపంచంలో వున్నారు గనక సన్యాసులు వునికిలో వున్నారు. మనిషిలో మరణ స్పృహ వుంటుంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ అట్లాంటి వాళ్ళని “థనోటోస్ (Thanotos) అన్నాడు. మనిషి అభివృద్ధికి సిగ్మండ్ ఫ్రాయిడ్ కాంట్రిబ్యూషన్ విలువైంది. అతని తొలినాళ్ళలో అతను జీవితంలో సెక్స్ సహజాతమన్నాడు. మౌలికమన్నాడు. తరువాత రోజుల్లో పెద్ద వాడయ్యేకొద్దీ 'ధనాటోస్'ను ఆవిష్కరించాడు. అది లైంగికతకు వ్యతిరేకమైంది.

మనిషిలో మౌలిక సహజాతాలు రెండు వుంటాయి. ఒకటి జీవించాలనుకోవడం, రెండోది మరణం. రెండూ అక్కడున్నాయి. జీవితం, మరణం, జీవించాలన్న సహజాతం బలంగా వుంటే అక్కడ మరణమన్న సహజాతం మాయమవుతుంది. రెంటిలోనూ ఒకటే శక్తి. జీవితం కాంక్షలోనూ లేదా 'మరణంలోనూ ప్రవహిస్తుంది. అది నీ మీద ఆధారపడి వుంటుంది.

నేను సన్యాసి దృక్పథానికి వ్యతిరేకిని, ఎందుకంటే అక్కడ అనారోగ్యకరమైన, నిర్జీవమైన దృష్టి వుంది. నేను జీవించడాన్ని యిష్టపడతాను. ఎందుకంటే జీవితమన్నది దేవుని ఆలయం. కాంక్ష ద్వారా మాత్రమే దేవుడు ప్రపంచంలో ఆవిష్కరింపబడతాడు.

ఆశ్రమం

ఆశ్రమమంటే గురుశిష్యుల నివాస స్థలం. అది ఉపనిషత్ కాలంనాటి ఆవిష్కారం. అది 'సన్యాసుల' నిలయం కాదు. అది పూర్తిగా వేరయిన విషయం. ఇంగ్లీషులో ఆశ్రమాన్ని సాధారణంగా 'మొనాస్టరి' (Monastry) అంటారు. ఆశ్రమమన్నది 'మొనాస్టరి' కాదు. సన్యాస కేంద్రమన్నది ప్రపంచానికి పూర్తిగా వ్యతిరేకమైంది. సన్యాస కేంద్రమంటే ప్రపంచం నించీ పారిపోయేది. సన్యాస నివాసమన్నది ప్రపంచాన్ని ఖండించేది.

ఆశ్రమమన్నది ప్రపంచాన్ని ఖండించదు. అది అధ్యయన కేంద్రం. ప్రపంచంలో ఎట్లా జీవించాలో వ్యక్తి అక్కడ అభ్యసిస్తాడు. జనం ఉపనిషత్ రుషుల ఆశ్రమాలకు వెళ్ళి ప్రపంచంలో ఎట్లా జీవించాలో అభ్యసించేవాళ్ళు.

ఆ రోజుల్లో అది జీవన విధానం. మనిషి నూరేళ్ళ జీవితాన్ని నాలుగు దశలుగా విభజించారు. వ్యక్తి పాతికేళ్ళు వచ్చేదాకా ఒక జ్ఞానం పొందిన రుషి దగ్గర అభ్యసించి అనంతానికి సంబంధించిన ఆనందాన్ని అందుకునేవాడు. ఆధ్యాత్మికమైన రుచులు గ్రహించేవాడు. పవిత్రమయిన దానితో ఆ విధంగా అతనికి పరిచయమేర్పడేది. ఈ మొదటి భాగాన్ని 'బ్రహ్మచర్యం' అన్నారు. బ్రహ్మచర్యాన్ని 'సన్యాసిగా' భావించడం సరి కాదు. బ్రహ్మచర్యమంటే వ్యక్తి దైవంలా జీవించడం. బ్రహ్మని, కేవలత్వాన్ని అనుభవానికి తెచ్చుకోవడం. ధ్యానంలో జీవించడం, బ్రహ్మచర్యమన్నదాన్ని అనువదించమంటే దాన్ని 'ధ్యానజీవన'మంటాను.

ఆ పాతిక సంవత్సరాలు జీవితంలోని తొలి భాగం. అది చిత్రంగా అనిపించ వచ్చు. మొదట్లోనే దైవాన్ని ఎందుకు అనుభవానికి తెచ్చుకోవాలి? దానికి చాలా కారణాలున్నాయి. మొదటిది జీవితంలో ఆ మొదటి భాగం ఎంతో అమాయకమైంది. ఉత్సాహభరితమైంది, సాహసోపేతమైంది, చైతన్యవంతమైంది. చురుకైంది. ఒకసారి జీవితానుభవాల బరువెక్కితే మనిషిలో మోసం పెరుగుతుంది. ప్రపంచంలో జీవిస్తూ మోసం చేయకుండా వుండడమన్నది చాలా కష్టమైన విషయం. ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే మోసం తెలియాలి. స్పృహతో వుండాలి. రక్షణలో పడాలి. లేకుంటే నిన్ను వాడుకుంటారు, వంచిస్తారు. ప్రపంచంలో వుండాలంటే నిరంతర ఘర్షణలో, నిరంతర పోటీలో మునిగి వుండాలి. అత్యాశతో, అధికార దాహంతో, ఆగ్రహంతో, అణచివేత ఆధారంగా వుండాలి. యివన్నీ వ్యక్తి చైతన్యంలో భాగాలవుతాయి. వ్యక్తి జీవితంలో అనివార్య భాగాలవుతాయి.

అప్పుడు 'నమ్మక'మన్నది కష్టమైన విషయమవుతుంది. సందేహమన్నది సులభంగా ముందు కొస్తుంది. ఈ కారణంగా ఉపనిషత్తులు కాలంలో జ్ఞానులు, దార్శనికులు ప్రాపంచికమైన అనుభవాల్ని అందుకునే ముందు దైవంతో మొదట సాన్నిహిత్యం పొందడం, పవిత్రమైన దాని పరిచయం అవసరమన్నారు. అప్పుడు పవిత్రమయిన దాని పరిచయం ప్రాపంచిక మయిన అవినీతినించి వ్యక్తిని పరిరక్షిస్తుందని భావించారు. అత్యున్నతమైన దాని అనుభవం కలిగితే అల్పమయినది మనల్ని ప్రభావితం చెయ్యలేదని వాళ్ళు భావించారు. గాఢమయిన దాని పరిచయం కలిగితే ఉపరితలంలోని దాన్ని పట్టించుకోవాల్సిన పని వుండదు. ఇది పూర్తిగా శాస్త్రీయమైన దృష్టి. మనస్తత్వశాస్త్ర సంబంధమైనది.

మొదటి ఇరవై ఐదు సంవత్సరాలు ధ్యానానికి కేటాయించాలి. గురువుతో జీవిస్తూ ఆ పనిచేయాలి. గురువు సేవలు సాన్నిహిత్యంలో వుంటూ గురు శుశ్రూష చేస్తూ గడపాలి. అది 'సన్యాస కేంద్రం' కాదు. అది ఒక పాఠశాల. అకాడమీ. జీవనకళను అభ్యసించే విశ్వవిద్యాలయం.

మొదటి పాతిక సంవత్సరాల తరువాత జీవితంలోని రెండో మెట్టు వస్తుంది. అది సంసార సంబంధమయింది. గృహస్థాశ్రమం. వ్యక్తి వివాహం చేసుకుని ప్రపంచంలో పనిచేయడానికి అడుగుమోపుతాడు. ధనం సంపాదిస్తాడు. ప్రాపంచిక జీవితాన్ని అనుభ విస్తాడు. అప్పుడతనికి లోపలి కేంద్రముంటుంది. పునాది వుంటుంది. ప్రపంచం అతన్ని కదిలించలేదు. ఆందోళనకు గురిచెయ్యదు. ఆ అనుభవాన్ని మళ్ళీ అందుకోవాలన్న స్పృహ అతనికుంటుంది. మొదటి పాతిక సంవత్సరాలు అతని మనసులో ఏ మెరుపులు మెరిశాయో అవి అతన్ని అనుసరించి వుంటాయి. ఈ ప్రపంచం క్షణికమైందని అవి అతనికి మాటి మాటికీ గుర్తుతెస్తాయి. అతను డబ్బు వెంట, అధికారం వెంట, గౌరవం వెంట పరుగులు తియ్యడు. అతను ప్రాపంచిక వ్యవహారాల్లో భాగస్వామ్యం వహిస్తాడు. కానీ లోలోతుల్లో నిశ్చలంగా వుంటాడు. బాహ్య ప్రపంచానికి సంబంధించినంత మేరకు అతను ఒక చక్రం. లోలోతుల్లో అతను ఇరుసు. నిర్మలంగా వుంటాడు. బాహ్య ప్రభావాలు అతని ఆంతర్యాన్ని కదిలించలేవు. అతనికి విజయమైనా, వైఫల్యయినా ఒకలాంటివే. అతనికి సంపదవచ్చినా, పేదతనమైనా ఒకటే. అతను సుప్రసిద్ధుడయినా అనామకుడయినా ఒక్కలాగే వుంటాడు. ఎందుకంటే తనలోపలి ఆనందాన్ని అతను అప్పటికే అనుభవానికి తెచ్చుకున్నాడు. బాహ్యమైనవేవీ అతన్ని మోసపుచ్చలేవు.

ఈ అనుభవం మొదటి పాతికేళ్ళ అనుభం మరింత ధృడతరం కావడానికి ఉపక రిస్తుంది. ఇదొక పరీక్ష. వ్యక్తి పొందిన అనుభవం నిజమైనదా? కేవలం గురువు దగ్గర

నించీ నేర్చుకున్నదా? అన్నది యిక్కడ పరీక్షకు లోనవుతుంది. అది యధార్థ అనుభవమా? అరువు తెచ్చుకున్నాదా? అన్నది నిగ్గు తేలుతుంది. వ్యక్తి ప్రపంచంలోకి వెళ్ళాలి? అది పరీక్ష. అది వ్యక్తిలో అవిభాజ్యం భాగంగా వుందా? లేదా? అన్నది తెలుస్తుంది. గురువు దగ్గరి నించీ వచ్చేసినా అది అంత ప్రభావాన్ని చూపదు. ఎందుకంటే అక్కడ వ్యక్తి సాధికారికత, స్వీయతత్వం వుంటుంది. అది అద్భుతమైంది, శాస్త్రీయమైంది.

వ్యక్తికి యాభయ్యేళ్ళు వచ్చేసరికి అతని సంతానం ఆశ్రమం నించి సిద్ధపడి రంగంలోకి వస్తారు. అది అధ్యయన క్రియా విధానం. యిప్పుడు జీవనరంగంలో అడుగు పెట్టడానికి అతని పిల్లలు సిద్ధపడ్డారు.

వ్యక్తి పాతికేళ్ళు ప్రపంచంలో వుంటాడు. చాలు. అదంతా నాటకమని గ్రహించ డానికి పాతిక సంవత్సరాలు చాలు. అది పనికిమాలిందని, భ్రమ అని, కల అని గ్రహించ డానికి అన్నేళ్ళు చాలు.

ఉపనిషత్ కాలంలో పిల్లలు రంగంలోకి అడుగుపెట్టి ప్రాపంచిక వ్యవహారాల్లో అడుగుపెట్టాక తండ్రి ఉపసంహరించుకుంటాడు. అంటే ప్రపంచంలో అడుగు నిలదొక్కు కోడానికి పిల్లలకు సహకరిస్తాడు. మనవళ్ళు వచ్చే కాలానికి ప్రపంచం నించీ ఉపసంహ రించుకుని ఆశ్రమాలకు తిరిగి వెళతాడు.

ఇది జీవన వలయం. నాలుగు దశలు. ఆశ్రమంతో మొదలై ఆశ్రమంతో అంత మవుతుంది. ఆశ్రమంతో శిష్యుడుగా మొదలై గురువుగా అంతమవుతుంది. వృత్తం సంపూర్ణ మవుతుంది.

డెబ్బయి అయిదేళ్ళకు పాతికేళ్ళ వయసుదాకా గురువుతోడి అనుభవం, రెండో పాతికేళ్ళు ప్రపంచంలో పరీక్షకు నిలబడడం, చివరి పాతికేళ్ళు నిశ్శబ్దంగా జీవితం నించి నిష్క్రమించడం. మెల్లగా అరణ్యంలోకి ఉపసంహరించడం అంటే ఆశ్రమానికి తిరిగి చేరడం. యిప్పుడు వ్యక్తి గురువుగా అడుగుపెడతాడు. సంపూర్ణంగా జీవితానుభవంతో నిండి వుంటాడు. స్వీయకాంతితో వెలుగుతూ వుంటాడు. ఆధ్యాత్మిక, ప్రాపంచిక అనుభవాలతో తొణికిసలాడుతూ వుంటాడు. అతను తనకు తానే గురువుగా వుంటాడు.

అడగడం

దేవుడు ఎప్పుడూ అందుబాటులోనే వుంటాడు. సహాయపడ్డానికి సిద్ధంగా వుంటాడు. మనమే అడగం. జీసెస్ 'తలుపు తట్టండి. అది మీ కోసం తెరుచుకుంటుంది. అడిగింది యిస్తుంది' అన్నాడు. కానీ మనం అడగం. మనం తలుపుతట్టి కావలిసినన్ని శక్తులు మనకు అందుబాటులోకి రావడానికి సిద్ధపడి వుంటాయి.

పువ్వులోకి చూడండి. దేవుణ్ణి మీరు చూడగలరు. ఎందులోనయినా గాఢంగా చూడండి మీరు దేవుణ్ణి దర్శించగలరు. దేవుడంటే విషయాలలోతు. విషయాల గాఢత. విషయంలోతుల్తో సంబంధ మేర్పరచుకున్న మరుక్షణం అనంతశక్తులు మీకు అందుబాటులోకి వస్తాయి. ఎవరూ పేదవాళ్ళు వారు. మనిషి అతను అనుకున్న దానికన్నా సంపన్నుడు. మనం అడిగితే దేవుని రాజ్యం మనకు అందుబాటులో వుంటుంది.

మరి జనాలు ఎందుకడుగరు? అహం వాళ్ళకి అడ్డుపడుతుంది. అహం 'అడగద్దు, ఆక్రమించు' అంటుంది. వ్యక్తి దేవుణ్ణి ఆక్రమించలేడు. దైవ సామ్రాజ్యాన్ని దురాక్రమించ లేడు. ఒక భాగమన్నది సమస్తాన్నీ ఆక్రమించడం ఎట్లా? అది అసంభవం, అసంగతం. మనం సమస్తానికి లొంగిపోవడం చేయగలం. ఆ లొంగిపోవడమే అంతులేని విజయం!

అభిలాష

సాధారణంగా మన సృజనకారుణ్ణి ప్రేరణ కలిగించే వ్యక్తిగా భావిస్తాము. అది సరికాదు. అతన్ని మనం అభిలాష వున్న వ్యక్తిగా, కోరికవున్న వ్యక్తిగా పేర్కొనాలి. ప్రేరణ అంటే దేన్నయినా లోపలికి తీసుకోవడం. దాన్ని లోపలికి తీసుకుంటే లోపలికి శ్వాసిస్తే అప్పుడది ప్రేరణ అవుతుంది. బయటికి వదిల్తే, లోపలినించి బయటికి శ్వాసిస్తే అది అభిలాష. ప్రేరణ అంటే లోపలికి తీసుకోవడం, అభిలాష అంటే పంచుకోవడం, బయటికి యివ్వడం. సాధారణంగా, సులభమయిన మాటలో చెప్పాలంటే అది 'విద్య'. అంటే ఏదయినా బయటికి చెప్పడం. విత్తనం నుండి పువ్వు రావడం, బావి నుండి నీళ్ళు రావటం. శక్తి క్రియారూపాన్ని ధరించడం.

వేల సంవత్సరాల నుండి మనకు ప్రేరణ గొప్పదని చెప్పారు. యితర్లని అనుసరించమని చెప్పారు. క్రీస్తు ద్వారా ప్రేరణ పొందు. అప్పుడు నువ్వు క్రిస్టియన్ అవుతావు. బుద్ధుని నించి ప్రేరణ పొందితే బౌద్ధుడవుతావు. బుద్ధుడు అద్భుతం! బౌద్ధుడు అసహ్యం! కృష్ణునిలో అద్భుత సౌందర్యముంది. హిందువు కావడంలో మతఛాందసముంది. ఎవరితోనూ ప్రేరణ పొందకు? ఎందుకంటే ప్రేరణవల్ల నువ్వు అనుయాయివి, అనుచరుడివి అవుతావు.

అభిలాషతో అనుబంధం సృజనాత్మక ఆనందం! అప్పుడు వ్యక్తికి జన్మనివ్వడంలోని బాధ తెలిసివస్తుంది. అక్కడ గొప్ప పరవశం కూడా వుంది! ఆ పరవశంవల్ల జన్మనివ్వడంలోని బాధవల్ల కలిగే శ్రమ మధురమైన బాధగా మారుతుంది. అప్పుడు ముళ్ళు కూడా మనోహరంగా వుంటాయి. ఎందుకంటే అవి గులాబీలతోబాటుగా వచ్చాయి. అప్పుడు రాత్రులు కూడా మృదువుగా, కాంతివంతంగా వుంటాయి. ఎందుకంటే అవి రోజులో భాగాలు గనక! కారణం చీకటి లేనిదే కాంతిలేదు. అప్పుడు అన్నిటినీ ఆమోదిస్తాము దేన్నీ తిరస్కరించం. వ్యక్తి అట్లా సంపూర్ణతని ఆమోదించి చాలా ప్రశాంతంగా కేంద్రంలో నివసించ వచ్చు.

అప్పుడు అన్ని వేళల్లో ప్రశాంతంగా వుండగలగడం సులభమవుతుంది. వ్యక్తి అస్తిత్వంతో ప్రశాంతంగా వుండగలిగితే, తనలో తను ప్రశాంతంగా వుండగలిగితే వ్యక్తిని ఏదీ కదిలించలేదు, ఆందోళనకు గురిచెయ్యదు. దారితప్పనియ్యదు. బాగా రద్దీగా వున్న గందరగోళం మధ్య కూడా, అయోమయం మధ్యలోనైనా స్పష్టంగా వుండవచ్చు.

అయితే అనుసరించేవాడుగా వుంటే, అనుకరించేవాడుగా వుంటే వ్యక్తి అస్తిత్వానికి సంబంధించిన ప్రశాంతిని కోల్పోతాడు. కారణం వ్యక్తి అక్కడ మరొక్కడిగా మారడానికి ప్రయత్నిస్తున్నాడు. కారణం వ్యక్తి ఎప్పుడూ యింకొకరిలా మారడం అసంభవం! ఫలితంగా ఆందోళనకు, ఆగ్రహానికి, అయోమయానికి గురవుతాడు. మనోవైకల్యం పొందుతాడు. పిచ్చి నించి మరింత పిచ్చికి మారుతాడు. జీవితాన్ని నరకంగా మార్చుకుంటాడు.

నేను ఎవరూ అనుచరుడిగా, అనుకరించే వాడుగా మారకూడదని కోరుకుంటాను. నా సన్యాసులందరూ నన్ను అనుసరించే వాళ్ళు కారు. వాళ్ళు నా స్నేహితులు, ప్రేమికులు. వాళ్ళు నాతో ప్రేరణ పొందలేదు. వాళ్ళు నా నుండి 'అభిలాషను' అభ్యసించారు. వాళ్ళు నేను చేసినట్లు చేయరు. నాలాగా వుండాలనుకోరు. వాళ్ళు తమలాగే వుంటారు. వాళ్ళకి స్వేచ్ఛని బోధిస్తాను కానీ అనుసరించడాన్ని కాదు. వాళ్ళకు వ్యక్తిత్వాన్ని బోధిస్తాను. అసాధరణత్వాన్ని బోధిస్తాను. అనుకరణని కాదు. అందువల్ల వాళ్ళు ప్రశాంతంగా వుంటారు.

జ్యోతిష శాస్త్రం

జ్యోతిష శాస్త్రం యింకా సైన్సు కాలేదు. దానికి శాస్త్రీయ నిర్మాణం ఏర్పడడానికి యింకా కొన్ని వందల సంవత్సరాలు పట్టవచ్చు. అది చాలాకాలం నించీ మోసగాళ్ళ చేతిలో వుంది. నకిలీ సైన్సుగా మారింది. యిప్పటికీ అలాగే వుంది. మనుషులు ప్రయత్నిస్తే ఆ పరిస్థితిని మార్చే వీలుంది. ఎందుకంటే మనల్ని ప్రతిదానితో ముడిపెట్టారు. అందులో నిజముంది. మనందరం పరస్పరాశ్రితులమే. అంతస్సంబంధమున్న వాళ్ళమే. అస్తిత్వమన్నది ఆంతర్యంలో ఆధారపడిందే. ఒక నక్షత్రంలో ఏదయినా విధ్వంసమైతే యిక్కడ ఒక ఆకు రాలితే దానికి అంతస్సంబంధముంది. యిదంతా అంతస్సంబంధమైన క్రియ. యిది సాలెగూడు లాంటిది. ఒక తీగను తాకితే సాలెగూడంతా సంచరిస్తుంది. ఈ సృష్టి అలాంటిది. ఆ విషయం గ్రహించాలి.

★ ★ ★ ★

మనం ఒక ప్రాథమికమయిన విషయాన్ని గమనించాలి. మనం ఏ పనిచేసినా అంటే జ్యోతిష్య శాస్త్రం, హస్త సాముద్రికం, జాతకం, ఐఛింగ్, టోరోట్ ఏది చూసినా అవన్నీ భవిష్యత్తుకు సంబంధించిన విషయాలే. అక్కడ మౌలికంగా వ్యక్తి అచేతన స్థితిని అధ్యయనం చెయ్యడం కనిపిస్తుంది. అది భవిష్యత్తుకు సంబంధించి ఏమీ ఎక్కువ చెయ్యదు. అది నిజానికి గతానికి సంబంధించి ఎక్కువ చేయాలి. ఎందుకంటే భవిష్యత్తన్నది గతం ద్వారా సృష్టించబడింది. అందుకని భవిష్యత్తుకు కూడా సంబంధించిందే.

ఎందుకంటే జనం యంత్రాలులాగా జీవిస్తారు. అందుకని రాబోయే దాన్ని చెప్పడం వీలవుతుంది. వ్యక్తి బుద్ధుడులాంటివాడు కాకుంటే, అతను మామూలు మనిషి అయితే ఆ వ్యక్తి గతం గురించి మనకు తెలిసివుంటే అతని భవిష్యత్తు గురించి జరగబోయే విషయం చెప్పే వీలుంది. ఎందుకంటే అతను ప్రతిదీ తిరిగి మళ్ళీ మళ్ళీ చేస్తూ వుంటాడు. గతంలో అతను కోపం ప్రదర్శించేవాడయితే తప్పక భవిష్యత్తులోనూ ఆ విషయాన్ని పునరుక్తికి లోనుచేస్తాడు. అతని తత్వం అతని భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.

సాధారణంగా అచేతన స్థితిలోని వ్యక్తి తన గతాన్ని మళ్ళీ మళ్ళీ పునరుక్తికి లోను చేస్తూ వుంటాడు. అది చక్రం తిరిగినట్లు తిరిగే వ్యవహారం. అది తప్ప అతను యింకో పనిచెయ్యడు. జీవితంలోకి ఎట్లాంటి కొత్త విషయానికీ అవకాశమివ్వడు. దేనికీ విరామ

మివ్వడు. దేన్నీ వదిలించుకోడు. అందుకనే ఈ 'శాస్త్రాలన్నీ' పనిచేస్తున్నాయి. ఒకవేళ జనం మరింత స్పృహతో, మరింత చైతన్యంతో వుంటే ఈ శాస్త్రాలు పనిచెయ్యవు.

మనం బుద్ధుని జాతకాన్ని ఆయన చేతి గీతల్ని చదవలేం. కారణం ఆయన తన గతం నుండి పూర్తిగా స్వేచ్ఛను పొందినవాడు. అతను వర్తమానంలో ఖాళీగా వున్నాడు. అందువల్ల అక్కడ అతన్ని చదవడానికి వీలుపడదు.

ఈ సైన్సులన్నీ ప్రాథమికంగా గతానికి సంబంధించినవే. జనం గతంలో జీవిస్తుంటారు. గతం భవిష్యత్తులో పునరావృతమవుతుంది. నిన్నలు రేపుగా మారతాయి.

జనాన్ని చైతన్యవంతుల్ని చెయ్యాలంటే వాళ్ళ గతానికి సంబంధించిన స్పష్టత నివ్వాలి. గతం కొనసాగితే భవిష్యత్తు వుండదు. గతమే భవిష్యత్తవుతుంది. వ్యక్తుల్ని గతం నించీ విడిపోవడానికి సహకరించాలి.

అనుబంధం

అనుబంధాల్ని వదులుకోమని నేను చెప్పడం లేదు. వాటిని అర్థం చేసుకోమంటున్నాను. అది చాలు. అప్పుడు అప్రయత్నంగా ఎట్లాంటి నిర్ణయాలకి, తీర్మానాలకి, అంచనాలకి ఆస్కారం లేకుండా అనుబంధాలు అదృశ్యం కావడం చూస్తావు. అవి 'ఏమిటో ఎలాంటివో చూడు అవి ఎలాంటివయినా అవి అక్కడున్నాయి. నువ్వేం చేస్తావు? నీకు కాళ్ళు, చేతులు, జుత్తు, చర్మం, నీకొక రంగు వున్నట్లు అవి కూడా వున్నాయి. కాబట్టి నీ అనుబంధాలన్నవి అక్కడున్నాయి. వాటిని ఆమోదించు. అట్లా వాటిని ఆమోదించడం నించీ విప్లవం ఆరంభమవుతుంది.

నా జీవితంలో కేవలమంటే కేవలం ఒక్క అనుబంధాన్నీ వదులుకోలేదు. నేను వాటిని చూశాను. వాటి గుండా చూశాను. అట్లా చూడడం ద్వారా అద్భుతాలు ఆవిష్కరింపబడడాన్ని చూశాను. హఠాత్తుగా అవి మేఘాల్లా విచ్చుకోవడం చూశాను. అవి అక్కడున్నాయి. అవి దిగంతంలాగా వున్నాయి. వునికిలో లేని దిగంతంలా వున్నాయి. అవి నిన్ను అప్పుడు గుప్పిట్లో బంధించవు. అప్పుడు నువ్వు ప్రపంచంలో జీవిస్తూనే ప్రపంచానికి సంబంధం లేకుండా వుండగలవు.

★ ★ ★ ★

మనం సులభంగా అనుబంధానికి బందీలవుతాం. ప్రతిదానికీ బందీలవుతాం. ప్రతి దానితో అనుబంధం ఏర్పరచుకుంటాం. జీవితం ప్రవాహంలాంటిది. ఏదీ ఎప్పుడూ ఒక్కలాగే వుండదు. మనం అది అట్లాగే వుండాలని, ఎప్పట్లాగే వుండాలని, మారకుండా వుండాలని ఆశిస్తాం, కోరుకుంటాం. ప్రపంచంలో ఎంత దిక్కుతోచనితనముందంటే మన అంచనాలు, ఆశలు అసంపూర్తిగానే అంతమవుతాయి. ప్రతి విషయంలో అంచనాలు తల్లకిందులవుతాయి. ఆశించిన ప్రతిదీ గొప్ప వైఫల్యంగా ముగుస్తుంది.

అనుబంధమంటే ఒకదానికి అతుక్కోవడం. అది శాశ్వతంగా వుండిపోవాలని ఎదురుచూడ్డం. అది ఎట్లాంటిదంటే అసాధ్యాన్ని కోరుకోడం. యవ్వనంలోని వ్యక్తి శాశ్వతంగా యవ్వనంలోనే వుండిపోవాలని కోరుకోవడం లాంటిది. అది అసాధ్యం! ముందుగానో, ఆలస్యంగానో ఆ వ్యక్తిని వృద్ధాప్యం సమీపిస్తుంది. చివరిదశ సమీపిస్తుంది. అప్పుడది ఆనందానికి బదులు బాధల్ని వెంటతెస్తుంది. లేని పక్షంలో వృద్ధాప్యం జీవితంలో ఎంతో ఉత్కర్షని తెస్తుంది. ఉన్నతిని యిస్తుంది. అది జీవితంలో గొప్ప పతాకస్థాయి. అది

శిఖరాయమానమైంది. మంచుకప్పిన పర్వత శిఖరం. కానీ అది చీకటి కన్నా బలమైంది. కారణం మనం యవ్వనానికి అతుక్కుపోయాం! మనం శరీరానికి అతుక్కుపోయాం! కానీ శరీరం ఒక నాటికి వెళ్ళిపోతుంది. దాంట్లో జీవించు. దాన్ని ప్రేమించు. దాన్ని గౌరవించు, దాని పట్ల శ్రద్ధ వహించు. కానీ దాంతో అనుబంధం పెంచుకోకు. గుర్తుంచుకో అది సత్రం! రాత్రికి అక్కడుండు. పొద్దున్నే ఖాళీచేసి వెళ్ళిపోవాలి.

ప్రతిదానికి సంబంధించిన రహస్యమూ అదే! ఒక వ్యక్తితో ప్రేమలో పడతావు. ఆ వ్యక్తితో అనుబంధం పెంచుకుంటావు. వెంటనే నరకం మొదలవుతుంది. స్వార్థం మొదలవుతుంది. సొంతం చేసుకోవాలన్న దృష్టి ఆరంభమవుతుంది. ఆ వ్యక్తి మరొకని ప్రేమిస్తే? అన్న భయం మొదలవుతుంది. అందువల్ల ఆ వ్యక్తిని యితర్ల దృష్టిలోపడకుండా వుండాలని చూస్తావు. ఆ వ్యక్తి స్వేచ్ఛను హరిస్తావు. ఆ వ్యక్తిని వస్తువు స్థాయికి దిగజారుస్తావు. క్రమంగా గౌరవం, ప్రేమ అదృశ్యం కావడం ఆరంభిస్తాయి. అది రెండు అహాల మధ్య సంఘర్షణగా మారుతుంది. నిరంతర పోరాటం మొదలవుతుంది. నువ్వు అతన్ని సొంతం చేసుకోవాలని చూస్తావు. అతను నిన్ను సొంతం చేసుకోవాలని చూస్తాడు. అట్లాంటి యుద్ధ వాతావరణంలో ప్రేమ ఎట్లా వునికిలో వుంటుంది? అనుబంధం ప్రేమని నాశనం చేస్తుంది. అది ప్రేమకు విషం లాంటిది.

గాఢంగా ప్రేమించు, అమిత గాఢంగా ప్రేమించు, కానీ అక్కడకు అసూయను, సొంతం చేసుకునే తత్వాన్ని రానివ్వకు. అప్పుడవి నిన్ను బంధిస్తాయి. జీవితంలో నేర్చుకోవాల్సిన గొప్ప కళ ప్రవాహంలా సాగుతూ అనుబంధం లేకుండా వుండడం. జీవితం గుండా సాగు, కానీ దేనితోనూ అనుబంధాన్ని పెంచుకోకు. విషయాలు వస్తాయి, పోతాయి. కానీ నిశ్చలమైన కేంద్రంలో నిరాటంకంగా నిలబడు. సన్యాసమంటే అదే.

★ ★ ★ ★

జీసెస్ వచ్చాడు. జనం ఆయన్తో అనుబంధం పెంచుకున్నారు. అసలు సంగతి మరుగున పడింది. బుద్ధుడు వచ్చాడు. జనం బుద్ధుని గురించి తెలుసుకునే ప్రయాణం మొదలుపెట్టారు. వాళ్ళు ఎంత వ్యామోహానికి లోనయ్యారంటే తమలో లోపల తమ బుద్ధుడున్నాడన్న విషయమే విస్మరించారు. అతను బయట వున్నాడనుకున్నారు. అతను బయటలేడు.

బయట బుద్ధుణ్ణి తెలుసుకుంటే లోపలి బుద్ధుల్ని తెలుసుకోవచ్చని భావించారు. సంపూర్ణ అంతర్దృష్టి వుంటే క్రీస్తుల్ని, బుద్ధుల్ని గురించి తెలుసుకోవచ్చు. వాళ్ళ వునికి

గ్రహించవచ్చు. వాళ్ళెప్పుడూ వునికిలో వుంటారు. లోపల వుంటారు. కారణం నువ్వు కూడా సమస్తంలో భాగమే. మన గురించి మనం తెలుసుకోవడం సమస్తం గురించి తెలుసు కోవడమే.

గురువుతో అనుబంధం పెంచుకోవాలన్న వుబలాటం, ఆసక్తి ఎక్కువగా వుంటుంది. గురువుకు అతుక్కుపోవాలని, నీతిగా మారాలని కోరిక వుంటుంది. కానీ అది ఉపయోగ పడదు. అది ఆత్మహత్యా సదృశం.

నాతో అతుక్కుపోకండి. అనుబంధం పెంచుకోకండి. నేను మీకు స్వేచ్ఛను అందించ డానికి యిక్కడున్నాను. సంపూర్ణ స్వేచ్ఛను యివ్వాలనుకుంటున్నాను. మీ అంతకు మీరు సాధికారికంగా వుండండి.

శ్రద్ధ

సావధానమ్నది మానసికమయిన అవసరం. ఆ విషయం అర్థంచేసుకోవాలి. జనాలు ఎందుకు చాలా సావధానాన్ని కోరుకుంటారు? శ్రద్ధని ఆశిస్తారు? అందరికన్నా ముందుగా తమపైనే దృష్టి నిలపాలని ఆశిస్తారు? తాము ప్రత్యేకంగా యితరులకన్నా భిన్నంగా వుండాలని ఎందుకు కోరుకుంటారు? ఎందుకంటే లోపల వాళ్ళు ఏదో కోల్పోయారు. వ్యక్తికి తన గురించి తనకు స్పష్టతలేదు. యితర్ల గుర్తింపు ద్వారా తమని తాము గుర్తిస్తారు! తమ అస్తిత్వంతో సూటి సరాసరి సంబంధం కలిగి వుండదు. యితరుల ద్వారా తమని తాము గుర్తిస్తారు.

యితరులు నువ్వు మంచివాడవు అంటే వ్యక్తి తాను మంచివాడని భావిస్తాడు. నువ్వు మంచివాడు కావని యితరులు అంటే వ్యక్తి తీవ్ర నిరాశకు గురవుతాడు. అయ్యో! నేను మంచివాణ్ణి కానా! అనుకుంటాడు. నువ్వు అందంగా వున్నావని అంటే వ్యక్తి ఆనందిస్తాడు. అసహ్యంగా వున్నావని అంటే దిగులుపడతాడు. వ్యక్తికి తానెవరో తనకు తెలీదు. యితర అభిప్రాయాల మీద జీవిస్తూ వుంటాడు. యితర్ల అభిప్రాయాలు సేకరిస్తూ వుంటాడు. వ్యక్తి తన అస్తిత్వంతో సూటి, సరాసరి సంబంధం కల్పించుకుని దాని ద్వారా గుర్తింపు పొందాడు. అందువల్ల అభిప్రాయాల్ని, అస్తిత్వాన్ని అరువు తెచ్చుకుంటాడు. అందువల్ల అతను అందరి దృష్టి తన మీద పడాలనుకుంటాడు.

జనం తన మీద శ్రద్ధ ప్రదర్శిస్తే తనని అందరూ ప్రేమిస్తున్నారని భావిస్తాడు. కారణం ప్రేమలో ఒకరిపట్ల ఒకరు శ్రద్ధచూపడం వుంటుంది.

ప్రేమ సావధానమైంది. ప్రతి ఒక్కరూ ప్రేమను కోల్పోతున్నారు. చాలా కొద్దిమంది మాత్రమే ప్రేమను పొందగలుగుతున్నారు. ఎందుకంటే ప్రేమే దైవం. కోట్లమంది ప్రేమ రాహిత్యంలో జీవిస్తున్నారు. దేవుడు లేకుండా జీవిస్తున్నారు. ప్రేమను కోల్పోతున్నారు. ఆ ఖాళీని నింపడమెలా? దానికి సులభమయిన మార్గం. సులభమయిన ప్రత్యామ్నాయం ప్రజలు తమమీద శ్రద్ధ చూపెట్టేలా చెయ్యడం, జనాల దృష్టి తమ మీద పడేలా చేసుకోవడం అది వ్యక్తిని తెలివితక్కువవాణ్ణి చేస్తుంది, మోసం చేస్తుంది.

బుద్ధుడు కేవల ప్రేమ. అతను అస్తిత్వాన్ని ప్రేమిస్తాడు. అస్తిత్వం అతన్ని ప్రేమిస్తుంది. సమాధి అంటే అదే. అది నువ్వు సమస్తంలో ఒక భాగమైనప్పుడు వీలవుతుంది. అది భావప్రాప్తి పతాకస్థితి. అది శారీరకమైంది కాదు. మానసికమైంది కాదు,

పాక్షికమైంది కాదు, అది సంపూర్ణతకు సంబంధించింది. అతనికి ఆ పరవశం అనుభూత మవుతుంది. దానికి ఎట్లాంటి శారీరక శ్రద్ధతోనూ అవసరంలేదు.

★ ★ ★ ★

సాధారణమైన మనిషి లోపలి ప్రపంచం ఎడారిగా మిగిలిపోతుంది. అది ఎంతో అందమైన ఉద్యానవనం కాగలదు. దాని బీజాలు నీ బాల్యంలోనే పడాలి. వాటిని తప్పని సరిగా అప్పుడు అందించాలి. ఆ బీజాల్ని పెట్టెలోపెట్టి తాళంవేస్తే అవి ఎప్పటికీ పూలయి వికసింపలేవు. వ్యక్తి లోపలి ప్రపంచానికి సంబంధించి ఎట్లాంటి జాగ్రత్తా తీసుకోకపోతే, లోపలికి చూడకపోతే అక్కడ ఏమీ జరగదు. శ్రద్ధ అవసరం.

ఎట్లాంటి అభివృద్ధికయినా శ్రద్ధ, సావధానం అత్యంత ఆవశ్యకాలని మూల ధాతువులని యిటీవలి కాలంలో గ్రహించారు. పసిబిడ్డకు తల్లిపాలు అవసరం. దాన్ని మించి బిడ్డపై తల్లి చూపే శ్రద్ధ మరింత ముఖ్యమైంది. ఒకవేళ తల్లి బిడ్డ శారీరకమయిన ఎదుగుదల మీద మాత్రమే శ్రద్ధచూపి, కేవలం ఆహార విషయంలో మాత్రమే ఆసక్తి చూపితే, యితర విషయాలపై ఆసక్తి ప్రదర్శించకపోతే బిడ్డ తల్లి తనని పట్టించుకోవడం లేదని, నిర్లక్ష్యం చేసిందని భావిస్తాడు. దాంతో అతని ఎదుగుదల ఆగిపోతుంది. తన మీద తనకు విశ్వాసం సన్నగిల్లుతుంది. నమ్మకం పోతుంది. జీవితానికున్న ప్రయోజనాన్ని బిడ్డ కోల్పోతుంది. ఆ వ్యక్తి తాను పనికిమాలినవాణ్ణని, తన అవసరం ఎవరికీ లేదని భావిస్తాడు. యితరులకు ఉపయోగపడడమన్నది గొప్ప ఉపయోగం. అదిలేని పక్షంలో ఏదీ వుండదు, ఎలాంటి ఎదుగుదలా వుండదు.

ఆ సంగతి మొక్కల్లోనూ చూడవచ్చు. రెండు మొక్కల్ని పక్కపక్కనే నాటి రెంటికీ ఒకే రకమయిన సారవంతమైన, ఎరువులు, రసాయనాలు యిచ్చినా ఎలాంటి తేడా వుండదు. ఒక్క విషయం తప్ప. ఒక్క మొక్క పట్ల ప్రేమతో ఆ పనిని నిర్వహించండి. రెండో దానిపట్ల పట్టింపు లేకుండా అన్నీ సమకూర్చండి.

మొదటి మొక్కని పలకరించండి, కౌగిలించండి, ముద్దుపెట్టండి మీరు శ్రద్ధ వహించిన మొక్క ఏపుగా, త్వరగా ఎదుగుతుంది. నిర్లక్ష్యం వహించిన మొక్క కన్నా వారాల్లో రెండింతలవుతుంది. పెద్ద పూలు, పెద్ద పళ్ళు యిస్తుంది. అది మాట్లాడకపోవచ్చు. నీకు అది కృతజ్ఞత ప్రకటించకపోవచ్చు. పెద్ద పూలు, పెద్ద పళ్ళు చాలు అది నీతో ఆనందాన్ని పంచుకుందనడానికి. దాని లోలోపల ఎవరో తనపట్ల శ్రద్ధ వహించారన్న కృతజ్ఞత వుంటుంది.

ఇది లోపలి ప్రపంచానికి కూడా వర్తిస్తుంది. మనం ఎడారిగా మిగిల్తే అక్కడ పొరపాటు జరిగిందని గ్రహించాలి. దానిపట్ల మనం ఎట్లాంటి శ్రద్ధా వహించడంలేదని తెలుసుకోవాలి. ఆ విషయాన్ని పట్టించుకోలేదనుకోవాలి.

సన్యాసమంటే నీ జీవితానికి సంబంధించి కొత్తరకమయిన శ్రద్ధ వహించడం. నీ లోపలి అవసరాలపట్ల శ్రద్ధ ప్రకటించడం, నీ కేంద్రంపట్ల మరింత శ్రద్ధ వహించడం. వ్యక్తి సమయం దొరికినప్పుడల్లా కళ్ళు మూసుకుని ప్రపంచానికి తలుపులు మూసి అన్నీ విస్మరించాలి. లోపలి ప్రపంచంపట్ల శ్రద్ధని, ఆసక్తిని, ప్రేమని ప్రకటిస్తే పూలు వికసించడం అనుభవానికి వస్తుంది. అది ఒకరకయిన తోటపనిలాంటిది. అందులో గొప్ప ఆనందముంది. వ్యక్తి చైతన్య సుమాల వికసనాల్ని చూస్తే జీవితం పనికిమాలింది కాదని అర్థవంతమైందని గ్రహిస్తాడు. వ్యక్తి తనకు వచ్చిన అవకాశాన్ని అర్థవంతంగా నిర్వహించానని సంతృప్తిపడతాడు.

దృక్పథం

జీవితాన్ని కోల్పోడానికి మంచిదారి ఏదంటే జీవితానికి సంబంధించిన ఒక దృక్పథాన్ని కలిగివుండడం. దృక్పథమన్నది మనసులో అంటే ఆలోచనల్లో రూపొందుతుంది. జీవితమన్నది మనసును దాటింది.

దృక్పథాలు మన కల్పనలు, మన మూఢ నమ్మకాలు, మొండితనాలు, మన సృష్టులు, మన ఆవిష్కారాలు. జీవితం మన కల్పన కాదు. దానికి భిన్నంగా జీవన సరస్సులో పైన కదిలే చిన్ని అలలం మనం.

అగాధ సముద్రంపై అలలాంటి దృక్పథం సముద్రపు లోతుల్ని ఎలా చూపుతుంది? పైన పిల్లగాలికి కదిలే పచ్చిక భూగర్భపు లోతుల్ని మనకెలా చూపిస్తుంది?

చంద్రుణ్ణి, సూర్యుణ్ణి, నక్షత్రాల్ని గురించి మనకెలా పరిచయం చేస్తుంది? అన్ని దృక్పథాలూ అహంకారం పునాదిగా కలిగినవే. అన్ని తెలివితక్కువవే.

వ్యక్తికి జీవితంపట్ల దృక్పథముంటే జీవితాన్ని కోల్పోతాడు. జీవితం విశాలమైంది. దృక్పథంతో లెక్కించలేనిది. వ్యక్తి దృక్పథం ఒక కోణాన్ని ప్రదర్శించవచ్చు. కానీ అది ఒక కోణమే, మనసు దృష్టి ఒక కోణాన్ని సమగ్రంగా భావించమంటుంది. దాని లక్షణమది. ఒక కోణాన్ని సమగ్రమనుకున్న క్షణం మనం సమస్తాన్నీ కోల్పోతాం. అప్పుడు నువ్వు దృక్పథం మత్తులో మునుగుతావు. నీ జీవితం నరకప్రాయమవుతుంది.

జీవితానికి సంబంధించి దృక్పథముండడమన్నది. ప్రమాదకరమైంది. జీవితంలోకి నాట్యాన్ని, సంగీతాన్ని ఎందుకు అనుమతించకూడదు? ఎట్లాంటి అంచనాలూ ఆశించడాలూ లేకుండా వాటిని ఎందుకు ఆహ్వానించకూడదు? ఎట్లాంటి దృక్పథమూ లేకుండా ఎందుకు వుండకూడదు? అట్లా వుంటే ఎవరూ ఏమీ కోల్పోరు. ఆ దృక్పథాల్ని జీవితానికి ఆరోపిస్తే వ్యక్తి అన్నీ కోల్పోతాడు.

ఓం ఓం !

ఓం ఓం ఉన్నది H_2O లాగా ఒక సం(త్రం (Formula) అది కేవలం సమస్త వాస్తవానికీ ప్రాతినిధ్యం వహిస్తుంది. మనం దాంట్లోకి ప్రవేశించే ముందు మనిషి కనిపెట్టిన అత్యున్నత మైన ఈ సూత్రానికీ సంబంధించి కొద్ది విషయాల్ని అర్థం చేసుకోవాలి.

ఓం అన్నది సాధారణ సంస్కృత అక్షరాల్లో రాయబడలేదు. దానంతకు అదే ప్రత్యేకమయిన ప్రతీక. అది కోడ్‌లాంటిది. అది స్పష్టంగా తెలుసుకునేముందు అది సంస్కృత అక్షరమాలతో రూపొందలేదని ఆ కారణంగా అది అనువాదానికి లొంగదని మనం గ్రహించాలి.

అది మూడు శబ్దాలు కలిసింది. నాలుగోది శబ్దరహిత శబ్దం. ఆ మొదటి మూడు శబ్దాల్ని అనుసరించి నాలుగోది సమశృతిలో సాగుతుంది. మూడు శబ్దాల్ని వినవచ్చు. నాలుగో శబ్దాన్ని మన లోలోతుల అస్తిత్వంలో ఆలకించవచ్చు.

సాధికారం

సాధికారంగా వుండడమంటే నీ సొంత అస్తిత్వంలో వాస్తవంగా కలిసి వుండడం. వాస్తవంగా వుండడమంటే ఏమిటి? యిక్కడ మూడు విషయాల్ని గమనించాలి. మొదటిది ఎవరిమాటా వినకు. ఎప్పుడూ నీ లోపలి స్వరాన్నే విను. నువ్వు ఎట్లా వుండాలనుకుంటు న్నావో అట్లా వుండు. లేకుంటే నీ జీవితం పనికిమాలిందవుతుంది.

నీ అంతస్స్వరం పట్ల నిజాయితీగా వుండు. అది నిన్ను ప్రమాదం వైపు లాగవచ్చు గాక. ప్రమాదంలోకే వెళ్ళు. కానీ దానిపట్ల నిజాయితీగా వుండు. అప్పుడు ఒకరోజు వస్తుంది. నువ్వు సంతృప్తిగా, సమగ్ర ఆనందంతో నాట్యంచేసే సన్నివేశం వస్తుంది. అన్నిటికన్నా మొదట నీ అస్తిత్వానికి ప్రాధాన్యమివ్వు. దానివేపే చూడు. యితర విషయాలు నిన్ను మభ్యపుచ్చి లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తాయి. వాటిని అనుమతించకు. అవి లెక్కలేనన్ని వుంటాయి. ప్రతి ఒక్కడూ నిన్ను అదుపు చెయ్యడానికి సిద్ధంగా వుంటాడు. ప్రతి ఒక్కడూ నిన్ను మార్చడానికి ప్రయత్నిస్తూ వుంటాడు. నువ్వు అడక్కపోయినా దారిచూపడానికి సిద్ధంగా వుంటారు. నీ జీవితానికి మార్గదర్శక సూత్రాల్ని నిర్దేశిస్తారు. నీలోపలే నీ మార్గ దర్శక సూత్రాలున్నాయి. వాటి బ్లూప్రింట్ (Blue Print) తీసుకుని బయల్దేరు.

సాధికారికంగా వుండడమంటే నీపట్ల నువ్వు నిజాయితీగా వుండడం. అది చాలా కష్టమైన విషయం. అరుదైన వ్యక్తులు మాత్రమే అలా వుండగలరు. ఎప్పుడలా వుంటారో అప్పుడు ఫలితాల్ని అందుకుంటారు. వ్యక్తి తీవ్ర ఆందోళనకు, దిక్కుతోచని తనానికి లోనయ్యాడంటే అతను తనలోపలి స్వరాన్ని వినలేదని అర్థం.

యిక రెండో విషయం. వ్యక్తి మొదటి విషయాన్ని నిర్వహించిన పక్షంలోనే రెండో సంగతి వీలవుతుంది. ఎట్లాంటి ముసుగులూ వేసుకోకు. కోపంగా వుంటే కోపంగానే వుండు. అది కష్టం కావచ్చు కానీ నవ్వకు. ఎందుకంటే అందులో నిజాయితీ వుండదు. కానీ కోపంగా వున్నప్పుడు నవ్వమని బోధించారు. అప్పుడా నవ్వు కపటంగా వుంటుంది, ముసుగులా వుంటుంది. అది పెదాలతో వ్యాయామం చేయించినట్లుంటుంది. అంతకు మించి మరేమీ కాదు.

మూడో విషయం సాధికారిత గురించి. ఎప్పుడూ వర్తమానంలో జీవించు. ఎందు కంటే పొరపాట్లన్నీ గతం గుండానో భవిష్యత్తు గుండానో వచ్చేవే. జరిగింది జరిగిపోయింది. దాన్ని గురించి బాధపడకు. దాన్ని బరువుగా మోయకు. లేని పక్షంలో నువ్వు సాధికారంగా

వర్తమానంలో నిలబడలేవు. తరువాత యిప్పటిదాకా రానిదేదయితే వుందో అదింకా రానిదే! అనవసరంగా భవిష్యత్తు గురించి ఆందోళన వహించకు. ఆందోళన పడితే అది రంగంలోకి వచ్చి వర్తమానాన్ని విధ్వంసం చేస్తుంది.

వర్తమానం పట్ల నిజాయియితీగా వుండు. అప్పుడు నువ్వు సాధికారంగా వుంటావు. ఇప్పుడు యిక్కడ వుండడమన్నది సాధికారం. అక్కడ గతం లేదు. భవిష్యత్తు లేదు. ఈ క్షణమే సమస్తం, ఈ క్షణమే శాశ్వత అనంతం!

అధికారం

అధికారమన్నది నీ సాధికారమయిన అనుభవం గుండా రావాలి. అధికారానికి అదొక్కటే మూలస్థానం. అంతకు మించిన అవకాశం లేదు. రామకృష్ణ పరమహంస అధికారంతో మాట్లాడగలడు. రమణ మహర్షి అధికారంతో మాట్లాడగలడు. కానీ వివేకానందుడు మాట్లాడలేడు. అతను పండితుడు మాత్రమే. మేధావి మాత్రమే. మహావీరుడిది అధికార స్వరం. కానీ గౌతమ గనధరది కాదు, అతను మహావీరుడి శిష్యుడు. అతను విషయ సేకరణ చేసిన బ్రాహ్మణ పండితుడు. మహావీరుడు చెప్పిన విషయాలను రాసిపెట్టిన వాడు. జీసెస్ అధికారంగా మాట్లాడటానికి అర్హుడు. పోపులు కాదు.

పవిత్ర గ్రంథాల్లో ఎక్కడ ఏది వుందో వాటిని సమయానుకూలంగా చెప్పగలము కాబట్టి మాకు చెప్పడానికి అధికారముందని ఈ పండితులు భావిస్తారు. వీళ్ళకన్నా ఎంతో ప్రావీణ్యంతో కంప్యూటర్ ఆ పనిచెయ్యగలదు. దాని దగ్గర యాంత్రిక చలనముంది. దాని కోసం ఎట్లాంటి చైతన్యం అవసరంలేదు. 'దుఃఖించు వారు ధన్యులు వారు ఓదార్చబడుదురు' అన్న జీసెస్ మాటల్ని వల్లించేవాళ్ళు జీసెస్ కాలేరు. గ్రామ్‌ఫోన్ రికార్డు కూడా ఆ మాటల్ని తిరిగి చెప్పగలదు.

గ్రామ్‌ఫోన్ రికార్డుపైన తోక ఆడించే కుక్కబొమ్మను చూశారా? పోపులు, శంకరాచార్యులు ఆ పనే చేస్తారు. మాటల్ని వల్లిస్తారు.

వీళ్ళని సాధికారమున్న వాళ్ళుగా భావించకండి. వాళ్ళు యితరుల్ని, తమని తమల్ని వంచిస్తారు. తూర్పుదేశాల్లో సత్యాన్ని దర్శిస్తే మనం సత్యంగా మారుతాము అంటారు. సత్యంగా మారినప్పుడే సాధికారిత వస్తుంది. సత్యం దానిగుండా మాట్లాడుతుంది. నువ్వు కేవలం ఒక వాహిక. స్వరం సాగే వెదురు వేణువు.

తమని తామే హిప్నొటైజ్ చేసుకోవడం

నేను కొంతకాలం కొన్ని నెలలపాటు, ఆదివాసులు నివసించే బస్తర్‌లోని ఒక ప్రాంతంలో వున్నాను. అక్కడి స్త్రీలు పొలాలకు వెళ్ళి పనిచేసేవాళ్ళు. వాళ్ళు ఒకోసారి ఆ అరణ్యంలోనే ఎవరి సాయంలేకుండా ఒంటరిగా బిడ్డను ప్రసవించేవాళ్ళు. అక్కడ ఎట్లాంటి చికిత్స వుండేది కాదు, పట్టించుకోడానికి ఎవరూ వుండేవాళ్ళు కాదు. డాక్టర్లు, నర్సులు వుండేవాళ్ళు కారు. ఆమె ప్రసవించిన బిడ్డను చెట్టుకింద నీడలో పెట్టి యధావిధిగా పొలంలో పనిచేసుకునేది. అక్కడ ఎట్లాంటి శ్రమ, నొప్పి వుండేది కాదు. ఆధునిక స్త్రీలు పడే నొప్పులు వంటివి ఏవీ వుండేవికావు. అట్లాంటివి ఎప్పుడూ వాళ్ళ చెవినపడలేదు. అందువల్ల వాళ్ళు అట్లాంటి బాధపడలేదు. ఆధునిక నాగరిక స్త్రీ చాలా ఎక్కువగా ఆ నొప్పులు పడుతుంది. పాశ్చాత్య స్త్రీ గర్భవతి ఐనప్పటి నుండి ఆ రోజు వస్తుంది. వినాశ కాలం సమీపిస్తుంది, అంటూ తొమ్మిది నెలలు బాధపడుతూనే వుంటుంది. ఆమె తనని తను మంత్రబద్ధ చేసుకుంటుంది. మాయకు లోనుచేసుకుంటుంది. తొమ్మిది నెలల పాటు సుదీర్ఘ హిప్నొటిజంలో మునిగి వుంటుంది. ఫలితంగా అది బలంగా మారి అలవి మీరిన బాధగా పరివర్తన చెందుతుంది. బస్తర్‌కు వెళ్ళి ఈ పాశ్యాత్య స్త్రీ తన బాధ గురించి చెప్పింది. అట్లాంటి బాధ అంటూ మా దగ్గరలేదు, అంటారు ఆదివాసీలు.

ప్రపంచంలో ఇప్పుడు బాధపడకుండా ప్రసవించే మార్గాలు లక్ష వచ్చాయి. స్త్రీ అంతరాంతరాలలో అట్లాంటి బాధ అంటూ ఏమీ లేదు అన్న భావనని బలంగా యింజెక్ట్ చేశారు.

మనిషి తను సృష్టించుకున్న ప్రపంచంలో తను జీవిస్తాడు.

మెలకువ

మీరు మేలుకున్నారని మీరనుకుంటున్నారా? ప్రతి ఉదయం కళ్ళు తెరుస్తారు. అది ఒక విషయం. మేలుకోవడమన్నది పూర్తిగా వేరయిన విషయం. ఏ సమయంలోనైనా మీరు కళ్ళు మూసుకుని లోపలికి చూడండి. లోపల కలలు, అద్భుతాలూ ప్రవహిస్తూ వుంటాయి.

ఈ సాధారణమయిన మేలుకోవడం మెలకువకాదు. వాళ్ళు కలల్లోనే వుంటారు. కేవలం వాళ్ళ కళ్ళు తెరుచుకున్నాయి. వాళ్ళు యాంత్రికంగా ప్రవర్తిస్తారు. వాళ్ళు దొడ్డు కొట్టుడు చెయ్యడంలో నిపుణులు. కారణం వాళ్ళు ఆ పనిచేయడానికి అలవాటు పడిపోయాడు. వాళ్ళు రోబోట్‌లు (Robot). ఒకపని చేయదలచుకుంటే ఆ విషయం రోబోట్ మెదడులోకి ఆ సంజ్ఞలు చేరుతాయి. దాంతో ఎట్లాంటి చైతన్యంతో పనిలేకుండా ఆ పనిచేస్తారు. అది మనసులో ఫీడ్‌చేసే 'ప్రోగ్రాం' లాంటిది.

మనం ముఖ్యంగా అర్థంచేసుకోవాల్సిన విషయమిది. మనం 'ప్రోగ్రాం' చెయ్యబడ్డాం. మతపెద్దలు, రాజకీయవాదులు, అన్ని రకాల సిద్ధాంతకారులు మనల్ని 'ప్రోగ్రాం' అయ్యేలా చేశారు. పసితనం నుండి చేశారు. మీరనుకునే మెలకువ స్థితిలో యాంత్రికమైన అలవాట్లున్నాయి. వాటిని తిరిగి తిరిగి చేస్తూనే వుంటారు. ప్రతి కొత్తతరానికీ కొత్త ప్రోగ్రాం ఫీడవుతుంది. నిజమైన మేలుకోవడం 'డీప్రోగ్రాం' (De-Programme) అయినప్పుడే వస్తుంది.

మేలుకోవడం

ధ్యానం చెయ్యడానికి ఉదయం తగిన సమయం, రాత్రంగా పూర్తి విశ్రాంతి అనంతరం వ్యక్తి తన కేంద్రానికి సన్నిహితమవుతాడు. అన్ని సమయాలకన్నా ఉదయం పూట చైతన్యంతో కేంద్రాన్ని సమీపించడం సులభం. కారణం వ్యక్తి రాత్రంతా కేంద్రం దగ్గరే ఉంటాడు.

గాఢనిద్ర పునశ్శక్తినిస్తుంది. కారణం అచేతనంగానే కేంద్రాన్ని సమీపించినా బాహ్య ప్రపంచానికి సంబంధించిన శ్రమనించి వ్యక్తి విముక్తుడయి వుంటాడు. గాయాలు మాని వుంటాయి. ధూళి దూరమయి వుంటుంది. వ్యక్తి స్నానంచేసి శుభ్రపడతాడు.

అందువల్ల శుభ్ర స్థితితో ప్రపంచంలో కొత్త చైతన్యంతో అడుగుపెడతాడు.

ఎరుక, స్పృహ

ఎరుకవేపు మొదట అడుగుపెట్టేముందు వ్యక్తి శరీరాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. వ్యక్తి ప్రతి కదలికని, హావభావాల్ని దర్శించడంలో చురుగ్గా ప్రవర్తించాలి. అట్లా పరిశీలనతో వుంటే అద్భుతం ఆవిష్కారం కావడం మొదలువుతుంది. అంతకుముందు నువ్వు చేసే పనులు క్రమక్రమంగా అదృశ్యమయిపోతాయి. నీ శరీరం గొప్ప విశ్రాంతి స్థితికి చేరు కుంటుంది. సమశృతిలో సాగుతుంది. శరీరం నించీ గాఢమయిన శాంతి వెలువడుతుంది. సున్నిత సంగీతం శరీరాన్ని స్పృశిస్తుంది.

అప్పుడు నీ ఆలోచనలపట్ల స్పృహతో సాగు. శరీంతో లాగే ఆలోచనతోనూ మార్పు గమనించు. ఆలోచనలు శరీరంకన్నా పెళుసయినవి. సుకుమారమయినవి. అంతే కాదు ప్రమాదకరమయినవి కూడా. అప్పుడు నీ అంతరాంతరాళాల్లో జరిగే మార్పు చూసి ఆశ్చర్యానికి లోనవుతావు. ఒకవేళ నీ మనసులో ఆ క్షణంలో మెదిలే ఆలోచనల్ని రాసి పెడితే వాటిని చూసి నువ్వు గొప్ప ఆశ్చర్యానికి లోనవుతావు. లోపల జరుగుతున్నదాని గురించి నువ్వు నమ్మలేవు.

రాసిపెట్టాక పది నిముషాల తర్వాత వాటిని చదివితే నువ్వు పిచ్చివాడవుతావు. లోపల ఎంత పిచ్చెక్కిన మనసుందో తెలిసి దిగ్భ్రమ చెందుతావు. ఎందుకంటే మనం స్పృహలో వుండం. అలవిమీరిన పిచ్చి ఆలోచనలు అంతస్స్రోతస్వినిలా సాగుతాయి. నువ్వు ఏ పని చేసినా దానిపై ఆ ప్రభావముంటుంది. అది నీ జీవితమవుతుంది. కాబట్టి ఈ పిచ్చి మారాలి. యిక్కడ ఎరుకకు సంబంధించిన అద్భుతమేమిటంటే యిక్కడ నువ్వు స్పృహతో వుండడం మినహాయించి చెయ్యాల్సినదేదీ వుండదు.

అక్కడ చూడడమన్నదే, పరిశీలించడమన్నదే పరిస్థితిని మారుస్తుంది. క్రమక్రమంగా పిచ్చి మాయమవుతుంది. ఆలోచనలన్నీ క్రమక్రమంగా ఒక పద్ధతికి చేరుకుంటాయి. గందరగోళం అదృశ్యమవుతుంది. అవి మరింత వ్యవస్థీకృతమవుతాయి. అప్పుడు లోలోపల గొప్ప శాంతి నెలకొంటుంది. నీ మనసు శరీరము శాంతియుతమవుతాయి. అవి ఒకదాని కొకటి సానుకూలంగా స్పందిస్తాయి. అక్కడ వంతెన నెలకొంటుంది. ఇప్పుడవి వేరు వేరు మార్గాల్లో పరిగెట్టవు. వేరు వేరు వ్యతిరేక మార్గాల్లో గుర్రాలపై దూసుకుపోవు. నీ అనుభూతులు, స్పందనలు స్పృహతో వుంటాయి.

అక్కడ చాలా పల్చటి పొర వుంటుంది. దాని నిర్వహణ చాలా కష్టమయింది. కానీ నీ ఆలోచనల పట్ల స్పృహతో వుండడంవల్ల అడుగుముందుకు పడుతుంది. నీ

అనుభూతుల స్పందనల ఆవిష్కరణకు మరింత గాఢమయిన స్పృహ అవసరం. వాటి పట్ల స్పృహలో వుంటే సమశృతిలో సాగే సంగీత సమ్మేళనంలో సాగుతాయి.

★ ★ ★ ★

నిజమైన ఎరుక అంటే కేవలం ఎరుక మాత్రమే కాదు అప్పుడది శ్రమ కిందికి వస్తుంది. నిజమైన ఎరుక ఎలాంటిదంటే ఎట్లాంటి శ్రమలేని ఎరుక. వ్యక్తి ఆ మార్గంలో ఆందోళనకు గురయితే అది ఎరుక కాదు. అది సమస్తాన్ని విధ్వంసానికి గురిచేస్తుంది. ఈ సంగతి గుర్తుంచుకోవాలి.

ఎట్లాంటి ఆందోళనకు గురికానిదే నిజమైన ఎరుక. విశ్రాంతిపొందే చైతన్యమది. కేవల పరిశీలన ప్రయత్నం ఏమాత్రం లేనిది శ్రమ ఏమాత్రం లేనిది. ప్రయత్నరహిత ప్రయత్నం. ఆ పనిచేస్తూ పోతే తలుపులు క్రమంగా తెరుచుకుంటాయి. ఎట్లాంటి ఆందోళనకు గురికాకుండా ప్రతి క్షణాన్నీ పరిశీలనకు లోనుచేస్తే నువ్వు నిజమయిన దారిలో అడుగుపెట్టినట్లే అప్పుడు నువ్వు వెనుకటి వ్యక్తివి కావు.

★ ★ ★ ★

చైతన్యంలో వుండడానికి మూడు కష్టమయిన దశల్ని అధిగమించాలి. ప్రతి అన్వేషకుడు తప్పనిసరిగా అవగాహన చేసుకోవాల్సిన విషయాలవి. వాస్తవంలో ప్రతి వ్యక్తి మేలుకుంటాడు. కానీ చర్య పూర్తి అయిన తరువాతే అది జరుగుతుంది. నువ్వు ఆగ్రహంతో వుంటావు. నువ్వు భార్యను చెంపదెబ్బ కొడతావు. ఆమె నీమీద దిండు విసరికొడుతుంది. ఆ సందర్భం జరిగిపోయాక నెమ్మదిస్తావు. మెలకువ వస్తుంది. స్పృహలోకి వస్తావు. కానీ లాభంలేదు. అప్పటికే జరగాల్సింది జరిగిపోయింది. యిక చెయ్యడానికేమీ వుండదు. నిజానికి ఏ పనిజరిగిందో అది జరిగివుండాల్సింది కాదు. అప్పటికే ఆలస్యమయిపోయింది.

ఇక్కడ మూడు విషయాలు గుర్తుంచుకోవాలి. ఒకటి చర్యకు ఉపక్రమించేముందు మెలకువతో వుండడం. చైతన్యంతో వుండాలనుకున్న మనిషికి అది ఎంతో కష్టంతో కూడుకున్న పని. చర్యలో స్పృహలో వుండడమన్నది కష్టమయినపని.

కోపమన్నది నీలోపల వ్యాపించిన పొగలాంటిది. అక్కడ స్పృహతో వుండడమన్నది మొదటి శ్రమ. కానీ అది అసాధ్యంకాదు. కొంత చైతన్యంతో వుంటే అదుపులో పెట్టవచ్చు. చర్య అనంతరం పదిహేను నిముషాలకు నెమ్మదిస్తావు. మొదట ప్రయత్నిస్తే ఆ నెమ్మదించడం ఐదు నిముషాల అనంతరం జరగవచ్చు. మరింత ప్రయత్నిస్తే నిముషం తర్వాత జరగవచ్చు. యింకా ప్రయత్నిస్తే చర్య మధ్యలోనే అది జరిగే వీలుంది. అది మొదటి అడుగు.

రెండో అడుగు. అది మరింత కష్టమైంది. అప్పుడు నువ్వు లోతయిన నీళ్ళలోకి అడుగుపెడతావు. రెండో అడుగు. అది చర్యకు ముందే చైతన్యంతో వుండగలగడం. అప్పుడు చర్య ఆలోచన స్థాయిలో వుంటుంది. మనసుతో తచ్చాడుతూ వుంటుంది. యింకా చర్యగా పరివర్తించలేదు. బీజప్రాయంగా వుంది. ఏ క్షణంలోనైనా చర్యగా రూపొందే వీలుంది.

యిప్పుడు మరికొంత స్పృహతో వుండాలి. నీలో తలచూపిన ఆలోచనని ఒడిసి పట్టుకోవాలి. అది వీలవుతుంది. నువ్వు మొదటి మెట్టుదాటి వచ్చినప్పుడు మాత్రమే అది సంభవం. ఎందుకంటే ఆలోచన అన్నది బృహద్రూపంలో వుండదు. ఆకారం ధరించే స్థితిలో వుంటుంది. దాన్ని పట్టుకోడానికి కొంత శ్రమ అవసరం.

నిశ్శబ్దంగా కూచుని ఆలోచనల్ని పరిశీలించు. ఆలోచనచేసే అవకతవకల్ని పరిశీలించు. అదెట్లా పుడుతుందో, ఎట్లాంటి రూపాన్ని సంతరించుకుంటుందో నిన్నెట్లా తాకుతుందో ఎట్లా సాగిపోతుందో పరిశీలించు.

నువ్వు కోపం, నువ్వు అసూయ, నువ్వు ఈర్ష్య, నువ్వు ఆలోచనల మధ్యలో వుంటావు. అది రెండో కష్టం.

యిక మూడో విషయం ఈ క్రమ విధానాన్ని అదుపుచెయ్యడం. చర్యగా రూపొందే ఈ పరిణామాన్ని పట్టుకోవడం. అది ఆలోచనగా రూపొందకముందే అదుపు చెయ్యాలి. అది చాలా శ్రమతో కూడుకున్న విషయం. ఏదయినా ఒక ఆలోచనగా రూపొందే ముందు అది అనుభూతిగా వుంటుంది. అక్కడ మూడు దశలుంటాయి. మొదట అనుభూతి వస్తుంది. తరువాత ఆలోచన వస్తుంది. తరువాత చర్య.

ఫలానా అనుభూతి ఆలోచనగా రూపొందిందన్న స్పృహ నీకుండదు. అనుభూతి లేకుంటే ఆలోచనరాదు. అనుభూతి ఆలోచనలో యధార్థ రూపాల్ని సంతరించుకుంటుంది. ఆలోచన చర్యలో వాస్తవంగా ఆవిష్కారమవుతుంది.

ఇప్పుడు నువ్వు దాదాపు అసాధ్యమయిన ఒక పనిచేయాలి. ఒకరకమయిన అనుభూతిని పట్టుకోవాలి. ఈ పరిణామాన్ని నువ్వు గమనించవు. అనుభూతి ఎందుకు కొద్దిగా నిన్ను ఆందోళనకు గురిచేసిందో వాస్తవానికి నువ్వు గ్రహించలేవు. నువ్వు ఆందోళనకు గురయ్యావు గనక అనుభూతిని, ఆలోచనని పట్టుకోలేవు. లోలోతుల్లో వుండడంవల్ల దాన్ని పట్టుకోలేం.

వ్యక్తి ఆలోచనపట్ల స్పృహలో లేకుంటే అనుభూతిలోపడి కొట్టుకుపోతాడు.

సౌందర్యం

అందం వస్త్వాశ్రయం కాదు, అది వస్తువుల్లో లేదు. అది ప్రేమించే నేత్రం చేసే ఆవిష్కరణ. అది నేత్ర సృష్టి. సౌందర్యమన్నది ప్రేమ చేసే సృష్టి.

అందం అన్నది భౌతికంగా వున్నది మాత్రమే కాదు, అది ఆధ్యాత్మికం. అది ఆధ్యాత్మికం కాని పక్షంలో భౌతిక సౌందర్యం ఎంతోకాలం వుండదు. రూపుమాసిపోతుంది. అది తాత్కాలికమైన ఉనికి కలిగిందే.

జనం రెండు కారణాలవల్ల ప్రేమలో పడతారు. ఒకటి భౌతిక సౌందర్యం. ఒక వ్యక్తి భౌతిక సౌందర్య కారణంగా ప్రేమలోపడితే త్వరలో నిరాశకు లోనవుతాడు. రెండు మూడు రోజులు చాలు. భౌతిక సౌందర్యం అనుభవానికి వచ్చేస్తుంది. లోపల శూన్యం వుంటుంది. ఖాళీ వుంటుంది. అక్కడ అంతస్సౌందర్యం వుండదు. కాబట్టి శారీరక సౌందర్యం కారణంగా ప్రేమలో పడినవాళ్ళంతా అతి త్వరగా నిరాశకు లోనవుతారు. దిక్కుతోచనితనంలో పడతారు. గందరగోళానికి లోనవుతారు. కానీ తాము ఏది కోల్పోయామో అది చూడరు.

వ్యక్తి ఆధ్యాత్మిక సౌందర్యం కారణంగా ప్రేమలోపడితే తప్ప అతను సంతృప్తిని అనుభవానికి తెచ్చుకోడు. అధ్యాత్మిక సౌందర్య కారణంగా ప్రేమలో పడితే దానికి అంతం వుండదు. అది అనంత గాఢమైంది. వ్యక్తి అలా నిరంతర ప్రేమలో మునుగుతూనే లోలోతులకు వెళతాడు. కానీ అడుగు భాగం ఎప్పటికీ అందదు. అప్పుడే ప్రేమ నిండు దనాన్ని సంతరించుకుంటుంది.

ఆధ్యాత్మిక సౌందర్యం కోసం ప్రయత్నించండి, పరిశోధించండి. వేరే మాటల్లో చెప్పాలంటే దైవాన్ని అన్వేషించమంటే అదే!

★ ★ ★ ★

సన్యాసి సౌందర్య మూల కారణాన్ని అన్వేషించాలి. వ్యక్తి తన అస్తిత్వ కేంద్రానికి చేరితే నిజమైన సౌందర్యం విస్ఫోటిస్తుంది. ఆ కేంద్రాన్ని స్పర్శించిన క్షణం అక్కడే గొప్ప ఆనంద విస్ఫోటన జరుగుతుంది. వ్యక్తి ప్రతి అణువు పరవశనాట్యం చేస్తుంది. వ్యక్తి అస్తిత్వపు పొరలు స్పందిస్తూ అజ్ఞాత, మార్మిక మాధుర్యస్వర సమ్మేళనం చెందుతాయి.

సౌందర్యానికి లోతువుంది. సౌందర్యంలో దైవికమైనది వుంది. దాన్ని అందుకోలేం. దాన్ని నాశనం చెయ్యలేం. ఎందుకంటే అది బయట చిత్రించింది కాదు. అది లోపలే ఎదిగేది.

★ ★ ★ ★

సౌందర్యం దైవత్వానికి సంబంధించిన మొదటి మెరుపు. ఎక్కడ వ్యక్తి అందాన్ని చూసినా తను పవిత్ర స్థలంలో వున్నట్లు భావించాలి. ఎక్కడయినా కావచ్చు. మనిషి ముఖంలో, పసిపాప కళ్ళలో, పద్మవికసనంలో, కదిలే పక్షి రెక్కల్లో, ఇంద్రధనస్సులో నిశ్శబ్ద శిలలో ఎక్కడయినా కావచ్చు. ఎక్కడ సౌందర్యాన్ని సందర్శించినా వ్యక్తి పవిత్ర స్థలంలో వున్నట్లు, దైవానికి సన్నిహితంగా వున్నట్లు భావించాలి.

★ ★ ★ ★

నేనొక ఇంద్రియ మతాన్ని బోధిస్తాను. నేను సున్నితమయిన మతాన్ని బోధిస్తాను నా మేరకు సౌందర్యమన్నది సత్యంకన్నా విలువైంది. సత్యమన్నది సౌందర్యంలో ఒక భాగం. ఒక ముఖంలో అందం, అసలు అందమే దైవం. నేను కళాత్మకమైన మతాన్ని బోధిస్తాను. పాత మతాలకు నీతుల్లాగా సౌందర్యం నా మతం బోధిస్తుంది. నువ్వు సౌందర్యంతో ప్రేమలో వుంటే అక్కడ నువ్వేమీ పొరపాటు చెయ్యడంలేదు. నువ్వు రక్షణ వలయంలో వున్నట్లే. ఎందుకంటే నువ్వేదన్నా తప్పు చెయ్యదలచుకుంటే నువ్వు అసహ్యమయిన పని ఏదో చేయాలి. సౌందర్యాన్ని ఆరాధించే మనిషి అబద్ధాన్ని చెప్పలేడు. ఎందుకంటే అబద్ధం అసహ్యమయింది. అతని సౌకుమార్యమే అతను ఎన్నో అనవసరమయినవి చెయ్యకుండా అడ్డుపడుతుంది.

★ ★ ★ ★

నేనొక హసీడిక్ మార్మికుడి గురించి చదివాను. అతను ఎంతో అందగాడు. మార్మికులు సాధారణంగా అందంగా వుంటారు. ఎందుకంటే వాళ్ళ అంతరాంతరాళంలో ఒకటి శరీరం గుండా ఫిల్టరవుతుంది. వాళ్ళు కాంతితో వెలుగుతూ వుంటారు. ఆ మార్మికుడు మరణశయ్యపై వున్నాడు. అతని స్నేహితుడయిన మరో మార్మికుడు అతన్ని చూడ్డానికి వచ్చాడు. చూసి అతను ఏడవడం ప్రారంభించాడు.

చనిపోతున్న మార్మికుడు 'ఎందుకు ఏడుస్తున్నావు? నేను నా యింటికి వెళుతున్నాను. నేను చనిపోవడంలేదు. మరణమన్నది లేదు. నీకాసంగతి బాగా తెలుసు. నువ్వు మరణ రాహిత్యాన్ని అనుభూతి చెందావు. మరి ఎందుకు ఏడుస్తున్నావు? అని అడిగాడు. మిత్రుడు 'నేను ఆత్మకోసం రోదించడంలేదు. నేను నీ అందమయిన శరీరం కోసం ఏడుస్తున్నాను. యిప్పుడది మట్టిలో కలిసిపోతుంది కదా! అన్నాడు. ఆ కథ చివరి సారాంశం యిద్దరూ ఏడుస్తారు. నాకా కథ యిష్టం. యిద్దరు మార్మికులూ ఏడ్చారు. సౌందర్యం భగవంతుని హావభావం. అది ఏ రూపంలో వున్నా దైవికమే!

★ ★ ★ ★

బుద్ధుడు తన సన్యాసులు ఎత్తే బిచ్చాన్ని 'మధుకరం' అన్నాడు. మధుకరం అంటే తేనెటీగ తేనెని సేకరించడం లాంటిది. భిక్షువు అంటే బౌద్ధసన్యాసి యింటింటికీ తిరుగుతాడు. అతను తన భిక్షాన్నంతా ఒక యింట్లోనే అడగడు. దానివల్ల వాళ్ళకి ఎంతో శ్రమ. అందు వల్ల ఎందరినో భిక్షమడుగుతాడు. ఒక యింట్లో కొంత, మరొక యింట్లో మరికొంత. అందువల్ల అతను ఎవరికీ శ్రమ యివ్వడు. ఒకే యింటికి మళ్ళీ వెళ్ళడు. తుమ్మెద ఒక పువ్వు నుండి యింకో పువ్వుకు సాగుతుంది. అక్కడ దేన్నీ సొంతం చేసుకోవడమంటూ వుండదు. తేనెటీగ ఒక పువ్వునించీ కొంత సేకరించి మరో పువ్వు దగ్గరికి వెళ్ళడంవల్ల అక్కడ సౌందర్యం గాయపడదు. పరిమళం మలినపడదు. అసలు తేనెటీగ వాలివెళ్ళిన సంగతే పువ్వుకు తెలీదు. అట్లా తేనెటీగ నిశ్శబ్దంగా వస్తుంది, నిశ్శబ్దంగా వెళుతుంది.

బుద్ధుడు "మెలకువతో వున్న మనిషి. ఈ ప్రపంచంలో తేనెటీలాగా జీవిస్తాడు. అతనీ ప్రపంచ సౌందర్యాన్ని మలినపరచడు. ప్రపంచ పరిమళాన్ని మలినపరచడు. అతను నిశ్శబ్దంగా జీవిస్తాడు. నిశ్శబ్దంగా సాగి పోతాడు. ఏది తనకు అవసరమో అంతమేరకు అడుగుతాడు. అతని జీవితం సరళ మయింది. సంక్లిష్టమయింది కాదు. అతను రేపటి కోసం కూడబెట్టడు. తేనెటీగ రేపటి కోసం సేకరించదు. ఈ రోజుకు దొరికింది ఈ రోజుకు చాలు అన్నాడు.

★ ★ ★ ★

తేనెటీగకు కొన్ని లక్షణాలున్నాయి. మొదటిది అది ఒక పువ్వు నుండి యింకొక పువ్వుకు సాగుతుంది. ఎక్కడా స్థిరనివాస మేర్పరచుకోదు. నిశ్చలంగా నిలబడిపోదు. అది పువ్వును యిష్టపడుతుంది. కానీ అనుబంధాన్ని పెంచుకోదు. స్వేచ్ఛగా వుంటుంది.

సన్యాసి జీవన విధానమలాంటిది. అన్ని అనుబంధాల నించీ స్వేచ్ఛగా వుండడం. తేనెటీగ దేన్నీ సొంతం చేసుకోదు. యింకో తేనెటీగతో ఘర్షించదు. నా పువ్వు దగ్గరికి ఎందుకొచ్చావు?' అనదు దానికి భిన్నంగా అందమైన పూలను తేనెతో నిండిన పూలను చూస్తే వెంటనే వెళ్ళి తన గుంపుతో చెబుతుంది.

యిప్పుడు శాస్త్రవేత్తలు తేనెటీగలకు ఒక ప్రత్యేకమైన భాషవుందంటున్నారు. కనీసం నాలుగు పదాల్ని కనుక్కున్నారు. సాంకేతిక భాషను కనిపెట్టారు. యిప్పటికి అది మాత్రం ఖచ్చితం. అని నాలుగు పదాల్ని వాడుతాయి. అవి భాషా సంబంధమైనవి కావు. అవి హావభావాలకు సంబంధించినవి.

మనిషి ఒక నిధిని చూసిన వెంటనే యితరుల కంట కనబడకకుండా దాన్ని

దాచిపెడతాడు. తేనెటీగ అట్లా కాకుండా ఒక పూలవనాన్ని చూసిన వెంటనే ఆ విషయం యితర తేనెటీగల నించీ దాచిపెట్టడానికి బదులు పరుగు పరుగు తన గుంపు దగ్గరికి వెళ్ళి ఆ విషయం చెబుతుంది. అవి గుంపుగా జీవిస్తాయి. కమ్యూన్‌లో జీవిస్తాయి. ఒక తేనెతుట్టె దగ్గర వేల తేనెటీగలు కలిసి వుంటాయి.

ఒక తేనెటీగ ఒకరకమయిన నాట్యం చేస్తుంది. అది మొదటి సంకేతం. ఆ తేనెటీగ ఆ ప్రత్యేకమైన డాన్సు చేసిందంటే ఆ తేనెటీగ దేన్నో కనిపెట్టిందని తేనెటీగల గుంపుకు తెలుస్తుంది. ఆ తేనెటీగ చర్య "యురేకా! యురేకా! నేను కనిపెట్టాను!" అనడం లాంటిది. అప్పుడు అన్నీ ఆ తేనెటీగను అనుసరిస్తాయి. అక్కడ ఏదీ సొంతం చేసుకోవడం అంటూ వుండదు. వర్ణాల, సుమాల, పరిమళాల అనుభవంతో అని సంపన్నమవుతాయి.

చివరిది అయినా ముఖ్యమయింది. తేనెటీగ తేనెను స్వీకరిస్తుంది. కానీ ఎక్కడా పువ్వును గాయపరచదు. అగి ఎంత కళాత్మకంగా నిర్వహిస్తుందంటే అది పువ్వును ఏమాత్రం గాయపరచదు. అది పువ్వుతో దౌర్జన్యపూరితంగా ప్రవర్తించదు. అది మనిషిలాంటిది కాదు. మనిషి పువ్వును యిష్టపడితే వెంటనే దాన్ని కోస్తాడు. మనిషి ప్రేమ విధ్వంస నాత్మకం! అది ప్రేమ కాదు! దౌర్జన్యం! ప్రేమ పేరుతో నిర్వహించే పనిలో ఎక్కడో ద్వేషం దాగి వుంది.

పరవశించే తేనెటీగలా వుండు! అనుబంధం లేకుండా వుండు. ఎప్పుడు చలనంలో వుండు! దేన్నీ సొంతం చేసుకోకు! జీవితంలోని అన్ని కోణాల్ని అనుభవంలోకి తెచ్చుకో! అన్ని వర్ణాల్ని, యింద్రధనసుల్ని, అన్నిరకాల సంగీతాన్ని అనుభవంలోకి తెచ్చుకో. ఎప్పుడూ విధ్వంసకరంగా వుండకు! సృజనాత్మకంగా వుండు. సృజనాత్మకమైన మనిషి దైవిక స్పర్శ వున్న మనిషి! పవిత్ర వ్యక్తి!

ఉనికి

ఇంగ్లీషు పదం 'Being' సంస్కృత ధాతువు 'భూ' నించి వచ్చింది. భూ 'అంటే' ఏదైతే ఎదుగుతుందో అది! అట్లా ఎదిగేది దైవం. చెట్లు ఎదుగుతాయి. పక్షులు ఎదుగుతాయి. రాళ్ళు పెరుగుతాయి. అట్లా పెరగడమంటూ ఏది వుందో అదంతా దైవత్వమే. ప్రతిదీ దాని తత్వంలో ఎదుగుతుంది. దాని పరిధుల్లో ఎదుగుతుంది. Being పునాదిని గుర్తుంచు కోండి. అది 'భూ' అంటే ఏదయితే శ్వాసిస్తుందో, ఏదయితే ఎదుగుతుందో, దేనికైతే జీవితముందో ఏది ప్రాథమికమో, ఏది ఆదిమమైందో అదంతా ఉనికి కలిగిందే.

★ ★ ★ ★

మంచి గుండా ప్రవహించే ప్రతి ఉనికీ మంచిదే.

పాతకాలం వారు నువ్వు మంచిచేస్తే నీకు మంచే జరుగుతుందనేవాళ్ళు. నేను దానికి వ్యతిరేకంగా చెబుతాను. మంచిగా వుండు. అప్పుడు నువ్వు ఏదిచేసినా అది మంచే అవుతుంది. ఎందుకంటే అస్తిత్వమన్నది చర్యగుండా బయటపడుతుంది. ఉనికి అన్నది ప్రాథమికం. చర్య కాదు. గతంలో చర్య ఆధారంగా ఒత్తి చెప్పి వంచన చేశారు. అస్తిత్వం చెడ్డది కావచ్చు. కానీ వాళ్ళు మంచి పనులు చేయవచ్చు. అట్లాంటి వాళ్ళు గౌరవనీయులు, సన్యాసులుగా భావింపబడ్డారు. వాళ్ళ లోపలికి చూస్తే అక్కడ ఏమీలేదు. మామూలు మనుషులే. వాళ్ళ ప్రయత్నంలో నిలదొక్కుకున్నారు. తమని తాము క్రమశిక్షణకు లోను చేసుకున్నారు. తమని తాము సంస్కరించుకుని, ధర్మానికి లోనుచేసుకుని సేవచేస్తూ, ప్రార్థనచేస్తూ అదీ యిదీ చేశారు. కానీ యిదంతా చేయడమే. చేయడమన్నది ఉపరి తలంలోనే. వాళ్ళు కేంద్రానికి ప్రయాణం చెయ్యలేదు. నిజానికి కేంద్రమే ముఖ్యమైంది. కేంద్రం మారందే ఉపరితలంలో మారినా లాభంలేదు.

ఒక జీసెస్ అతని అస్తిత్వాన్ని బట్టే అంచనాకు లొంగుతాడు. అతని దగ్గరగా వుండే అతని ఉత్తమ అస్తిత్వంగుండా అన్నీ జరుగుతాయి. అతను చెప్పేది వినడానికి ప్రయత్నించకండి. అతను ఏం చెప్పాడో చూడకండి. అతనేమిటో చూడండి. అక్కడే కీలకముంది. అతని దగ్గరగా వుండండి. హిందువులు దాన్ని 'సత్సంగ'మన్నారు. సత్యానికి సన్నిహితంగా వుండడం మేధస్సుతో అనుభవాన్ని ముడిపెట్టండి. అతనేమిటో వినండి.

అస్తిత్వం సంచలిస్తుంది అస్తిత్వం వికసిస్తుంది, పరిమళిస్తుంది. జీసెస్ దగ్గర నిశ్శబ్దంగా వుంటే అతని నిశ్శబ్దాన్ని వింటావు. ఆ నిశ్శబ్దం గుండా ఆనందాన్ని అందు కుంటావు. ఆ నిశ్శబ్దం నీలో నిండుతుంది. నీ నించీ పొంగిపొర్లుతుంది. అనురాగం, ప్రేమతో కలిసి ప్రవహిస్తుంది.

విశ్వాసం

తార్కికంగా, మేధోపరంగా అంగీకారాన్ని కలిగింది అని విశ్వాసానికి అర్థం. అది చెప్పిందే నిజమంటుంది. ఆ వాదన నిన్ను లొంగదీస్తుంది. విశ్వాసమన్న దానికి హృదయంతో పనిలేదు. అది కేవలం మనసుకు అంటే మేధస్సుకు సంబంధించింది. అది మనసుకు సంబంధించిన విషయం. విశ్వాసమన్నది ప్రేమ వ్యవహారం కాదు.

విశ్వాసమంటే నువ్వు మేధోపరంగా లొంగావు. అక్కడ ఒక ఒప్పందానికి వచ్చావు. అక్కడ ఎట్లాంటి వాదనా దాన్ని నాశనం చెయ్యలేదన్న అంగీకారానికి వచ్చావు. ఎన్నో వాదాలలో దాన్ని ఎదుర్కొని నిరూపించడానికి ప్రయత్నించావు. కానీ లోపల అంతర్ ప్రవాహంగా ఒక సందేహం వుంది. విశ్వాసం ఆ సందేహాన్ని నాశనం చెయ్యలేదు. దాన్ని కేవలం కప్పిపెడుతుంది. అంతే. అది ఎంత జాగ్రత్తగా కప్పిపెడుతుందంటే నువ్వు దాని సంగతే మరచిపోతావు. కానీ అది ఎప్పుడూ అక్కడే వుంటుంది. విశ్వాసం వున్న వ్యక్తి కొద్దిగా తరచి చూసినా అదక్కడ కనిపిస్తుంది. అందుకనే విశ్వాసులు విశ్వాసానికి భిన్నంగా ఏమి వినాలన్నా భయపడతారు.

క్యాథలిక్ చర్చి యివి చదవాలి, అది చదవకూడదు అని నిబంధనలు పెడుతుంది. నిషేధాలు విధిస్తుంది. పుస్తకాల్ని కొన్నిట్ని బ్లాక్‌లిస్టులో పెడుతుంది. వాటికన్ లైబరీలో వేలకొద్దీ అద్భుతమైన డాక్యుమెంట్లు వున్నాయి. వేలకొద్దీ సంవత్సరాల నించి సేకరించినవి. వాటన్నిట్నీ కుప్పవేసి కాల్చివేశారు. చారిత్రక ప్రాధాన్యమున్న ఆ రికార్డుల్ని కాల్చేశారు. దానికి ఆధారాలున్నాయి. క్రిస్టియానిటీకి వ్యతిరేకమైన వాటికన్నిట్నీ వాటన్నిట్నీ తగలబెట్టారు.

మహమ్మదీయులు కూడా అదే పనిచేశారు. హిందువులూ ఆ పనిచేశారు. ప్రపంచ వ్యాప్తంగా విశ్వాసులు ఆ పనేచేశారు. ఎందుకంత భయం? ఎందుకంటే విశ్వాసి సందేహం నించీ స్వేచ్ఛగా లేడని అర్థం. సందేహం అక్కడుంది. ఎవరయినా దాన్ని మళ్ళీ పైకి తీసుకొచ్చే వీలుంది. వాళ్ళు ఏదోరకంగా దాన్ని కప్పిపెట్టారు. గాయాన్ని దాచి పెట్టారు. కానీ గాయం మానలేదు. అది అక్కడుంది. దాన్ని దాచిన చోటే అది విస్తరిస్తోంది!

జనం దేవుణ్ని నమ్ముతారు. అంటే వాళ్ళ సందేహం మాయమయిందనా? ఒకవేళ సందేహం అక్కరలేని పక్షంలో విశ్వాసం యొక్క అవసరం ఏముంది? విశ్వాసం విరుగుడు

లాంటిది. ఔషధం లాంటిది. నువ్వు ఆరోగ్యంగా వుంటే ఎట్లాంటి ఔషధంతోనూ పనిలేదు. నీలో ఎట్లాంటి సందేహమూ లేకుంటే ఎట్లాంటి నమ్మకమూ అవసరం లేదు.

విశ్వాసమన్నది పైపైన వుండేది. ఉపరితరంలో వుండేది, పైపైన కనిపించేది డొల్ల. అది నిన్ను విడదీస్తుంది. విశ్వాసి అన్నవాడు నీపైన కనిపించేవాడు, నీ ఉపరితల భాగం. తక్కినదంతా, ముఖ్యమయిన భాగమంతా పదింట తొమ్మిదివంతుల నీ భాగం పూర్తిగా సందేహాలతో నిండింది.

ప్రతి విశ్వాసి లోపల సంక్షోభం వుంటుంది. అందువల్ల తన నమ్మకానికి వ్యతిరేకంగా ఏదయినా వచ్చి పడుతుందేమో అని అతను అనునిత్యం ఆందోళనపడుతూ వుంటాడు. అతని విశ్వాసాన్ని ఏ చిన్ని విషయమయినా ఆందోళకు గురిచేస్తుంది.

★ ★ ★ ★

బుద్ధుడు 'నమ్మకు! ఎందుకంటే నువ్వు నమ్మితే ఎప్పటికీ అది నీకు తెలీదు. నువ్వు నిజంగా తెలుసుకోవాలనుకుంటే నమ్మకు' అన్నాడు. అపనమ్మకమేర్పరచుకోమని ఆయన వుద్దేశం కాదు. ఎందుకంటే అపనమ్మకం కూడా ఒకేరకమయిన నమ్మకమే! దేవుణ్ణి నమ్మేవాళ్ళు నమ్ముతారు, దేవుణ్ణి నమ్మనివాళ్ళు కూడా లేడన్న నమ్మకం వున్నవాళ్ళే! ఒకరు దేవుని వునికిని నమ్ముతారు. మరొకరు దేవుడు లేడన్న దాన్ని నమ్ముతారు. యిద్దరూ విశ్వాసులే! యిద్దరి మధ్యా తేడాలేదు. ఆస్తిక నాస్తికులిద్దరూ ఒకలాంటివాళ్ళు. క్యాథలిక్కులు, కమ్యూనిస్టులు ఒక్కలాంటి వాళ్ళే! తేడాలేదు. వాటికన్ అయినా క్రెమ్లిన్ అయినా ఒకటే!

బుద్ధుడు 'రండి! చూడండి! అన్నాడు. అది ఆహ్వానం! బుద్ధుడు రండి! నాపై విశ్వాసముంచకండి! నాతో ప్రయోగం చేయండి! మీలోకి వెళ్ళండి. మీరు చూడగలిగితే అప్పుడు నమ్మండి!' అన్నాడు. అప్పుడది విశ్వాసంగా వుండదు. అప్పుడది అనుభవంమీద ఆధారపడిన నమ్మకమవుతుంది. దాన్ని ఇంగ్లీషులో Trust అన్న పదంతో చెప్పవచ్చు. అది నమ్మకానికి సన్నిహితమైంది. విశ్వాసం అడ్డుకట్టవేసేది, నమ్మకం అనుభవం పునాదిగా కలిగింది.

★ ★ ★ ★

నిజమైన నమ్మకం విశ్వాసం కాదు. అది అనుభవం. దైవాన్ని అనుభవానికి తెచ్చుకోవాలి. అనుభవానికి రాకముందే విశ్వాసానికీ లోనుకాకూడదు. ఎప్పుడూ అట్లా చెయ్యకూడదు. ఎందుకంటే ఒకసారి విశ్వాసం వ్యక్తిలోకి ప్రవేశిస్తే అది వ్యక్తిని విషప్రాయం చేస్తుంది. అన్నీ విశ్వాసాలనీ వదిలేయండి. విశ్వసించడమెందుకు? దైవాన్ని అనుభవానికి తెచ్చుకోవచ్చు కదా!

నేను ఉపాధ్యాయుణ్ణి కాను. నేను మీకో సిద్ధాంతాన్నో, ఫిలాసఫీనో యివ్వడం లేదు. నేను కేవలం ఒక సాక్షిగా వున్నాను. నేను అనుభవాన్ని పొందాను. అందుకనే మీరు అనుభవానికి తెచ్చుకోండి' అంటున్నాను. అందువల్ల దేన్నీ విశ్వసించాల్సిన పనిలేదు.

నేను కచ్చితమయిన నాస్తిక దృక్పథమున్నవాణ్ణి. నేను దేవుణ్ణి నమ్మకపోవడమనే అదృష్టానికి నోచుకున్నవాణ్ణి. ఎందుకంటే అతని గురించి నాకు తెలీదు. నేను ఎంత సందేహ జీవినంటే ఎవ్వరూ అడగని ప్రశ్నలు ప్రతిదాని గురించీ అడుగుతాను. యితరుల ఉనికి గురించి ప్రశ్నిస్తాను. యితర వ్యక్తి వున్నాడా? లేదా? అన్నదాని గురించి స్వప్నిస్తాను, కలగంటాను.

నేను సుప్రసిద్ధుడయిన ఛాంగ్‌ట్జు స్టేట్‌మెంట్‌ని యిష్టపడతాను. ఆయన ఒక రాత్రి నేను సీతాకోకచిలుకగా మారిపోయినట్లు కలగన్నాడు. అప్పటినించీ అతడు నేనొక యిబ్బందిలో పడిపోయాను. దాన్ని అర్థంచేసుకోలేకపోతున్నాను. ఒకవేళ ఛాంగ్‌ట్జు తను సీతాకోక చిలుక అని కలగంటున్నాడా? ఎవడికి తెలుసు? వుదయాన్నే సీతాకోకచిలుక గాఢంగా నిద్రపోతూ తనను ఛాంగ్‌ట్జుగా కలగంటోందా? ఎవరికి తెలుసు?' అన్నాడు.

నేను యూనివర్సిటీలో వున్నప్పుడు నా డెస్కు వెనక యిది రాసి వుంచాను. ఒక రోజు ఒక ప్రొఫెసర్ నా దగ్గరికి వచ్చాడు. డెస్కు వెనక రాసింది చూసి 'ఎందుకీ ఛాంగ్‌ట్జు స్టేట్‌మెంట్ యిక్కడ రాశావు?' అని అడిగాడు. అప్పుడు నేను 'ఇది నా స్టేట్‌మెంట్ కూడా. మిమ్మల్ని మీరు అని నేను నమ్మడంలేదు' అన్నాను. ఆ ప్రొఫెసర్ 'ఏం మాట్లాడు తున్నావు?' అన్నాడు. నేను కొన్నిసార్లు మీరు కూడా నా కలల్లోకి వస్తారు. యిప్పుడీ విషయం మరింత సంక్లిష్టంగా మారింది' అన్నాను. అతను 'నీ వుద్దేశమేమిటి?' అన్నాడు. నేను 'ఆ కలలో కూడా మీరు ఈ బోర్డు గురించే అడిగారు. 'ఎందుకు నీ దగ్గర ఈ బోర్డు వుంది?' అన్నారు. యిప్పుడు మళ్ళీ మళ్ళీ అడుగుతున్నారు. యిప్పుడు నేను దేన్ని నమ్మాలి?' అన్నాను.

అతను మాటా పలుకూ లేకుండా మాయమయ్యాడు. అతను నువ్వు నాకు పిచ్చెక్కించావు. అసలు నీకేమయినా పిచ్చెక్కిందా?' అన్నాడు తరువాత.

నాకు ఆ మేరకు పిచ్చి వున్నందుకు నేనెంతో సంతోషించాను. ఎందుకంటే నేను దేనినీ నమ్మను. సంపూర్ణ స్వేచ్ఛతో వుంటాను. ఆ స్వేచ్ఛలో ఏదో అవిష్కారమవుతుంది. ఆ సంపూర్ణమయిన శూన్యంలోకి అనంతం నించీ ఏదో పిల్లగాలి వస్తుంది. నేను దాన్ని చూడలేను. కానీ అనుభూతి చెందగలను. నేను దాని తాజాదనాన్ని అనుభవించగలను.

నేను ఆ పరిమళాన్ని అనుభూతి చెందుతాను అది నన్ను మారుస్తుంది. యిప్పటికీ నేను విశ్వాసిని కాను. ఎందుకంటే యిప్పుడు దేవుడు నాకో వాస్తవం!

ఇప్పుడు నేను 'దేవుడున్నాడు' అనను.

కేవలం దేవుడు మాత్రమే వున్నాడు, యింకేదీ లేదు' అంటాను!

ఉదరం

ప్రాచీన ప్రాచ్య దేశాల్లో ప్రత్యేకించి దూర ప్రాచ్యంలో వాళ్ళు మనిషి కడుపులోనే జీవిస్తాడు అనేవాళ్ళు. వెనుకటి రోజుల్లో వందేళ్ళ క్రితం మీరు జపాన్ వెళ్ళి 'మీరు ఎక్కడ నించీ ఆలోచిస్తారు?' అని అడిగితే వాళ్ళు తమ కడుపును చూపించి ఇక్కడ నుంచీ అనే వాళ్ళు.

ఉదయం జీవితానికి ఆధారం. వ్యక్తి తల్లితో బొడ్డు గుండానే ఆధారపడి వుంటాడు. జీవితం స్పందించడం అక్కడి నించే ఆరంభమవుతుంది. తల నీ అస్తిత్వానికి దూరంగా వున్న భాగం. కేంద్రం నాభి. నీ అస్తిత్వం, వునికి అక్కడ వుంటాయి.

నువ్వు, నీ మెదడు రెండు విషయాలు. మెదడు నీ యాంత్రిక భాగం. తక్కిన అన్నిటిలాగే యాంత్రిక భాగం. నా చేయి యాంత్రికం. దాన్ని ఉపయోగిస్తాను. నా మెదడు యాంత్రికం దాన్ని ఉపయోగిస్తాను.

మనసు స్థానమేది? జెన్ అది కడుపులో వుంది., అంటుంది. నాభిలో వుంటుంది మొదటి స్పందన ఆరంభమయిన దగ్గరుంటుంది. అక్కడినించీ శరీరమంతా వ్యాపిస్తుంది. తిరిగి దారి దగ్గరికే వెళ్ళాలి.

మేధస్సు చాలా చాలా పరిమితమైంది. సహజాతం సాటిలేనిది. సహజాతం ఎప్పుడూ కడుపునించే వస్తుంది. నువ్వు సహజంగా ఏది భావిస్తే అది కడుపుగుండానే వస్తుంది. మొదట ఉదరం ప్రభావితమవుతుంది. నువ్వు మొదటిసారి ప్రేమలో పడితే నువ్వు 'తల' గుండాపడవు. అందుకనే జనం ప్రేమ గుడ్డిదంటారు. ఎందుకంటే దానికి మెదడుతో పనిలేదు. నువ్వు ప్రేమలో పడ్డావంటే మరెక్కడినించో పడ్డావని అర్థం. గొప్ప కవుల్ని, శాస్త్రవేత్తల్ని, సృజనకారుల్ని అడిగితే ఏదయినా సంభవించినప్పుడు అది తలనించీ కాక ఎక్కడినించో జరిగిందంటారు. అది అతీత స్థితినించి ఆవిష్కారమైందంటారు.

★ ★ ★ ★

మనిషి మనసులోకి ఒక దురభిప్రాయం ప్రవేశించింది. అది చిన్ని కడుపు, విశాలమైన రొమ్ము వుండాలని. ఆ అభిప్రాయం సింహం శరీరాన్ని చూసి ఏర్పడింది. ఎందుకంటే సింహానికి చాలా చిన్ని కడుపు, పెద్ద వక్షస్థలం వుంటాయి.

ఏదో ఒకరకంగా సింహంతో మనిషి అహం పోలిక తెచ్చుకుంది. సింహం యిరవై నాలుగ్గంటల్లో ఒకసారే తింటుంది. అది మాంసంతిని జీవిస్తుంది. ఆ కారణంగా దానికి ఎక్కువ ఆహారం అవసరం లేదు. మనిషీ జీర్ణకోశ నిర్మాణం, జీర్ణక్రియ నిర్మాణం వేరు. మనిషి శాకాహారి.

జననం

వ్యక్తి జన్మించడు, మరణించడు, రెండూ భ్రమలే. అవి కనిపిస్తాయి. పాము తాడు లాగా కనిపిస్తే దాన్ని స్పష్టంగా చూడలేం. రాత్రి పడుతూ వుంటుంది. సూర్యుడు అస్త మిస్తాడు. నువ్వు చీకటి మార్గంలో వుంటావు. అప్పుడు నువ్వు హఠాత్తుగా పాముని చూసి భయపడతావు. కానీ అక్కడ తాడే వుంటుంది. అక్కడ కాంతిని ప్రసరిస్తే, ఒక క్యాండిల్ వెలుగుచాలు అక్కడ పాములేదని తెలుస్తుంది. తాడు వుందన్న విషయం తెలుస్తుంది.

జననం కూడా తాడులో పాము కనిపించడంలాంటి భ్రాంతే. జననం భ్రాంతి అయినప్పుడు మరణం కూడా భ్రాంతే. నువ్వు పుట్టవు, మరణించవు. తప్పకుండా శరీరంలో ప్రవేశిస్తావు. కానీ నీకు సంబంధించినంతవరకు నువ్వు జననానికి ముందు వున్నావు, మరణానంతరం వున్నావు.

జనన మరణాలు నీ జీవితానికి హద్దులు కావు. ఎన్నో జననాలు, ఎన్నో మరణాలు వున్నాయి. నీ జీవితానికి సంబంధించిన శాశ్వతత్వంలో జననమరణాలు చిన్ని భాగాలు. నువ్వు ఈ శాశ్వతత్వానికి సంబంధించిన స్పృహతో వుంటే – లేదా కాలరహిత స్థితిలో వుంటే అన్ని భయాలు, మరణానికి సంబంధించిన అన్ని ఆందోళనలు సూర్యకాంతికి మంచు బిందువులు ఆవిరైనట్లు మాయమవుతాయి.

నేను చనిపోను. కానీ తప్పనిసరిగా ఒక రోజు శరీరాన్ని వదిలిపెడతాను. నిజానికి నేను పాతికేళ్ళ క్రితమే వదలిపెట్టాను. నేను కేవలం అతిధిని మాత్రమే. నేను సొంతం చేసుకోను. నేను దాంట్లో భాగాన్ని కాను. అది నాలోనూ భాగం కాదు, మేము కలిసి వున్నాము. స్నేహపూరిత అంగీకారంతో వున్నాం. ఇక్కడ ఆధిపత్య ధోరణిలేదు. నేను దాన్ని గౌరవిస్తాను, ఎందుకంటే అది నాకు నీడనిచ్చింది. అక్కడ వంతెన ఏమీలేదు. శరీరమక్కడుంది. నేనిక్కడున్నాను. ఆ రెంటి మధ్యా వ్యవధానం వుంది.

మనిషి కేవలం బీజంగా జన్మనెత్తాడు. పువ్వులా కాదు. పుష్పించడాన్ని అతను సాధించాలి. అది జరుగుతుందని భరోసాగా భావించకూడదు. జననం కూడా జీవితానికి సంబంధించిన ఒక అవకాశమే. అదే జీవితం కాదు. అక్కడ వ్యక్తి జీవితాన్ని చేజార్చుకునే వీలుంది. తాము పుట్టినందుకే జీవంతో వున్నట్లు కోట్లమంది భావిస్తారు. అది చాలదు. అది అవసరమే. అది లేకుంటే జీవితంలేదు. ఇదీ అదీ జీవితం కాదు. వ్యక్తి రెండుసార్లు జన్మించాలి.

జీసెస్ నువ్వు మళ్ళీ పుట్టకుంటే నువ్వు దేవుని రాజ్యంలో అడుగుపెట్టలేవు' అన్నాడు. ఒకరకమయిన పునర్జన్మ అవసరం. సాధారణమైన జన్మ శరీర మనసుల జన్మ లాంటిది. అది సజీవం కావడానికి శక్తివంతమైన చైతన్యం అవసరం.

వ్యక్తి నిజంగా జన్మిస్తే జీవితం కోసం లేదా దేవుని కోసం జన్మించాలి. నాకు రెండూ సమానార్థకాలే.

బ్రహ్మానందం

బ్రహ్మానందం, పరమానందం అన్నది హిమాలయ పర్వత శిఖరాయమానమయింది. దాన్ని మించింది ఏదీ లేదు. వ్యక్తి దాన్ని అందుకోందే జీవనయాత్ర పరిపూర్తి కాదు. జీవన లక్ష్యం నెరవేరదు.

బ్రహ్మానందమన్నది విచిత్రమయిన ద్రాక్షాసవం. ఎందుకు విచత్రమైందంటే ఒక వేపు వ్యక్తిని అది అనంత చైతన్యంతో నింపుతుంది. మేలుకొల్పుతుంది, స్పృహ కలిగిస్తుంది. యింకోవేపు సంపూర్ణమయిన మత్తును కలిగిస్తుంది. దైవత్వంతో మత్తెక్కిస్తుంది. వ్యక్తి అస్తిత్వం పట్ల పూర్తి స్పృహతో నిలుపుతుంది. ఏ క్షణం వ్యక్తి తన వునికిపట్ల పూర్తి స్పృహతో వుంటాడో అప్పుడే దైవత్వమనే ద్రాక్షాసవం వర్షించడం ఆరంభిస్తుంది. అది అద్భుతాల్లోకెల్లా అద్భుత సంఘటన. స్పృహ కూడా మత్తెక్కే మధుర సందర్భం! అయినా స్పృహతో వుంటాం. రహస్యమదే! రెండూ ఒకచోట వుంటాయి. రెండూ ఒక దగ్గరే వుంటాయి. రెండు ఒకటై వుంటాయి.

బ్రహ్మానందమన్నది ప్రతి మనిషి జన్మహక్కు. అది మన అధికారం. అర్హత. ఆ అర్హత ధ్యానం! మన దాన్ని అందుకోవాలి.

★ ★ ★ ★

నీలో అనంతమయిన పరమానందం వుంటే – నువ్వు దాన్ని యితరుల్తో పంచుకోవచ్చు. అక్కడ కవిత్వం ప్రవహిస్తుంది. అంతులేని పూలవాన కురుస్తుంది. పూలు అంతులేని సుఖం నించీ వచ్చాను. వృక్షం ఎంతో ఆనందంగా వుంటే తప్ప పూలు పూయదు. వృక్షంలో ఎంత నిర్భరమయిన జీవితం వుంటుందంటే అది రంగురంగుల పూలు పూయందే విశ్రాంతి పొందదు. పూల సంకేతాల ద్వారా అది తన ఆనంద నృత్యాన్ని మనకు అందిస్తుంది. అనంత విశ్వంతో తన ఆనందాన్ని పంచు కుంటుంది. బ్రహ్మానందం అందుకున్న మనిషిది కూడా అదే స్థితి.

నా బోధనలన్నీ బ్రహ్మానందం కోసమే. యిది ప్రతి ఒక్కరి అవకాశం. వ్యక్తి అంతు లేని ఆనందంగా వుండదలచుకుంటే ఎవ్వరూ అడ్డు చెప్పలేరు కదా! అట్లాగే మనిషి విషాదంలో మునక వెయ్యదలుచుకున్నా అది అతని నిర్ణయం.

★ ★ ★ ★

పరవశానందం అన్నది దేవుడిచ్చిన వరం. మనం దాన్ని తయారుచెయ్యలేం. ఎవడూ తనంత తానుగా బ్రహ్మానందాన్ని పొందలేడు. అది వస్తే మనం దాన్ని అనుమతించ వచ్చు. గానీ మనమే దాన్ని తయారుచెయ్యలేం. అది రాకుండా మనం అడ్డంపడవచ్చు. అది మన సామర్థ్యం! కానీ దాని వునికిని అడ్డుకోలేం. అంటే ఉదయాన్నే సూర్యుడు వస్తాడు. సూర్యుణ్ణి చూడకుండా గదిలోకి వెళ్ళి తలుపులు కిటికీల మూసుకుని నువ్వు చీకట్లో వుండవచ్చు. కానీ ఆ చీకటి అన్నది నీ సృష్టి. కిటికీల తలుపులు తెరిస్తే సూర్యుడు గదిలోకి ప్రవహిస్తాడు. బ్రహ్మానంద స్థితి కూడా అలాంటిదే. మనం బ్రహ్మానంద సముద్రంలో చేపల్లాంటివాళ్ళం. మనం తలుపులు మూసుకున్నాం. బ్రహ్మానందాన్ని మనలోకి అనుమ తించడం లేదు. అందుకే మనకు దుఃఖం.

★ ★ ★ ★

బ్రహ్మానందమన్నది పరిమళంలాంటిది. దాన్ని నువ్వు పట్టుకోలేవు. నువ్వు మల్లె పాదల్ని పెరగనివ్వాలి. మల్లె పూలు పూస్తే యాదృచ్ఛికంగా పరిమళం వ్యాపిస్తుంది. వెంటనే పరిమళం ప్రసరిస్తుంది. బ్రహ్మానందమన్నది ధ్యాన పరిమళం. ధ్యానమంటే మరింత మరింత నిశ్శబ్దంలోకి నిష్క్రమించడం.

ఎప్పుడు హడావిడిపడే మనిషి పరవశంగా వుండలేడు. వ్యక్తికి నిశ్శబ్ద సంగీతం అవసరం. మన మనసు ఎప్పుడూ శబ్దంచేస్తూ వుంటుంది. మన మనసులో మనం పెద్ద సంతను మోసుకునిపోతూ వుంటాం. మనసెప్పుడూ చెత్తా చెదారంతో నిండి వుంటుంది. మనం ఒకరం కాదు. ప్రతిమనిషిలో ఒక్కో గుంపు వుంటుంది. చాలామంది జనముంటారు. వాళ్ళు ఎప్పుడూ పోట్లాడుకుంటూ వుంటారు. అరుచుకుంటూ వుంటారు. ఒకరిపై ఒకరు అధికారం చెలాయించాలని చూస్తారు. మన మనసులోని ప్రతిభాగం అధికారం చెలాయించాలని చూస్తూ వుంటుంది. యిదంతా అనునిత్యం అంతరంగంలో కొనసాగే రాజకీయం, అంతర్యుద్ధంలో శాంతి అనుభవం!

బ్రహ్మానందమన్నది నిరంతర యుద్ధవిరమణతోనే సంభవం. అది వీలవుతుంది. దాన్ని దాటి వెళ్ళడం కష్టమేమీ కాదు. దానికి కావలసిందల్లా చైతన్యం, స్పృహ, అక్కడ జరిగే దానిపై మనం దృష్టిపెట్టం. అది అంతస్స్రోతస్వినిలా సాగుతూ వుంటుంది. దాన్ని పట్టించుకోం. నిర్లక్ష్యం చేస్తాం.

దాన్ని మెలకువలోకి తీసుకురావాలి. అక్కడ శబ్దాల పొరల్ని పరిశీలించాలి. మనసులో జరగుతున్న పిచ్చాసుపత్రి వ్యవహారాన్ని పరిశీలించాలి. మనం యిట్లాంటి పీడకలలో జీవిస్తున్నామా అని గ్రహించాలి.

పరిశీలన ద్వారా అద్భుతాలు ఆవిష్కరించబడతాయి. అప్పుడు నువ్వు దేన్ని చూసినా దేనిపై దృష్టి నిలిపినా అది ఆవిరైపోవడం ఆరంభిస్తుంది. అది ఆవిరి కావడం ఆరంభం కాగానే నువ్వు గాఢమయిన నిశ్శబ్దంలోకి ఉపసంహరిస్తావు. ఆరంభంలో విరామాలు, కొద్ది వ్యవధానాలు మాత్రమే వుంటాయి. ఆలోచనలు ఉపసంహరించినప్పుడు అట్లాంటి సందర్భాలు వస్తాయి. చిన్ని కిటికీల గుండా మాత్రమే నువ్వు వాస్తవాల్ని చూస్తావు. మెల్ల మెల్లగా ఆ చిన్ని వ్యవధానాలు పెద్దవవుతాయి. అవి తరచూ రావడం ఆరంభిస్తాయి. తరువాత చాలాకాలం నిలకడగా వుంటాయి.

ప్రాచీన మార్మికులు వీటిని లెక్కపెట్టారు. నేను వాళ్ళతో పూర్తిగా ఏకీభవిస్తాను. అదేమిటంటే ఒక వ్యక్తి వరుసగా నలభై ఎనిమిది నిముషాలపాటు నిశ్శబ్దంగా వుండగలిగితే అతను జ్ఞానోదయాన్ని అందుకోగలడు. అతను కేవలమయిన పరమానందాన్ని పొంద గలడు. బ్రహ్మానందం కాగలడు. అప్పుడది నిరంతరం వుండగలదు. ఇక వెనుదిరిగే ప్రసక్తి వుండదు. వ్యక్తి ఆ స్థాయిని దాటి వెళ్ళవచ్చు. కాలాతీత స్థితిని అందుకోవచ్చు. శాశ్వతత్వాన్ని చేరవచ్చు. మనిషి శాశ్వతత్వాన్ని అంటే మరణరాహిత్యాన్ని అందుకోవడమంటే అదే.

సన్యాసి అంతిమ లక్ష్యమిదే.

★ ★ ★ ★

పరమానందంతో ఉండాలన్నదొక్కటే నా ఏకైక క్రమశిక్షణ. అంతకుమించిన ఏ క్రమశిక్షణా అక్కర్లేదు. ఎట్టాంటి నైతిక నిబంధనలు అవసరంలేదు. పరమానంద మొకటే సందేశం. ఎట్లాంటి పరిస్థితుల్లోనైనా పరవశంగా వుండడం. అట్లా వుండగలిగితే అప్పుడు ఎన్నో విషయాలు దాన్ని అనుసరిస్తాయి.

★ ★ ★ ★

జీవితమన్నది ఎవరో బుద్ధిహీనుడు చెప్పిన కథకాదు, లేదా బుద్ధుడు చెప్పిన కథా కాదు. అదంతా నీ మీద ఆధారపడి వుంటుంది. నువ్వు నిద్రపోతూ వుంటే, అచేతనంగా వుంటే నీ జీవితం కేవలం యాదృచ్ఛికమే అవుతుంది. ప్రవాహంలోపడి కొట్టుకుపోతున్న వృక్షమవుతుంది. గాలికి, అలలలకు కొట్టుకుపోయే వృక్షం వాటి దయాదాక్షిణ్యాలకు లోబడి అర్థరహితమవుతుంది. మరణతీరం వేపు కొట్టుకుపోతుంది. అనుదినం నీరసంగా, అంధకారంగా సాగుతుంది. వ్యక్తి కొంత స్పృహతో, చురుకుదనంతో వుంటే జీవన నాణ్యత, జీవితపు విలువ వెంటనే మార్పుకు లోనవుతుంది. అప్పుడది యాదృచ్ఛికం కాదు. దానికి సున్నితయిన అర్థమేర్పడుతుంది.

అదే దాని అర్థమే పరమానందం. అప్పుడు జీవితం అద్భుతమయిన కథగా పరివర్తన చెందుతుంది. బహుముఖీనమయిన ఆసక్తికర కథగా మారుతుంది. అప్పుడు ఒక వ్యక్తి జీవితంలో ప్రపంచంలోని పవిత్ర గ్రంథాలన్నీ వుంటాయి. అప్పుడు వ్యక్తి తన హృదయ స్పందనలో సమస్త అస్తిత్వ గాధను అధ్యయనం చెయ్యగలడు. అయితే దాని కోసం ఒక నిబంధన పూరించాలి. అదేమిటంటే వ్యక్తి కొంత మెలకువతో కొంత చైతన్యంతో వుండాలి.

పరమానందమన్నది చైతన్యానికి సమాంతరంగా ఎదుగుతుంది. వ్యక్తి దుఃఖపూరితుడయ్యాడంటే అది అతని అచేతన స్థితిని తెలుపుతుంది. వ్యక్తి పరమానందంగా వున్నాడంటే అది అతని చైతన్య స్థితని తెలుపుతుంది. వ్యక్తి సంపూర్ణ ఆనందంతో వున్నాడంటే అతను గమ్యం చేరాడని అర్థం. పరమానందాన్ని దైవత్వమనవచ్చు. దైవత్వ ఉనికినే పరమానంద మనవచ్చు.

శరీరం

ఇది మీరు పొందిన శరీరం. దేవుడు మీకిచ్చిన శరీరం. దీన్ని ఉపయోగించండి. దీన్ని ఆనందించండి! మీరు దీన్ని ప్రేమించడం మొదలుపెడితే అది మార్పుకు లోను కావడం చూస్తారు. వ్యక్తి తన శరీరంలో నివసించడం ఆరంభిస్తే అతను దానిపట్ల శ్రద్ధ వహిస్తే శ్రద్ధ అన్నది అన్ని భాగాలకూ వర్తిస్తుంది. అప్పుడు వ్యక్తి పనికిమాలిన ఆహారాన్ని దానికి అందివ్వడు. కారణం దానిపట్ల శ్రద్ధతో వున్నాడు. దాన్ని ఆకలితో మాడ్చడు. దాని పట్ల జాగ్రత్త వహిస్తాడు. వ్యక్తి దాని మాటల్ని చెవి ఒగ్గి వింటాడు. దాని సూచనల్ని గ్రహిస్తాడు. దానికి ఏది ఎప్పుడు అవసరమో అప్పుడది చెబుతుంది. శరీరంపట్ల శ్రద్ధ వహిస్తే, దాన్ని ప్రేమిస్తే దానితో స్నేహభావంతో కలిసిపోతాం. అప్పుడు తక్షణ స్పందనతో శరీరం నువ్వు చెప్పినట్లు వింటుంది. నువ్వు శరీరాన్ని యిష్టపడకుంటే అప్పుడు శరీరం నీకు సమస్యలు సృష్టిస్తుంది. ఫలితంగా నువ్వు నువ్వు శరీరాన్ని నిర్లక్ష్యం చేస్తావు. ఎందుకంటే శత్రువు నెవడు లెక్కపెడతాడు? అప్పుడు నువ్వు దాన్ని పట్టించుకోవు. నిర్లక్ష్యం చేస్తావు. దాని సందేశాల్ని వినిపించుకోవు దాన్ని మరింత ద్వేషిస్తావు.

వ్యక్తి సమస్యని సృష్టిస్తాడు. శరీరం ఎప్పుడూ ఎట్లాంటి సమస్యనూ సృష్టించదు. సమస్యని సృష్టించేది మనసే. ఈ మనసులో పుట్టినదే ఆలోచన. ఏ జంతువూ శరీరానికి సంబంధించిన ఏ ఆలోచనతోనూ బాధపడదు. చివరి నీటి గుర్రం కూడా? అవి ఎందుకు సంతోషంగా వుంటాయంటే అక్కడ మనసుండదు. మనసు లేకుండా మనసు సృష్టించే ఐడియా వుండదు. అట్లా వుండే పక్షంలో హిప్పోపోటమస్ 'నేనెందుకు యిట్లా వున్నాను' అని ఆలోచనలో పడుతుంది. కాబట్టి అక్కడ సమస్య లేదు.

ఆదర్శాలను వదిలిపెట్టు. శరీరాన్ని ప్రేమించు. యిది నీ శరీరం. ఇది దేవుని వరం. దాన్ని ఆనందించు. దానిపట్ల జాగ్రత్త వహించు. నీ వ్యాయామం, భోజనం, నిద్ర వీటిపట్ల జాగ్రత్త వహించు. ఇది నీ ఉపకరణం. కారు లాంటిది. అది చెప్పేది విను దాని శుభ్రతపట్ల శ్రద్ధవహించు. దానిపట్ల శ్రద్ధ వహిస్తే ఆ యంత్రం డెబ్బయి సంవత్సరాలు దాటి బాగా పనిచేస్తుంది. నిద్రపోతున్నా, మెలకువతోనూ వున్నా దాని పని అది చేస్తుంది. నిశ్శబ్దంగా పనిచేస్తుంది. వ్యక్తికి సేవచేస్తుంది. వ్యక్తి దానిపట్ల కృతజ్ఞతతో మెలగాలి.

★ ★ ★ ★

శరీరం క్షణికమైంది. ఒకరోజు అది లేదు, అది కేవలం కాల క్షేపం కోసం వున్నది. అది నురగలాంటిది. తీరంనించి అద్భుతంగా కనిపిస్తుంది. తెల్లటి నురగ అలలా

కదుల్తుంది. కానీ అది చేతుల్లోకి తీసుకున్న మరుక్షణం మాయమయి పోతుంది. శరీరానికి సంబంధించిన విషయమూ అలాంటితే. అది అద్భుతమైంది, సౌందర్య వంతమైంది. కానీ మరణం దాంతో ఎదుగుతూ వుంటుంది. మరణం దాంట్లో దాగుంటుంది. వృద్ధాప్యం దానికోసం ఎదురుచూస్తూ వుంటుంది. ఎప్పుడు? ఏ టైంలో అన్నదే ప్రశ్న.

ఫలానా తేదీన చనిపోతాం అని ఎక్కడ రాసిపెట్టి వుండదు. ఇక్కడ వాస్తవమేమిటంటే నువ్వు ఏ రోజు పుట్టావో ఆ రోజే మరణించడం మొదలుపెట్టావన్నమాట! ఒకరోజు వయసున్న పసిబిడ్డ అప్పటికే కొంత చనిపోయింది ఒకనాటికి పూర్తిగా చనిపోతుంది. రోజూ కొంత కొంత చనిపోతుంది.

శరీరానికి సంబంధించినంత మేరకు మనం నిరంతరం చనిపోతూ వుంటాం. అది అదృశ్యమయ్యే నురగ. డెబ్బయ్యేళ్ళని మోసపోకండి. అనంతంగా విస్తరించిన ఈ కాలంలో అది అత్యల్పం. అది క్షణకం!

★ ★ ★ ★

నిజమైన ప్రార్థన శరీరం నించి ప్రారంభమవుతుంది. మన మనసునించీ కాదు. నేను మౌలికంగా నొక్కి చెప్పేది యిదే. వాస్తవమయింది శరీరం నించే ఆరంభమమవుతుంది. నేను శరీరంతో అద్భుతమైన ప్రేమతో వుంటాను. కారణం వ్యక్తి శరీరమే అతని తత్వం. అన్ని రకాల మతాలు నాటే మట్టి అదే. నీకు నీ శరీరానికి మధ్యనున్న వంతెనను కూల్చేవి అవే. అవి నువ్వు నీ శరీరం కాదంటాయి. అంతేకాదు శరీరంనీ శత్రువంటాయి. దాన్ని మతం పేరుతో ఆకలితో మాడ్చేమంటాయి. అప్పుడే దేవుడికి దగ్గరవుతూ వుంటాయి. శరీరాన్ని హింసిస్తే దేవుణ్ణి హింసించినట్లే. శరీరానికి వివేకముంది. ఎట్లా గానం చెయ్యాలో, నాట్యం చెయ్యాలో, ఎట్లా దైవంతో స్పందించాలో దానికి తెలుసు. అజ్ఞాతంతో కలిసి అద్భుత నాట్యం చెయ్యడం దానికి తెలుసు.

సూర్యుడు వుదయించడం మొదలుపెట్టగానే కోట్లాది వృక్షాలు మేలుకోవడం మొదలు పెడతాయి. వాటికి తెలుసు. సూర్యకిరణాలు స్పర్శతో పదార్థం పులకిస్తుంది. పక్షులు పాడతాయి. రాత్రి గడిచిపోయింది. ఉదయం వచ్చింది. మొగ్గలు విచ్చుకుని సూర్యకాంతిని స్వీకరిస్తాయి. గాలో కలిసి నాట్యమాడుతాయి. అజ్ఞాతంలో కలిసి ఎట్లా అడుగులో అడుగు వేయాలో పదార్థానికి తెలుసు. మనసన్నది మనిషి సృష్టించింది. ఆత్మ దైవసృష్టి. శరీరం దైవసృష్టి. మనసొక్కటే దేవునికి వేరయింది. నేను శరీరాన్ని ప్రేమించమని, ప్రార్థించమని చెబుతాను. అట్లా చేస్తే ఆత్మకు సంబంధించిన ప్రార్థన దానంతట అదే ఆరంభమవుతుంది.

పుస్తకాలు

నా రచనలతో అంగీకారం చెందడం ఒక విషయం. అనుభూతితో సాన్నిహిత్యం చెందడం మరో విషయం. నా రచనలతో అంగీకారానికి రావడం మిమ్మల్ని మార్చదు. మీకు అదనంగా జ్ఞానాన్ని అందిస్తుంది అంతే. నాతో సాన్నిహిత్యం, అనుబంధం మిమ్మల్ని నాశనం చేస్తుంది. రూపుమాపుతుంది. మీరు చదువుతున్నప్పుడు మీరు అధికార స్థానంలో వుంటే మీరు పుస్తకాన్ని సొంతం చేసుకుంటారు. మీరు మార్గాల్ని కనిపెడతారు. ఆ మార్గాల గుండా మీరు పుస్తకానికి వ్యతిరేకంగా మిమ్మల్ని మీరు రక్షించుకుంటారు. పుస్తకమేమీ పెద్దగా చెయ్యదు. మీరు మీ మార్గంలో దాన్ని విశ్లేషించగలిగే స్వేచ్ఛను పొందుతారు.

మీరు చెయ్యాల్సిన పని అదే. అందుకనే మీరు 'నేను మీ రచనల్తో ఒక సమాకాలికుడిలా అనుభూతి చెందాను' అంటారు. వాటిగుండా మీ అహం సంతృప్తిపడుతుంది. నా మాటల్తో మీరు ఏ మేరకు అంగీకారానికి వచ్చారన్నది ముఖ్యం కాదు. నేను ఏం చెప్పానన్నది ముఖ్యం కాదు. అంతకుముందే మీలో వున్న ఆలోచనల్తో అంగీకారానికి రావడమన్నది ముఖ్యమైన విషయం.

మీరు సంబంధాన్ని ఏర్పరచుకోవడం 'ఎట్లాంటిదంటే' ఓషో కూడా నా అభిప్రాయంతో అంగీకరించారు' అనుకోవడం లాంటిది. అక్కడ నాతో అంగీకారానికి రావడం కాదు, మీతో మీరు అంగీకారానికి రావడం వుంటుంది. పుస్తకంతో మీరు చాలా సులభంగా దీన్ని నిర్వహించవచ్చు. మీరు అంగీకారానికి రాలేని విషయాల్ని సులభంగా దాటివెయ్యడం, వదిలెయ్యడం లేదా వాటిని మీ అభిప్రాయాలకు అనుకూలంగా విశ్లేషించుకోవడం. మీరు పుస్తకంతో ఏమైనా చెయ్యవచ్చు.

★ ★ ★ ★

మీకు నిశ్శబ్దం పట్ల వ్యామోహం కలగడానికి నేను మాట్లాడుతాను. మీరు మాటల్లేని ఉనికిపట్ల ప్రేమతో దానివేపు కదలడానికి నేను మాటల్ని వుపయోగిస్తాను.

పుస్తకాలు మిమ్మల్ని వాటిని దాటి తీసుకెళ్ళడానికి వున్నాయి. కాబట్టి పుస్తకాలను అంటిపెట్టుకోకు, అతుక్కుపోవు. మరీ అంతగా అయితే అవి వంతెనల లాంటివి. అయితే నువ్వు నీ యింటిని వంతెన మీద కట్టుకుంటానంటే నువ్వు బుద్ధిహీనుడవు. దాని గుండా వెళ్ళు.

ఇప్పటికిప్పుడు నువ్వు నిశ్శబ్దాన్ని అర్థంచేసుకోలేవు. నువ్వు కేవలం మాటల్ని అర్థం చేసుకోగలవు. మాటల్ని మాత్రమే అర్థం చేసుకోగలవు. నేను నిశ్శబ్ద సందేశాన్ని యివ్వడానికే మాటల్ని వుపయోగిస్తాను. పదాల మధ్య, వాక్యాల మధ్య కొన్నిమార్లు నువ్వు నా చుట్టూ వేళ్ళాడ్డం యిక చాలు.

ఒకరోజు నువ్వు నిశ్శబ్దాన్ని వినడం ఆరంభిస్తావు. అప్పుడు పుస్తకాల అవసరం వుండదు. ఇక వేదాలతో, బైబిల్‌తో, పవిత్ర గ్రంథాలతోబాటు నీ పుస్తకాలన్నిట్నీ కాల్చేయవచ్చు.

ప్రతిదీ వెనక్కి కదిలిపోతుంది. కానీ ప్రస్తుతానికి నువ్వు సిద్ధంగా లేవు. నువ్వు సిద్ధపడిన రోజు ఎట్లాంటి పుస్తకాలు అవసరంలేదు.

ఎవరయితే అవగాహన కలిగివుంటారో వాళ్ళకోసం ఆ పుస్తకాలు అచ్చెయ్యలేదు. అవగాహన చేసుకోవాలన్న కోరిక కలిగిన వాళ్ళకోసం ఆ పుస్తకాలు అచ్చేశారు. కానీ మీరు అర్థంచేసుకోరు. వాళ్ళ కోరిక అద్భుతమైంది. వాళ్ళకు సాయంచేయాలి. నేను మీకు సాయం చేదలచుకుంటే నేను మీకు సన్నిహితంగా రావాలి. మీరు నా దగ్గరికి రావడానికి ముందే నేను మీ దగ్గరకు రావాలి. అదొక్కటే మార్గం. మిమ్మల్ని నేనున్న చోటుకి తీసుకొచ్చేముందు నేను మీరున్న చోటుకి రావాలి.

ఈ పుస్తకాలు అవసరం లేదు, మీ కోసమే అవి వున్నాయి. మీరు వాటిని దాటిపోతే, వాటిని వదిలించుకుంటే, పట్టించుకోకుంటే చాలామంచిది. పుస్తకాల ద్వారా ఎవరూ లాభం పొందలేరు. మిమ్మల్ని దాటి మీరు వెళ్ళడానికి మాత్రం పుస్తకాలు పనికొస్తాయి. అన్ని పవిత్ర గ్రంథాలు ఆ విషయమే చెబుతాయి.

అక్షరాలు వెనక్కి తిరిగి ముందుకు వెళ్ళలేనిచోట ఏది వుంటుందో అదే ద్వారం. పవిత్ర గ్రంథాలు మిమ్మల్ని వాటిని దాటి వెళ్ళమంటాయి. కానీ మీ తెలివితక్కువతనంతో వాటిని తలపై మోస్తూ వుంటారు. వాటిల్లోకి చూడరు. ఎందుకంటే అవి 'మాటలకి అతుక్కో కండి, సిద్ధాంతాలకు కట్టుబడకండి: దృక్పథాలకు, వేదాంతాలకి (Philosophics) లొంగకండి. అదంతా చెత్త' అంటాయి.

నా పుస్తకాలు మిమ్మల్ని రూపాంతరం చెందించడానికి వున్నాయి. వాటిని అనువ దించండి. కానీ వాటికి అతుక్కుపోకండి! దాటి వెళ్ళడానికి సిద్ధపడండి!

విసుగు

విసుగు పొందడానికి, చిరాకు పడడానికి తెలివి తేటలు కావాలి. చాలా తక్కువ మంది, ప్రపంచంలో చాలా కొద్దిమంది మేధావులు మాత్రమే విసుగును అనుభూతి చెందుతారు. బుద్ధుడు దాన్ని అనుభూతి చెందాడు, మహావీరుడు పొందాడు. అసాధారణ వ్యక్తులు మాత్రమే విసుగును అనుభూతి చెందుతారు. ఎందుకంటే దానికి అద్భుతమయిన తెలివి తేటలు కావాలి. ఒకరకంగా అది శాపం కాదు, వరం.

విసుగునించీ జీవితానికి అర్థం అన్వేషించడమన్నది ఆరంభమవుతుంది. ఎవరు విసుగుదలను అనుభూతి చెందుతారో వాళ్ళు సాధారణంగా జీవితానికి యిచ్చే నిర్వచనాలతో, జీవితానికి చెప్పే అర్థంతో సంతృప్తి పొందరు.

తెలివయిన వ్యక్తి వెంటనే స్పృహలోకి వస్తాడు. చైతన్యంతో స్పందిస్తాడు. యిదంతా బాహ్యంలో జరిగే పటాటోపం. యిది నన్ను సంతృప్తిపరచలేదు. అది నా ఆంతర్యాన్ని అంటలేదు' అంటాడు. 'మనసుకు తాకే విలువైనదేదీ బయట కనిపించదు' అంటాడు. ఆ చెప్పింది అనుభవానికిరాని పక్షంలో అతని విసుగుదల రోజు రోజుకూ మరింత పెరుగుతూ పోతుంది.

ఇక్కడ రెండు అవకాశాలున్నాయి. ఒకటి పాశ్చాత్య పద్ధతి. వ్యక్తి హేతువు ద్వారా చూస్తే జీవితానికి ఎట్లాంటి అర్థమూ కనిపించదు. విసుగుదల పెరిగిపోతుంది. భరించలేనంత పెరుగుతుంది. అది నీ అస్తిత్వంపై దాడిచేస్తుంది. నీ జీవితంలోని ప్రతి కదలికలోకి దూసుకుపోతుంది. నిన్ను జీవించడానికి అనుమతించదు. అది ఎంత భార మవుతుందంటే ఆత్మహత్య తప్ప మరో మార్గాంతరముండదు.

కానీ ప్రాచ్యానికి దానికి పూర్తిగా వేరయిన ప్రత్యామ్నాయముంది. మనసు వైఫల్యం చెందినంత మాత్రాన, హేతువు నిష్ఫలమయినంత మాత్రాన జీవితం అంతమయినట్లు కాదు. జీవితం విఫలమయినట్లు కాదు. అదేమిటంటే హేతువు ఏ మేరకు చెయ్యగలిగిందో ఆ మేరకు చేసింది. యిప్పుడు వ్యక్తి తన అస్తిత్వపు లోపలి పొరల్లోకి చూడాలి. మనసుకన్నా, హృదయం కన్నా లోతయిన పొరల్లోకి చూడాలి. తర్కానికన్నా లోతుల్లోకి వెళ్ళాలి. అక్కడే ప్రేమ వుంటుంది. సైన్సును దాటిలోతయింది కళ. గణితంకన్నా లోతయింది సంగీతం!

ప్రాచ్యం మనసును వదిలిపెట్టింది. జీవితం కాదు, హృదయంలోకి ప్రయాణించడం ఆరంభించింది. అనుభూతుల ప్రపంచంలోకి అడుగుపెట్టింది. అక్కడ హఠాత్తుగా గొప్ప

అర్థం ఆవిర్భవించింది. విసుగుదల అదృశ్యమైంది. విసుగుదల వరం. దీవెన. అది అన్వేషణకు ప్రేరేపించే ములుగర్ర. అది దేవుడివైపు తోస్తుంది. తావోవేపు సాగేలా చేస్తుంది. పాశ్చాత్య పద్ధతి విఫలమైంది. అది ఎక్కడిదాకా వచ్చిందంటే యిక ముందుకు వెళ్ళలేనంత దాకా వచ్చింది. పాశ్చాత్యం ఎటూ కదలలేని స్థితికి చేరుకుంది. కానీ ప్రాచ్య పద్ధతి వైఫల్యం చెందదు, ఎప్పటికీ వైఫల్యం చెందదు. పాశ్చాత్యం వైఫల్యాల గుండా ప్రాచ్యాన్ని సమీపిస్తుంది. ప్రాచ్యాన్ని పాశ్చాత్యం అర్థంచేసుకుని అడుగు వెయ్యాల్సిన దశ వచ్చింది. అప్పుడు రెండూ కలిసే స్థితి వస్తుంది.

నేను హేతువుకి వ్యతిరేకిని కాను. హేతువిచ్చిన దాన్ని అర్థవంతంగా ఉపయోగించాలి. అయితే ఒక విషయం స్పష్టం. ఏ విషయాన్నీ అది యివ్వలేని సమాధానం కోసం అడగకూడదు. విషయాలు అర్థవంతమైన దాన్ని, అంతిమమైన దాన్ని, విలువైన దాన్ని గంభీరాన్ని యివ్వలేవు. అది ధ్యానం ద్వారా మాత్రమే సాధ్యం. జనన మరణాలు లేని లోలోపలి శాశ్వత అస్తిత్వ దర్శనవల్లనే అది సాధ్యం.

విసుగును ఒక పెద్ద అంగంగా భావించాలి. అంతిమంకేసి వేసే అడుగుగా చూడాలి. అప్పుడు విసుగుపట్ల కూడా కృతజ్ఞత ఏర్పడుతుంది. వివేకవంతుడు బాధని, దుఃఖాన్ని కూడా పరమానందంగా పరివర్తింపజెయ్యగలడు. బుద్ధిహీనుడు పరమానందాన్ని పటాపంచలు చేసి దుఃఖాన్ని సృష్టించుకుంటాడు. వ్యక్తి తనలోని స్వర్గాన్ని సందర్శించాలి.

★ ★ ★ ★

వ్యక్తి తను జీవించే విధానం వేరయినప్పుడు విసుగుపొందుతాడు. వ్యక్తి ఎందుకు విసుగు పొందుతాడు? యితరులు ఇచ్చిన ప్రాణం లేని దారిలో జీవించాల్సి వచ్చినప్పుడు విసుగుపొందుతాడు. ఆ పద్ధతుల్ని వదిలించుకోవాలి. వాటినించీ బయడపడాలి. తను స్వీయంగా ఏర్పరచుకున్న మార్గంలో జీవించాలి.

సమస్త మానవజాతి విసుగులో వుంది. మార్మికుడు కావాల్సిన వాడు గణితశాస్త్రవేత్త అయ్యాడు. గణితశాస్త్రవేత్త రాజకీయవాది అయ్యాడు. కవి కావాల్సిన వాడు వ్యాపారవేత్త అయ్యాడు. ప్రతి ఒక్కడూ యింకొకడిలా తయారయ్యాడు. ఎవరూ తనలా లేరు. ఫలితంగా కష్టపడాలి. వ్యక్తి శ్రమపడడానికి సిద్ధపడితే క్షణంలో విసుగునించీ విముక్తి పొందుతాడు.

వ్యక్తి తనలో తానే విసుగుపొందుతాడు. కారణం తనతో తను నిజాయితీగా వుండడు. తన పట్ల తను నమ్మకంతో వుండడు. తన అస్తిత్వం పట్ల గౌరవంతో వుండడు.

సరిహద్దులు

మానవ శక్తియుక్తులకు సరిహద్దులు లేవు. అన్ని సరిహద్దులూ మన విశ్వాసాలే. అవి తప్ప వేరే సరిహద్దులు లేవు. మనిషి ఈ అనంతంలో భాగం. ఆ భాగమన్నది సమస్తంతో సమానమైదే. అది ఉన్నత గణితరీత్యా భాగమన్నది సమస్తంతో సమానంకాదు. భాగమన్నది సమస్తం కన్నా చిన్నది. ఉన్నతరీత్యా భాగంలో సమస్తముంటుంది. సమస్తంలో భాగముంటుంది. అవి వేరు వేరు కావు. వాటిని ఎట్లాంటి సరిహద్దులూ విడదీయలేవు. ఒకే యధార్థాన్ని రెండు మార్గాలలో చూడడమిదే.

నువ్వు మంచుబిందువును చూస్తే ఒకరకంగా అది సముద్రాన్ని చూడడం. అవును మంచు బిందువులో సమస్త సముద్రం నిక్షిప్తమయి వుంటుంది. ఒక మంచు బిందువును నువ్వు విశ్లేషించగలిగితే సమస్త సముద్రాన్ని విశ్లేషించగలవు. అంతే కాదు అన్ని సముద్రాల్నీ, గ్రహాల్నీ అర్థంచేసుకోగలవు. ఎందుకంటే అన్నిట్లో వున్నదదే. శాస్త్రవేత్తలు కనీస నీటి వనరులున్న యాభయివేల గ్రహాలున్నాయన్నారు. ఆ సముద్రాల రహస్యాలన్నిట్నీ మంచు బిందువు బహిర్గతం చెయ్యగలదు. ఒక మంచు బిందువును విశ్లేషించు H_2O అన్న సత్యాన్ని సమీపిస్తావు. అందులో అన్నీ వున్నాయి.

మనిషి మంచు బిందువు. అతనిలో సమస్తం వుంది. అక్కడ సరిహద్దులు లేవు. వ్యక్తి సరిహద్దులు వున్నాయనుకుంటేనే అవి వుంటాయి. వ్యక్తి విశ్వాసం వాటిని సృష్టిస్తుంది. నీ విశ్వాసాన్ని బట్టి నీస్థాయి పెరుగుతుంది. 'మనిషి ఆలోచిస్తున్నాడు గనక మనిషి వున్నాడు' వ్యక్తి దేన్నీ నమ్మకపోతే వ్యక్తి అనంతమవుతాడు. ఎందుకంటే ఏ నమ్మకమూ అనంతం కాదు. అన్ని విశ్వాసాలూ పరిధులున్నవే. సరిహద్దులకు లోబడినవే. నమ్మకానికి ఒక వివరణ అవసరం. అది ఎంత పెద్దదయినా అది సరిహద్దు కలిగిందే.

అందుకే నేను మాటిమాటికీ విశ్వాసాల్ని వదలిపెట్టండి' అంటూ వుంటాను. విశ్వాసాల్ని వదిలిపెడితే అన్నిరకాల విశ్లేషణల్నీ వదిలిపెడతాం. హద్దులు, పరిధులు అదృశ్యమవుతాయి. వ్యక్తి అన్ని నమ్మకాల్ని, అన్ని రకాల ఆలోచనల్ని అన్ని రకాల కాంక్షల్ని వదిలిపెడితే అక్కడ సరిహద్దులు ఏర్పడడానికి ఏమీ వుండదు. అతను సమస్తమవుతాడు. మన్సూర్ 'అనల్‌హక్' అనడం వెనక అర్థమదే!

★ ★ ★ ★

మనం ఆనందంగా వుండదలచుకుంటే మనం అన్నిరకాల సరిహద్దుల్నీ వదులుకోవాలి. మనం క్రిస్టియన్స్, హిందువులు, మహమ్మదీయులు, కమ్యూనిస్టులు, సోషలిస్టులు, ఫాసిస్టులు అని చెప్పే అన్నిట్నీ వదులుకోవాలి. మనచుట్టూ అల్లుకున్న అన్ని సిద్ధాంతాల్నీ వదిలించుకోవాలి. అన్నీ వదలుకున్నప్పుడు అనంతం వేపు అడుగువేస్తాం.

మెదడు

గతానికి మరణించడమంటే దాన్ని మరచిపోతావని కాదు. అది నీకు గుర్తుండదని లేదా నీ జ్ఞాపకశక్తి పోతుందని, నాశనమవుతుందని కాదు. నువ్వు నీ జ్ఞాపకాలు జీవించడం లేదని అర్థం. వాటి ద్వారా నిన్ను నువ్వు గుర్తించడం లేదు. నువ్వు వాటి నించి స్వేచ్ఛను పొందావు. అవి కేవలం నీ మెదడులో భాగంగా వుంటాయి. అంతే కానీ నీ చైతన్యంలో భాగంగా వుండవు.

మెదడు ఒక యాంత్రిక నిర్మాణం. టేప్ రికారర్డ్ (Tape Recorder) లాంటిది. మెదడు ప్రతిదాన్నీ రికార్డు చేస్తూ పోతుంది. వ్యక్తి జ్ఞాపకాలు నాశనంకావు. మెదడు నాశనమైతే తప్ప నాశనం కావు. సమస్య అది కాదు. సమస్య వ్యక్తి చైతన్యం జ్ఞాపకాలతో నిండివుండడం. వ్యక్తి చైతన్యం తన ఉనికిని మెదడు ద్వారా చూస్తే, మెదడు చైతన్యాన్ని అదుపుచేస్తే వ్యక్తిపై జ్ఞాపకాల ప్రవాహం పొంగిపొర్లుతూ వుంటుంది. వరదలా ముంచెత్తుతుంది.

'గతానికి మరణించండి' అంటే మెదడు ద్వారా నీ వునికిని చూడకు అని. నువ్వు దాన్ని ఉపయోగించు. మెదడు అప్పుడు ఒక ఉపకరణంలా వుంటుంది. నీకు అవసరమొస్తే దాన్ని ఉపయోగించు. కానీ నువ్వు 'యింటికి' తిరిగి వెళ్ళాలి. నువ్వు ఎక్కడ జీవించాలో గుర్తుతెచ్చుకోవాలి. నీ వూరు, పేరు గుర్తుంచుకోవాలి. ఈ జ్ఞాపకాల్ని ఉపయోగించాలి. అంతేకానీ అవి నిన్ను ఉపయోగించకూడదు. సమస్య అదే.

కాబట్టి గతానికి నువ్వు మరణిస్తే నీ మనసుతో నువ్వు శక్తివంతంగా నిర్వహించ లేవనుకోవద్దు. మరింత శక్తివంతంగా నిర్వహిస్తావు. గురువు ఎప్పుడూ శక్తివంతుడే, అధి కారం వహించినవాడు, తన మీద తనకు అధికారమున్నవాడు. అతను అనుకున్నప్పుడు గుర్తుతెచ్చుకుంటాడు. అక్కర్లేదన్నప్పుడు గుర్తుతెచ్చుకోడు. అతను మెదడును 'పనిచేయి' అంటే అది పనిచేస్తుంది. 'ఆగు' అంటే ఆగిపోతుంది. నేను జ్ఞాపకాల్ని ఉపయోగిస్తాను. నేను మాట్లాడటం ఆపితే మనసు పనిచెయ్యడం ఆగుతుంది. అప్పుడక్కడ పూర్తి శూన్యం, ఖాళీ వుంటుంది. అక్కడ ఎట్లాంటి మేఘమూ వుండదు.

★ ★ ★ ★

మెదడులోని రెండు భాగాల్ని అర్థంచేసుకోవాలి. గాఢంగా అర్థంచేసుకోవాలి. ఎందుకంటే దానిపైనే చాలా విషయాలు ఆధారపడి వున్నాయి. ఇప్పుడు సైంటిస్టులు కూడా మార్మికుల భావనతో అంగీకారానికి వచ్చారు. మెదడులోని రెండు భాగాలకు

వంతెన లేకుంటే అది మనోవైకల్యానికి కారణమవుతుంది. వాటి రెండు మధ్య సున్నితమైన వంతెన వుంది. దాన్ని నాశనం చెయ్యకూడదు.

ప్రమాదవశాత్తు కారు ప్రమాదం జరిగిందనుకోండి. అప్పుడు రెండు భాగాల మధ్యనున్న వంతెన ధ్వంసమవుతుంది. అది సున్నితమయింది. దారంలాంటిది. ఒకసారి రెంటిమధ్య సంబంధం తెగిందంటే ఒక వ్యక్తి యిద్దరవుతాడు. యిద్దరిలా ప్రవర్తిస్తాడు. చిత్రమయిన విషయాలు జరుగుతాయి.

ఉదాహరణకి మెదడులో ఎడం భాగం చదవడం, గుర్తుతెచ్చుకోవడడం లాంటివి చేస్తుంది. మెదడులో కుడి భాగం చదవలేదు. అందువల్ల చిత్రమైన సంగతులు జరుగుతాయి. నువ్వా వ్యక్తి ఏమైనా చదవడానికి యిస్తే అతను చదువుతాడు. కానీ మెదడులో ఒక భాగమే దాన్ని గుర్తుపెట్టుకుంటుంది. అతని ఎడమ భాగానికి మత్తు మందిస్తే అతనికి తను ఏమైనా చదివానా? అన్న సంగతి కూడా గుర్తుండదు.

అతని ఒకచేయి ఏదో పనిచేస్తుంది. యింకో చేయి దానికి సహకరించదు. కారణం రెండు చేతులు భిన్నభిన్నమయిన మెదడు భాగాలకు చెందినవి. కుడిచేయి ఎడమభాగం మెదడుకు, ఎడమచేయి కుడిభాగం మెదడుకు సంబంధించింది. అందుకనే కుడిచేయి ముఖ్యమైంది. కుడిచేయి 'సరయిన' చేయి. ఎడమచేయి భిన్నమైంది. అది చాలా సాంకేతికం.

మెదడులో కుడిభాగం సహజాతానికి, మానసిక శక్తికి, ధ్యానానికి, ప్రేమకు, కవిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. కారణం వీటన్నిటినీ కాదన్నారు, ఖండించారు. ఎడమ చేతిని తక్కువ చేశారు. కుడిచేయి తర్కానికి, లెక్కలకు, సైన్సుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. కారణం వాటిని గొప్ప చేశారు.

వీటి రెంటినీ సున్నితమైన వంతెన కలుపుతుంది. వాటితో సన్నిహితమైతే రెంటి మధ్య గొప్ప సంబంధం ఏర్పడుతుంది. రెండు ఒకటవుతాయి.

వ్యాపారవేత్త

వ్యాపారస్తుడు అన్నది ఒక సంగతి. వ్యాపారం చేయడమన్నది యింకో సంగతి. అది పూర్తిగా వేరయిన విషయం. మీరు వ్యాపారంలో, మతంలో వుండవచ్చు. కానీ వ్యాపారవేత్తగా, మతంలో వున్న మనిషిగా వుండడం కుదరదు. అవి భిన్న ధృవాలు. మీ వ్యాపారాన్ని పూర్తిగా వదిలేసి మతంలోకి అడుగుపెట్టమని నేను అనడంలేదు. నేను ప్రపంచంలో దేన్ని వదిలిపెట్టడానికీ వ్యతిరేకిని. నేను వ్యాపారవేత్త మతంలో ఒదగడని అనడం అన్నది పూర్తిగా భిన్నమైన విషయం. నేను సైకాలజీని (Psychology) దృష్టిలో పెట్టుకుని అంటున్నాను. మీరు మార్కెట్‌రంగంలో చేసే పనిని గురించి చెప్పడం లేదు. మనస్తత్వం గురించి మాట్లాడుతున్నాను.

వ్యాపారవేత్త మనసు ఎప్పుడు లావాదేవీల్లో వుంటుంది. ఈర్ష్యతో నిండి వుంటుంది. ఎప్పుడూ లాభం గురించి ఆలోచిస్తూ వుంటుంది. ఎప్పుడూ భవిష్యత్తుపై దృష్టిపెట్టి వుంటుంది. అల్పమయిన భౌతిక విషయాలపై, వస్తువులపై వ్యామోహంతో వుంటుంది. నేను 'వ్యాపార వేత్తగా వుండకు' అన్నానంటే ఆ మనస్తత్వాన్ని వదిలిపెట్టమని అంటున్నాను.

మీరు మార్కెట్ స్థలాన్ని వదిలిపెట్టి హిమాలయాలకు వెళ్ళవచ్చు. దానివల్ల మీకు ఎలాంటి లాభమూ వుండదు. నేను గొప్ప గొప్ప మహాత్ములు వ్యాపారాన్ని వదిలేసి వెళ్ళిన వాళ్ళను చూశాను. వాళ్ళు యిప్పటికీ వ్యాపారవేత్తలే. వాళ్ళ మనస్తత్వం ఎప్పట్లాగే వుంది. వాళ్ళు రూపాయల లెక్కల్లో మాట్లాడకపోవచ్చు. కానీ వాళ్ళ ఆలోచన్లు నాణేల పరి భాషలోనే వుంటాయి. వాళ్ళు హిమాలయాల్లో బంగ్లాలు కావాలని కోరుకోవపోవచ్చు. కానీ స్వర్గంలో మంచి సౌధాల్నే ఆశిస్తారు. వాళ్ళు ప్రాపంచిక వస్తువుల మీద వ్యామోహం ప్రదర్శించ పోవచ్చు. దానివల్ల లాభమేమిటి? తేడా ఏముంది? ఎప్పటికీ వాళ్ళు వస్తువుల పట్లే వ్యామోహం ప్రదర్శిస్తున్నారు. వాళ్ళ లక్ష్యాలకు పునాది ఈర్ష్యే.

ఈర్ష్యగా వుండకండి. దయగా వుండండి! అన్నీ అందుకుని దాచుకోవా లనుకోకండి. పంచుకోడం నేర్చుకోండి! అది నిజమైన పరిత్యాగం! అప్పుడు మీరు ఎక్కడయినా వుండండి. ఏ పనయినా చేయండి. భవిష్యత్తులో మాత్రం జీవించకండి. ఈ క్షణంలో జీవించండి. ఈ క్షణం కోసం జీవించండి. అప్పుడు మీరు వ్యాపారి కారు మీరు వ్యాపారంలో వున్నా...

నేను చెబుతున్నదంతా బాహ్య విషయాల్ని వేటినీ మీరు మార్చాల్సిన పన్లేదు. కానీ లోపల దృష్టిని, దృక్పథాల్ని దర్శనను మార్చండి.

సెలబ్రేషన్ (ఆచరణ, ఉత్సవం)

నా సన్యాసులకు పునాది సెలబ్రేషన్. పరిత్యాగం కాదు పరవశం. అన్ని అందాలని, అన్ని ఆనందాలని, జీవితం వేటిని యిస్తుందో వాటన్నిటినీ అందుకుని పరవశించడం ఎందుకంటే సమస్త జీవితం దేవుని వరం!

నా ఉద్దేశంలో దేవుడు, జీవితం ఒకలాంటివే. వాస్తవానికి 'జీవితం' దేవుడికన్నా మేలైంది. ఎందుకంటే 'దేవుడు' అన్నది ఒక తాత్విక పరిభాష. కానీ జీవితం వాస్తవం, ఉనికి, 'దేవుడు' అన్న పదం కేవలం పవిత్ర గ్రంథాల్లో వుంది. అది కేవలం 'పదం' - జీవితమన్నది మీలోపల వుంది, మీ బయట వుంది. వృక్షాలలో, మేఘాలలో నక్షత్రాలలో వుంది. ఈ సమస్త అస్తిత్వం జీవన నృత్యమే!

నేను జీవితాన్ని ప్రేమించమంటాను. జీవన కళని బోధిస్తాను. జీవితం ద్వారా దైవత్వాన్ని తాగమని చెబుతాను.

నాకు జీవితంపట్ల అపారమైన ప్రేమ వుంది. నేను ఉత్సవం గురించి చెబుతున్నా నంటే ప్రతిదాన్నీ ఉత్సవంగా జరుపుకోవాలని అర్థం. ప్రతిదీ జీవితంతో కళకళలాడాలి. ఏదీ నా దృష్టిలో లౌకికమైందీ కాదు, పవిత్రమైందీ కాదు... నిచ్చెనలో మొదటి మెట్టు నించీ చివరి మెట్టుదాకా అన్నీ సమానవమే. శరీరం మొదలు ఆత్మదాకా భౌతికం మొదలు ఆధ్యాత్మికం దాకా, సెక్స్ నించీ సమాధిదాకా ప్రతిదీ ప్రవిత్రమైందే!

★ ★ ★ ★

తాత్వికులకన్నా కవులు జీవితానికి దగ్గరగా వుంటారు. గణితశాస్త్రవేత్తలకన్నా సంగీత కారులు జీవితానికి సన్నిహితంగా వుంటారు. నాట్యకారులు మరింతగా జీవితానికి సన్నిహితంగా వుంటారు. కారణం నిజమైన నాట్యకారుడు నాట్యంచేస్తే ఆ నాట్యకారుడు అదృశ్యమవుతాడు. నాట్యమే వుంటుంది. అతను అందులో భాగమయిపోతాడు. తన అహాన్ని కోల్పోతాడు. అహంతోబాటు గాంభీర్యం అదృశ్యమవుతుంది.

నేను నాట్యాన్ని నేర్పుతాను, నేను సంగీతాన్ని నేర్పుతాను, నేను కవిత్వాన్ని నేర్పుతాను. ఎందుకంటే యివి వుత్సవానికి స్థంభాలలాంటివని.

★ ★ ★ ★

అట్లా నా బోధనల సారాంశం ఆరాధన కాదు, ఉత్సవం. మీరు ప్రార్థన చేస్తే అధికార క్రమంలో, ఆ మార్గంలో వుంటారు. అక్కడ పైస్థాయి, కిందిస్థాయి వుంటాయి.

మీరు ఆరాధనలో మునిగితే ఒకదాన్ని అధికార స్థానంలో పెట్టి మీరు కింద వుంటారు. మీరు ప్రార్థనలో వుంటే ఒకటి పవిత్రమయింది, యింకొకటి అపవిత్రమయింది వుంటాయి. మీలో ఒక భాగం పాపం, యింకో భాగం పవిత్రమయి వుంటాయి. అందువల్ల మీలో నిరంతర సంఘర్షణ వుంటుంది. అణచివేత వుంటుంది. ఆనందమంతా మట్టి గొట్టుకు పోతుంది. ఆరాధనకు ప్రాథమికంగా బలహీనంగా, అనారోగ్య స్థితిలో పడతారు.

సెలబ్రేషన్ పూర్తిగా భిన్న కోణానికి చెందింది. మీరు ఉత్సవంలో వుంటే పూర్తిగా ఉత్సవమై వుంటారు. అక్కడ విభజన వుండదు. సెలబ్రేట్ చేసుకునే వ్యక్తికి ప్రార్థన అన్నది అద్భుతమయిన 'టీ' లాంటిది. టీ అపవిత్రమైంది కాదు. ప్రార్థన దాన్నించీ వేరయిందీ కాదు. రెండూ ఒకటే. చర్చి, ఆలయం, మసీదు, పబ్ (Pub) అన్నీ ఒకటే! స్త్రీతో, పురుషుడితో శృంగారం జరపడం, దేవుణ్ణి ప్రార్థించడం రెండూ ఒకటే.

సెలబ్రేషన్ విడగొట్టదు. అది కలుపుతుంది. విషయాల్ని సన్నిహితం చేస్తుంది. ప్రపంచంలో కలయికని అది సృష్టిస్తుంది. ద్వైదీభావం అంతరిస్తుంది. అక్కడ ఐక్యత వుంటుంది. కలసి వుండడంలో ఆనందముంది. ఘర్షణలేదు. దేన్నీ ఏదీ అధిగమించడ మంటూ వుండదు. సెలబ్రేషన్‌లో యివన్నీ అదృశ్యమవుతాయి. ప్రార్థన చేసే వ్యక్తికి లక్ష్య ముంటుంది. నువ్వు ఈ క్షణం ఉత్సవం జరుపుకుంటావు. కానీ నీ ప్రార్థన యింకెక్కడో వున్న లక్షణానికి చెందింది.

సన్యాసి లక్షణమిలా వుండాలి. అది దేవునికి సంబంధించిన ఉత్సవ సంరంభం. ప్రార్థన కాదు. నీ మార్గంలో నువ్వు ఉత్సవం జరుపుకో ఎందుకంటే ఉత్సవానికి ఫలానా పద్ధతంటూ లేదు. ప్రార్థనకు పద్ధతులున్నాయి. ఉత్సవం సజీవమైంది. అంతా దైవికమైంది. స్వర్గ సంబంధమైంది. కాబట్టి ఏదీ అడ్డం కాదు.

బ్రహ్మచర్యం

శృంగారమన్నది ఆనందం, విషాదం కూడా. పరవశం, బాధ కూడా. ఈ వైరుధ్యాన్ని అర్థం చేసుకోవాలి. యిది అర్థం చేసుకోని పక్షంలో బ్రహ్మచర్య కాంక్ష అర్థం కాదు. సెక్స్ క్షణికమైన పరవశాన్ని యిస్తుంది. క్షణంపాటు మరో ప్రపంచానికి, కాలరహిత ప్రపంచానికి తీసుకెళుతుంది. ఒక క్షణం నువ్వు యింకొక దానిలోకి కరిగిపోతావు. నీ అహంకారం అదృశ్యమవుతుంది. అప్పుడు గొప్ప సుఖం, ఇంద్రియ సంబంధ సుఖం కలుగుతుంది. కానీ అది క్షణకాలమే వుంటుంది. తరువాత ఆ ఆనంద దృశ్యం అదృశ్యమవుతుంది. దారులన్నీ మూసుకుపోతాయి. తెరుచుకున్న తలుపులు మూసుకుంటాయి. నువ్వు చూసిన ఆకాశం, నక్షత్రాలు మాయమవుతాయి. నువ్వు మళ్ళీ నీ చీకటి గుహలోకి అడుగుపెడతావు. అది వెనకటికన్నా అంధకారంగా వుంటుంది. నువ్వు దాన్ని అధిగమించిన దేన్నో రుచు చూశావు.

సెక్స్ గాఢమయిన పరవశాన్ని యిస్తుంది. కానీ అది క్షణికం. దాని తర్వాత పతనం. పర్వతం మీదినించి లోయలోకి పతనం. నిన్ను చీకటి చుట్టుముడుతుంది. ఆరాటం ఆరంభమవుతుంది. నువ్వు దిగులు లోయల్లోకి జారతావు. 'ఏమిటి యిదంతా? దీనికేమయినా అర్థముందా! అంటూ నెగెటివ్ దృష్టిలోపడతావు. నువ్వు సంభోగానికి వ్యతిరేకంగా తయారవుతావు. 'ఏముందిక్కడ! యిది క్షణికమయిందయితే యిది విలువలేనిదన్నమాట' అనుకుంటావు. పైగా అది నిరంతరం కొనసాగేది కాదు. పైగా ఆ అనుభవమే మిగలదు. కేవలం ఒక జ్ఞాపకంగా, పైగా అందని జ్ఞాపకంగా, జారిపోయే జ్ఞాపకంగా నీ నించీ గతానికి మాయమయ్యే జ్ఞాపకంగా మిగుల్తుంది. నువ్వు చీకటిలో తపిస్తూ బాధపడుతూ వుంటావు. దాన్ని గురించి ఎంత తక్కువ ఆలోచిస్తే అంత మేలనుకుంటావు.

ఈ వ్యతిరేక దృష్టి ఏర్పడిన క్షణాల్లో బ్రహ్మచర్యంపై కాంక్ష మొగ్గ తొడుగుతుంది. కానీ అది ఎంతోకాలం వుండదు. ఇరవై నాలుగు గంటల తర్వాత నీ నెగెటివ్ ఆలోచనల్ని, విషాదాన్ని, బాధను మరచిపోతావు. అది కూడా జ్ఞాపకంలో భాగమవుతుంది. అది కూడా వెనుకబడుతుంది. మళ్ళీ నువ్వొక అందమైన స్త్రీని, ఆమె వంపుల్ని ఆమె అందమైన ముఖాన్ని చూస్తావు. మళ్ళీ కోరిక మొలకెత్తుతుంది. ఈసారి నీ అనుభవం వేరుగా వుండవచ్చు, అద్భుతంగా వుండవచ్చు. ఎవరికి తెలుసు? మళ్ళీ నీలో జలదరింపు

ఆరంభమవుతుంది. ఈ సందర్భంలో నువ్వు జీవితాన్ని గురించి ఎంతో ఆశావహంగా వుంటావు. యిది మళ్ళీ మళ్ళీ జరుగుతుంది. ఇదొక విషవలయం. పాజిటివ్ తరువాత నెగెటివ్, నెగెటివ్ తరువాత పాజిటివ్ రాత్రింబవళ్ళలా వస్తాయి. పగలు రాత్రిని అనుసరిస్తే రాత్రి పగటిని అనుసరిస్తుంది. నువ్వీ చక్రంమీద తిరుగుతావు. ప్రాచ్యం జీవన చక్రం' అంది. జీవన్మరణాలు చక్రంలో భిన్న ధృవాలు. ముందూ వెనకా వస్తాయి. జీవితం సాగుతుంది. నువ్వు మెల్లగా ఆలోచనలో పడతావు. అసలు ఆశావహ దృష్టి అన్నది ఒక భ్రమ ఏమో అని భావిస్తావు. జీవితమంతా యిట్లా వెనకా ముందూ ఆలోచిస్తూ జీవన చక్రాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తావు.

అంటే మీరు నెగెటివ్ దృష్టితో వున్నప్పుడు నిర్ణయాలు తీసుకొమ్మని నేననడం లేదు. నువ్వు నెగెటివ్ దృష్టితో నిర్ణయాలు తీసుకుంటే జీవితం నెగెటివ్‌గా మారుతుంది. గతంలో మతాలు అట్లా మారాయి. అవి జీవితాన్ని వ్యతిరేకించాయి. అవి నెగెటివ్ దృష్టితో నిర్ణయాలు చేశాయి. అవి సమాజాన్ని వదలి 'ఆశ్రమాల'కేసి సాగాయి. వాళ్ళు హిమాల యాలకేసి, గుహలకేసి సాగారు. అక్కడికి వెళ్ళినా సెక్స్ నిన్ను వదిలిపెట్టదు. అంత సులభంగా వదిలిపెట్టదు. ఎందుకంటే సెక్స్ అన్నది ఎక్కడో బాహ్యంలో వున్నది కాదు. అది నీ లోపల ఉన్నది. అది నీ శరీరతత్వం, అది నీ మనస్తత్వం. అది భౌతిక శరీరం. ఆ హార్మోన్లు నీలో వున్నాయి. అది నీ ఎముకల్లో, రక్తంలో వుంది. అది నీ సారం. అది కేవలం నీ లైంగిక కేంద్ర అవయవంలో మాత్రమే వుండదు. తెలివితక్కువ జనం వాళ్ళ లైంగిక అవయవచ్ఛేదనతో సమగ్ర బ్రహ్మచర్య సాధన పొందవచ్చను కుంటారు.

సెక్స్‌కు లైంగిక అవయవానికి ఏమీ సంబంధం లేదు. నువ్వు లైంగిక అవయవాన్ని కట్ చేయవచ్చు. కానీ సెక్స్ నీలో మిగిలే వుంటుంది. కారణం సెక్స్ కేంద్రం నీ మెదడులో వుంది. లైంగిక అవయవమన్నది మెదడులో వున్నదానికి కొనసాగింపు. యిప్పుడు శాస్త్రవేత్తలు మెదడులో ఆ కేంద్రాన్ని కనిపెట్టారు. ప్రేరణ పద్ధతుల్ని కనుగొన్నారు.

స్త్రీతో శృంగారంలో వీర్యం ప్రవహించినప్పుడు కేంద్రంలో గిలిగింతలు కలుగుతాయి. సన్యాసాశ్రమాలకు గుహలకు పర్వతాలకు పారిపోయినా సెక్స్ నీతో వుంటుంది. అది నీ మెదడులో వుంది. బ్రహ్మచర్యం రాదు, విపరీతతత్వం, వక్రబుద్ధి రంగంలోకి వస్తాయి.

బ్రహ్మచర్యమన్నది దానంతట అదే రావాలి. అది అభ్యాసం వల్లా, తయారు చెయ్యడం వల్లా రాదు. దానంతట అదే వస్తుంది. అప్పుడు అది నెగెటివ్ సందర్భంలో తీసుకునే నిర్ణయం కిందకు రాదు, జీవితాన్ని అది వ్యతిరేకించదు. అదొక రూపాంతర

ప్రక్రియ కిందకు వస్తుంది. పాజిటివ్, నెగెటివ్ దృష్టుల్ని పరిశీలించి మనమీద ప్రకృతి ఆడే ఆటల్ని అప్పుడు గమనిస్తాం. అప్పుడు నువ్వు ప్రకృతి బలిపశువయ్యానని గుర్తిస్తావు. ప్రకృతి తన ప్రాణుల్ని పునరుత్పత్తి చెయ్యాలనుకుంటుంది. కాబట్టి నీలో 'సెక్స్' అన్న వ్యూహాన్ని ప్రవేశ పెట్టింది. నీ స్వీయ అనుభవం ద్వారా ఒకసారి దీన్ని గ్రహిస్తే క్రమక్రమంగా సెక్స్ అన్నది అదృశ్యమవుతుంది. బ్రహ్మచర్యం ఆరంభమవుతుంది. కానీ దాన్ని బలవంతంగా రుద్దలేం, అభ్యసించలేం.

ఛాలెంజ్ (సవాల్)

ప్రతి క్షణం కొత్త కొత్త సవాళ్ళు ఎదురవుతాయి. మనం పరిశీలిస్తే, వెతికితే చూస్తే అవి కనిపిస్తాయి. మనం నిరంతరం ఒక సవాలును దాటి యింకో సవాలును ఎదుర్కొంటూ సాగితే అందులో ఎంతో మజావుంది, వుత్సాహం వుంది. ఒక శిఖరాన్ని దాటి యింకో శిఖరాన్ని అందుకోవడంలో వుంది. నువ్వు ఎంత ఎత్తుకు ఎగిరితే అంత పెద్ద శిఖరాలు సిద్ధంగా వుంటాయి. అక్కడ ఎట్లాంటి అహాన్నీ మోయడం అంటూ వుండదు. అప్పుడు నువ్వు శిఖరాన్ని అందుకోలేకపోయినా బాధపడవు. వైఫల్యాన్ని దాన్ని ఆమోదించడం వల్ల అప్పుడు కూడా సంతోషంగా వుంటావు. అక్కడ యింకా అవకాశం వున్నందుకు సంతోషిస్తావు. దానిగుండా సాగుతున్నందుకు ఆనందిస్తావు. నువ్వు విజయాన్ని అందుకున్నా అక్కడ అహం వుండదు. కేవలం ఉత్సాహంగా వుంటావు, ఉల్లాసంగా వుంటావు. ముందుకు సాగడానికి సిద్ధంగా వుంటావు.

నిజమైన ప్రేమకుడికి, సవాళ్ళను ప్రేమించే వ్యక్తికి విజయం, వైఫల్యం అనే పట్టింపు వుండదు. నిజమైన విలువ సవాలులో వుంది, దానికి ప్రతిస్పందించడంలో వుంది. నిజమైన ఉల్లాసం సంక్లిష్ట సందర్భాల్లో ఒకవేపు జీవితం, యింకోవేపు మరణం వున్నప్పుడు వస్తుంది. వంతెన సన్నగా వుంటుంది. కేవలం పల్చటిరేకులా వుంటుంది. ఒక్క పొరపాటు అడుగువేస్తే నవ్వు అనంత అగాధంలోకి జారిపోతావు. అందుకే వ్యక్తి చైతన్య శిఖరం మీద నిలబడాలి.

పర్వతారోహణలో సౌందర్యమదే. గొప్ప ఉద్వేగ ఉల్లాసాన్ని అందుకోవడం తప్ప అక్కడ ఏమీ సాధించడం వుండదు. కొండ లెక్కడంలో ఆనందమదే. కారును అంతులేని వేగంలో నడపడంలో కూడా అదే వుంది. అక్కడ ప్రతి క్షణమూ కష్టంతో కూడుకున్నదే. అక్కడ అనుక్షణం అప్రమత్తంగా మెలగాలి. అహంకాదు, ఆనందమే అక్కడుంది.

సమస్త జీవితమూ ఒక సాహసమే! అది సాహసంగానే వుండాలి. కానీ అక్కడ అహానికి అవకాశమివ్వకూడదు. యిస్తే అది భారమవుతుంది. అడ్డంకి అవుతుంది.

అహంకారి విజయం సాధించినా దాన్ని ఆనందించలేడు. అతను వైఫల్యం చెందితే మాత్రం నరకయాతన పడతాడు. కారణం అహం ములుగర్రలాంటిది. అది "ఏంటిది? నువ్వు చాలా సాధించాలి. నువ్వు ప్రపంచానికి చాలా ప్రదర్శించాలి. యిప్పుడు నువ్వు సాధించింది అత్యల్ప అంటుంది. అహం నీకు విశ్రాంతినివ్వదు. అది సరే! యింకా

ముందుకు వెళ్ళు. దీనికన్నా గొప్ప విజయాన్ని సాధించు" అంటుంది. అప్పుడు నువ్వు అది సాధించినా దానికి సంతోషం కలగదు, సంతృప్తి కలగదు. నువ్వు వైఫల్యం చెందితే అది అంతులేని వేదనలో కదిలిపోతుంది. అదే అహంలేని వక్తి అతను విజయం సాధిస్తే సంతోషిస్తాడు. నాట్యం చేస్తాడు. ఎందుకంటే అక్కడ విజయం, అపజయం అన్నది కాదు సమస్య. అక్కడ ప్రయత్నించామా లేదా అన్నదే ప్రథమ స్థానంలో వుంటుంది. సంక్లిష్ట సందర్భంలో సజీవంగా వున్నామా లేదా అన్నదే సమస్య! ప్రమాదకర పరిస్థితుల్లో ప్రతిస్పందించామా? లేదా? అన్నదే విషయం. అక్కడ ఉత్సాహమొక్కటే విలువైంది!

కాబట్టి అక్కడ ఆందోళనపడవల్సిందేమీ లేదు. సమస్యలకు, సవాళ్ళకు ఎదురుగా వెళ్ళి వాటిని ఆమోదించడమే! నేను మీకొక సవాలును తప్ప మరేమీకాను. మీలో నేనొకటి సృజిస్తాను. మీరు జీవితానికి సవాలుగా మారుతారు. మీ జీవితానికి సవాలుగా నిలబడతారు. ఆ పర్వతం మీద మీరు నిలబడినప్పుడు మీరు అలసిపోరు. శిఖరాన్ని చేరినప్పుడు మీరు వుండరు. శిఖరాన్ని చేరేమార్గం అదే. మీరు అదృశ్యం కావడమే! అందుకే నేను మతాన్ని అసాధ్యం పట్ల వ్యామోహమంటాను. అసాధ్యం జరుగుతుంది, కానీ మీరు అదృశ్యమయినప్పుడే అది ఆవిష్కారమవుతుంది.

మార్పు

మార్పును మనం అనుమతించం. అందుకని రహస్యం రంగంలోకి వస్తుంది. విషయాలకు మనం అతుక్కుపోతాం. అవి మారకూడదనుకుంటాం. నువ్వు ఒక స్త్రీని ప్రేమిస్తే ఈ రోజు సన్నిహితంగా వుంటే రేపు కూడా అలాగే ఆమె వుండాలని కోరుకుంటావు. అప్పుడు కష్టాలు మొదలవుతాయి. ఎవరి గురించీ యింకో క్షణానికి హామీ యివ్వలేం. రేపటి గురించి మనమేం చెప్పగలం?

చైతన్యంతో, స్పృహతో వున్న మనిషి జీవితం నిరంతరం మారుతూ వుంటుందని గ్రహిస్తాడు. ప్రపంచంలో శాశ్వతమయింది ఒకటే. అది మార్పు. ఈ జీవనతత్వాన్ని అంగీకరిస్తే, మారుతున్న ఈ అస్తిత్వాన్ని ఆమోదిస్తే, దాని రుతువుల చలనాన్ని అంగీకరిస్తే, ఒక్క క్షణం కూడా ఆగని దాని నిరంతర ప్రవాహాన్ని గమనిస్తే అది ఆనందహేతువవుతుంది. అప్పుడు ఎవరూ నీ సంతోషాన్ని ఆటంకపరచ లేరు. శాశ్వతత్వంకోసం నువ్వు పడే తాపత్రయమే నీ విషాదానికి కారణం. మార్పులేని జీవితంలో నువ్వు వుండదలచుకుంటే అది అసాధ్యం.

వ్యక్తి చైతన్యం కలిగించే సాహసమొక్కటి చాలు మార్పును ఆమోదించడానికి, ఆ ఆమోదమే ఆనందం. అప్పుడూ అంతా మంచే జరుగుతుంది. అప్పుడు నువ్వు వూపిరాడని స్థితిలో ఉక్కిరి బిక్కిరి కావు. అక్కడ మొదట నువ్వు దేనినీ ఆశించవు. జీసెస్ 'అడుగు అది నీకు అందుతుంది' అన్నాడు. అక్కడ ఆయన పరిణతి చెందని వ్యక్తుల గురించి చెబుతున్నాడు. ఆ కాలంలో మనుషుల్లో అంత విశాలతత్వం లేదు. నేను 'అడగండి. అది మీ చేతికందదు, (అడిగావంటే నువ్వు కష్టాల్ని అహ్వానిస్తున్నావని అర్థం.) అడగకు అది తప్పకుండా నీకు అందుతుంది' అంటాను.

సంక్షోభం

సంక్షోభం బయటలేదు, బయట అనంత విశ్వముంది. లోపల సంక్షోభముంది, అస్తవ్యస్తముంది. లోపల అంతా సంక్షోభముంది గనక జనంలోపలికి చూడరు. చూడ్డానికి భయపడతారు. వాళ్ళు తమని తాము ఎంత బిజీగా వుంచుకుంటారంటే, ఎప్పుడూ ఏదో పనిలో ఎంతగా మునిగిపోతారంటే వాళ్ళకు కాలం వుండదు, లోపలికి చూసుకునే సమయ ముండదు. వాళ్ళ బుద్ధుల మాటలు వింటారు. బుద్ధులు మీ గురించి మీరు తెలుసుకోండి' అంటారు. 'మీ గురించి మీరు తెలుసుకోండి' అన్నమాటల్ని వాళ్ళు అర్థంచేసుకుంటారు. కానీ తమని తాము అర్థంచేసుకోవడానికి ప్రయత్నించరు. ఎందుకంటే లోపలి సంక్షోభాన్ని దర్శించడానికి వాళ్ళు భయపడతారు.

లోపల అస్తవ్యస్త స్థితి వుంది. బయటలేదు. నక్షత్రాలు లయబద్ధంగా సాగుతున్నాయి. సమస్త అస్తిత్వం లయబద్ధంగా వుంది. అక్కడ అంతా క్రమబద్ధంగా వుంది. కేవలం మనిషి మనసులోనే గందరగోళం వుంది. బయట ఎప్పుడయినా ఎలాంటి సంక్షోభం వున్నా అదంతా మనిషి సృష్టించిందే. మనిషి కల్పించిందే!

మనిషి ఎప్పటిదాకా మనసులేని స్థితిని అందుకోడో అంతవరకూ సంక్షోభంలోనే వుంటాడు. మనసు సంక్షోభం. దాని ద్వారా వ్యక్తి తనని తాను చూసుకుంటున్నాడు. అదే అతను అనుకుంటున్నాడు. మనసంటే ఏమిటి? గతం యింకా భవిష్యత్తు. ఈ రెండూ కలిస్తే మనసు. వర్తమానం మనసులో భాగం కాదు. వర్తమానం అస్తిత్వానికి సంబంధించింది. వర్తమానం ఎప్పుడూ కేవల సామరస్యం. సమశృతిలో వుంటుంది. గతం జరిగిపోయింది. భవిష్యత్ యింకా రాలేదు. వ్యక్తి మనసు ఉనికిలో లేని ఈ రెంటికీ అతుక్కుని వుంటుంది. జ్ఞాపకాలు వూహలు, ఆశలు. కారణంగా వ్యక్తి పిచ్చెక్కిన స్థితిలో వుంటాడు.

కేవలం గురువు సాన్నిధ్యంలో, బుద్ధుని ఆవరణలో జనంచేరి తమని తాము ఎదుర్కోడానికి సిద్ధపడతారు. మొదట అక్కడ ఆటంకాలేర్పడతాయి. కానీ వ్యక్తి చైతన్యంతో ముందుకు సాగితే ఆటంకాలే అవకాశాలవుతాయి.

ఆటంకాల్ని అవకాశాలుగా పరివర్తింపజేసే కళ గురువు చేసేపని. (Psychotherapist) సైకోథెరపిస్టు కేవలం అతుకులు వేస్తాడు. మలాము పూసి కట్టు కడతాడు. వ్యక్తి నిలబడేలా చేసి మళ్ళీ వెనక్కి, పాతమార్గానికే తీసుకెళతాడు. అంతే కానీ వ్యక్తిని రూపాంతరం చెందించ లేదు.

వ్యక్తికి 'మెటా సైకాలజీ' (Meta psychology) అవసరం. బుద్ధుల సైకాలజీ కావాలి.

నిజమైన ఆధ్యాత్మిక కేంద్రాల నిర్వహణ యిలాగే వుంటుంది. ఎందుకంటే ఒంటరిగా నువ్వు ఈ పనిచేయలేవు. అదే ఆధ్యాత్మిక కేంద్రంలో కొంతమంది నీకు ముందుగా సాగి వుంటారు. మరికొంతమంది నీకు వెనబడి వుంటారు. ఉదయాన్నే రంగంలోకి వచ్చిన గురువు 'భయపడకు. లక్ష్యంలో ఎంతో దూరంలో లేదు' అంటాడు. నీకన్నా ముందున్న వాళ్ళు' బాధపడకు. నువ్వు ఏ మార్గంగుండా వచ్చావో మేమూ అదే మార్గంగుండా వచ్చాం. కొంత పట్టుదల, మరికొంత నిరీక్షణ, యింకొంత సహనం కావాలి' అంటారు.

అక్కడ నక్షత్రంలా గురువు వుంటాడు. అది ఒక అద్భుతం! నువ్వు సమగ్ర స్పృహతో వుంటే నీ అస్తవ్యవస్తస్థితి అనంత విశ్వంగా మారుతుంది. కారణం అక్కడ ఆనంద సంగీత సమ్మేళనం ఆరంభమవుతుంది. అప్పటిదాకా ఉన్న ఉన్మత్తదశ జ్ఞానదశగా మారుతుంది. జ్ఞానోదయమవుతుంది.

ఒకే శక్తి! సంక్షోభమంటే శక్తి! అచేతనస్థితికి సంబంధించిన శక్తి! నువ్వు పరివర్తన చెందితే ఆ శక్తి చైతన్యశక్తిగా మారుతుంది. అంతకుమించి నువ్వు చెయ్యాల్సిందేమీ లేదు. స్పృహతో వుండు చాలు.

వసంతం వచ్చింది. మొగ్గలు విచ్చుకోడం మొదలుపెట్టాయి. పూలు వికసించాయి. వేలవేల పూలు. ఆంతరింగిక ప్రపంచం పరిమళంతో నిండుతుంది.

వ్యక్తిత్వం

నీ చైతన్యం మారితే దాన్ని అనుసరించి వెంటవెంటనే నీ వ్యక్తిత్వం మారుతుంది. కానీ అదే సమయంలో నీ వ్యక్తిత్వం మారితే నీ చైతన్యం మారదు. వాస్తవానికి నీ వ్యక్తిత్వం మారడంవల్ల నీ చైతన్యం అణచివేతకు గురవుతుంది. అక్కడ ద్వైదీభావం ఏర్పడుతుంది. సంఘర్షణ మొదలవుతుంది. చైతన్యం ఒకరకంగా, వ్యక్తిత్వం మరోరకంగా వుంటుంది. వాటి మధ్య వంతెన వుండదు. నువ్వు ఇద్దరుగా, అనేకమందిగా వుంటావు. గుంపు నీలో వుంటుంది. నువ్వు నిశ్శబ్దపు అంచుల్ని అందుకునే బదులు, శాంతి అనుభవాన్ని పొంద డానికి మారుగా, నరాల జబ్బుకు లోనవుతావు, నీలో అంతులేని ఆందోళన మొదలవుతుంది. లోపలి సమతౌల్యాన్ని, సమశృతిని కోల్పోతావు.

నీతివాదులందరికీ జరిగేది అదే. వాళ్ళు బయటనించి గాయాలకు కట్టుకట్టే పనిలో వుంటారు. జనాలకు సున్నం వేసే పనిలో వుంటారు. జీసెస్ ఆ పనిని గోడకు సున్నం వెయ్యడం' అన్నాడు. సమాధులకు వెల్లవేయడం' అన్నాడు. లోపలి శవం ముడుచుకుపోతూ వుంటుంది. బయట సమాధికి వెల్లవేస్తావు. చూడటానికి స్మశానం అద్భుతంగా వుంటుంది. స్మశానంలో పూలచెట్లు నాటవచ్చు, పచ్చిక పెంచవచ్చు. కళకళలాడుతుంది. స్మశానాన్ని అందచందాలతో నింపవచ్చు. కానీ స్మశానం కేవలం స్మశానమే.

మనిషి పరిస్థితీ అలాంటిదే. మనం వ్యక్తిత్వాన్ని మరీ బలంగా నమ్మడంవల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. నీకా సంగతి తెలియవచ్చు, మాకు తెలియకపోవచ్చు. కానీ నూటికి తొంభయి తొమ్మిదిమంది జనం ప్రవర్తనా వాదులు. వాళ్ళు మాటలు ఏమైనా చెప్పవచ్చు. వాళ్ళ లోలోతుల్లోకి చూస్తే వాళ్ళందరూ 'పావ్‌లోవ్, స్కిన్నర్ స్కూళ్ళకు చెందినవాళ్ళే. వాళ్ళందరూ ప్రవర్తనావాదులే! వాళ్ళు నీ ప్రవర్తన మారితే నువ్వు మారుతావని నమ్ముతారు. కారణం నీ ప్రవర్తనే నువ్వని నమ్ముతున్నారు. వాళ్ళు వాళ్ళ ప్రాథమిక మొండివాదాన్ని, విశ్వాసాన్ని అసలు చూడరు. ఆ స్పృహే వాళ్ళకు వుండదు. సమాజం యిప్పటిదాకా సాగుతున్న పద్ధతి యిదే. సమాజం అధ్యాత్మికం కాదు.

ఆధ్యాత్మిక మానవుడు యింకా అడుగుపెట్టాల్సి వుంది. అధ్యాత్మిక సమాజం యింకా ఆవిష్కరింపబడాల్సి వుంది. అధ్యాత్మిక నాగరికత భవిష్యత్తుది. అది దిగంతంలో వుంది.

దాన్ని మనం తీసుకురావాలి. అది యింకా జరగలేదు. అది అక్కడక్కడా కొందరు వ్యక్తుల్తో కనిపిస్తుంది. కానీ వాళ్ళని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు.

★ ★ ★ ★

నేను మాస్టర్ డిగ్రీ పూర్తిచేసి వుద్యోగ ప్రయత్నాల్లో వున్నాను. నేను విద్యాశాఖ మంత్రిని కలిశాను. నా ఉద్యోగ విషయం చెప్పాను. అతను ఖాళీ వుంది. కానీ నువ్వు రెండు సద్గుణవర్తన (Charactor) సర్టిఫికెట్లు తీసుకురావాలి అన్నాడు. నేను 'ఎవర్నించీ' అన్నాను. అతను మీ ఉపకులపతి (Vice Chanceller) అడిగి తీసుకురా లేదా మీ ప్రొఫెసర్లు వున్నారు కదా! వాళ్ళని అడిగి తీసుకురా!' అన్నాడు.

నేను 'ఆ పని చెయ్యలేను. ఎందుకంటే ఒకవేళ వైస్‌ఛాన్సలర్ నన్ను క్యారెక్టర్ సర్టిఫికెట్ యివ్వమంటే నేను అతనికి యివ్వను. అతను తన సామర్థ్యంవల్ల వైస్‌ఛాన్సలర్ కాలేదు. తన 'రాజకీయాల' వల్ల అయ్యాడు. నేను అతన్ని అడగను. నాకు సన్నిహితుడయినా మా ప్రొఫెసర్‌ని కూడా అడగను. ఎందుకంటే అతనికి నేనంటే భయం. అతని జీవితం గురించి నాకు తెలుసు, అతను పిరికివాడు. ఎట్లాంటి అధికారికయినా తలవంచేరకం. కాబట్టి వీళ్ళ దగ్గరకి వెళ్ళను. నేను చేయవలసిందల్లా ఒకటే. నేను యిక్కడున్నాను. మీరు నా కళ్ళలోకి చూడండి. నా చేయి పట్టుకోండి. నేను మీ కళ్ళలో కళ్ళుపెట్టి చూస్తాను. నా గుణం మీకు తెలుస్తుంది. మీ గుణం నాకు అవగతమవుతుంది. దాంతో పని పూర్తవుతుంది' అన్నాను. అతను కొంత ఆందోళనకు లోనయ్యాడు. 'ఇంతకూ ఏమంటున్నావు?' అన్నాడు. నేను 'ఇదిగో నా చేయి, పట్టుకుని నా కళ్ళలోకి చూడండి' అన్నాను. అతను యిటూ అటూ చూడడం మొదలుపెట్టాడు. మోసకారి మనుషులు సూటిగా కళ్ళలో కళ్ళుపెట్టి చూడలేరు. వాళ్ళు ఆత్మన్యూనతా భావంతో వుంటారు. అతని నుదురు మీద చెమట పట్టడం చూశాను. నేను మీరెందుకు అంత ఆందోళనకు గురవు తున్నారు? కేవలం నా కళ్ళలోకి చూడమంటున్నాను. నేనిక్కడున్నాను. మీరు ఎన్నాళ్ళు వుండమన్నా యిక్కడుంటాను. నేను మీ గుణాన్ని చూస్తాను, మీరు నా గుణాన్ని చూడండి' అన్నాను.

ఆయన కాగితంపై సంతకం చేశాడు. నువ్వు వెళ్ళు నిన్ను ఉద్యోగంలో నియమించాను. మళ్ళీ రాకు. నువ్వొకడివే నన్ను భయపెట్టినవాడిని' అన్నాడు.

ఇతరుల అభిప్రాయం మీద ఆధారపడకండి. వాళ్ళెవరు? నీ క్యారెక్టర్ సర్టిపికెట్ యివ్వడానికి వాళ్ళెవరు?

★ ★ ★ ★

వ్యక్తిత్వానికి సంబంధించిన గాంభీర్యం ధ్యానంగుండా వస్తుంది. నీ వ్యక్తిత్వానికి సంబంధించి దేన్నీ నువ్వు ప్రాక్టీసు చేయయనప్పుడు నీ అంతర్దృష్టి పెరుగుతుంది. నువ్వు విషయాల్ని యధాతథంగా చూస్తావు. అట్లా చూడడం ఆరంభిస్తే నీ పూర్తి జీవితం రూపాంతరం చెందుతుంది. కొత్త కాంతి వస్తుంది. కొత్త దృష్టి కలుగుతుంది. పాత మార్గంలో ఏమాత్రం వుండవు. ఎవర్నీ మోసగించవు. ఎందుకంటే ధ్యానంవల్ల మనం ఎవరమూ వేరు వేరుకామని తెలిసివస్తుంది. మోసం చెయ్యడానికి నువ్వెవరు? నిన్ను నువ్వే మోసం చేసుకోవాలి. నువ్వు దౌర్జన్యపూరితంగా వుండవు ఎవర్నీ గాయపరచవు. యితరుల్ని గాయ పరచి ఆనందించవు. ఎందుకంటే యితరులు నీలో భాగం, యితరుల్లో నువ్వు భాగమై వుంటావు. మనందరం అనంత విశ్వ శరీర భాగాలం. వేరుకాము.

వ్యక్తిత్వ గాంభీర్యం సమాన దృష్టివల్ల, చిత్తశుద్ధి వల్ల వస్తుంది. మనం వేరుకాము మనం ఒకటే. నీ జీవన విధానాన్ని ఎవరో నీపై నిర్భయంగా విధించరు. అది సహజంగా సమకూరేది. అది యితరులకు వ్యతిరేకమైంది కాదు. అది ఆరోగ్యకరమైన పెదావుల్లాంటిది. లోపలి రక్తప్రసరణ ద్వారా పెదవులకు ఎరుపుదనం సంక్రమిస్తుంది. అది పూర్తిగా భిన్న ప్రక్రియ.

కాబట్టి ధ్యానమన్నది వ్యక్తిత్వానికి ఆధారమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. వ్యక్తి వ్యక్తిత్వం గురించి పూర్తిగా మరిచిపోవాలి. తన సమస్త శక్తిని ధ్యానం మీద కేంద్రీకరిస్తే అక్కడ వ్యక్తిత్వం ఆవిష్కరించబడుతుంది. అక్కడ రెండు విషయాల్ని తీసుకొచ్చి కలపడ మంటూ వుండదు. అది సహజ సిద్ధంగా సంభవిస్తుంది. హఠాత్తుగా జరుగుంది. వ్యక్తిత్వ మన్నది తక్షణ స్పందనతో వస్తే దాని సౌందర్యం ఎంతో ప్రత్యేకత సంతరించుకుంటుంది. అదే ఆనందం.

జనాకర్షక శక్తి

ప్రపంచంలో మూడు రకాల గురువులున్నారు. మొదటి రకాన్ని జనాకర్షణగల వాళ్ళుంటాను, రెండో రకం వాళ్ళు పద్ధతి ప్రకారం చేసేవాళ్ళు. మూడోరకం వాళ్ళు సహజమైన వాళ్ళు. ఈ మూడు రకాల విభాగం థెరపిస్టు(Therapist)లకు అంటే చికిత్స చేసేవాళ్ళకూ వర్తిస్తుంది. చికిత్సకారులు మూడు రకాలు. వాళ్ళూ పైవిభాగాలకు చెందినవాళ్ళే. 'కరిష్మా' అన్న పదం గ్రీకునించి వచ్చింది. దాని అర్థం సంపూర్ణశక్తి. నువ్వు అంతశక్తివున్న వ్యక్తిని సమీపిస్తే అతని బానిస అవుతావు. అతని శక్తి నీ మీద పొంగి ప్రవహిస్తుంది. అతను నీ గురించి ఆలోచించడు. తన శక్తి ద్వారా నిన్ను ఆకర్షిస్తాడు. నిన్ను నడిపిస్తాడు. అతను నాయకుడు.

నేను నేతను కాను, ఆకర్షణ కలవాణ్ణి కాను, ఎందుకంటే జనాకర్షణ గల వ్యక్తి ప్రమాదకారి. అతను నిన్ను నాశనం చేస్తాడు. నిన్ను తీవ్రంగా ప్రభావితం చేస్తాడు. అతను మర్రిచెట్టులాంటివాడు. అతను రక్షకుడనుకుంటావు. మహావృక్షం నీడలో గడ్డి కూడా మొలవదు.

జనాకర్షణగల వ్యక్తి నిజమైన నాయకుడు కాడు. అతను బానిసల యజమాని. హిట్లర్, ముస్సోలినీ అట్లాంటివాళ్ళు. వాళ్ళు జనాల్ని నడిపిస్తారు, జనాల్ని బానిసలు చేస్తారు. వాళ్ళు అధికారం నెరపుతారు. అదేశాలిస్తారు.

రెండో రకంవాళ్ళు పద్ధతుల్ని, విధానాల్ని అనుసరించేవాళ్ళు. వాళ్ళు విధానాల్ని ప్రదర్శిస్తారు, శక్తిని కాదు. అతడికి జనంపై ఆకర్షణ వుండదు. జనాలకు విధానాల్ని వివరిస్తాడు. మొదటి వ్యక్తి కన్నా మేలు. ఇతను నిన్ను బానిసగా చెయ్యడు.

మూడోకం సహజమైన గురువు. సహజమైన గురువు. సహజమైన చికిత్స చేసే వాడు. అతను నిన్ను ముందుకు నడుపడు, అనుసరించడు. నీతోబాటు వుంటాడు. కేవలం నీ చేయిపట్టుకుంటాడు. అతను స్నేహితుడు. సహజమైంది ఉత్తమమైన దాంట్లో ఆకర్షణ లేదు. అతను చాలా సాధారణమైనవాడు. అతన్లో ఆకర్షణ వుండదు. అతనికి విధానముండదు. అతను మరీ సాంకేతిక దృష్టిగలవాడు కాడు, మరీ శాస్త్రీయ దృష్టికలవాడు కాదు. అతను కవితాత్మకమైనవాడు, గందరగోళమైనవాడు, ప్రకృతి అంత ఉద్విగ్నమైనవాడు.

నేను సహజమైన మనిషిని. సాధారణమైన మనిషిని. నేను గుంపులో కలిసిపోతే మీరు నన్ను గుర్తుపట్టలేరు. కాబట్టి మిమ్మల్ని ముందుకు నడపలేను. మీతోబాటు వుండ గలను. మీ చేయిపట్టుకోగలను. మీ స్నేహితుడిగా వుండగలను.

దాతృత్వం

మొదటి విషయం అన్ని మతాలు దాతృత్వాన్ని నొక్కి చెప్పాయి. ఎందుకంటే మనిషి ధనంతో ఆత్మన్యూనతకి లోనవుతాడు. దాతృత్వాన్ని గొప్పగా చెప్పారు. దానివల్ల మనిషి తక్కువ గిల్టీగా ఫీలవుతాడు. మీరు ఆశ్చర్యపోతారు. పాత యింగ్లీషులో 'gilf' అంటే ధనమని అర్థం. జర్మన్ భాషలో 'gild' అన్న పదముంది. దానికి ధనమని అర్థం. 'gord' అన్న పదం Gilt, guilt, gold వీటికి సన్నిహితమైంది. ఒకరకంగా లోలోతుల్లో ధనంలో గొప్ప ఆత్మన్యూనత దాగి వుంది.

ఎప్పుడు నీ దగ్గర ధనముంటే అప్పుడు తప్పుచేసినట్లు విచారపడతావు. అది సహజం. ఎందుకంటే ఎంతోమంది మనుషుల దగ్గర డబ్బులేదు. అట్లాంటప్పుడు నీ ఆత్మన్యూనతని ఎలా తరిమేయగలవు? నీ దగ్గర డబ్బుంటే దానివల్ల ఎవరో పేదవాళ్ళయ్యారని నీకు తెలుసు. ఎక్కడో ఎవరో ఆకలితో అలమటిస్తున్నారని నీకు తెలుసు. నీ బ్యాంకులో డబ్బు పెరుగుతూపోతూ వుంటుంది. చావు బతుకుల్లో వున్న ఒక పసిబిడ్డ మందుల్లేక అల్లాడుతూ వుంటుంది. ఒక స్త్రీ అనారోగ్యంతో బాధపడుతూ వుంటుంది. తిండిలేక ఒక పేదవాడు చనిపోతాడు. వీటిని ఎట్లా పక్కకి తోసెయ్యగలవు? తప్పించుకోగలవు? నీ దగ్గర ఎంత డబ్బు ఎక్కువైతే అంతగా నువ్వు తప్పుచేశాననుకుంటావు.

దాతృత్వమన్నది నీ ఆత్మన్యూనత నించి నిన్ను తేలిక పరుస్తుంది. అందువల్ల నువ్వు 'నేను ఒక పనిచేస్తున్నా. నేను కాలేజీ ఆసుపత్రి మొదలుపెడ్తున్నా, కళాశాల పెడుతున్నా. ఈ ఛారిటీ ఫండ్‌కు డబ్బు యిస్తున్నా." దీనివల్ల నువ్వు కొంత ఆనందిస్తావు. ప్రపంచం పేద తనంలో వుంది. లోకం నిస్సహాయంగా వుంది. తొంభయి శాతం జనం పేదలుగా వున్నారు. దాదాపు ఆకలితో చస్తున్నారు. కేవలం ఒక శాతం మనుషులు సంపన్నులుగా వున్నారు. డబ్బుతో వున్నారు. వాళ్ళెప్పుడూ గిల్టీగా వుంటారు. వాళ్ళకి సాయం చెయ్యడానికి మతం దాతృత్వమన్న ఐడియాని అభివృద్ధి చేసింది. అది వాళ్ళని తప్పులు చేశామన్నా భావన నుంచీ బయట పడేస్తుంది.

కాబట్టి మొదట నేను చెప్పదలచుకున్న విషయం దాతృత్వమన్నది ధర్మం కాదు. అది కేవలం మీ స్వచ్ఛతని సంరక్షించడానికి ఏర్పడింది. అది లేని పక్షంలో మీకు పిచ్చెక్కు తుంది. దాతృత్వం ధర్మంకాదు, పుణ్యంకాదు. వ్యక్తి దాతృత్వం కలిగివుంటే అతనేమీ గొప్ప పని, మంచిపని చేసినట్లు కాదు. వ్యక్తి ధనాన్ని కూడబెట్టడానికి అడ్డదారులకు పశ్చాత్తాపపడడం లాంటిది. నా దాతృత్వమన్నదేమీ గొప్ప విషయం కాదు. అది పశ్చాత్తాపం.

వందరూపాయలు నువ్వు సంపాదిస్తావు. పది రూపాయలు దానం చేస్తావు. అది పశ్చాత్తాపం! దాంతో కొద్దిగా తేలికపడతావు. అది మంచిపని అనుకుంటావు. నీ అహం కొంతమేరకు సంతృప్తిపడుతుంది. అప్పుడు నువ్వు దేవుడితో 'నేను మనుషుల్ని దోచుకోవడమే కాదు, నేను పేదవాళ్ళకు సాయం కూడా చేస్తున్నాను' అంటావు. ఈ సాయం ఏరకమైంది? ఒక చేత్తో వంద రూపాయలు లాక్కొని యింకో చేత్తో పది రూపాయలు యివ్వడం లాంటిది.

మతానికి సంబంధించిన పెద్దలు కల్పించిన మోసకారి జిత్తు యిది. ఎత్తు యిది. కుట్ర యిది. యిది పేదల్ని కాదు సంపన్నుల్ని ఆదుకోడానికి పన్నిన ఎత్తుగడ. పేదలకు కొద్ది సాయం చేశారు. కానీ వాళ్ళ లక్ష్యం అది కాదు.

నా సన్యాసులకు నేను ఏం చెప్పాలి?

నేను దాతృత్వం గురించి మాట్లాడను. ఆ పదం నాకు అసహ్యం అనిపిస్తుంది. నేను 'పంచుకోవడం' గురించి మాట్లాడతాను. పంచుకోవడమన్నది పూర్తిగా వేరైన లక్షణం. నీకు ఉంటే పంచుకుంటావు. నువ్వు పంచుకోవడంవల్ల యితరులకు సాయపడడం లేదు. దానివల్ల నువ్వు ఎదుగుతావు. ఎంత పంచుకుంటే అంత ఎదుగుతావు.

'ఛారీటీ', దాతృత్వం మంచి పదం కాదు. బరువైన పదం. నేను పంచుకోవటం గురించి చెబుతాను. నా సన్యాసులను పంచుకోమంటాను. దాతృత్వంలో ఒక చేయి కింద, యింకొక చేయి పైన వుంటాయి. ఒకడు సంపన్నుడు, యింకొకడు బిచ్చగాడు వుంటాడు. అంటే నీకుండి, వాడికి లేదు, అది మంచిది కాదు, అది అమానవీయం.

పంచుకోవడమన్నది పూర్తిగా భిన్నమయిన దృష్టి, ఎదుటి వ్యక్తికి వుందా? లేదా అన్నది సమస్యకాదు. ప్రశ్న అల్లా నీ దగ్గర చాలా వుంది. నువ్వు పంచుకోదలచుకున్నావు. నువ్వు ధర్మం చేసే ఎదుటి వ్యక్తి నించి కృతజ్ఞత ఆశిస్తావు. నువ్వు పంచుకుంటే దానికి అనుమతించిన అతనికి నువ్వు కృతజ్ఞత తెలుపుతావు.

నీ వద్ద విస్తారమయిన దానిని పంచుకోవడం వుంటుంది. దాతృత్వం యితరుల దరిద్రం మీద ఆధారపడింది. పంచుకోవడం నీ సంపన్నతనించీ వస్తుంది. యిక్కడ నాణ్యతాపరమైన తేడా వుంది.

నేను దాతృత్వం గురించి మాట్లాడను. పంచుకోడం గురించి చెబుతాను పంచుకో! నీ దగ్గర ఎంతవున్నా పంచుకో! అది అభివృద్ధి చెందుతుంది. అది ప్రాథమిక సూత్రం. నువ్వు ఎంత యిస్తే నీకంత వస్తుంది. యివ్వడంలో లోభికాకు!

పురుష దురహంకారం

శతాబ్దాల నుండి పురుషాధిపత్యం వ్యాపించి వుంది. భారతదేశంలో సన్యాసులని పిలవబడేవాళ్ళు 'స్త్రీ నరకానికి ద్వారమన్నారు. అదే మాట పురుషుల గురించి అనలేదు. వాళ్ళు స్త్రీని ఖండిస్తూ వచ్చారు. తక్కువచేస్తూ వచ్చారు. కానీ పురుషుడి గురించి ఏమీ అనలేదు. స్త్రీ పురుషుణ్ణి మోహిస్తే' పురుషుడు స్త్రీని మోహించాడు.

ఈ సన్యాసులు కూడా నిజమైన సన్యాసులు కారు. వాళ్ళు పురుష దురహంకార పందులు. మానవత్వానికి స్త్రీ పురుషులు రెండు కోణాలు. వాళ్ళకు ఒకే రకమైన గౌరవం అవసరం! కాని సమస్త గతం స్త్రీని ఖండించింది. అక్కడ ఒక విషయం అర్థమవుతుంది. ఆ సన్యాసులందరూ లోలోతుల్లో స్త్రీ అంటే భయపడ్డారు. అందువల్ల తమ చుట్టూ కంచెలు కట్టుకున్నారు. 'స్త్రీ నరకానికి ద్వారం' వంటి నిబంధనలు ఏర్పరచుకున్నారు. వాళ్ళు స్త్రీకి కేవలం రక్తమాంసాలు మాత్రమే ఉన్నాయని భావించారు. ఆ శరీరానికి బంగారం, వెండి, వజ్రాలు, పూలు అలంకరణలు చాలనుకున్నారు.

ఎంత విపరీతం! ఏ సన్యాసీ నేను స్త్రీగుండా ఈ భూమిలోకి వచ్చానని భావించలేదు. స్త్రీ గర్భం నించి రక్తమాంసాలతో ఆకారాన్ని సంతరించుకున్నానని అనుకోలేదు. స్త్రీని విమర్శిస్తూ పోయారు. సన్యాసి భయపడ్డాడు. తన లైంగిక దృష్టిని చూసి భయపడి అది పాపమన్నాడు. అతనికి స్త్రీ సెక్స్ సింబల్ అయింది.

ఎవరూ స్త్రీ గురించి బాధపడరు. ఆమె పరిస్థితిని చూడరు. సెక్స్‌కు సంబంధించినంత మేరకు స్త్రీ దౌర్జన్యపూరితమైంది కాదు, స్వీకరించేతత్వం కలిగింది. ఏ స్త్రీ పురుషుడిపై అత్యాచారం చెయ్యలేదు. పురుషుడే స్త్రీని బలాత్కరిస్తాడు. పురుషుడి లైంగికత దౌర్జన్యపూరితమైంది. స్త్రీది స్వీకరించే గుణం. స్త్రీ పురుషుడికన్నా సులభంగానే సెక్స్ లేకుండా జీవించగలదు. అందుకనే మతకన్యలు (Nurs) నిజమైన సన్యాసులు, పురుష సన్యాసులు మోసగాళ్ళు.

ఈ అసహ్య సంప్రదాయాన్ని మార్చడానికి ఒకటే మార్గం. సెక్స్‌ను గౌరవించి నప్పుడు స్త్రీ గౌరవింపబడుతుంది. గుర్తుంచుకోండి. సెక్స్‌ను సహజమైందిగా మనం అంగీకరించినప్పుడే స్త్రీ గౌరవాన్ని పొందుతుంది.

పోప్‌లు, శంకరాచార్యులు, ఇమామ్‌లు ఈ అసహ్య సంప్రదాయ సృష్టికర్తలు. దీన్ని నాశనం చేయాలంటే స్త్రీ పురుషులు వేరు కాదు. సమానులు అన్న సత్యం రంగంలోకి రావాలి. ఇద్దరూ ఒకే నాణేనికి రెండు వేపులు అని గ్రహించాలి.

ఉత్సాహం, ఉల్లాసం !

ఉత్సాహం రెండు రకాలు. ఒకటి ప్రాపంచికమైంది. ఒక వ్యక్తి ఒక విషయంలో విజయం సాధిస్తాడు. ఎప్పట్నించో కొనాలనుకున్న యింటిని కొంటాడు. ఎప్పట్నించో యిష్టపడే స్త్రీ సొంతమవుతుంది. కాని ఈ రకమయిన ఉల్లాసం క్షణికం. అది పిల్లగాలిలా వస్తుంది, వెళుతుంది. తరువాత ఖాళీ. ఎందుకంటే అంతకుముందు ఒకదాని కోసం ఆశవుండేది.

ప్రాపంచికమయిన ఉల్లాసం దానంతట అదే వస్తే మంచిదే. నువ్వు దానికి అతుక్కుపోవు. స్పృహతోనే వుంటావు. అప్పుడది కేవలం సంభవిస్తుంది. నువ్వొక ట్రెయిన్‌లో ప్రయాణిస్తూ వుంటావు. ఒక వ్యక్తి పరిచయమవుతాడు. ఏవో కబుర్లు చెప్పుకుంటారు. స్టేషన్ వస్తుంది. అతను వీడ్కోలు తీసుకుంటాడు. ప్రాపంచిక విషయాల్ని అలా తీసుకోవాలి.

యింకోరకమయిన ఉత్సాహ, ఉల్లాస సందర్భముంది. అది దైవికమైన ఉల్లాసం. దానికి బాహ్య విషయాల్తో సంబంధంలేదు. అది నీలోని నీటి చెలమ. అది నువ్వు లోపలికి వెళితేనే సంభవిస్తుంది. నీ లోపలి కేంద్రంతో నువ్వు సంబంధం ఏర్పరచుకోవాలి. నువ్వు నిశ్శబ్దంగా, ధ్యానంలో వుంటే అక్కడ ఆలోచనలుండవు. గతం, భవిష్యత్తులుండవు. కేవలం వర్తమానముంటుంది. వర్తమాన స్వచ్ఛత, తాజాదనం అక్కడుంటుంది.

అప్పుడు నువ్వొక్క నవ్య ఉల్లాస స్థితిలో అడుగుపెడతావు. అక్కడ కారణముండదు. అదే కేవలం నీ నించీ పొంగి ప్రవహిస్తుంది. ఆ సంగతి నువ్వు ఎవరికీ వివరించాల్సిన పన్లేదు. అది అవ్యక్తం. వివరించలేనిస్థితి. నువ్వు ఆ విషయాల్ని జనం అర్థం చేసుకోగలిగేలా చెప్పలేవు. జనం నీకు పిచ్చెక్కిందనుకుంటారు. ఎందుకంటే వాళ్ళకు తెలిసింది ఒకే రకమయిన ఉల్లాసం అది బాహ్యమైంది. నీకు లాటరీ తగిలిందని నువ్వు కారణం చెబితే తప్ప వాళ్ళు నమ్మరు.

కానీ నువ్వు లాటరీ గెలవలేదు. నువ్వీ దేశ రాష్ట్రపతి కావాలనుకోలేదు. నీకు బాహ్య ప్రపంచ సంబంధమయిన ఎట్లాంటి లక్ష్యాల్నీ అందుకునే ఆరాటం లేదు. అయినా నవ్వు ఆనందంతో పొంగిపోతున్నావు. వుత్సాహంతో వురకలేస్తున్నావు. అప్పుడు తప్పనిసరిగా జనం నీకు పిచ్చెక్కిందనే అనుకుంటారు. తప్పదు, ప్రతి చైతన్యవంతుడైన వ్యక్తీ పిచ్చివాడనే ప్రపంచమనుకుంటుంది. కానీ దాన్ని గురించి దిగులుపడకు.

నువ్వు ఆ ఆనందాన్ని అందుకుంటే సమస్త ప్రపంచాన్నీ అందుకున్నట్లే నువ్వు దాన్ని అందుకుంటే జీవన లక్ష్యాన్ని సాధించినట్లే. అక్కడ ప్రయోజనం పరిపూర్ణమైంది!

పిల్లలు

పిల్లలకు మతం గురించి, నీతి గురించి బోధ చెయ్యకండి. మీరు వాళ్ళ నించే నేర్చుకోవాలి. ఎందుకంటే మీ కంటే వాళ్ళు దేవునికి సన్నిహితంగా వుంటారు. వాళ్ళు యిప్పుడిప్పుడే దేవుని ఇంటి నించి వచ్చినవాళ్ళు. యింకా వాళ్ళ దగ్గర ఆ పరిమళముంది. మీరు పూర్తిగా ఆ విషయం మరిచిపోయారు. వాళ్ళింకా మరిచిపోలేదు. వాళ్ళు మరిచి పోవడానికి కొంత సమయం పడుతుంది. వాళ్ళు మీ నిబంధనలకు కట్టుబడడానికి, మీ వల్ల నాశనం కావడానికి కొంత సమయం పడుతుంది.

★ ★ ★ ★

పిల్లలు చైతన్యానికి సంబంధించిన కొత్త రూపాతరాలు ఎడిషన్లు (Editions). పిల్లలు జీవితంలోకి తాజాగా అడుగుపెట్టిన దైవత్వాలు. వాళ్ళని గౌరవించు. వాళ్ళని అర్థం చేసుకో!

★ ★ ★ ★

ఎప్పుడు వ్యక్తి ఏకాంతంగా వుంటాడో అప్పుడు వాస్తవంగా అతనికి సమస్యలేమీ వుండవు. అతనికున్న సమస్య అల్లా ఒంటరితనమే. అదేం పెద్ద సమస్య కాదు. అతను తన ఒంటరితనం పట్ల కొంత స్పృహతో వుంటే ఆ ఒంటరితనం ఏకాంతంగా పరివర్తన చెందుతుంది. అప్పుడు దాన్ని ఆనందిస్తాడు. కానీ వ్యక్తి ఒకడే వుంటే ఒంటరితనంతో బాధపడతాడు. చిత్రవధ అనుభవిస్తాడు. అప్పుడు తోడు కోసం వెదుకుతాడు. ప్రేమలో పడతాడు. యింకా ఏమైనా చేస్తాడు. అతను సంబంధంలోకి అడుగుపెట్టినపుడు అంతకుముందు తనెంత ఆనందంగా వున్నానో ఆలోచిస్తాడా? కానీ అప్పటికే ఆలస్యమైంది.

అతను ఒకవేళ ఏకాంతంలో వుంటే మళ్ళీ ఒంటరితనంతో బాధపడడం మొదలు పెడతాడు. ఎందుకంటే జనుల జ్ఞాపకాలు చాలా అల్పమయినవి. వాళ్ళు గుర్తుంచుకోరు. మళ్ళీ ఆ వ్యక్తి స్త్రీ కోసమో, పురుషుడి కోసమో వెతకడం మొదలవుతుంది. ఎప్పుడు సంబంధమేర్పడుతుందో అక్కడ సమస్య మొదలవుతుంది. కాని సమస్యలు అక్కడితో ఆగవు. ఒకసారి నువ్వు పురుషుడితో సంబంధమేర్పరచుకుంటే తల్లి కావడం గురించి ఆలోచిస్తావు. అప్పుడు మూడో వ్యక్తి రంగంలోకి రావడం జరుగుతుంది. మూడో వ్యక్తి మరింత ప్రమాదకరం! ఎందుకంటే నువ్వు ఎంపిక చేసుకున్న పురుషుడి గురించి నీకు బాగా తెలుసు. మరి బిడ్డ గురించి? నువ్వు బిడ్డ యిలా వుండాలి అన్న ఎంపిక చెయ్యలేవు.

ఏ రకమయిన బిడ్డ నీ గర్భంలోకి వచ్చాడో, ఏమవుతుందో ఎవరూ వూహించలేరు. ఇదొక గుడ్డివాళ్ళ ఆట! బిడ్డ కడుపులో పడుతుంది. అప్పుడు పిల్లల్లేకుంటే బావుండునను కుంటాం. కానీ అప్పటికే ఆలస్యమైంది.

మరి జనం ఎందుకు యిట్లాంటివి ఎన్నుకుంటారు? కారణం వాళ్ళు ఒంటరిగా వున్నారు. కాబట్టి తమని తాము తప్పించుకోడానికి, తమ నించి పారిపోడానికి ఈ పనులు చేస్తారు. యిది ప్రేమ కాదు. యిక్కడ ప్రేమవల్ల జరిగేదేమీ వుండదు. వాళ్ళు ఒంటరిగా వుండలేరు. అదొక పలాయనం. అందుకని యింకొకర్ని వెతుక్కుంటారు. ఆ వచ్చేవ్యక్తి కూడా ఎవరి కోసమో వెతుకుతూ ఒంటరితనాన్ని తప్పించుకునే ప్రయత్నంలోనే వుండడం జరుగుతుంది. యిద్దరు ఒంటరివాళ్ళు కలిశారు. ఆ కలయికలో ఎట్లాంటి ఆనందాన్ని యివ్వడం వుండదు వాళ్ళు ఒకర్నొకరు వంచించుకుంటారు. ఒకరిపై ఒకరు అధికారం చెలాయిస్తారు. ఈర్ష్యపడతారు. ఎక్కడ వదిలి వెళతారో అని భయపడతారు. అందుకని ఒకరికొకరు అతుక్కుని వుంటారు. అతుక్కునే కొద్దీ సంబంధం మరింత భారమవుతుంది. అప్పుడు ఒంటరిగా వుంటే హాయిగా వుంటుంది కదా! అనుకుంటారు.

కానీ యిప్పటికే అంటగట్టుకుపోయారు, కమిట్ అయ్యారు. ఒప్పందానికొచ్చారు. హామీలకు వ్యతిరేకంగా ప్రవర్తించడం కష్టం. అప్పుడు 'మనకు పిల్లలెందుకుండకూడదు? అనుకుంటారు. యిక్కడ కూడా బిడ్డ అన్నది ఒకరకమయిన పలాయనం.

★ ★ ★ ★

ప్రతి బిడ్డా గొప్ప శక్తితో జన్మిస్తుంది. కానీ ఆ శక్తిని మనం నాశనం చేస్తాం. పసివాళ్ళని నిర్వీర్యం చేస్తాం. నలిపేస్తాం. మన చర్చీలు, ఆలయాలు, మసీదులు మానవజాతికి గొప్ప అపకారం చేశాయి. వాళ్ళు నేరస్తులు, పాపులు. వాళ్ళు ప్రతి మనిషినీ నిర్వీర్యం చేశారు. స్వేచ్ఛను హరించారు. తొలినించి గొప్ప స్వాతంత్ర్యం వుంటే ఎలా వుండేవాళ్ళమో ఎవరికీ తెలీదు. అప్పుడు మీ నవ్వు, ప్రేమ, ఆనందం అన్నీ అపూర్వంగా వుండేవి. కానీ చిన్నప్పటినుంచీ వాటిని అదుపుచేశారు. అన్నిటికీ నిబంధనలు కల్పించారు.

ఏ పసిబిడ్డా ధనం పట్ల ఆసక్తి ప్రదర్శించదు. ఎందుకంటే పసివాళ్ళు బుద్ధిహీనులుకారు. ఏ పసిబిడ్డా దేశాధ్యక్షుడు కావాలనుకోదు. ఎందుకంటే పసివాళ్ళు మూర్ఖులు కారు. పసివాళ్ళ ఆసక్తులన్నీ సహజమైనవి. పసివాళ్ళు అన్నిటి పట్ల ఆసక్తి చూపిస్తారు. పసివాళ్ళు నక్షత్రాల కింద నాట్యం చేయాలనుకుంటారు. సూర్యుడి కింద, గాలితో కలిసి గంతులేయాలనుకుంటారు. చెట్లు, పర్వతాలు ఎక్కాలనుకుంటారు. నదిలో ఈత కొట్టాలనుకుంటారు. సముద్రంలో ప్రయాణించాలనుకుంటారు.

పసివాడు పూర్తిగా భిన్నమయిన విషయాలపట్ల ఆసక్తి ప్రకటిస్తాడు. కానీ మనం పసివాడి శక్తుల్ని పూర్తిగా దారి మళ్ళించాం. 'చెట్లు ఎక్కకు, పర్వాతాలు అధిరోహించాల్సినపన్లేదు. విజయమనే నిచ్చెనమెట్లు ఎక్కు "అంటున్నాం. ఇదిపూర్తిగా పనికిమాలిన విషయం, తెలివి తక్కువపని. విజయ శిఖరాన్ని అధిరోహించు, యితరుల కన్నా ధనవంతుడివికా; పోటీలో వుండు, అన్నీ సొంతం చేసుకో. పోరాడు! 'అర్థం లేనివాటి కోసం పోరాడ్డం యిదంతా. అట్లా చేస్తే అప్పుడు నువ్వు నీ ఆనందాన్ని కోల్పోతావు, నవ్వుని పోగొట్టుకుంటావు, అప్పుడు బతుకు పీడకలగా మారుతుంది.

పసివాడు నీకు పుడతాడు. కానీ అతను నీకు సంబంధించినవాడు కాడు. ఈ విషయం ఎప్పుడూ మరచిపోవద్దు. అతను నీగుండా వచ్చాడు. అతను నిన్ను దారిగా చేసుకున్నాడు. అతని భవితవ్యం అతన్ది.

అతనికి నువ్వు సన్యాస మివ్వడమంటే నువ్వు అతన్ని రూపొందిస్తున్నావనికాదు. నువ్వు అతని మీద ఎట్లాంటి నిర్బంధాన్నీ ప్రదర్శించకు. సన్యాసమంటే స్వేచ్ఛ. అతను అతనుగా వుండడానికి స్వేచ్ఛ నివ్వు. కానీ ఎట్లాంటి నియమాలూ విధించకు. నువ్వు ఎంతగా అతన్ని ప్రేమిస్తే అంతగా ప్రేమించు. కానీ నీ ఆలోచనల్ని అతనికి అందించకు. నువ్వు ధ్యానం చేస్తే నీతో వుండమను. కొన్నిసార్లు అతన్తో కలిసినాట్యమాడు.

పసిపిల్లలు సులభంగా ధ్యానం చేయ్యగలరు. మనం చెయ్యాల్సింది వాళ్ళకు సహకరించాలి. బలవంతం చేయకూడదు. ఐనా అది అసంభవం. ధ్యానం చేయమని ఎవర్నీ బలవంతపెట్టలేం.

గొప్ప గౌరవంతో పసివాణ్ణి ఆహ్వానించాలి. అతన్తో కలిసి ఆడాలి, పాడాలి.

నాగరికత

ఎక్కడా నాగరికత లేదు. కాబట్టి నేను ఎట్లా దాన్ని వ్యతిరేకిస్తాను? అది ఉనికిలో లేదు. అది కేవలం బుకాయింపు, నటన, మనిషి తన ఆదిమ సనాతన అమాయకత్వాన్ని కోల్పోయాడు. కానీ నాగరికుడు కాలేదు. కారణం అక్కడ నాగరికుడయ్యే వీలేలేదు. మనిషి నాగరికుడు కావాల్సిన ఒకే ఒక అవకాశం మనిషి తన అమాయకత్వాన్ని పునాదిగా చేసుకోవాలి. మనిషి తన ప్రాథమిక అమాయకత్వాన్ని పునాదిగా చేసుకుంటే తప్ప అక్కడినించీ ఎదగడు. అందుకే జీసెస్ "మీరు మళ్ళీ జన్మిస్తే తప్ప మళ్లీ మీరు పసివాళ్ళుగా మారితే తప్ప మీకు సత్యమంటే ఏమిటో తెలీదు" అన్నాడు.

ప్రస్తుతం నాగరికత అని చెప్పుకొనేదంతా బూటకం, అదొక మోసపూరిత నాణెం. నేను దానికి వ్యతిరేకిని. నేను నాగరికతకు వ్యతిరేకిని కాను. కానీ యిది నాగరికత కాదు. నేనెందుకు వ్యతిరేకినంటే మనం చెప్పుకునే ఈ నాగరికత అసలు నాగరికతే కాదు. యిది బూటకపు నాగరికత!

ఎవరో మాజీవేల్స్ "నాగిరికత మీద మీ అభిప్రాయమేమిటి? అని యువరాజుని అడిగారు. దానికి ఆయన అది మంచి భావన. ఎవరయినా దాన్ని మొదలుపెడితే బావుండు' అన్నాడు. నాకు ఆ సమాధానం యిష్టం. ఎందుకంటే అది యింకా ఆరంభమే కాలేదు. మనిషి నాగరికుడు కాలేదు. మనిషి నటిస్తున్నాడంతే!

నేను నటనలకు వ్యతిరేకిని. మోసగాళ్ళకు వ్యతిరేకిని. మనిషి కేవలం తను నాగరీకుణ్ణని ప్రదర్శించుకుంటున్నాడు. ఒకసారి మనిషిని పరిశోధించండి. కొద్దిగా పరిశీలించండి. మీకు అనాగరికుడు కనిపిస్తాడు. మనిషిని కొద్దిగా పరిశీలించండి. కొద్దిగా 'గీకి' చూడండి. మంచి అనిపించేదంతా పైపైన కనిపిస్తుంది. చెడ్డ అన్నదంతా లోలోపలి బలమైన పునాదితో వుంటుంది. ఇదంతా చర్మంపైన కనిపించే పై తొడుగు నాగరికత. అంతా బాగానే వుంటుంది. మీ నవ్వులు, వాటితో బాటు ప్రతిదీ. ఎవరయినా మీ పైన ఒకమాట విసిరితే, మిమ్మల్ని తక్కువ చేస్తే మీకు పిచ్చెక్కుతుంది, తిక్కరేగుతుంది. ఆగ్రహంతో ఎదుటివ్యక్తిని చంపేయాలనిపిస్తుంది. కేవలం ఒక్క క్షణం ముందు మీరు నవ్వుతున్నారు. మరుక్షణం చంపడానికి సిద్ధపడ్డారు. హత్య చేయాలన్న అభిప్రాయాలు పైకి వచ్చాయి. యిది ఏం నాగరికత?

మనిషి ధ్యానిగా మారినప్పుడు మాత్రమే నాగరీకుడవుతాడు. కేవలం ధ్యానం మాత్రమే ఈ ప్రపంచానికి నిజమైన నాగరికతను తెస్తుంది. కేవలం జ్ఞానోదయం పొందినవాళ్ళు మాత్రమే నాగరికులు.

ఇక్కడున్న వైరుధ్యమిదే. జ్ఞానులు ఆదిమ 'లక్షణానికి వ్యతిరేకులు కారు. వాళ్ళు ఆదిమ'మైనదాన్ని పునాదిగా ఉపయోగిస్తారు. పసితనము అమాయకత్వాన్ని పునాదిగా ఉపయోగిస్తారు. దానిపై ఆలయాలు తలెత్తుతాయి. నాగరికత పసితనపు అమాయకత్వాన్ని నాశనం చేసింది. నాశనం చేసి తప్పుడు ఫలితాల్ని అందించింది. మొదట ప్రాథమికమైన అమాయకత్వాన్ని ధ్వంసం చేసింది. మనిషిని మోసగాడుగా, అతి తెలివిగలవాడిగా, లెక్కలేసుకునేవాడిగా మార్చింది. తరువాత దారి తప్పించింది. అట్లా నిన్ను నాగరికుణ్ణి చేయడం మొదలుపెట్టింది.

మొదట వ్యక్తిని తన స్వీయతత్వం నించీ వేరుచేసింది. వేరుచేసి తప్పుడుదారుల్ని చూపించింది. తప్పుడు లక్ష్యాలేర్పరచి వాటి మీద ఆధారపడేలా చేసింది. నిజమైన నాగరికత నీ సహజతత్వానికెప్పుడూ వ్యతిరేకమైనది కాదు. నీ బాల్యానికి వ్యతిరేకమైందికాదు. దానిపైన ఎదిగేది. ఆదిమ అమాయకత్వాన్ని అణచివేసేదికాదు. దానిపై వికసించేది. అది ఎంతో ఎత్తు ఎదుగుతుంది. కానీ ఆదిమ అమాయకత్వం పునాదులపైనే వుంటుంది.

నాగరికత అన్నది గాభరా పెట్టే వ్యవహారం. పిచ్చెక్కించేది. ఈ సమస్త ప్రపంచం పిచ్చాస్పత్రిలా వుండడం చూస్తున్నారు కదా! జనాలు తమ ఆత్మలు కోల్పోయారు. జనం జనం కాకుండాపోయారు. తమని తాము కోల్పోయారు. వ్యక్తిత్వాన్ని కోల్పోయారు. అన్నీ కోల్పోయారు. కేవలం నకళ్ళుగా తయారయ్యారు. నటిస్తున్నారు. వాళ్ళకు ముసుగులున్నాయి. వాళ్ళ మౌలికతను కోల్పోయారు.

నేను కావాలన్నది నాగరికతే కానీ యిది నాగరికతకాదు.. అందుకే నేను దీన్ని వ్యతిరేకిస్తున్నాను. మనిషి నిజమైన నాగరికుడు కావాలని కోరుకుంటున్నాను. నిజమైన సంస్కారవంతుడు కావాలను కుంటున్నాను. అటువంటి సంస్కారమయినప్పుడే అది ఎదుగుతుంది. అది బయటినించి నిర్బంధిస్తే రాదు. అది లోపలి నించీ రావాలి. విస్తరించాలి, వ్యాపించాలి.

కానీ నాగరికత దానికి పూర్తిగా వ్యతిరేకంగా వుంది. అది బాహ్యంనించి నిర్బంధిస్తోంది. ప్రపంచమంతా శాంతి సందేశాల్నే ఇస్తారు. మహావీరుడు, బుద్ధుడు, జీసెస్ అందరూ అహింసనే బోధించారు. కారణం వాళ్ళు అహింసను ఆనందించారు.

మరి అనుయాయులు? వాళ్ళు ఏ క్షణమూ అహింసను ఆనందించలేదు. వాళ్ళకు హింస ఒకటే తెలుసు. అహింసను ఖండిస్తారు. తమ మీద అహింసను నిర్బంధంగా రుద్దు కుంటారు. ఒక లక్షణాన్ని సృష్టిస్తారు. ఆ లక్షణం వాళ్ళ చుట్టూ వుంటుంది. కేవలం చుట్టూ మాత్రమే వుంటుంది. అది కవచంలాంటిది. లోపల అగ్ని పర్వతాల్లా ఉడుకుతూ పగలడానికి సిద్ధంగా వుంటారు. పైకి చిరునవ్వులు నవ్వుతూ వుంటారు. కపటపు నవ్వులు, ప్లాస్టిక్ నవ్వులు.

ఇది నాగరికత కాదు. ఇది అసహ్యమైన విషయం. అహింస అంతరంగం నించీ రావాలి. బయటినించి కాదు. విద్య (Education) అన్న పదానికి అర్థమదే. అది దాదాపు బావి నించి నీళ్ళు తోడడంలాంటిది. ఎడ్యుకేషన్ అంటే బయటికి తేవడం. కానీ విద్య ఏం చేస్తోంది? దేన్నీ బయటికి తీసుకురాదు. బయటివి తెచ్చి మీద వేస్తుంది. చిన్నతనం నించీ నిర్బంధిస్తుంది. పసిబిడ్డ గురించి పట్టించుకోదు. పసివాణ్ని యంత్రంలా చూస్తుంది. మరింత సమాచారాన్ని అతనిలో కుక్కుతుంది. యిది విద్య కాదు.

పసివాడి ఆత్మను బయటికి తేవాలి. అతని చైతన్యం ఎదగడానికి సాయపడాలి. ఎంత ఎక్కువ సమాచారం (Information) తెలిస్తే అదే విద్య అనుకోవడం తప్పు. మరింత మరింత చైతన్యమే విద్య. మరింత ప్రేమే విద్య, అట్లాంటి విద్యే నాగరికతను సృష్టిస్తుంది.

ఈ నాగరికత తప్పుడు నాగరికత. ఈ విద్య తప్పుడు విద్య. అందుకనే నేను దీనికి వ్యతిరేకిని. ఇది నాగరికతే కాదు గనక నేను వ్యతిరేకిని. సన్యాసమన్నది నాగరిక మానవజాతికి ఆరంభం. ఏ తేడాలూ లేని చిన్న మినియేచర్ (Miniature) ప్రపంచాన్ని సృష్టించడమే నా ప్రయత్నం.

అక్కడ ఎవరూ నువ్వు క్యాథలిక్‌వా, ప్రొటెస్టెంట్‌వా, హిందువా, మహమ్మదీయుడివా, భారతీయుడివా, జర్మన్‌వా అని పట్టించుకోరు. ఒక దశలో నువ్వు స్త్రీవా, పురుషుడివా అని కూడా పట్టించుకోరు. కారణం అదొక ప్రత్యేక లక్షణం అంతే.

ఎప్పుడు మనం మనిషిని మనిషిగా చూస్తామో. కులం, తెగ, లింగ, సిద్ధాంత, జాతి, దేశ, విషయాల్ని లేకుండా వుంటామో అప్పుడే మనం మనుషులవుతాం. అప్పుడే నిజమైన దృష్టి, పరిశీలనలో సత్యం ఆవిష్కారమవుతుంది.

మనం గర్వించకూడదు. అట్లా చేస్తే మన సమస్య శక్తీ నిర్వీర్యమవుతుంది.

స్పష్టత

స్పష్టత ఒక మనస్థితి. ఆలోచనలు లేనప్పుడు అది కలుగుతుంది. ఆలోచనలన్నవి ఆకాశంలో మేఘాల లాంటివి. ఆకాశమంతా నిండుగా మేఘాలు వుంటే నువ్వు సూర్యుణ్ణి చూడలేవు. నీ ఆకాశంలో మేఘాలు లేనప్పుడు, నీ లోపలి ఆకాశంలో మేఘాలు లేనప్పుడు, నీ చైతన్యంలో మేఘాలు లేనప్పుడు అక్కడ స్పష్టత వుంటుంది.

స్పష్టత అంటే నీ చాతుర్యం కాదు. గుర్తుంచుకో. నైపుణ్యమున్నవాళ్ళు స్పష్టతవున్నవాళ్ళు కారు. చాతుర్యం, నేర్పరితనంతో వుండడం గొప్పకాదు. చాతుర్యమంటే మోసకారి తనం తప్ప మరేమీ కాదు. నేర్పరితనమున్న వాళ్ళు స్పష్టత వున్నవాళ్ళు కారు. మేధావితనం తెలివితేటలనుకోకండి. మేధావికావడం సులభం. విషయ సేకరణ విపరీతంగా చేస్తే మేధావివవుతావు. పండితుడవుతావు. అది స్పష్టతను, తెలివిని యివ్వదు. తెలివి అన్నది పూర్తిగా దానికి వ్యతిరేకమైంది. తలలో ఎట్లాంటి జ్ఞానమూ కదలనప్పుడు, లోపలి ఆకాశంలో ఎట్లాంటి మేఘాలు కదలనప్పుడు, లెక్కలు వేసుకోనప్పుడు, మోసకారి తనం లేనప్పుడు, నువ్వు ఏమాత్రం ఆలోచించనప్పుడు, నువ్వు అద్దంలా ప్రతిఫలించినప్పుడు అప్పుడు ఏదైతే వుందో అదే స్పష్టత! స్పష్టత అంటే అద్దంలాంటి లక్షణం. స్పష్టతగా వుండడమంటే దేవుణ్ణి ఎదుర్కోవడం.

దేవుడిని జ్ఞానం ద్వారా తెలుసుకోలేం. దేవుణ్ణి స్పష్టత ద్వారా గ్రహించగలం. దేవుణ్ణి మేధస్సుతో, మోసంతో గ్రహించలేం. అమాయకత్వం ద్వారా అందుకోగలం. అమాయకత్వమే స్పష్టత! అందుకే జీసెస్ 'మీరు పసిపిల్లలయితే తప్ప నా దేవుని రాజ్యంలో అడుగుపెట్టలేరు' అన్నాడు. ఆయన దేన్ని వుద్దేశిస్తున్నాడో? అతను కేవలం నువ్వు పసివాడుగా వుంటే తప్ప నీలోపలి ప్రపంచంలో మేఘాలు లేకుంటే తప్ప, లోపలి అద్దంపై దుమ్ము లేనప్పుడు తప్ప, ఎవరి దృష్టి కేవల స్వచ్ఛతతో మాత్రమే దేవుణ్ణి చేసే అర్హత వుంటుంది. అదే స్పష్టత!

★ ★ ★ ★

ఆలోచన లేకుంటే స్పష్టత వుంటుంది. ఆలోచన వుంటే స్పష్టత వుండదు. 'ఆకాశం మేఘాలతో నిండి వుంది. కానీ ఎంత బాగా వుంది' ఇది అసాధ్యం! స్పష్టత ధ్యాన దృష్టి గుండా వస్తుంది. ఆలోచన గుండా రాదు.

అతుక్కుపోవడం

నువ్వు అతుక్కుపోయిన, అంటుకట్టుకున్న గతమేమిటి? అక్కడ అతుక్కుపోవడానికి ఏముంది? బాగా తెలిసిన పరిచయమయిన విషయం తప్ప అక్కడేముంది? అదంతా ఒక నరకం, అదంతా ఒక విషాదం. జనం ఆ సంగతి బాగా తెలిసినా వాళ్ళకు వాటికి అంటిపెట్టుకునే వుంటారు. వాటితో స్నేహంగా వుంటారు. ఆరోగ్యం తలపు తడుతున్నా ఆ శబ్దాన్ని వినరు. వాళ్ళు క్షయకు, క్యాన్సర్‌కు అంటిపెట్టుకునే వుంటారు. ఎందుకంటే అవి పరిచయమైనవి. చిరకాల మిత్రులు. వాటితో చాలా కాలంగా సహజీవనం చేస్తున్నారు. వాటిని వదిలి ఆరోగ్యంగా జీవించడాన్ని నమ్మకద్రోహమనుకుంటారు.

అందుకని జనం బాధలకు అతుక్కుపోయివుంటారు. ఒకవేళ అవకాశాలు వచ్చి బాధల్ని పోయి ఉత్సవం ఆరంభమయినా వాళ్ళు నిరంతరం బాధలకు తగులుకుని వుంటారు. బాధను వదిలిపెట్టరు. అది వాళ్ళని వదిలిపెట్టినా మాటిమాటికీ దాన్ని పట్టుకుంటారు. ఒక బాధ అదృశ్యమయినా వెంటనే అట్లాంటి యింకో బాధని సృష్టించుంటారు. కనీసం కొంత విరామమిచ్చి తమ అస్తిత్వంలో అడుగుపెట్టడానికి కూడా వాళ్ళు అవకాశమివ్వరు.

ఒక విషయం గుర్తుంచుకోండి. ఎవరయితే కొత్త జీవితాన్ని ఎన్నుకుంటారో వాళ్ళు మాత్రమే జీవిస్తారు. జీవితమంటే లెక్కలు వేసుకోని చోటుకి, పథకాలు, ప్రణాళికలు లేని చోటుకి అడుగు పెట్టడానికి సిద్ధపడడమే! జీవితమంటే అజ్ఞాత తీరం నించీ వచ్చే సవాలుకి చెవి ఒగ్గడానికి సిద్ధ పడడమే! ప్రపచంలో సురక్షితమైంది భద్రతవున్నది కేవలం స్మశానం మాత్రమే! అక్కడ ఏమీ జరగదు.

జీవితమంటే చలనం, ద్రవస్థితి, జీవితమంటే అస్థిరం. అయినా మనమెంత తెలివి తక్కువవాళ్ళమంటే మనం అంటుకుపోతాం, అతుక్కుపోతాం. మార్పన్నది జీవన తత్వమయితే అతుక్కుపోవడమన్నది బుద్ధిహీనత. ఎందుకంటే నీ అతుక్కు పోవడమన్నది జీవన సూత్రాన్ని మార్చదు. నీ అతుక్కుపోవడమన్నది నిన్ను చిత్రహింసకు గురిచేస్తుంది. విషయాలు మార్పుకు కట్టుబడివున్నాయి. నువ్వు వాటికి అతుక్కుపోయినా లేకున్నా అది లెక్కలో లేనిది. నువ్వు అతక్కుపోతే నరకమనుభవిస్తావు. నువ్వు పట్టుకుంటావు, అవి మారుతాయి. నువ్వు దిక్కుతోచని స్థితిలో పడతావు. నువ్వు వాటిని పట్టుకోకున్నా అవి మారుతాయి. అయితే అప్పుడు నువ్వు నిరాశ పడవు. నువ్వు అవి మార్పుకు కట్టుబడ్డాయని

స్పష్టమయిన స్పృహలో వుంటావు. విషయాలు అలావుంటాయి. అది జీవన యధార్థం. చిత్రమయిన విషయమేమిటంటే నువ్వు వేలసార్లు మోసపోయావు. నువ్వు స్పృహలో లేవు. మళ్ళీ ఒక సబ్బు బుడగ రంగంలోకి వస్తుంది. నువ్వు నమ్ముతావు. అజ్ఞానానికి అంతముండదు! ఎన్నిసార్లు నిన్ను సుత్తితో కొట్టాలి? ఎన్నిసార్లు నీ కలలు నలిగిపోలేదు, తునాతునకలైపోలేదు? అతుక్కుపోవడమన్నది పనికిమాలిన విషయమన్నది ఎన్నిసార్లు నిరూపణకాలేదు! అతుక్కుపోవడాన్ని ఆపు! విషాదాన్ని దాటివెళ్ళు! విషయాలకు అతుక్కుపోవడమన్నది విషాదాలకు మూలం!

ఆ విషయం గ్రహిస్తే వెంటనే నువ్వు విషాదాలను దాటివుంటావు. వాటికి అందనంత ఎత్తులో వుంటావు. అప్పుడికి చేయాల్సినదేమీ వుండదు. ఆ క్షణం నువ్వక్కడ చూస్తే విషాద మెక్కడుంది? కారణం అదృశ్యమైంది. నువ్వా కారణాన్ని తొలగించావు. నువ్వు అతుక్కుపోతే నువ్వు కారణాన్ని సృష్టిస్తావు. అతుక్కుపోకుండా వుండడమే స్వాతంత్ర్యం!

మేఘాలు

బుద్ధుడు చనిపోవడానికి ముందు ఎవరో ఆయన్ని 'మీరు చనిపోయాకా ఎక్కడికి వెళతారు? మీరు ఉనికిలోనే వుంటారా? లేదా కేవలం శూన్యంలోకి అదృశ్యమయిపోతారా? అని అడిగారు.

ఇది కొత్త ప్రశ్న కాదు. అతి ప్రాచీనమయింది. ఎన్నోసార్లు పునరుక్తి చేసింది. బుద్ధుడు కేవలం తెల్ల మేఘాల లాగా అదృశ్యమయిపోతాను' అన్నాడు.

మేఘాలు కదలిపోతాయి, అదృశ్యమయిపోతాయి.

అవి ఎక్కడికి వెళ్ళాయి? అవి ఎక్కణ్ణించీ వచ్చాయి? అవి ఎట్లా రూపొందాయి? ఎట్లా అదృశ్యమయ్యాయి?

తెల్లని మేఘానికి ఎట్లాంటి పునాదీ వుండదు. అది పునాది లేని విషయం. దానికి ఎక్కడా వేర్లు కనిపించవు. అది ఏమీలేని తనం నించీ పుడుతుంది. అయినా అది వుంటుంది. ఈ సమస్త అస్తిత్వం తెల్ల మేఘంలాంటిది. ఎట్లాంటి ఆకస్మికమైంది లేకుండా, ఎట్లాంటి అంతిమ కారణం లేకుండా అది ఉనికిలో ఉంటుంది. అది ఒక రహస్యంగా వునికిలో వుంటుంది.

ఆ తెల్లని మేఘానికి తన దారంటూ ఏమీ వుండదు. అది ప్రవహిస్తుంది, సాగుతుంది ఎటు గాలి తీసుకెళితే అక్కడికి వెళుతుంది. అది ఎక్కడికి చేరితే అదే దాని లక్ష్యం! అది అడ్డు పెట్టదు, ఘర్షించదు. తెల్లని మేఘం ఆక్రమణదారుడుకాదు, విజేతకాదు అయినా అది ప్రతిచోటా తిరుగుతూనే వుంటుంది. నువ్వు దాన్ని ఆక్రమించలేవు. దాన్ని ఓడించలేవు

తెల్లని మేఘానికి ఫలానా చోటికి వెళ్ళాలని వుండదు. అది కదుల్తుంది, ప్రతిచోటుకీ సాగుతుంది. అన్ని కోణాలూ దానికి సంబంధించినవే! అన్ని దిక్కులూ దానివే. దేన్నీ వ్యతిరేకించడం, కాదనడం వుండదు. ప్రతిదీ ఆమోదపరిధిలో వుంటుంది.

టిబెట్‌లో ఒక ధ్యానముంది. సన్యాసులు పర్వతం మీద కూర్చుంటారు. ఒంటరిగా, కేవలం ఏకాంతంలో కూచుని ఆకాశంలో సాగే తెల్లని మేఘాలపై ధ్యానం నిలుపుతారు. వాళ్ళు నిరంతర ధ్యానంలో దానిలో లీనమవుతారు. అప్పుడు వాళ్ళు తెల్ల మేఘాలుగా మారిపోతారు. పర్వతాలపై తెల్ల మేఘాలుగా వాలుతారు. మనసు లేనితనం అక్కడుంటుంది. అక్కడ అణచివేత వుండదు, ఘర్షణ వుండదు. సాధించాల్సింది ఏమీ వుండదు. కోల్పోయేది

ఏదీ వుండదు. కేవలం అస్తిత్వాన్ని ఆనందించడం, ఆ సందర్భాన్ని ఉత్సవం జరుపుకోవడం, ఆనందించడం, పరవశించడం వుంటుంది!

జీవితంలోని రహస్యాల్ని చూడండి. అన్నిచోట్లా చూడండి. తెల్లని మేఘాల్లో, నక్షత్రాల్లో, రాత్రిలో, పూలలో, ప్రవహించే నదిలో చూడండి!

ఎక్కడ చూసినా రహస్యం కోసం చూడండి! ఎక్కడ రహస్యం కనిపిస్తే అక్కడ ధ్యానాన్ని నింపండి! ధ్యానమంటే రహస్యం ముందు మిమ్మల్ని మీరు మాయం చెయ్యడం మిమ్మల్ని మీరు లయం చేయడం! రహస్యం ముందు మీరు అదృశ్యం కావడం.

నువ్వు వుండవు, రహస్యం సంపూర్ణంగా నిన్ను తనలోకి తీసుకుంటుంది. అప్పుడు హఠాత్తుగా ఒక కొత్త ద్వారం తెరచుకుంటుంది. కొత్త దృష్టి ఏర్పడుతుంది. హఠాత్తుగా విభాగాల ప్రపంచం, వేర్పాటు ప్రపంచం, అదృశ్యమవుతుంది. ఏకత్వానికి సంబంధించిన కొత్త ప్రపంచ రంగంలోకి వస్తుంది. సరిహద్దులు మాయమవుతాయి. ప్రతిదీ యింకో దానితో వుంటుంది. అక్కడ విడదీయడముండదు.

కాబట్టి నేను నా మార్గం తెల్ల మేఘాల మార్గమన్నానంటే అది కేవలం ఒక సంకేతం. తెల్లని మేఘాన్ని ఒక వాస్తవంగా ఉపయోగించలేం. దాన్ని సంకేతంగా ఉపయోగించవచ్చు. అది కవితాత్మక సంకేతం. రహస్యంలోకి గాఢంగా నిష్క్రమించే అద్భుతానికి సంకేతం!

నిబద్ధత

నిజానికి నిబద్ధతలో ప్రేమ లేదు. ప్రేమకు అవకాశం లేదు. కేవలం భిన్న ధృవంలో వుండేది. నీ నమ్మకానికి వ్యతిరేక దిశలో వుండేది. నీ కల్పన పూర్తిగా అబద్ధం. అప్పుడు నువ్వు మొదటినించీ పరిశోధించాలి.

నిబద్ధత అవసరం లేదని ఎందుకన్నాను? అక్కడ ప్రేమకు అడ్డంకి వుందని ఎందుకన్నాను? నిబద్ధత అంటే ఏమిటి. భవిష్యత్తు కోసం యిచ్చే హామీ. ప్రేమ వర్తమానంలో వుంటుంది. హామీ భవిష్యత్తులో వుంటుంది. ప్రేమ ఈ రోజు, నిబద్ధత రేపు. ప్రేమ ఎప్పుడూ యిప్పుడే వుంటుంది. నిబద్ధత అప్పుడు అక్కడ వుంటుంది. అవి ఎప్పటికీ కలవవు.

నిబద్ధత అన్నది హామీ అది 'ఈ రోజు ఎట్లా ప్రవర్తించానో అట్లానే రేపు కూడా ప్రవర్తిస్తాను' అంటుంది. కానీ రేపటి గురించి నువ్వు ఎట్లా హామీ ఇవ్వగలవు? నువ్వు రేపు బతికివుండకపోవచ్చు. ఒకవేల బతికి వున్నా నువ్వు పూర్తిగా మారే అవకాశం వుండవచ్చు. నువ్వు మారకపోయినా ఎదుటి వ్యక్తి పూర్తిగా మారవచ్చు. రేపటి గురించి చెప్పలేం.

నేను ప్రేమను (Commitment) కమిట్‌మెంట్ అన్నానంటే దాని అర్థమేమిటి? అంటే రేపటి గురించి నేను హామీ యిచ్చానని కాదు. కానీ అక్కడ హామీ వుంది. అక్కడి సంక్లిష్టత, సున్నితత్వం అది. నువ్వు, "నేను రేపు కూడా ప్రేమిస్తాను". అనడంలో హామీ యిస్తే ఆ క్షణంలో ప్రేమ వుంది.

పోల్చుకోవడం

పోల్చుకోవడమన్నది జబ్బు. అన్నిటికన్నా పెద్ద జబ్బు. మనకు మొదటి నించీ పోల్చుకోవడం నేర్పారు. మీ అమ్మ నిన్ను యితర్ల పిల్లల్తో పోల్చుకుంటుంది. మీ నాన్న అట్లాగే యితర పిల్లల్తో నిన్ను పోలుస్తాడు. టీచర్ కూడా అదే పనిచేస్తుంది. రాజా! చూడు, గోపాల్ ఎంత మంచి పనులు చేస్తాడో, నువ్వు అలా కాదు, అంటుంది. పసితనం నించే యితర్లలో నిన్ను పోల్చుకుని చూడమని బోధిస్తారు. ఇది గొప్ప జబ్బు. ఇది నీ ఆత్మను నాశనం చేసే క్యాన్సర్. ఎందుకంటే సృష్టిలో ప్రతి మనిషీ అసాధారణ వ్యక్తే. అసలు ఎక్కడా పోల్చడానికి కుదరదు. నేను నాలా వున్నాను. నువ్వు నీలాగా వున్నావు. అసలు సృష్టిలో ఏ ఇతర వ్యక్తితోనూ నిన్ను పోల్చడానికి కుదరదు.

మల్లెపువ్వును గులాబీతో పోల్చగలమా? పోల్చలేము. మామిడి పండును ఆపిల్‌తో పోల్చగలమా! పోల్చలేవు. నీకు తెలుసు, అవి వేరువేరు. పోలిక వీలుపడదు. నీలాగా యిప్పటికీ ఏ వ్యక్తీ లేడు. యికమీద వుండబోడు... నువ్వు అసాధారణమైన మనిషివి. ఇది నీ జన్మ హక్కు. అది అసాధారణ లక్షణం. దేవుని దయ. నిన్ను ప్రత్యేకతల్తో సృష్టించాడు. ఎవరితోనూ పోల్చుకోకు. పోల్చుకోవడం వల్ల సమస్యలు తలెత్తుతాయి.

ఈ పోల్చుకోవడమనే జబ్బు బారిన పడితే సహజంగా నువ్వు అహంకారివవుతావు. లేదా క్రూరుడవుతావు. అది నువ్వు ఎవరితో పోల్చుకుంటున్నావన్న దాని మీద ఆధారపడి వుంటుంది. ఒకరకంగా నీకన్నా గొప్ప స్థాయిలో వున్నారనుకునే వాళ్ళతో నిన్ను పోల్చుకుంటే నువ్వు క్రూరంగా మారుతావు. చాలా దుర్మార్గంగా మారతావు. లేదా నీ కన్నా దిగువ స్థాయిలో వున్నారనుకునే వాళ్ళతో పోల్చుకుంటే నువ్వు అహంకారిగా మారుతావు.

ప్రతి మనిషిలోని ప్రత్యేకతను అర్థం చేసుకున్న వ్యక్తి ఆధ్యాత్మిక వాది అవుతాడు. అతనిదే నిజమైన మతం. కారణం అతను దేవుడు తనకిచ్చిన దాని పట్ల గాఢమయిన కృతజ్ఞతతో వుంటాడు. నువ్వు పోల్చుకోని పక్షంలో నువ్వు పెద్దవాడవు కావు, తక్కువవాడూ కావు. వికారివి కావు, అందగాడివీ కావు, తెలివైన వాడివీ కావు. తెలివి తక్కువ వాడివీ కావు. పోల్చుకోని పక్షంలో నువ్వు కేవలం నువ్వులా వుంటావు. నిరాడంబరమైన, సాధారణ ప్రాణిలా వుంటావు. వసంతం వస్తుంది, పూలు పూస్తాయి, ఎందుకంటే ఈ వసంతాన్ని తీసుకొచ్చిన దైవం పట్ల గాఢమయిన కృతజ్ఞతవుంటుంది. ఆ దేవుడిచ్చిన జీవితాన్ని

ఆనందంతో ఆమోదించడముంటుంది. పోల్చుకోవడమన్నది పోటీని రంగంలోకి తెస్తుంది. పోలిక అన్నది గాయాల్ని అహాన్ని తెస్తుంది. నీకన్నా పైస్థాయిలో వున్నవాళ్ళ ద్వారా గాయాల్ని అందుకుంటావు. మరో వేపు నీ కన్నా తక్కువ స్థాయిలో వున్నవాళ్ళ వల్ల అహంకారాన్ని పొందుతావు. నువ్వు ఈ రెండు రాళ్ళ మధ్య నలిగిపోతావు.

నీవు కేవలం నువ్వే! నువ్వు ఏ గురు పీఠానికీ చెందవు. నీకన్నా ఎవడూ పై స్థాయిలో లేడు, నీకన్నా ఎవడూ కింది స్థాయిలో లేడు. ఎందుకంటే ఎవడూ నీలా లేడు. అందువల్ల అక్కడ పోల్చుకోడానికి వీలు పడదు. అందువల్ల పోటీ అన్నది నిష్ఫలం!

వ్యక్తి తనలా వుండాలి. అది నా మౌలిక సందేశం! నిన్ను నిన్నుగా ఆమోదించిన క్షణం అన్ని, కొండంత బరువులూ క్షణంలో అదృశ్యమయి పోతాయి. అప్పుడు జీవితమన్నది కేవలం ఆనందం! ఉత్సవకాంతి!

కరుణ

కరుణ 'అన్న పదాన్ని అర్థం చేసుకోవాలి. మోహం రూపాంతరం చెందితే అది కరుణగా మారుతుంది. ఆ దారిలో ప్రేమ ఒక మజిలీ. అంతేకానీ అంతా అదే కాదు. బుద్ధుడు కరుణను ధ్యానంతో కలిసిన ప్రేమ' అన్నాడు. నీ ప్రేమ కేవలం యితరుల్ని కాంక్షించడం ఒక్కటే కాక, నీ ప్రేమ కేవలం అవసరమే కాక, నీ ప్రేమ యితరుల్తో పంచుకునేదయినప్పుడు, నీ ప్రేమ బిచ్చగాడుగాక, చక్రవర్తి స్థాయిలో వున్నప్పుడు, నీ ప్రేమ యితరుల నించి ఏదో ఆశించేదికాక, ఇచ్చేదయినప్పుడు, ఇవ్వడంలో ఆనందించేదయినప్పుడు దానికి ధ్యానాన్ని జోడిస్తే స్వచ్ఛమయిన పరిమళాన్ని అది విడుదల చేస్తుంది. అప్పుడు బంధించబడిన కాంతి విడుదలవుతుంది. అది కరుణ! కరుణ అత్యున్నతమైంది.

సెక్స్ జంతు సంబంధమైంది. ప్రేమ మానవీయమైంది. కరుణ దైవికమైంది, సెక్స్ భౌతికం, ప్రేమ మానసికం. కరుణ ఆధ్యాత్మికం.

★ ★ ★ ★

కరుణ అంటే ఏమిటో తెలుసుకున్నాకా దాన్ని అర్థం చేసుకోవడం కష్టం కాదు. మోహమంటే శారీరకమైన జ్వరం. దాంతో నువ్వు శరీరానికి లొంగుతావు, అచేతన వ్యక్తికి బానిసవుతావు. అప్పుడు నీపై నీకు అధికారముండదు.

కరుణ అంటే రూపాంతరం చెందిన శరీరధర్మం. నువ్వు మానసికంగా రూపాంతరం చెందుతావు. అప్పుడు బానిసగా వుండవు. అధికారిగా వుంటావు. అప్పుడు చైతన్యంతో ప్రవర్తిస్తావు. నిన్ను అచేతన శక్తులు ఆక్రమించలేవు. ఆ శక్తులు నీ అదుపులో వుంటాయి. నువ్వు పూర్తి స్వాతంత్ర్యంతోవుంటావు. అదే శక్తి రూపాంతరం చెంది కరుణ అవుతుంది.

మోహం శారీరక వాంఛ! కరుణ ప్రేమ. మోహం కోరిక, కరుణ కాంక్షా రహితం. మోహం ఈర్ష్య, కరుణ పంచుకోవడం. మోహం ఇతర్లని తన కోసం వాడుకుంటుంది. కరుణ యితరుల్ని గౌరవిస్తుంది. మోహం భూమికి కట్టేస్తుంది. మట్టిగానే వుండమంటుంది. నిన్ను పద్మంగా ఎదగనివ్వదు. కరుణ నిన్ను పద్మాన్ని చేస్తుంది. నువ్వు మట్టిగా వుంటే ప్రాపంచిక కాంక్షలు, ఈర్ష్యాలు, కోపాలు ఎదుగుతాయి. కరుణ నీ శక్తుల్ని రూపాంతరం చెందిస్తుంది.

నువ్వు బుద్ధుడయినపుడే నీకు కరుణ అంటే ఏమిటో తెలిసివస్తుంది. అది చల్లని ప్రేమ. సమస్త అస్తిత్వంతో ఆనందాన్ని పంచుకుంటుంది. నువ్వు నీకేదీవెనగా, సమస్త అస్తిత్వానికి దీవెనగా మారుతావు. అది కరుణ. మోహం అసహ్యమైంది. కరుణ అందమైంది. మోహం శాపం కరుణ ఆశీర్వాదం.

★ ★ ★ ★

ప్రేమ నిచ్చెన, మూడు మెట్లున్న నిచ్చెన. క్రింద మెట్టు సెక్సు, మధ్యలో మెట్టు ప్రేమ, పైనున్న మెట్టు ప్రార్థన. ఈ మూడు మెట్ల కారణంగా వెయ్యినొక్క విషయాల కలయిక జరుగుతుంది.

నిజమైన కరుణ సెక్సు మెట్టుకు సంబంధించిన శక్తి ప్రేమగా మారినప్పుడు జరుగుతుంది. అది బుద్ధుని కరుణ.

★ ★ ★ ★

కరుణ ఒక్కటే చికిత్సా ఔషధం, ఎందుకంటే మనిషిలోని అనారోగ్యానికంతా ప్రేమ రాహిత్యమే కారణం. ప్రేమించలేకపోవడం, ప్రేమను పొందలేకపోవడం మనిషి అనారోగ్య కారణం. తన అస్తిత్వాన్ని పంచుకోలేకపోవడం దుఖ కారణం. నరకమంటే అదే. మనిషిలోని అన్ని సంక్లిష్టతలకూ కారణం.

ఈ లోపలి గాయాలు ఎన్నో విధాలుగా పైకి వస్తాయి. అది శారీరక అనారోగ్యంగా, మానసిక అనారోగ్యంగా బహిర్గతమవుతాయి. కానీ లోపలి మనిషి ప్రేమ రాహిత్యంతో అల్లాడుతాడు. శరీరానికి ఆహారం ఎట్లా అవసరమో ఆత్మకు ప్రేమ అంత అవరసం. ఆహారం లేకుంటే శరీరం వుండదు. ప్రేమ లేకుంటే ఆత్మ వునికిలో వుండదు.

సౌభాగ్య రచనలు

1. సంధ్యాబీభత్సం - 1984
2. కృత్యాద్యవస్థ - 1987
3. సింహావలోకనం - 1989
4. నువ్వు - నేను - 1994
5. పునరుత్థానం - 1995
6. ప్రేమ కవితలు - 2004
7. రెండు దశాబ్దాలు - 2004
8. సౌభాగ్య కవిత - 2010
9. యాభయి దాటిన యవ్వనం - 2012

సాహిత్య విమర్శ - జీవిత చరిత్రలు

1. నేటి విమర్శ (సం) - 1994
2. సమకాలీనం (సం) - 1997
3. సాహిత్య వ్యాసాలు - సమీక్షలు - 1998
4. ప్రసిద్ధ ఉర్దూ కవులు - 1998
5. ఆధునిక ప్రపంచ కవులు - 1998
6. వ్యాసాలు - ద్వేషాలు -2004
7. ఇరవయ్యో శతాబ్దం ఇంగ్లీషు కవులు - 2004
8. ఈ కాలం కవులు - 2006
9. వజ్రశకలాలు - 1991
10. రెండు వందల ఏళ్ళ జాన్ కీట్స్ - 1995
11. ప్రాపర్టియస్ కవిత - 1995
12. శిఖామణి కవిత్వం - తాత్విక సౌందర్యం - 2010
13. ఆశారాజు కవితా వైభవం-2010
14. బహుత్‌ఖూబ్ యాకూబ్-2011
15. జీవన దార్శనికుడు - వేంపల్లి షరీఫ్ - 2012
16. కె.యస్. రమణ అనుభవాంతరంగం - 2011
17. సున్నితమైన కవి - సుమనశ్రీ-2012
18. సమకాలీన ప్రపంచకవులు-2012

ఇంకా మరిన్ని...

1. దేశదేశాల ముద్దులు - 1999
2. ఆస్కార్‌వైల్డ్ ఆలోచనలు - 2004
3. గ్రీకు రోమన్ కథలు -2004
4. జెన్ కథలు - 2004
5. తావో తరంగాలు - 2004
6. పాశ్చాత్య సంగీతకారుల జీవితాలు - 2008
7. పాశ్చాత్య చిత్రకారుల జీవితాలు
8. లాటిన్ అమెరికన్ కవుల జీవితాలు
9. సుప్రసిద్ధ శృంగార జీవితాలు-2008
10. సెక్స్ ఆచారాలు - సంప్రదాయాలు - 2008
11. అద్భుత జెన్ కథలు - 2010
12. నిత్య జీవితంలో ధ్యానం-2010
13. కందుకూరు శ్రీరాములు కవిత్వం
14. ఖదీర్‌బాబు కమనీయ బాల్యం
15. పెద్దలకు మాత్రమే (జోక్స్)
16. సౌభాగ్య వ్యాసాలు
17. సౌభాగ్య సమీక్షలు
18. ఖలీల్ జీబ్రాన్ కమ్మని కథలు
19. ఖలీల్ జీబ్రాన్ కొటేషన్లు

20. మార్క్‌ట్వయిన్ కొటేషన్లు
21. రోమన్ల ఆలోచనలు
22. రష్యన్ కొటేషన్లు
23. సిసిరో ఆలోచనలు
24. ప్రపంచ కవుల పరిమళాలు
25. జెన్‌తత్వం
26. జెన్ కొటేషన్లు
27. ఇటలీ కవులు
28. ఫ్రెంచి కవులు
29. ఫ్రెంచి విమర్శకులు
30. దేశదేశాల సామెతలు
31. ప్రపంచ ప్రసిద్ధుల చమత్కారాలు
32. ఐన్‌స్టీన్ ఆలోచనలు
33. బెర్‌ట్రాండ్ రస్సెల్ ఆలోచనలు
34. గొథె ఆలోచనలు
35. ప్రపంచ ప్రసిద్ధ జోక్స్
36. దేశదేశాల జోక్స్
37. అక్బర్ – బీర్బల్ కథలు
38. ఈసఫ్ కథలు
39. తూర్పు దేశాల మార్మిక కథలు
40. సూఫీ కథలు
41. రసన
42. వివేక కథలు
43. బౌద్ధ కథలు
44. జపాన్ కథలు
45. భారతీయ జానపద కథలు
(ఇరవై సంపుటాలు)
46. విదేశీ జానపద కథలు
(ఇరవై సంపుటాలు)
47. రింబో కవిత్వం
48. రుగ్వేద వచనానువాదం
49. తావో తత్వం
50. హుయాయినెంగ్
51. జిడ్డు కృష్ణమూర్తి ఆలోచనలు
52. తావో–తె–చాంగ్
53. ఆధునిక జపాన్ కవిత్వం
54. ఇవన్నీ నిజాలే
55. వివేకానికి వెయ్యి మార్గాలు
56. యూదుల జోక్స్
57. యూదుల కథలు
58. అద్భుత ఆధ్యాత్మిక కథలు
59. టిబెట్ జానపద కథలు
60. వైరముత్తు కవిత
61. హాలీవుడ్ హాస్యం
62. డాస్టయేవ్‌స్కీ ఆలోచనలు
63. వైఫై జోక్స్
64. కంప్యూటర్ జోక్స్
65. దమ్మపదం
66. పాబ్లో నెరుడా ప్రేమ కవితలు
67. సిక్కు గురువుల కథలు
68. చింతన

ఓషో గ్రంథాలు

1. నేను ప్రేమించిన పుస్తకాలు
2. పిచ్చివాడి రాతలు
3. నిద్రకుముందు నిర్మల ధ్యానాలు
4. ఓషో కథలు
5. ధ్యాన రహస్యాలు
6. సమగ్ర మార్గం
7. మాటల్లేని మనిషి మాటలు
8. ఆణిముత్యాలు
9. ఇండియా నా ప్రాణం
10. ఆత్మకు ఔషధం
11. నా మార్గం – తెల్ల మేఘాల మార్గం